సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 15 సంచిక: 305

బుధవారం 19-7-2023

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



'గిన్నిస్'లో సాత్విక్ స్మాష్..

యోనెక్స్ టెస్టులో గంటకు 565 కి.మీ వేగంతో దూసుకెళ్లిన షటిల్ - 12లో



ఉమామహేశ్‌కు కాంస్యం


వరల్డ్ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో ఏపీ షూటర్ ఘనత - 12లో



ఊమెన్ చాందీ కన్నుమూత

కాంగ్రెస్ నేత, కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ కన్నుమూశారు. ఆయన మృతిపట్ల పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

వివరాలు 6లో ▸



నేడు అఖిలపక్ష సమావేశం

ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు మొదలవుతున్న నేపథ్యంలో కేంద్రం బుధవారం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది.

వివరాలు 6లో ▸



మూడో విడత కక్ష్య దూరం పెంపు

చంద్రయాన్-3 మిషన్‌కు ఇస్రో శాస్త్రవేత్తలు మూడోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు.

వివరాలు 6లో ▸



రేపు అల్పపీడనం

వాయవ్య బంగాళాఖాతంలో గురువారం అల్పపీడనం ఏర్పడనుంది. ఇది బలపడి వాయుగుండంగా మారే అవకాశముంది.

వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్ చెక్

మందుల పైనా మాయదారి రాతలు

- ప్రభుత్వాస్పత్రుల్లో మందుల లభ్యతపై ఈనాడు దుష్ప్రచారం
- 2018–19లో అందుబాటులో ఉన్నవి 229 రకాల మందులు, 232 కన్జ్యూమబుల్స్
- ప్రస్తుతం 566 రకాల మందులు, 326 కన్జ్యూమబుల్స్ నిత్యం అందుబాటులో.. మిగతావి డి–సెంట్రలైజ్డ్ బడ్జెట్‌తో సరఫరా
- తొలిసారి సెంట్రల్ టెండర్ విధానంలో రీఏజెంట్స్ సరఫరా
- టీడీపీ ప్రభుత్వంలో మందుల సరఫరాకు రూ.1,315 కోట్లు ఖర్చు
- ప్రస్తుత ప్రభుత్వంలో రూ. 2,688 కోట్లు ఖర్చు
- పెరిగిన ఖర్చే మందులు పుష్కలమనడానికి నిదర్శనం
- 13 డ్రగ్ స్టోర్స్‌లలో 3 నెలలకు సరిపడా మందులు, సర్జికల్స్
- వీటి విలువ రూ.117.10 కోట్లు

2 లో

దోచుకునే దుర్బుద్ధి మీదే రామోజీ!

- చేయని పనులకూ పైసలు నొక్కేయడమే మీ విధానం
- డీపీటీలో సిద్ధహస్తులు చంద్రబాబు, నువ్వే కదా..
- పోలవరంలో మట్టి పనులు చేయకుండానే రూ.150.93 కోట్లు కాజేసిన మాట నిజం కాదా?
- వాటిని మీ కొడుకు వియ్యంకుడితో కలిసి బాబు, నువ్వు పంచుకుతినలేదా రాజగురవిందా?
- ఈ డీపీటీని 2018, మార్చి 24న 'సాక్షి' ఆధారాలతో బయట పెట్టింది.. మర్చిపోయారా!
- దాంతో పే అండ్ అకౌంట్స్ విభాగం ఎం–బుక్‌ల తనిఖీ చేసింది.. దోపిడీ రట్టవుతుందని కాంట్రాక్టరు హడావుడిగా కొన్ని పనులు చేయలేదా?
- తనిఖీలు పూర్తయ్యేసరికి చేయని పనులకు రూ.112.47 కోట్లు అధికంగా చెల్లించినట్లు పీఏఓ తేల్చింది కదా
- వారిలాగే అందరూ ఉంటారనే భ్రమలతో 'రాయలసీమ ఎత్తిపోతల'పై రామోజీ విషం

10 లో



ఢిల్లీలో మంగళవారం జరిగిన ఎన్డీయే మిత్రపక్షాల నేతలతో ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో నితిన్ గడ్కరీ, రాజ్‌నాథ్‌సింగ్, పళనిస్వామి, రాందాస్ అథవలే, చిరాగ్ పాశ్వాన్, పవన్‌కల్యాణ్, జేపీ నడ్డా, ఏక్‌నాథ్ షిండే, అమిత్‌షా తదితరులు

ఢిల్లీలో ఎన్డీయే | మళ్లీ గెలుస్తాం!

ప్రజల ఆకాంక్షలను నెరవేర్చింది ఎన్డీయేనే

- దేశ ప్రయోజనాలే మాకు పరమావధి.. ఎన్డీయే భేటీలో మోదీ ప్రసంగం
- విపక్షాలవి ప్రతికూల కూటములు.. నెగ్గడం కల్ల
- అది యూపీఏకే మరో రూపమంటూ ప్రధాని మోదీ ఎద్దేవా
- సమావేశానికి 38 పార్టీలు హాజరు

న్యూఢిల్లీ: 'ఇండియా' పేరిట కొత్త రాజకీయ కూటమికి శ్రీకారం చుట్టిన విపక్షాలపై ప్రధాని నరేంద్ర మోదీ పదునైన విమర్శలతో విరుచుకుపడ్డారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ దూకుడుకు కళ్లెం వేసేందుకు అవి నిర్వహించిన బెంగళూరు భేటీకి దీటుగా ఎన్డీయే కూటమి కూడా భాగస్వామ్య పక్షాలన్నింటితో మంగళవారం హస్తినలో పూర్తిస్థాయి బలప్రదర్శనకు దిగింది. ఏకంగా 38 పార్టీలు పాల్గొన్న ఎన్డీయే సమావేశాన్ని ఉద్దేశించి మోదీ మాట్లాడారు. ''అప్పటి యూపీఏనే ఇప్పుడు 'ఇండియా' అయింది. 'పక్షవాత' విధానాలను అవలంబించడం వల్లే యూపీఏ కూటమి 2014లో ఓటమి పాలైంది. నాడు ప్రధాని (మన్మోహన్ సింగ్)ని మించిన హైకమాండ్, కుంటుబడిన పాలనా విధానాలు, అంతర్గత స్పర్థలు, అంతులేని అవినీతి, భారీ కుంభకోణాలమయంగా నాటి యూపీఏ పాలన కొనసాగింది. కూటములు కట్టే సంస్కృతి దేశంలో చాన్నాళ్లుగా ఉంది. కానీ ప్రతికూల, హానికర కూటములు మన దేశంలో నెగ్గవు, నెగ్గలేవు'' అని జోస్యం చెప్పారు.

కూల్చేందుకే కూటములు కట్టింది

కూల్చేందుకే కూటములు కట్టడం కాంగ్రెస్ పార్టీ నైజమని మోదీ దుయ్యబట్టారు. '1990ల్లో దేశాన్ని అస్థిరపరిచే కుట్రతో కాంగ్రెస్

మిగతా 6వ పేజీలో ▶



కుటుంబం వలన.. కుటుంబం కోసం..

- ఇదే ప్రతిపక్ష నేతల నినాదం: మోదీ
- బెంగళూరు భేటీని చూసి జనం నవ్వుకుంటున్నారు

6 లో



బెంగళూరులో జరిగిన విపక్షాల భేటీలో పాల్గొన్న నేతలు వరుసగా సిద్ధరామయ్య, హేమంత్ సోరెన్, మమతా బెనర్జీ, రాహుల్‌గాంధీ, మల్లికార్జున ఖర్గే, శరద్‌పవార్, సీతారాం ఏచూరి, జైరాం రమేశ్, రాజా, అరవింద్ కేజ్రీవాల్ తదితరులు

బెంగళూరులో ఇండియా | కలిసి ఓడిస్తాం!

'ఇండియా' వర్సెస్ మోదీ.. ఇదే విపక్షాల సమరనాదం

- బెంగళూరు భేటీలో 'సామూహిక సంకల్పం'
- కూటమి పేరు ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్... పార్టీల మధ్య సమన్వయ సాధన తదితరాలకు 11 మందితో కమిటీ
- ముంబైలో జరిగే భేటీలో కన్వీనర్ ఎంపిక, కీలక నిర్ణయాలు
- ప్రచార నిర్వహణ తదితరాలకు ఢిల్లీలో కూటమి సచివాలయం
- కూటమి సారథ్యం ఎవరిదన్నది మాత్రం ప్రస్తుతానికి సస్పెన్స్
- 'ఇండియా'ను సవాలు చేసే దమ్ము బీజేపీకి ఉందా!: మమత
- బీజేపీ ప్రభుత్వంపై 420 సెక్షన్ విధించామన్న దీదీ
- విపక్షాలన్నింటికీ దేశమే కుటుంబం: మోదీపై ఉద్ధవ్ విసుర్లు

బెంగళూరు: 26 విపక్ష పార్టీలు సమైక్యంగా 2024 లోక్‌సభ ఎన్నికల సమరనాదం చేశాయి. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ సారథ్యంలోని ఎన్డీఏ కూటమిని ఓడించడమే ఏకైక లక్ష్యంగా ఒక్క తాటిపైకి వచ్చాయి. ఇండియా (ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్) పేరుతో కొత్త కూటమిగా ఆవిర్భవించాయి. సమైక్యతా ప్రయత్నాల్లో భాగంగా సోమవారం బెంగళూరులో మొదలైన విపక్షాల రెండు రోజుల భేటీ మంగళవారం సాయంత్రం ముగిసింది. కాంగ్రెస్‌తో పాటు తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే తదితర 26 పార్టీల అధినేతలు, అగ్ర నేతలు పలు అంశాలపై నాలుగు

మిగతా 6వ పేజీలో ▶

'ఇండియా'పై యుద్ధానికి దిగితే... గెలుపెవరిదో అందరికీ తెలుసు

2024 ఎన్నికల ఫలితాలపై రాహుల్ జోస్యం

6 లో

మాది ప్రత్యామ్నాయ అ'జెండా'

'ఇండియా' కూటమి జాయింట్ డిక్లరేషన్

స్వయం ఉపాధికి 'తోడు'

పేదలకు మేలు చేసే మహాయజ్ఞంలో 'జగనన్న తోడు' ఓ విప్లవమే

చిరు వ్యాపారుల కష్టాలను నా పాదయాత్రలో స్వయంగా చూశా: సీఎం వైఎస్ జగన్

- రోజువారీ పెట్టుబడికి అధిక వడ్డీకి అప్పులు తెచ్చుకోవాల్సిన దుస్థితి
- ఆ పరిస్థితులను మార్చేందుకే ఈ పథకం తీసుకొచ్చాం
- ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని తాపత్రయపడే ప్రభుత్వమిది
- వరుసగా నాలుగో ఏడాదీ 'జగనన్న తోడు'.. 15,87,000 మంది చిరు వ్యాపారులకు లబ్ధి
- 5.10 లక్షల మంది ఖాతాల్లోకి రూ. 549.70 కోట్ల వడ్డీలేని రుణాలు, వడ్డీ రీయింబర్స్‌మెంట్
- రుణాలను సకాలంలో చెల్లించిన వారికి రూ. 11.03 కోట్ల వడ్డీ డబ్బులు జమ



జగనన్న తోడు లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఒకరిపై ఆధారపడకుండా స్వయం ఉపాధితో జీవించడమే కాకుండా మరో ఒకరిద్దరికి సైతం ఉపాధి కల్పిస్తున్న చిరువ్యాపారులు అధిక వడ్డీల బారిన పడకుండా వడ్డీ లేని రుణాలతో ఆదుకుంటున్నట్లు సీఎం వైఎస్ జగన్ తెలిపారు. 'జగనన్న తోడు' పథకం ద్వారా తాజా లబ్ధిదారులతో కలిపితే ఇప్పటివరకు 15,87,000 మంది చిరు వ్యాపారులకు ప్రయోజనం చేకూరుస్తూ వడ్డీ లేని రుణం కింద రూ.2,955.79 కోట్లు ఇవ్వగలిగామన్నారు. పథకం ద్వారా

మిగతా 2వ పేజీలో ▶

> పేదలకు మేలు చేసేందుకు ప్రభుత్వం చేపట్టిన మహాయజ్ఞంలో 'జగనన్న తోడు' ఒక విప్లవం లాంటిది. అందరం కలసికట్టుగా ఒక్కటైతే పేదవాడికి మంచి జరిగే ఈ మహాయజ్ఞం సత్ఫలితాలనిస్తుంది. ఈ రోజు అదే జరుగుతోంది. చిరు వ్యాపారులైన నా 15,87,000 మంది అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు ఇప్పటిదాకా మంచి జరిగింది. - సీఎం వైఎస్ జగన్

ఏపీ విద్యా విధానాలు భేష్

- ఐక్యరాజ్యసమితి అభినందనలు
- బాలికా విద్యకు సీఎం జగన్ ప్రోత్సాహం అభినందనీయం
- ఐరాస లక్ష్యం కూడా ఇదేనని స్పష్టీకరణ

14 లో



నాడు-నేడు స్టాల్ వద్ద ఐక్యరాజ్యసమితి ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్

ఇవాళ్టి కార్టూన్



మనం 'భారత్' అని పెట్టుకుంటే పోలా..!

పేదరికం.. తగ్గుముఖం

రాష్ట్రంలో ఐదేళ్లలో దాదాపు సగం తగ్గిన పేదలు

- 2016లో పేదలు 11.77%.. 2021 నాటికి 6.06 శాతమే
- ఆంధ్రప్రదేశ్ చరిత్రలో తొలిసారిగా జనాభాలో 10 శాతం కంటే తక్కువగా పేదలు
- గణనీయంగా పెరిగిన ప్రజల జీవన ప్రమాణాలు
- సత్ఫలితాలనిస్తున్న వైఎస్ జగన్ ప్రభుత్వం సంక్షేమ విధానాలు

సాక్షి, అమరావతి: 'పేదరికంపైనే నా యుద్ధం.. పేదల సంక్షేమమే నా లక్ష్యం' అని విస్పష్టంగా పేర్కొన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధనలో కీలక మైలురాయిని అధిగమించారు. మొత్తం జనాభాలో పేదలు 10 శాతం కంటే తక్కువగా ఉండాలన్న నీతి ఆయోగ్ ప్రాథమిక లక్ష్యాన్ని ఆంధ్రప్రదేశ్ తొలిసారిగా 2021లో సాధించింది. విపక్షాలు రాజకీయ దురుద్దేశాలతో ఎంత బురద జల్లుతున్నా సంక్షేమ ఫలాలు

మిగతా 3వ పేజీలో ▶



కొత్తగా 1.63 లక్షల రైస్ కార్డులు

అదనంగా 3,81,061 మందికి లబ్ధి

- కొనసాగుతున్న తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ
- త్వరలో వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ
- జగనన్న సురక్షలో దరఖాస్తు చేసుకున్న వారికీ కార్డుల జారీ
- నాలుగేళ్లలో పీడీఎస్ బలోపేతానికి రూ.23,680 కోట్లు ఖర్చు
- ప్రజలు రేషన్ సరుకులను సద్వినియోగం చేసుకునేలా పౌరసరఫరాల శాఖ ప్రచారం


సాక్షి, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా బియ్యం కార్డుల మంజూరు ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ప్రభుత్వం ఏటా రెండు సార్లు జూన్, డిసెంబర్‌లో అర్హులకు కొత్త కార్డులు అందజేస్తోంది. ఇప్పటివరకు 1,63,333 కొత్త రైస్ కార్డులకు ఆమోదం లభించగా తహసీల్దార్ల డిజిటల్ సంతకాల ప్రక్రియ కొనసాగుతోంది. ఇది పూర్తయిన వెంటనే కార్డులను ముద్రించి వలంటీర్ల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేయనున్నారు. జగనన్న సురక్షలో

మిగతా 3వ పేజీలో ▶



క్లుప్తంగా...

12 భారతీయ భాషల్లో ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు



సాక్షి, అమరావతి: ఆంగ్ల భాషపై పట్టు సాధించాలనుకునే వారికి ఆక్స్‌ఫర్డ్ నిఘంటువు ఎంతో ఉప యోగపడుతుందని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్ ఇండియా ఎండీ సుమంతా దత్తా తెలిపారు. ప్రస్తుతం తమిళం, కన్నడ, ఒరియాతో సహా 12 భారతీయ భాషల్లో నిఘంటువులను ప్రచురిస్తున్నట్టు తెలిపారు. ఏపీలోని పాఠశాల విద్యార్థులకు ద్విభాషా నిఘంటువులను ఉపయోగించి ఆంగ్లాన్ని బోధించే కొత్త, వినూత్న విధానాన్ని అమలు చేస్తున్నారని, జగనన్న విద్యా కానుక కింద అందించే కిట్లలో నాలుగో ఏడాది కూడా తమ డిక్షనరీలను తీసుకున్నట్టు తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీలు, 6–10వ తరగతి విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులు వీటిలో ఉన్నాయని తెలిపారు.

కాటమనేని భాస్కర్‌కు అదనపు బాధ్యతలు



సాక్షి, అమరావతి: పాఠశాల మౌలిక సదుపాయాల కల్పన కమిషనర్ కాటమనేని భాస్కర్‌కు పాఠశాల విద్యా శాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ మంగళవారం ఉత్తర్వులిచ్చారు. పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్ కుమార్ ఈ నెల 25 వరకు విదేశీ పర్యటనలో ఉన్నందున పాలనాపరమైన విధులకు ఆటంకం కలగకుండా ఆయన స్థానంలో భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

ఆగస్టులో 31 వేల టిడ్కో ఇళ్ల పంపిణీ!



సమావేశంలో పాల్గొన్న శ్రీధర్ తదితరులు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని 8 మున్సిపాలిటీల్లో 31,090 టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఆగస్టు నెలలో అందించనున్నారు. కందుకూరులో 1,408, నెల్లూరులో 11 వేలు, గుంటూరులో 4,094, పుంగనూరులో 1,536, మదనపల్లెలో 1,872, ఆళ్లగడ్డలో 1,392, డోన్‌లో 288, విశాఖలో 9,500 ఇళ్లను అందించాలని ప్రణాళిక సిద్ధం చేశారు. మంగళవారం విజయవాడలోని టిడ్కో కార్యాలయంలో టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్, ఎండీ చిత్తూరి శ్రీధర్ అధ్యక్షతన బోర్డు సమావేశం జరిగింది. ఇప్పటికే పంపిణీ చేసిన 72 వేల గృహ లబ్ధిదారులకు, ఆయా సముదాయాల నిర్వహణకు రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ల ఏర్పాటుకు విధివిధానాలను రూపొందించి ప్రభుత్వ అనుమతి కోసం పంపాలని నిర్ణయించినట్టు చైర్మన్ ప్రసన్న కుమార్ తెలిపారు.

రేపు అల్పపీడనం
వాయుగుండంగా మారే అవకాశం



సాక్షి, అమరావతి/సాక్షి, విశాఖపట్నం : వాయవ్య బంగాళాఖాతంలో ఒడిశా తీరానికి ఆనుకుని ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో గురువారం అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఇది మరింత బలపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేస్తోంది. ఇది 24వ తేదీ లోపు ఒడిశాలో తీరం దాటే అవకాశం ఉంది. మరోవైపు రుతుపవన ద్రోణి రాజస్థాన్‌లోని బికనీర్ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు పయనిస్తోంది. ఈ ప్రభావంతో రానున్న 4 రోజులు రాష్ట్రంలో అక్కడక్కడ భారీవర్షాలు కురిసే అవకాశం ఉంది. అలాగే ఈ నెల 29న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. దీనివల్ల వచ్చే నెల 3 వరకు వర్షాలకు ఆస్కారముంది.

నేడు గోదావరికి పెరగనున్న వరద!



ధవళేశ్వరం: పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల్లో గోదావరి ఉధృతి స్వల్పంగా పెరుగుతోంది. ఆ ప్రభావంతో తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ వద్ద నది వరద బుధవారం పెరిగే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువనున్న లక్ష్మి బ్యారేజీ నుంచి నీటిని దిగువకు విడుదల చేశారు. దీని ప్రభావం ధవళేశ్వరం వద్ద కనిపించే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం మంగళవారం 9.55 అడుగులకు చేరింది. బ్యారేజీ నుంచి 51,268 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెడుతున్నారు.

మందుల పైనా మాయదారి రాతలు

ప్రభుత్వాస్పత్రుల్లో మందుల లభ్యతపై ఈనాడు అసత్య కథనం

చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులు అంటే నరకానికి నకళ్లు. మంచాలు, బెడ్లు, దుప్పట్లు, వైద్యులు, ఇతర సిబ్బంది ఉండే వారు కాదు. కంపు కొట్టే వార్డులు, అపరిశుభ్రతకు ఆనవాళ్లుగా ఆస్పత్రులు ఉండేవి. చిన్నపాటి మందు బిళ్లలకు కూడా కొరతే. అన్ని మందులూ బయట కొనుక్కోవాల్సిందే.

వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఆస్పత్రుల రూపురేఖలే మార్చేశారు. నాడు-నేడు కార్యక్రమం ద్వారా కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా అధునాతన వైద్య సౌకర్యాలతో తీర్చిదిద్దారు. నిరంతర వైద్య సేవలందేలా వైద్యులు, ఇతర సిబ్బందిని నియమించారు. మందులకు కొరతే లేదు. ఏ మందు కావాలన్నా ప్రభుత్వాస్పత్రుల్లో దొరుకుతుంది. మొత్తంగా వైద్య రంగం ముఖచిత్రాన్నే మార్చిన సీఎం వైఎస్ జగన్. అందుకే ఇప్పుడు ప్రజలంతా నిర్భయంగా ప్రభుత్వాస్పత్రులకు వెళ్లి వైద్య సేవలు పొందుతున్నారు.



సాక్షి, అమరావతి: చంద్రబాబు పాలనలో అధ్వానంగా ఉన్న ఆస్పత్రులు ఈనాడు అధిపతి రామోజీరావుకు కనిపించలేదు. **ఎందుకంటే.. ఆయనకు అప్పుడు ప్రభుత్వ ఆస్పత్రులు అద్భుతంగా కనిపించాయి.** మరి ఇప్పుడు.. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా పేదలకు నిరంతర వైద్యసేవలు అందిస్తున్న ప్రభుత్వ ఆస్పత్రులపై అబద్ధాలు అచ్చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో మందుల కొరత అంటూ అసత్య కథనాన్ని ప్రచురించారు. ఈ క్రమంలో వాస్తవాలను ఓ సారి పరిశీలిస్తే...

కొరతకు తావివ్వకుండా

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ప్రభుత్వాస్పత్రుల్లో మందులకు తావు లేకుండా చర్యలు చేపట్టింది. జీఎంపీ, డబ్ల్యూహెచ్‌వో ప్రమాణాలు కలిగిన నాణ్యమైన మందులను ప్రభుత్వాస్పత్రులకు సరఫరా చేస్తోంది. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2018–19లో 608 రకాల మందులకుగాను 229 రకాలే సరఫరా చేసేవారు. సర్జికల్ కన్జ్యూమబుల్స్ 357 రకాలకు గాను 232 మాత్రమే అందుబాటులో ఉండేవి. రీఏజెంట్స్ అసలు సరఫరా చేసేవారే కాదు. ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా అరకొరగా సరఫరా చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వంలో 608 రకాల మందులకు గాను 566 రకాలు సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ విధానంలో సరఫరా చేస్తున్నారు. మిగిలిన 42 మందులు డీసెంట్రలైజ్డ్ బడ్జెట్ ద్వారా స్థానిక సరఫరాదారుల ద్వారా నేరుగా ఆస్పత్రులకు అందిస్తున్నారు. సర్జికల్ కన్జ్యూమబుల్స్ 377 కు గాను 326, రీఏజెంట్స్ 449 కు గాను 172 అందుబాటులో ఉంటున్నాయి. తక్కువ వినియోగం ఉన్న మందులు, రీఏజెంట్స్, సర్జికల్ కన్జ్యూమబుల్స్‌ను డి-సెంట్రలైజ్డ్ బడ్జెట్ ద్వారా స్థానిక సరఫరాదారుల నుంచి నేరుగా ఆస్పత్రులకు అందిస్తున్నారు. ఎమ్మార్పీపై 35.60 శాతం డిస్కౌంట్‌తో సరఫరా చేస్తున్నారు. రీఏజెంట్స్‌ను రాష్ట్ర వైద్య శాఖ చరిత్రలో తొలిసారి ఈ ప్రభుత్వంలోనే సెంట్రల్ టెండర్ విధానం ద్వారా సరఫరా చేస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో తొలి రెండు క్వార్టర్స్‌కు డి-సెంట్రలైజ్డ్ బడ్జెట్ కింద బోధన, జిల్లా ఆస్పత్రులకు రూ.14.59 కోట్లు కేటాయించారు. ఇందులో రూ.3.44 కోట్లు వినియోగించారు. భవిష్యత్ అవసరాలకు ఇబ్బందులు లేకుండా ఏపీఎంఎస్ఐడీసీ మందులు, సర్జికల్స్ నిల్వలను సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌లో ఉంచుతోంది. ప్రస్తుతం 13 డ్రగ్ స్టోర్స్‌లలో వచ్చే మూడు నెలలకు సరిపడా రూ.117.10 కోట్ల విలువైన మందులు, సర్జికల్స్ నిల్వ ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆస్పత్రుల్లో మందుల కొరత అంటూ రామోజీరావు కథనాలు ప్రచురించడం ప్రభుత్వ వైద్య రంగం పట్ల ప్రజల్లో అపనమ్మకాన్ని కలిగించాలనే కుట్రకు నిదర్శనమని విమర్శలు వస్తున్నాయి. టీడీపీ ప్రభుత్వంలో కేవలం 229 రకాల మందులు అందుబాటులో ఉండి, ఇతర వనరుల కొరత తీవ్రంగా వేధిస్తున్న సమయంలో ప్రభుత్వాస్పత్రులకు జనాలు పోటెత్తుతున్నారని ఇదే ఈనాడులో ప్రచురించారు. గతంతో పోలిస్తే గణనీయంగా మందులు, సర్జికల్స్, మానవ వనరులు పెరిగిన సందర్భంలో నేడు ప్రభుత్వాస్పత్రులకు వెళ్లాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారని రాతలు రాయడం దిగజారుడుతనానికి నిదర్శనమని వైద్య రంగ నిపుణులు వాపోతున్నారు.

బడ్జెట్ గణనీయంగా పెరుగుదల

టీడీపీ ప్రభుత్వంతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలో మందులు, సర్జికల్ కన్జ్యూమబుల్స్ బడ్జెట్ గణనీయంగా పెరిగింది. ప్రభుత్వాస్పత్రుల్లో మందులు, సర్జికల్ కన్జ్యూమబుల్స్ పుష్కలంగా ఉండటమే ఇందుకు నిదర్శనం. టీడీపీ ప్రభుత్వంలో 2015–18 మధ్య మందుల కోసం రూ. 1080 కోట్లు, సర్జికల్ కన్జ్యూమబుల్స్ కోసం రూ.235.94 కోట్లు చొప్పున రూ.1,315.94 కోట్లు ఖర్చు చేశారు. అదే 2019 నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మందుల కోసం రూ.2,229.99 కోట్లు, సర్జికల్ కన్జ్యూమబుల్స్ కోసం రూ. 458.33 కోట్లు వెచ్చించింది. ఇలా 2019–23 మధ్య రూ.2,688.32 కోట్లు ఖర్చు చేశారు. అంటే గత ప్రభుత్వం కన్నా రూ.1372.38 కోట్లు అదనంగా వైఎస్ జగన్ ప్రభుత్వం వెచ్చించింది. మరోవైపు చంద్రబాబు ప్రభుత్వం బకాయి పెట్టి వెళ్లిన రూ. 150 కోట్లను కూడా ప్రస్తుత ప్రభుత్వమే చెల్లించింది.

టీడీపీ ప్రభుత్వంలో మందులు, సర్జికల్స్ కోసం చేసిన ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	మందులు	సర్జికల్స్
2015	260	57.97
2016	260	57.97
2017	260	60
2018	300	60
మొత్తం	1080	235.94

ప్రస్తుత ప్రభుత్వంలో మందులు, సర్జికల్స్ కోసం చేసిన ఖర్చు (రూ.కోట్లలో)

సంవత్సరం	మందులు	సర్జికల్స్
2019	179.99	33.33
2020	400	60
2021	500	125
2022	650	100
2023	500	140
మొత్తం	2229.99	458.33

రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య రంగం బలోపేతానికి సీఎం జగన్ సంస్కరణలు చేపట్టారు. ఏకంగా రూ.16 వేల కోట్లకు పైగా నిధులతో వైద్య రంగాన్ని అభివృద్ధి చేస్తున్నారు. ప్రభుత్వాస్పత్రులను కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారు. ఈ క్రమంలో రూ. 8 వేల కోట్లకు పైగా నిధులతో 17 కొత్త వైద్య కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారు. వీటిలో 5 వైద్య కళాశాలలు ఈ ఏడాది నుంచి ప్రారంభమవుతున్నాయి. ఇప్పటికే ఉన్న 11 వైద్య కళాశాలల్లో వసతుల కల్పనతో పాటు పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, ఏరియా, జిల్లా ఆస్పత్రులను కూడా బలోపేతం చేశారు. గ్రామాల్లో ప్రతి 2,500 జనాభాకు ఒకటి చొప్పున 10,032 వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్ ఏర్పాటు చేశారు. వీటిలోనే 105 రకాల మందులను అందుబాటులో ఉంచారు. అంతేకాకుండా దేశంలోనే ఎక్కడా లేని విధంగా ప్రతిష్టాత్మకంగా ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. వైద్య శాఖలో ఒక్క పోస్టు ఖాళీగా ఉండటానికి వీల్లేకుండా ఇప్పటి వరకు 50 వేలకు పైగా పోస్టులను భర్తీ చేశారు.

చంద్రబాబు రేపో మాపో జైలుకెళ్లక తప్పదు

- ఆయన సింగపూర్ పార్టనర్ ఈశ్వరన్ ఆ దేశంలో జైలు పాలయ్యాడు
- ఎంత వ్యవస్థలను మేనేజ్ చేసినా.. అవి కొంతకాలమే..
- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



సాక్షి, అమరావతి: చంద్రబాబు పార్టనర్, సింగపూర్ మాజీ మంత్రి ఈశ్వరన్ అనేక అక్రమాలకు పాల్పడ్డారని, ఆ దేశ ప్రభుత్వం ఇప్పుడు ఆయన్ని జైల్లో పెట్టిందని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ చెప్పారు. పార్టనర్ మాదిరే చంద్రబాబు కూడా రేపో మాపో జైలుకెళ్లడం ఖాయమన్నారు. చంద్రబాబు ఎంత వ్యవస్థలను మేనేజ్ చేసినా.. కొంతకాలమే చేయగలుగుతాడని చెప్పారు. దానికి రుజువుగా ఇప్పుడిప్పుడే కొన్ని జరుగుతున్నాయన్నారు. ఆయన మంగళవారం రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాజధాని అంశాల్లో ఈశ్వరన్‌పై ప్రభుత్వం వేరుగా విచారణ జరపాల్సిన అవసరం లేదని, ప్రస్తుతం రాజధాని భూముల వ్యవహారాలకు సంబంధించి అనేక అంశాలపై సీఐడీ చేస్తున్న విచారణలోనే అన్ని విషయాలు బయటకు వస్తాయని చెప్పారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా సీఎం జగన్ రాష్ట్రంలో జనరంజక పాలన చేస్తుంటే..బాబు తన అనుకూల మీడియాతో కలిసి నిత్యం అబద్ధపు మాటలు, అసత్యాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో అశాంతి రేకెత్తించాలని ప్రయత్నిస్తున్నాడన్నారు. ఈ తప్పుడు ప్రచారం చేసే వారి అకౌంట్లను ప్రజలే ఎన్నికల్లో సెటిల్ చేస్తారన్నారు. 2024 తర్వాత ఏపీలో చంద్రబాబు రహిత రాజకీయాలే ఉంటాయన్నారు. రాష్ట్రంలో మరో పెద్ద సామాజిక వర్గం కాపులపై తొలినుంచి తీవ్ర వ్యతిరేకత చూపే చంద్రబాబు.. ఇప్పుడున్న తనకున్న ప్రతిపక్ష స్థానానికి సైతం ఎప్పటికీ పోటీకి రాకూడదన్న దుర్మార్గమైన ఆలోచనతో పవన్‌కళ్యాణ్‌ను ప్రజల్లో పలుచన చేసే సలహాలిస్తున్నారని చెప్పారు.

శ్రీవాణి ట్రస్టు ద్వారా 2,790 ఆలయాల నిర్మాణం

కామన్‌గుడ్ ఫండ్ (సీజీఎఫ్) కార్యక్రమంలో దేవదాయశాఖ ద్వారా ప్రభుత్వం రూ.311 కోట్లతో 591 పురాతన ఆలయాల పునరుద్ధరణ పనులు చేపట్టిందని ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. వీటిలో రెండేళ్లయినా పనులు ప్రారంభించనివారికి నోటీసులు ఇస్తామన్నారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో 1,917 ఆలయాలు నిర్మాణం చేపట్టామని, మరో 873 ఆలయాలకు కూడా టీటీడీ నుంచి ఆమోదం తీసుకోనున్నామని చెప్పారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా ఈ మొత్తం 2,970 ఆలయాల నిర్మాణం పూర్తికాగానే.. ఆసక్తి ఉన్న స్థానికులకు శిక్షణ ఇచ్చి అర్చకులుగా నియమిస్తామని, ధూపదీప నైవేద్య పథకం వర్తింపజేస్తామని ఆయన తెలిపారు.

అర్హత కల్గిన వీఆర్వోలకు పదోన్నతులు!

ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు భూపతిరాజు

సాక్షి,అమరావతి: రాష్ట్రంలో అర్హత కలిగిన వీఆర్వోలకు పదోన్నతులు కల్పించాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరినట్లు ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్ర రాజు తెలిపారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సంఘం ప్రతినిధులు మంగళవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. అనంతరం మీడియా పాయింట్ వద్ద రవీంద్రరాజు మాట్లాడారు. ప్రస్తుతం వీఆర్వోల పదోన్నతుల్లో 40 శాతం రేషియో అమల్లో ఉందని, దీంలో చాలా మంది వీఆర్వోలకు సీనియర్ సహాయకుల పోస్టులు రావడం లేదన్నారు. వీఆర్వోల పదోన్నతుల్లో 70 శాతం రేషియో ఇవ్వాలని కోరారు. విధి నిర్వహణలో ఎవరైనా వీఆర్వో చనిపోతే అతని కుటుంబసభ్యులకు కారుణ్య నియామకాలు ద్వారా ఉద్యోగం ఇవ్వాలని కోరామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏ నుంచి వీఆర్వోకు అర్హత కల్గిన 1,500 మందికి అర్హత పరీక్ష నిర్వహించి వీఆర్వోలుగా పదోన్నతి కల్పించాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. తాము లేవనెత్తిన అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ చైర్మన్ వెంకటరామిరెడ్డి, ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అప్పలనాయుడు, ఏపీ రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, సీఆర్‌పీ రాష్ట్ర అధ్యక్షుడు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



సీఎం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రవీంద్రరాజు,అప్పలనాయుడు, వెంకటరామిరెడ్డి

ఎన్నేళ్లిలా ప్రేక్షకపాత్ర?!

- ప్రాజెక్టులను అధీనంలోకి తీసుకోండి
- లేదంటే మా అవుట్‌లెట్లను మాకు అప్పగించండి
- కృష్ణా బోర్డుకు తెగేసిచెప్పిన ఏపీ ఈఎన్‌సీ నారాయణరెడ్డి
- తక్షణమే సాగర్ కుడి కాలువకు నీటిని విడుదల చేయాలని డిమాండ్

సాక్షి, అమరావతి: ఉమ్మడి ప్రాజెక్టులైన శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను స్వాధీనం చేసుకుని నిర్వహించాలని.. లేదంటే తమ అవుట్‌లెట్లను తమకు అప్పగించాలని కృష్ణా బోర్డును ఏపీ ఇంజినీర్-ఇన్-చీఫ్ సి.నారాయణరెడ్డి డిమాండ్ చేశారు. శ్రీశైలం, సాగర్‌లలో తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా నీటిని వాడుకుంటుంటే నియంత్రించలేకపోతున్నారని.. తమకు విడుదల చేయాల్సిన నీటిని విడుదల చేసేలా ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించలేకపోతున్నారని చెప్పారు. ఎన్నాళ్లు ఇలా ప్రేక్షకపాత్ర వహిస్తారని నిలదీశారు. కృష్ణా బోర్డు సభ్య కార్యదర్శి డీఎం రాయ్‌పురే మంగళవారం త్రిసభ్య కమిటీ భేటీని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. దీనికి తెలంగాణ అధికారులు డుమ్మా కొట్టారు. సాయంత్రం వరకూ వేచిచూసినా వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ అధికారులు పాల్గొనలేదు. దాంతో డీఎం రాయ్‌పురే, నారాయణరెడ్డిలు చర్చించుకున్నారు. సాగర్ కుడి కాలువకు తాగునీటి అవసరాల కోసం ఈ నెల 15 నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 5 టీఎంసీలు విడుదల చేయాలని బోర్డును కోరిన అంశాన్ని ఈఎన్‌సీ నారాయణరెడ్డి గుర్తు చేశారు. తమ నీటి వాటా ఉన్నా సరే కుడి కాలువకు తెలంగాణ సర్కార్ నీటిని విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అటు శ్రీశైలం.. ఇటు సాగర్‌లలో తెలంగాణ సర్కార్ యథేచ్ఛగా నీటిని వాడుకుంటుంటే నియంత్రించడంలో బోర్డు ప్రేక్షకపాత్ర పోషిస్తోందన్నారు. తక్షణమే రెండు ప్రాజెక్టులను స్వాధీనం చేసుకోవాలని.. లేదంటే సాగర్ కుడి కాలువ అవుట్‌లెట్‌ను తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. దీనిపై సభ్య కార్యదర్శి రాయ్‌పురే స్పందిస్తూ త్రిసభ్య కమిటీ సమావేశాన్ని మరోసారి నిర్వహిస్తామని, కుడి కాలువకు నీటిని విడుదల చేసేలా తెలంగాణ అధికారులను ఆదేశిస్తామన్నారు.

స్వయం ఉపాధికి 'తోడు'

▶ మొదటి పేజీ తరువాయి

సున్నా వడ్డీ కింద మరో రూ.74.69 కోట్లు చెల్లించి వారికి మేలు చేసినట్లు చెప్పారు. వరుసగా నాలుగో ఏడాది జగనన్న తోడు పథకం అమలు సందర్భంగా వడ్డీలేని రుణాలు, వడ్డీ రీయింబర్స్‌మెంట్ నిధులను మంగళవారం బటన్ నొక్కి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిన అనంతరం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం జగన్ మాట్లాడారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

ఆ పరిస్థితులను మార్చాలనే ఆరాటంతో

నా సుదీర్ఘ పాదయాత్రలో చాలాచోట్ల ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులు, బండ్లపై టిఫిన్లు విక్రయిస్తూ పొట్ట పోసుకునే వారి కష్టాలను స్వయంగా చూశా. రోజువారీ పెట్టుబడికి కావాల్సిన రూ.1,000 కోసం అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి. రూ.వెయ్యి తీసుకుంటే ముందుగానే రూ.100 కట్ చేసుకుని సాయంత్రానికి తిరిగి రూ.1,000 వెనక్కి ఇవ్వాలని ప్రైవేట్ వ్యాపారులు షరతు విధించేవారు. చిరు వ్యాపారులకు గత్యంతరం లేక ఆ వడ్డీ వ్యాపారుల మీదే ఆధారపడాల్సిన దుస్థితిని నాడు చూశా. ఐదారు రూపాయల వడ్డీకి దొరికితే అదే అదృష్టంగా భావించే దారుణ పరిస్థితిని అప్పట్లో గమనించా. అవన్నీ చూశాక ఆ పరిస్థితులను మార్చాలన్న ఆరాటం నుంచి 'జగనన్న తోడు' పథకం పుట్టింది.

చిరు వ్యాపారులందరికీ మేలు..

ఫుట్‌పాత్‌ల మీద, వీధుల్లో తోపుడుబండ్ల మీద పండ్లు, కూరగాయలు, వస్తువులు, ఆహార పదార్థాలను అమ్ముకునేవారు, రోడ్ పక్కన టిఫిన్ సెంటర్లు నిర్వహిస్తున్నవారు, గంపలు, బుట్టలతో వస్తువులు అమ్మేవారు, ఆటోలు, సైకిళ్లపై వెళ్లి వ్యాపారం చేసేవారితో పాటు చేనేత కార్మికులు, సంప్రదాయ చేతివృత్తుల కళాకారులు, ఇత్తడి పనిమీద బతికేవారు, బొబ్బిలి వీణలు తయారు చేసేవారు, ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలు, కలంకారీ, తోలుబొమ్మల తయారుదారులు, లేసు వర్కర్స్.. అందరికీ ఈ పథకం ఉపయోగపడుతుంది. ఒక్కొక్కరికి ఏటా రూ.10 వేలు అందిస్తూ సకాలంలో కిస్తీలను చెల్లించినవారికి అదనంగా ఏటా రూ.వెయ్యి చొప్పున జోడిస్తూ రూ.13,000 వరకు వడ్డీలేని రుణాలను అందజేస్తున్నాం. ఈ పథకం కింద ఇవాళ వరుసగా నాలుగో ఏడాది 5,10,412 మంది చిరు వ్యాపారులకు రూ.549.70 కోట్ల వడ్డీలేని రుణాలతో పాటు రుణాలపై కిస్తీలను సకాలంలో చెల్లించిన వారికి రూ.11.03 కోట్ల వడ్డీ రీయింబర్స్‌మెంట్ డబ్బులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నాం.

అక్కచెల్లెమ్మలే అత్యధికం..

జగనన్న తోడు పథకం ద్వారా లబ్ధి పొందిన 15.87 లక్షల మందిలో 80 శాతం మంది అక్కచెల్లెమ్మలే ఉన్నారు. ఇది నిజంగా ఒక విప్లవం. ఇందులోనూ 80 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలే కావడం మరొక విప్లవం. సామాజికంగా అట్టడుగున ఉన్నవారందరికీ ఇది ఉపయోగపడుతుంది. అక్కచెల్లెమ్మలందరికీ మేలు చేసే గొప్ప కార్యక్రమమిది. దీనిద్వారా అందరూ బాగుపడాలని మనసారా కోరుకుంటున్నా.

అందరి మేలు కోసం తపించే ప్రభుత్వమిది..

చిరు వ్యాపారాలు చేసుకుంటున్న వారిలో ఎవరికైనా ఈ పథకం పొరపాటున రాని పరిస్థితి ఉంటే వెంటనే మీ సమీపంలోని సచివాలయంలో సంప్రదించండి. అక్కడ సిబ్బంది మీకు అందుబాటులో ఉంటూ తోడుగా నిలుస్తారు. వలంటీర్‌ని అడిగినా దగ్గరుండి దరఖాస్తు చేయించి వెరిఫై అనంతరం పథకం అందేలా చేస్తారు. లేదా 1902 నెంబర్‌కు ఫోన్ చేసినా మీకు ఈ పథకం అందించేలా సహాయపడతారు. అర్హత ఉన్నవారు ఏ ఒక్కరూ మిగిలిపోకూడదు.. ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని తాపత్రయ పడే ప్రభుత్వం మనది. ప్రతి రెండు సచివాలయాలకు చెందిన సిబ్బంది, వలంటీర్లు ఒక బ్యాంకుతో అనుసంధానమై జగనన్న తోడు ద్వారా రుణాలు ఇప్పించడంతో పాటు లబ్ధిదారులతో తిరిగి కట్టించేలా అంతే ప్రాధాన్యతగా కార్యక్రమాన్ని చేపట్టాలి. బ్యాంకర్లకు నమ్మకం పెరిగే కొద్దీ సంఖ్య పెరుగుతుంది. లబ్ధిదారుల సంఖ్య పెరగాలంటే క్రమశిక్షణతో సకాలంలో రుణాలను తిరిగి చెల్లించాలి. దీన్ని ప్రోత్సహించేందుకే సున్నా వడ్డీ కింద ఆర్నెల్లకు ఒకసారి ప్రయోజనం చేకూరుస్తూ పథకాన్ని అమలు చేస్తున్నాం.

దేశం మొత్తం కంటే ఏపీలోనే ఎక్కువ లబ్ధిదారులు

దేశంలో ఎక్కడా ఇన్ని లక్షల మంది చిరు వ్యాపారులకు మంచి చేసే కార్యక్రమం జరగడం లేదు. లబ్ధిదారుల సంఖ్యలో దేశం మొత్తం ఒకవైపు ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో అంతకంటే ఎక్కువ మంది ఉండటం అరుదైన ఘటన. ఈ స్థాయిలో సత్ఫలితాలు సాధించేలా పథకాన్ని నడిపిస్తున్న సచివాలయ వ్యవస్థ, వలంటీర్లు, వివిధ ప్రభుత్వ శాఖలతో పాటు ప్రధానంగా ఈ కార్యక్రమానికి తోడ్పాటు అందిస్తున్న బ్యాంకర్లకు ధన్యవాదాలు. లబ్ధిదారుడికి మొదటి విడత రూ.10 వేలతో ఈ కార్యక్రమం మొదలవుతుంది. ఇదొక రికరింగ్ అకౌంట్. సకాలంలో డబ్బులు చెల్లించిన వెంటనే బ్యాంకులు వారికి మళ్లీ రుణాలు మంజూరు చేసి తోడుగా నిలబడతాయి. ఈ క్రమంలో వారు కట్టిన వడ్డీ మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి ఆయా ఖాతాల్లోకి చెల్లిస్తుంది.

ఈ రుణం తీర్చుకోలేనిది



ఇంటి వద్దే చీరల వ్యాపారం నిర్వహించే నాకు చేయూత, ఆసరా, జగనన్న తోడు పథకాలతో ప్రభుత్వం అండగా నిలిచింది. కుట్టు మిషన్‌కు మోటర్ అమర్చుకుని రోజుకు రూ.800 వరకు సంపాదిస్తున్నా. నా భర్తకు ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె ఆపరేషన్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేశారు. జగనన్న తోడు పథకం కింద అందిన డబ్బులతో నా భర్త ఇంటి వద్దే టీ దుకాణం ఏర్పాటు చేశారు. ఉన్నతి, సీఐఎఫ్ రుణాల ద్వారా అందిన డబ్బులతో టీ దుకాణాన్ని కిరాణా షాపుగా మార్చుకుని నా కుటుంబం ఎంతో సంతోషంగా జీవిస్తోంది. మాకు ఇంత అండగా నిలిచిన జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– లలితకుమారి, మద్దులూరు, సంతనూతలపాడు మండలం, ప్రకాశం జిల్లా

విశాఖలో ఇనార్బిట్ మాల్



నీల్ రహేజాకు వేంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్

- శంకుస్థాపనకు రావాలని సీఎం జగన్‌కు ఆహ్వానం
- ముఖ్యమంత్రితో కే రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజా భేటీ

సాక్షి,అమరావతి: విశాఖలో ఇనార్బిట్ మాల్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు హాజరుకావాలని సీఎం వైఎస్ జగన్‌ను కే రహేజా గ్రూప్ ప్రెసిడెంట్ నీల్ రహేజా ఆహ్వానించారు. ఆ సంస్థ ప్రతినిధులతో కలిసి ఆయన మంగళవారం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్‌తో సమావేశమై ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని పెట్టుబడులపై చర్చించారు. నీల్ రహేజా మాట్లాడుతూ..విశాఖలో 6 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇనార్బిట్ మాల్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. మూడేళ్లలో రూ.600 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్లు కే రహేజా గ్రూప్ ప్రతినిధులు చెప్పారు. పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, ఏపీఐఐసీ ఎండీ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా...

24 నుంచి ఈఏపీ సెట్-2023 కౌన్సెలింగ్



సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మా కోర్సుల్లో ప్రవేశాలకు నిర్దేశించిన ఏపీ ఈఏపీ సెట్–2023 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ప్రవేశాల కన్వీనర్ చదలవాడ నాగరాణి మంగళవారం విడుదల చేశారు. తొలి దశలో భాగంగా ఇంజినీరింగ్, వ్యవసాయ విభాగాల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ఫీజు చెల్లింపులకు అవకాశం కల్పించారు. 25వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన, 3వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక చేసుకోవడంతో పాటు 9వ తేదీ ఒక్క రోజే ఆప్షన్లలో మార్పులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. 12న సీట్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థులు సీట్లు పొందిన కళాశాలల్లో 13, 14వ తేదీల్లో స్వయంగా రిపోర్టు చేయాలని సూచించారు.16వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, మరిన్ని వివరాలు, సహాయ కేంద్రాల సమాచారం కోసం cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఎన్‌ఆర్‌ఐ కోటాలో దరఖాస్తుకు గడువు పెంపు

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో ఎన్‌ఆర్‌ఐ కోటాలో దరఖాస్తు చేసుకునేందుకు గడువును పెంచినట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్‌ఆర్‌ఐ కోటాలో కమ్యూనిటీ సైన్స్ ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 31వ తేదీ వరకూ గడువును పొడిగించినట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు గమనించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఐఎన్‌ఎస్ మైసూర్ యుద్ధ నౌకలో అగ్నిప్రమాదం

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళంలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న ఢిల్లీ క్లాస్ గైడెడ్–క్షిపణి విధ్వంసక నౌక, ఐఎన్‌ఎస్ మైసూర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. డాక్‌యార్డులో ఉన్న ఈ యుద్ధ నౌకలో మంగళవారం రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్పందించిన నౌకలోని సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎలాంటి గాయాలవలేదని తూర్పు నౌకాదళ వర్గాలు వెల్లడించాయి. ప్రమాదానికి కారణాలపై ఉన్నతాధికారులతో విచారణ కమిటీని నియమించారు.

3 పార్టీలూ కలిసి పోటీ చేస్తాయని భావిస్తున్నా: పవన్



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే ఎన్నికల్లో టీడీపీ–బీజేపీ–జనసేన పార్టీలు కలిసి పోటీ చేస్తాయని తాను భావిస్తున్నానని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. ఎన్డీఏ పక్షాల భేటీలో పాల్గొనేందుకు ఢిల్లీకి వచ్చిన ఆయన భేటీకి ముందు మీడియాతో మాట్లాడారు. ఏపీలో వైఎస్ జగన్ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు అంతా కలిసి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. వైసీపీ వ్యతిరేక ఓటు చీలకూడదనేది తమ ఉద్దేశమన్నారు. టీడీపీ, బీజేపీలు గతంలో కలిసి పోటీ చేశాయని గుర్తు చేసిన పవన్, ఆ రెండు పార్టీల మధ్య ప్రస్తుతం అండర్ స్టాండింగ్ సమస్య ఉందన్నారు. జనసేన కేడర్ తనను సీఎంగా చూడాలని అనుకుంటోందని, అయితే క్షేత్రస్థాయిలో పార్టీల బలాబలాలను బట్టి, ఎన్నికల ఫలితాలను బట్టి సీఎం అభ్యర్థిపై నిర్ణయం ఉంటుందని వ్యాఖ్యానించారు. తనకు ముఖ్యమంత్రి పదవి ముఖ్యం కాదని స్పష్టం చేశారు. వైఎస్సార్‌సీపీని ఓడించి ఏపీని అభివృద్ధి చేయడమే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.

మోదీ నాయకత్వంలోనే దేశం నడవాలి

భవిష్యత్తులోనూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోనే దేశం ముందుకు నడవాల్సిన అవసరం ఉందని పవన్‌కళ్యాణ్ వ్యాఖ్యానించారు. ఎన్డీఏ భాగస్వామ్యపక్షాల సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మోదీ వంటి బలమైన నాయకుడి నాయకత్వంలో దేశం ముందుకు వెళ్తోందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వానికి జనసేన తరఫున సంపూర్ణ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

పవన్ ఎన్డీఏతో కలవడం బాధాకరం: నారాయణ



సాక్షి, న్యూఢిల్లీ : చేగువేరా నుండి సావర్కర్ వైపు పవన్ కళ్యాణ్ ప్రయాణించడం, ఎన్డీఏతో కలవడం బాధాకరమని సీపీఐ నేత నారాయణ వ్యాఖ్యానించారు. గతంలో విప్లవ వీరుడు చేగువేరా టీ షర్టులు వేసుకుని సోషలిజంపై గళం విప్పిన పవన్ ఇప్పుడు మితవాద సంస్కరణల సావర్కర్ వైపు దారి తప్పి నడవడం సరికాదని మంగళవారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. బీజేపీ, టీడీపీల మధ్య మధ్యవర్తిత్వం చేయడం రాజకీయాలకు మంచిది కాదని తెలిపారు. మతవాద పార్టీ బీజేపీతో పవన్ చేతులు కలపడం ప్రజాస్వామ్యానికి, లౌకిక వాదానికి ప్రమాదకరమని చెప్పారు. ఎన్డీఏతో పొత్తు పెట్టుకోని ప్రాంతీయ పార్టీల నేతలపై సీబీఐ, ఈడీ సంస్థలతో దాడులు చేయిస్తూ దుర్మార్గపు రాజకీయాలు చేస్తున్న బీజేపీకి మద్దతు పలకడం సరికాదని అన్నారు.

పేదరికం.. తగ్గుముఖం

▶ మొదటి పేజీ తరువాయి

పేదల అభ్యున్నతికి దోహదపడుతున్నట్లు మరోసారి రుజువైంది. కేంద్ర ప్రభుత్వానికి చెందిన నీతి ఆయోగ్ తాజాగా విడుదల చేసిన 'జాతీయ బహుముఖ పేదరిక సూచీ' నివేదిక ఈ వాస్తవాన్ని గణాంకాలతో సహా వెల్లడించింది. 2016 కంటే 2021 నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేదలు దాదాపుగా సగం వరకు తగ్గారని నివేదిక తెలిపింది. మరోవైపు ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయని పేర్కొంది. పౌష్టికాహారం, శిశు మరణాల రేటు, తల్లుల ఆరోగ్యం, పాఠశాల విద్య, హాజరు శాతం, వంటనూనెల వినియోగం, పరిశుభ్రత, తాగు నీరు, గృహ వసతి, విద్యుత్ వినియోగం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు కలిగి ఉండటం లాంటి 12 అంశాలు ప్రామాణికంగా దేశవ్యాప్తంగా నిర్వహించిన సర్వే నివేదికను నీతి ఆయోగ్ తాజాగా వెల్లడించింది. అందులో ప్రధానాంశాలు ఇవీ..

గ్రామాల్లో గణనీయంగా తగ్గుదల..

ఆంధ్రప్రదేశ్‌లో పేదరికం తగ్గుతోందని నీతి ఆయోగ్ నివేదిక వెల్లడించింది. 2016 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 11.77 శాతం మంది ప్రజలు నిరుపేదలుండగా 2021 డిసెంబర్ నాటికి 6.06 శాతానికి తగ్గారు. నిరుపేదలు 5.71 శాతం తగ్గారని నీతి ఆయోగ్ వెల్లడించింది. రాష్ట్రంలో పట్టణ ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో పేదరికం తగ్గడం గమనార్హం. 2016 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో 14.72 శాతం మంది, పట్టణ ప్రాంతాల్లో 4.63 శాతం మంది నిరుపేదలున్నారు. 2021 నాటికి గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలు 7.71 శాతానికి, పట్టణ ప్రాంతాల్లో 2.20 శాతానికి తగ్గారు. అంటే గ్రామీణ ప్రాంతాల్లో 7.01 శాతం, పట్టణ ప్రాంతాల్లో 2.43 శాతం పేదరికం తగ్గింది.



12 అంశాల్లోనూ మెరుగైన పనితీరు

బహుముఖ పేదరిక నిర్మూలనకు సంబంధించి నీతి ఆయోగ్ పరిగణలోకి తీసుకున్న 12 అంశాల్లోనూ ఆంధ్రప్రదేశ్ మెరుగైన పనితీరు కనబరిచింది. పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య, జీవన ప్రమాణాలు (వంటనూనెల వినియోగం, పారిశుద్ధ్యం, తాగు నీరు, విద్యుత్ వినియోగం, గృహనిర్మాణం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు) ఇలా అన్నింటిలో రాష్ట్రం ప్రగతి సాధించింది.

చంద్రబాబు సాధించలేనిది... జగన్ చేసి చూపారు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా అందిస్తున్న సంక్షేమ పథకాలు సత్ఫలితాలను అందిస్తున్నట్లు నీతి ఆయోగ్ నివేదిక స్పష్టం చేస్తోంది. పేదరిక నిర్మూలనకు నీతి ఆయోగ్ నిర్దేశించిన లక్ష్యాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అధిగమించడమే అందుకు నిదర్శనం. బహుముఖ పేదరిక సూచీల ప్రమాణాల ప్రకారం జనాభాలో పేదలు 10 శాతం కంటే తక్కువ ఉండాలని నీతి ఆయోగ్ పేర్కొంది. 2016 డిసెంబర్‌లో నీతి ఆయోగ్ వెల్లడించిన నివేదిక ప్రకారం మొత్తం జనాభాలో 10 శాతం కంటే తక్కువ పేదలున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ లేదు. హిమాచల్ ప్రదేశ్, పంజాబ్, తమిళనాడు, కేరళ, గోవా, మిజోరాం రాష్ట్రాలే ఆ జాబితాలో ఉన్నాయి. 2016 డిసెంబర్ నాటికి ఆంధ్రప్రదేశ్‌లో నిరుపేదలు 11.77 శాతం మంది ఉన్నారు. అంటే జనాభాలో 10 శాతం లోపే పేదలు ఉండాలన్న లక్ష్యాన్ని ఆంధ్రప్రదేశ్ సాధించలేకపోయింది. అయితే 2021నాటికి ఆంధ్రప్రదేశ్ పేదల సంక్షేమంలో గణనీయమైన ప్రగతి సాధించింది. నీతి ఆయోగ్ నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించింది. పేదరికాన్ని సమర్థంగా కట్టడి చేసిన రాష్ట్రాల జాబితాలో చోటు దక్కించుకుంది. రాష్ట్ర జనాభాలో నిరుపేదలను 6.06 శాతానికి తగ్గించింది.

రాష్ట్రంలో పేదరికం తగ్గుదల జిల్లాలవారీగా..

ఉమ్మడి జిల్లా	2016 నాటికి పేదల శాతం	2021 నాటికి పేదల శాతం
శ్రీకాకుళం	14.01	5.20
విజయనగరం	19	8.66
విశాఖపట్నం	15.10	7.60
తూర్పు గోదావరి	8.51	6.13
పశ్చిమ గోదావరి	9.11	2.42
కృష్ణా	8.69	4.38
గుంటూరు	7.26	4.36
ప్రకాశం	13.84	6.28
ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు	11.27	5.41
చిత్తూరు	9.64	5.66
వైఎస్సార్	9.14	3.34
కర్నూలు	19.64	12.84
అనంతపురం	12,47	6.74

4 డీసీసీబీలకు కొత్త ఛైర్మన్‌ల నియామకం

- ఏపీ, మార్కెఫెడ్, ఆప్కాబ్ పర్సన్ కమిటీల కాలపరిమితి ఆర్నెల్లు పెంపు
- 9 డీసీసీబీల పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీలు యథాతథం

సాక్షి, అమరావతి: ఏపీ మార్క్‌ఫెడ్, ఏపీ సహకార బ్యాంక్ (ఆప్కాబ్) పర్సన్–ఇన్‌చార్జ్ కమిటీ కాలపరిమితిని మరో 6 నెలల పాటు పొడిగిస్తూ ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి చిరంజీవి చౌదరి మంగళవారం ఉత్తర్వులిచ్చారు. 4 డీసీసీబీలకు ఛైర్మన్‌లను మార్చడంతో పాటు మిగిలిన 9 డీసీసీబీల ఛైర్మన్‌లలో ఎలాంటి మార్పులు చేయకుండా యథాతథంగా ఆర్నెల్ల పాటు కొనసాగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణ డీసీసీబీ పాలకవర్గంలో ఒకర్ని మాత్రమే మార్చగా, మిగిలిన జిల్లా డీసీసీబీల్లో ఎలాంటి మార్పులు చేయలేదు. మార్క్‌ఫెడ్ పర్సన్–ఇన్‌చార్జ్ కమిటీ కాల పరిమితి పొడిగింపు ఈ నెల 29 నుంచి వచ్చే ఏడాది జనవరి 28 వరకు పొడిగించగా, ఆప్కాబ్ పర్సన్ ఇన్‌చార్జ్ కమిటీ పదవీకాలాన్ని ఈ నెల 17 నుంచి వచ్చే ఏడాది జనవరి 17 వరకు పొడిగించారు. దీంతో మార్క్‌ఫెడ్ ఛైర్‌పర్సన్‌గా పీపీ నాగిరెడ్డి, ఆప్కాబ్ ఛైర్‌పర్సన్‌గా మల్లెల ఝాన్సీరాణిలు మరో ఆర్నెల్ల పాటు అదే పదవిలో కొనసాగనున్నారు.

కొత్త ఛైర్మన్లు వీరే..

కర్నూల్ డీసీసీబీ–ఎస్వీ విజయమనోహరి, విశాఖపట్నం డీసీసీబీ– కోలా గురువులు, ప్రకాశం డీసీసీబీ–వై.మారుతిప్రసాద్‌రెడ్డి, కృష్ణా డీసీసీబీ– తాతినేని పద్మావతి

మిగతా రాష్ట్రాలకు సీఎం జగన్ దిక్సూచి

- జగన్ పాలనలో జనం సుభిక్షం
- కుప్పానికి త్వరలో హంద్రీ–నీవా నీళ్లు
- కరోనా కాలంలో హైదరాబాద్‌లో దాక్కున్న తండ్రీకొడుకులు
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



కుప్పం రూరల్ (చిత్తూరు జిల్లా): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి దేశంలోని ఇతర సీఎంలు ఆలోచనలో పడ్డారని రాష్ట్ర అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం వార్డుబాట కార్యక్రమంలో భాగంగా రెండో రోజు కుప్పం పట్టణంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ, జలయజ్ఞం పథకాలు తెచ్చి ప్రజల మనసులో చిరస్థాయిగా నిలిచిపోయారని, ఆయన తనయుడు, సీఎం వైఎస్ జగన్ మరో అడుగు ముందుకేసి అనేక సంక్షేమ పథకాలు తెచ్చి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు రెండు కళ్లుగా పాలన చేస్తున్న సీఎంను చూసి దేశంలోని ఇతర ముఖ్యమంత్రులు ఇన్ని సంక్షేమ పథకాలు ఎలా చేస్తున్నారా.. అంటూ ఆలోచనలో పడ్డారన్నారు. 95 శాతం హంద్రీ–నీవా పనులను వైఎస్సార్ పూర్తి చేస్తే, ఆయన తరువాత వచ్చిన కాంగ్రెస్ సీఎంలు, బాబు 5 శాతం పనులు పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. గత సెప్టెంబర్‌లో కుప్పానికి వచ్చిన సీఎం జగన్ హంద్రీ–నీవా పనులు పూర్తిచేయాలని ఆదేశించారని, పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో హంద్రీ–నీవా నీళ్లు కుప్పానికి తెచ్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. కరోనా కాలంలో తండ్రీకొడుకులు హైదరాబాద్‌లో దాక్కుంటే సీఎం జగన్ ప్రతి నిత్యం సమీక్షలు నిర్వహించి ప్రాణనష్టాన్ని నివారించారన్నారు. వలంటీర్లు కరోనా కాలంలో ప్రాణాలకు తెగించి సేవ చేస్తే వారిని తప్పుపట్టడం దారుణమన్నారు. 2019 ఎన్నికల ముందు మహిళా, రైతు రుణాలు రూ.14,200 కోట్లు ఇవ్వకుండా వెళ్లిపోయారని, ఆ రుణాలు కాస్త వడ్డీతో కలిపి ప్రస్తుతం రూ.27 వేల కోట్లు అయ్యాయని, ఆ మొత్తాన్ని సీఎం జగన్ విడతల వారీగా చెల్లిస్తూ వస్తున్నారని తెలిపారు.

టీచర్ల వల్లే విద్యార్థులకు మంచి భవిత

- స్కూళ్లలో ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకోండి
- మంత్రి బొత్స



బాపట్ల అర్బన్: టీచర్ల వల్లే విద్యార్థులకు మంచి భవిష్యత్ లభిస్తుందని.. వారి కృషితోనే ఉత్తమ ఫలితాలు సాధ్యమని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. టీచర్లను ఇబ్బంది పెట్టే ఉద్దేశం తమకు లేదని.. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు మెరుగైన చదువులు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ ధ్యేయమని చెప్పారు. మంగళవారం బాపట్లలో పాఠశాల విద్యా శాఖ, సమగ్ర శిక్షా ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమాన్ని మంత్రి బొత్స ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చామని వివరించారు. టీచర్లంతా ఎప్పటికప్పుడు కొత్త విషయాలు తెలుసుకుని.. విద్యార్థులకు మార్గ నిర్దేశం చేయాలని సూచించారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తి పెంపొందించేలా ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వం దేశంలో ఎక్కడా లేని విధంగా నాడు–నేడు, అమ్మ ఒడి, జగనన్న గోరుముద్ద, జగనన్న విద్యాకానుక తదితర పథకాలను అమలు చేస్తోందన్నారు. కార్పొరేట్ స్కూళ్ల కంటే గొప్పగా ఇంగ్లిష్ మీడియం, డిజిటల్ చదువులను ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు ఇస్తున్నామని పేర్కొన్నారు. వీటన్నింటినీ సద్వినియోగం చేసుకొని విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలల విద్యుత్ బిల్లులను సమగ్ర శిక్షా కార్యాలయం నుంచే చెల్లిస్తారని.. విద్యుత్ విషయంలో ఇంకా ఎక్కడైనా ఇబ్బంది ఉంటే అధికారుల దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తారన్నారు. సమగ్ర శిక్షా ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ మొదటి బ్యాచ్‌లో 1,450 మంది హెచ్‌ఎంలకు నైపుణ్య శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బి.శ్రీనివాసరావు, బాపట్ల కలెక్టర్ పి.రంజిత్ బాషా, జాయింట్ కలెక్టర్ శ్రీధర్, ఆర్డీవో జి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ

రాష్ట్రానికి రెడ్ అలర్ట్

- తెలంగాణలో నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షాలు
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి
- గత 24 గంటల్లో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం

సాక్షి, హైదరాబాద్: ఒడిశాను ఆనుకొని ఉన్న జార్ఖండ్ ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దీని ప్రభావంతో తెలంగాణలో బుధ, గురువారాల్లో అనేకచోట్ల భారీనుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో రెడ్ అలర్ట్ జారీ చేసినట్లు పేర్కొంది. మరోవైపు గత 24 గంటల్లో ములుగు జిల్లా వెంకటాపూర్, తాడ్వాయి, ఏటూరు నాగారం, గోవిందరావుపేట, వెంకటాపురంలలో అత్యధికంగా 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అదే జిల్లా పేరూరు, హనుమకొండ జిల్లా పరకాలలో 8 సెంటీమీటర్ల మేర వర్షం కురిసింది. రేగొండ, ఎల్లారెడ్డిపేట, భీంగల్, ఆత్మకూరు, గంగాధర, చొప్పదండి, చందుర్తి, ములుగు, హుజూరాబాద్, చిట్యాల, శాయంపేటల్లో 7 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం రికార్డయింది. మంగళవారం ఉదయం నుంచి అనేక జిల్లాల్లో వర్షాలు కురుస్తూనే ఉన్నాయి.

అత్యంత భారీ వర్షాలు కురిసే జిల్లాలు
మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, ఖమ్మం

భారీ నుంచి అతిభారీ వర్షాలు
సిద్దిపేట, జనగాం, నిజామాబాద్, పెద్దపల్లి, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మెదక్, సంగారెడ్డి, కామారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి.

భారీ వర్షాలు..
ఆదిలాబాద్, కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, మెదక్, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి, రంగారెడ్డి

మోస్తరు నుంచి భారీ వర్షాలు..
హైదరాబాద్ సహా చుట్టుపక్కల ప్రాంతాలు. మిగతా ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.

కొత్తగా 1.63 లక్షల రైస్ కార్డులు

మొదటి పేజీ తరువాయి

బియ్యం కార్డుల కోసం అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులకు ఈ దఫాలోనే కార్డులు అందించనున్నారు. దీనికి ఈ నెల 31వతేదీ వరకు అవకాశం కల్పించిన నేపథ్యంలో కొత్తగా జారీ చేసే బియ్యం కార్డుల సంఖ్య మరింత పెరగనుంది.

కొత్తగా 3,81,061 మందికి లబ్ధి

రాష్ట్రంలో ఇప్పటివరకు 1.46 కోట్ల కార్డులకు గాను 4.25 కోట్ల మంది లబ్ధిదారులున్నారు. కొత్త కార్డుల మంజూరు ద్వారా అదనంగా 3,81,061 మందికి ప్రతి నెలా పీడీఎస్ ద్వారా లబ్ధి చేకూరనుంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్)లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. నాణ్యమైన (సార్టెక్స్) బియ్యాన్ని ఇంటివద్దకే అందించడంతో ప్రతి నెలా రేషన్ తీసుకునేవారి సంఖ్య పెరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యం ఇచ్చినా దాన్ని తినేవారు తక్కువగా ఉండేవారు. పేదలకు ఇచ్చే బియ్యం ముక్కి పోవటం, పురుగులు పట్టడం, రాళ్లు, నూకలు ఎక్కువగా ఉండటంతో పాటు గింజ రంగు మారిపోయేది. బియ్యాన్ని లబ్ధిదారులు శుభ్రం చేసుకోవాల్సి వచ్చేది. ఇప్పుడిస్తున్న నాణ్యమైన సార్టెక్స్ బియ్యం పేదల ఆకలి తీరుస్తోంది. కరోనా సమయంలో ప్రభుత్వం ఇచ్చిన నాణ్యమైన రేషన్ బియ్యమే ఎంతో మంది పేదలను ఆదుకుంది. బియ్యం సార్టెక్స్ కోసం కిలోకు రూపాయి చొప్పున నెలకు రూ.20 కోట్ల అదనపు భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది.

పీడీఎస్ వ్యవస్థ బలోపేతం..

టీడీపీ హయాంలో రేషన్ సబ్సిడీపై రూ.13 వేల కోట్లు ఖర్చు చేసినట్లు చూపినా పేదలకు ప్రయోజనం దక్కలేదు. ఇప్పుడు నాలుగేళ్లలో ప్రజా పంపిణీ వ్యవస్థ బలోపేతమైంది. 100.13 లక్షల టన్నుల నాణ్యమైన బియ్యం, 2.99 లక్షల టన్నుల కందిపప్పు, 2.34 లక్షల టన్నుల పంచదారను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఇందుకు సుమారు రూ.23,680 కోట్లు ఖర్చు చేయడం గమనార్హం. పంచదార, కందిపప్పుపై గతంతో పోలిస్తే మూడు రెట్లకు పైగా సబ్సిడీ భారాన్ని ప్రభుత్వం భరిస్తోంది. వీటికి తోడు 18 జిల్లాల్లో నాణ్యమైన బలవర్థక బియ్యాన్ని (ఫోర్టిఫైడ్) అందిస్తోంది. ఏప్రిల్ నుంచి రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో రాగి, జొన్నలు, అన్ని మున్సిపాలిటీల్లో గోధుమ పిండి పంపిణీని ప్రారంభించింది. కేంద్ర ప్రభుత్వం కేవలం జాతీయ ఆహార భద్రత చట్టం (ఎన్ఎఫ్ఎస్ఏ) కార్డులకు మాత్రమే రేషన్ ఇస్తుండగా రాష్ట్ర ప్రభుత్వం నాన్–ఎన్ఎఫ్ఎస్ఏ కార్డుదారులకు సైతం రేషన్ సరఫరా చేస్తూ పేదలకు అండగా నిలుస్తోంది.

ఉచితంగా కిలో రూ.40 విలువైన బియ్యం

ఒకవేళ రేషన్ తీసుకోకుంటే కార్డు రద్దు అవుతుందనే ఆందోళనతో కొందరు ప్రతి నెలా సరుకులు తీసుకుని దళారులకు విక్రయిస్తున్నారు. దీన్ని అరికట్టేందుకు పౌరసరఫరాల శాఖ ప్రత్యేక వీడియో సందేశం ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. ఇప్పటి వరకు సుమారు 50 లక్షల మంది కార్డుదారుల వాట్సాప్ నంబర్లకు వీడియో సందేశాలను చేరవేసింది. ఎండీయూ వాహనాల ద్వారా కూడా ప్రచారం చేస్తోంది. ప్రభుత్వం కిలోకు రూ.40 చొప్పున ఖర్చు చేస్తూ పేదలకు ఉచితంగా రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. ఇంత ఖరీదైన బియ్యాన్ని వృథా చేయకుండా ప్రజలు భోజనంగానే కాకుండా దోశలు, ఇడ్లీలు, మురుకులు, స్వీట్లు లాంటి చిరుతిళ్ల తయారీకి కూడా వినియోగించవచ్చని సూచిస్తోంది.

కార్డు రద్దు చేయడం లేదు..

రేషన్ తీసుకోకుంటే ఎక్కడా కార్డును రద్దు చేయడం లేదు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార రేషన్‌ను ప్రజలు తక్కువగా చూడొద్దు. కొన్ని చోట్ల మధ్యవర్తులకు తక్కువ రేటుకు రేషన్ బియ్యాన్ని విక్రయిస్తున్నట్లు మాదృష్టికి వచ్చింది. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. రేషన్ బియ్యం విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిగా అరికడతాం. కొత్త కార్డు కోసం ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చు. ఏటా జూన్, డిసెంబర్‌లో అర్హు లకు కార్డులు మంజూరు చేస్తున్నాం. తాజాగా జగనన్న సురక్ష దరఖాస్తులను పరిశీలించి వారికి కూడా కార్డులు ఇస్తున్నాం.

– హెచ్.అరుణ్‌కుమార్, కమిషనర్, పౌరసరఫరాల శాఖ

బెదిరింపు కాల్స్ రావడంతో అజ్ఞాతంలోకి..

- ఎమ్మెల్యే మైనంపల్లి నన్ను చంపాలని చూశారు
- ఆయన అనుచరులు నన్ను వెంబడించారు
- మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో మీడియాతో రియల్టర్ తిరుపతిరెడ్డి

కుత్బుల్లాపూర్/బచ్చన్నపేట/అల్వాల్: బెదిరింపు కాల్స్ వచ్చినందునే తాను అజ్ఞాతంలోకి వెళ్లానని రియల్టర్ ముక్కెర తిరుపతిరెడ్డి తెలిపారు. భూమి వ్యవహారంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు తనను కిడ్నాప్ చేసి చంపాలని యత్నించారని, ఎనిమిది సార్లు బెదిరింపు కాల్స్ వచ్చాయని చెప్పారు. ఆరురోజుల క్రితం అదృశ్యమైన ఆయన.. నాటకీయ పరిణామాల మధ్య పేట్‌బషీరాబాద్ సమీపంలోని మేడ్చల్ డీసీపీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యక్షమయ్యారు. తనకు ఎదురైన సమస్యలను మేడ్చల్ డీసీపీ సందీప్ గోనె, పేట్‌బషీరాబాద్ ఏసీపీ రామలింగరాజులకు వివరించారు. అనంతరం డీసీపీ కార్యాలయ ఆవరణలో మీడియాతో మాట్లాడుతూ.. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఎమ్మెల్యే ఒత్తిడితో తనకు సాయం చేయడానికి ముందుకురాలేదని చెప్పారు. కేసు రిజిస్టర్ చేయకుండా అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ గంగాధర్ సమయం వృథా చేశారని ఆరోపించారు. అందుకే అజ్ఞాతంలోకి వెళ్లానని, అయినా మైనంపల్లి అనుచరులు తనను చంపాలని నార్కట్‌పల్లి వరకు వెంబడించారని, వారి కంటపడకుండా ఆటోలో తప్పించుకున్నానని చెప్పారు. ఆపై విజయవాడ వెళ్లి స్నేహితుల సహాయంతో కొద్దిరోజులు అక్కడున్నానని, ఆపై వైజాగ్ వెళ్లి తలదాచుకున్నానని వివరించారు. హైకోర్టు అడ్వొకేట్ సలహామేరకు డీసీపీ కార్యాలయానికి వచ్చానన్నారు. మైనంపల్లి హనుమంతరావుతో తన కుటుంబానికి ప్రాణ హాని ఉందన్నారు. తన భూమిని లాక్కునేందుకు మైనంపల్లి ప్రయత్నిస్తున్నారని, సదరు భూమి తనది కాదని నిరూపిస్తే ఆయనకే గిఫ్ట్‌గా ఇస్తానని చెప్పారు.

అంతా ఫేక్..

తిరుపతిరెడ్డి చెప్పిందంతా ఫేక్ అని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. 'ఎమ్మెల్యే మైనంపల్లి కాల్ చేశారు, కిడ్నాప్‌నకు యత్నించారు' అంటూ తిరుపతిరెడ్డి చేసిన ఆరోపణలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. తిరుపతిరెడ్డి సీడీఆర్‌లో ఎటువంటి కాల్స్ లేవని గుర్తించారు. ల్యాండ్ కేసులో తిరుపతిరెడ్డిపైనే ఓ మహిళ ఫిర్యాదు చేసిందని, ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు. అయితే... కిడ్నాప్ పేరుతో స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించిన తిరుపతిరెడ్డి కుటుంబ సభ్యులు, మద్దతుదారులపై కేసుల నమోదు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నామని అల్వాల్ సీఐ ఉపేందర్ వెల్లడించారు.

హెచ్‌ఎం బదిలీ ఆపాలి

- దత్తత పేరుతో డబ్బులు వసూలు చేసిన ఎస్‌ఎంసీ చైర్మన్‌ను తొలగించాలి
- పొనుగోడు జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థుల ఆందోళన

గూడూరు (మహబూబాబాద్ జిల్లా): మహబూబా బాద్ జిల్లా గూడూరు మండలం పొనుగోడు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పూల్ సింగ్ బదిలీని ఆపివేయాలని, డబ్బులు వసూలు చేస్తున్న పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ (ఎస్ఎంసీ)ను తొలగించాలని కోరుతూ మంగళవారం ఆ పాఠశాల విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఐదేళ్ల క్రితం పొనుగోడుకు చెందిన ఓ వ్యక్తి గ్రామంలోని హైస్కూల్‌ను దత్తత తీసుకున్నారని అప్పట్నుంచి విద్యా కమిటీ చైర్మన్‌ను ఎన్నుకున్నారని తెలిపారు. ఆ దత్తత తీసుకున్న వ్యక్తి ఆదేశానుసారం గెస్ట్ టీచర్లను నియమించి వేతనాలు చెల్లిస్తున్నారని వివరించారు. అయితే దత్తత తీసుకున్న వ్యక్తి ఆదేశాల ప్రకారం ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ గత రెండేళ్లుగా అభివృద్ధి పేరుతో పేద విద్యార్థుల నుంచి రూ.6 వేలు చొప్పున వసూలు చేశారని తెలిపారు. ఆ డబ్బులు హెచ్‌ఎం వద్దగానీ, జాయింట్ అకౌంట్‌లో గానీ జమ చేయకుండా విద్యా కమిటీ చైర్మన్ వ్యక్తి గతంగా ఉపయోగించుకున్నారని ఆరోపించారు. ఆ డబ్బుల లెక్కలు అడిగిన హెచ్‌ఎం పూల్‌సింగ్‌ను బెదిరిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు హైస్కూల్ ఎదుట ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ ఇంటికి వెళ్లి ర్యాలీగా వెళ్లి వినతిపత్రం సమర్పించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా...విచారణ చేసి చర్యలు చేపడతామని చెప్పడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.

శ్రీసిటీ అభివృద్ధి అద్భుతం

బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్‌ఓవెన్ కితాబు

వరదయ్యపాలెం : తిరుపతి జిల్లాలోని శ్రీసిటీని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ గారెత్ విన్‌ఓవెన్ మంగళవారం సందర్శించారు. శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీలో మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, సుస్థిర అభివృద్ధి, హరితహిత చర్యలు, వ్యాపార అనుకూలతలు, వివిధ రంగాల్లో పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల ఆర్థిక ప్రోత్సాహకాలను వివరించారు. శ్రీసిటీలో విభిన్న రంగాలకు చెందిన 8 ప్రముఖ బ్రిటిష్ కంపెనీ ఉండటం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. శ్రీసిటీ ప్రపంచశ్రేణి మౌలిక వసతులు, వ్యాపార అనుకూల వాతావరణం పట్ల సంతృప్తి వ్యక్తం చేసిన బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ శ్రీసిటీ పారిశ్రామిక అభివృద్ధిని అభినందించారు. 15ఏళ్లలో మంచి పారిశ్రామిక అభివృద్ధి సాధించడంతోపాటు పలు యూకే కంపెనీలు ఇక్కడ ఏర్పాటు కావడం అద్భుతమని ప్రశంసించారు. త్వరలో వివిధ రంగాలకు చెందిన మరిన్ని బ్రిటిష్ కంపెనీలు శ్రీసిటీకి తరలివస్తాయన్నారు.



సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్

హెడ్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మిషన్ హెడ్ వరుణ్ మాలి మాట్లాడుతూ.. శ్రీసిటీలో టెక్నాలజీ, హెల్త్‌కేర్, లైఫ్ సైన్సెస్ వంటి రంగాల్లో ముఖ్యంగా సుస్థిరతపై కలిసి పనిచేయాలని వ్యూహరచన చేస్తున్నట్టు చెప్పారు. పర్యటనలో భాగంగా గారెత్ విన్ ఓవెన్ శ్రీసిటీ పరిసరాలతో పాటు బెర్లిన్ పైప్స్ సపోర్ట్స్ ఇండియా, ఎంఎండీహెచ్ మెషినరీ, రోటోలాక్ ఇండియా, ఎంఎస్ఆర్ గార్మెంట్స్, క్యాడ్బరీ కంపెనీలను సందర్శించారు. ఈ సందర్భంగా బెర్లిన్ పైప్స్ పరిశ్రమలో 350 కిలోవాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ప్రారంభించారు. క్రియా యూనివర్సిటీని సందర్శించి అధ్యాపకులు, విద్యార్థులతో మాట్లాడారు.

డేటా చోరీ దొంగ చంద్రబాబే

- తిరుపతి ఎమ్మెల్యే భూమన



తిరుపతి మంగళం: గత టీడీపీ ప్రభుత్వంలో సాధికారిత సర్వే పేరుతో డేటా సేకరించిన దొంగ చంద్రబాబేనని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. తిరుపతిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే 2016 నుంచి 2019 వరకు సాధికారిత సర్వే పేరుతో విలువైన డేటాను చంద్రబాబు సేకరించారని చెప్పారు. సాధికారిత సర్వే పేరుతో డేటా సేకరించి 45 లక్షలకు పైగా దొంగ ఓట్లను చంద్రబాబు చేర్చారని ఆరోపించారు. దీంతో విచారణ కమిటీ కూడా శాసనసభా సంఘం తన అధ్యక్షతన ఏర్పాటైందని చెప్పారు. ఇప్పటికి 4 సార్లు శాసన సభా సంఘం డేటా చోరీ జరిగినట్లు నిర్ధారించిందని తెలిపారు. దీనిపై అప్పటి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయగా..బాబు చేసిన మోసాన్ని గుర్తించిన సెంట్రల్ ఎన్నికల కమిషన్ 45 లక్షల ఓట్లను తొలిగించిందని చెప్పారు. వలంటీర్ వ్యవస్థపై బురదజల్లడం బాధాకరమన్నారు.

- **తెలంగాణలోని వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు కేంద్ర వన్యప్రాణి బోర్డు అనుమతులిచ్చింది. ఈ మేరకు మంగళవారం ఢిల్లీలో జరిగిన నేషనల్ వైల్డ్‌లైఫ్ బోర్డు సమావేశంలో రాష్ట్రానికి సంబంధించి 23 అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపింది. నిర్మల్ జిల్లా కడెం ప్రాజెక్టుపై నిర్మించతలపెట్టిన లక్ష్మీపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ (ఖానాపూర్ పరిధి) పథకానికి అనుమతులు ఇచ్చింది.**





అంతా సరిగ్గానే ఉందని గుర్తించినప్పుడు నువ్వు తలను పైకి లేపి, ఆకాశం వైపు చూసి నవ్వుతావు.
– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 19 జూలై 2023

హాలీవుడ్ సంక్షోభం

అవును... హాలీవుడ్ సంక్షోభంలో చిక్కుకుంది. ఆరు దశాబ్దాల పైచిలుకు తర్వాత రచయితలు, నటీనటులు మళ్ళీ ఏకకాలంలో సెట్స్‌కు దూరం జరిగారు. సినిమాలు, టీవీ షోల నిర్మాణం ఒక్కసారిగా ఆగింది. జీతభత్యాల పెంపు సహా పలు అంశాలపై నిర్మాతల కూటమి (అలయన్స్ ఆఫ్ మోషన్ పిక్చర్ అండ్ టెలివిజన్ ప్రొడ్యూసర్స్)తో చర్చలు విఫలమై మే 2 నుంచి రచయితలు సమ్మె బాట పట్టారు. రెండు నెలల తర్వాత తాజాగా ఈ జూలై 13 నుంచి వేలాది నటులూ జత కలిశారు. సరైన జీతం, మెరుగైన పని పరిస్థితుల డిమాండ్లు తీరకపోవడంతో నటులూ పిడికిలి పైకెత్తారు. ఇక, రచన, నటనలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని నటీనటుల సంఘం (ఎస్ఏజీ), రచయితల సంఘం (డబ్ల్యూజీఏ)... రెండూ వ్యతిరేకిస్తున్నాయి. సమ్మెకు అదీ ఒక ప్రధాన కారణమే. జంట సమ్మెల ప్రభావం చిత్రనిర్మాణంలోని ఇతర విభాగాల్లో, అనుబంధ పరిశ్రమల్లోని వేలమందిపైనా పడింది. కార్మికులంతా వీధిన పడ్డారు. అందుకే, ఇది వట్టి వినోదానికి మించిన విషయం.

సీఈఓలకు లక్షల డాలర్లిస్తూ, రచయితలు, నటుల దగ్గరకొచ్చేసరికి నష్టాలొస్తున్నాయంటూ బీద అరుపులు అరవడం హాలీవుడ్‌లోనూ ఉన్నదే. 2000లో అన్నీ కలిపి హాలీవుడ్ వినోద పరిశ్రమకు 500 కోట్ల డాలర్ల లాభాలొస్తే, నెట్‌ఫ్లిక్స్ చేరికతో 2019కి అది 3 వేల డాలర్లకు దూసుకుపోయింది. రచయితల సంపాదన మాత్రం తగ్గిపోయింది. గత దశాబ్దకాలంలో రచయిత కమ్ నిర్మాత హోదాలోని వారి సగటు జీతం 4 శాతం మేర తగ్గింది. ద్రవ్యోల్బణంతో చూసుకుంటే, ఏకంగా 23 శాతం క్షీణించింది. తాజా స్ట్రీమింగ్ శకం ప్రకంపనలు రచనావృత్తిని తాకాయి. 2000లో టీవీ సీజన్ రైటర్లకు ఏటా 42 వారాల పని దొరికేది. స్ట్రీమింగ్‌తో సీజన్లు తగ్గి, 20 వారాలకు పడిపోయింది.

11,500 మంది సభ్యులున్న రచయితల సంఘంతో మూడేళ్ళకోసారి నిర్మాతల కూటమి కొత్త జీతభత్యాల ఒప్పందం కుదుర్చుకుంటుంది. వార్నర్ బ్రదర్స్, డిస్కవరీ లాంటి భారీ స్టూడియోలు, నెట్‌ఫ్లిక్స్, పీకాక్ లాంటి పలు స్ట్రీమింగ్ వేదికలు ఆ నిర్మాతల్లో భాగమే. ఈసారి మే1తో కొత్త ఒప్పందం రావాలి. ఆరు వారాలు చర్చించినా ఫలితం లేకపోయింది. జీతం, పింఛన్, స్ట్రీమింగ్‌లో పదే పదే ప్రసారంతో రచయితలకు అదనంగా చేయాల్సిన అవశేష చెల్లింపులు (రాయల్టీలు) వగైరా ఎటూ తెగకపోవడంతో కలం కార్మికులు సమ్మె సైరన్ మోగించారు. స్థూలంగా నటీనటులకూ ఇలాంటి సమస్యలే. చర్చలు ఫలించక నటీనటుల సంఘం సైతం తాజాగా షూటింగ్‌లకు దూరం జరిగింది. గత నవంబర్‌లో రంగప్రవేశం చేసిన ఛాట్‌జీపీటీ సైతం సృజనాత్మక రంగాలను కుదిపేస్తోంది. సమీప భవిష్యత్తులో ఏఐతో తమ పొట్ట కొట్టకుండా రక్షణ ఉండాలని రచయితల, నటుల డిమాండ్.

ప్రస్తుతం స్ట్రీమింగ్ వేదికలు పెరిగాయి. కంటెంట్ దాహం తీరట్లేదు. దీన్ని అదనుగా చేసుకొని ఏఐ లాంటి వాటి శిక్షణకు తమ స్క్రిప్టులను వినియోగించరాదనీ, తమ రచనల నుంచి కొత్తవి సృష్టించడానికి ఏఐని వాడరాదనీ సృజనకారుల డిమాండ్. నటులు సైతం అనుమతి లేకుండా, పరిహారమివ్వకుండా ఏఐతో తమ రూపాలనూ, స్వరాలనూ సృష్టించి నటింపజేయరాదంటున్నారు. అది సమంజసమే. నిర్మాతలు మాత్రం నేపథ్యంలోని నటీనటుల స్కాన్లను తీసుకొనే హక్కు తమకు ఉండాలంటున్నారు. తద్వారా వారి రూపాలను ఏఐతో సృష్టించి శాశ్వతంగా వాడుకోనివ్వాలని కోరుతున్నారు. అప్పుడిక పారితోషికమివ్వకుండానే పని జరిగిపోతుందనేది నిర్మాతల ఎత్తు. దీని పైనే తీవ్ర అభ్యంతరం. వెరసి, యావత్ సినీ చరిత్రలోనే రెండో పర్యాయం హాలీవుడ్ స్తంభించింది.

2007లో వంద రోజుల పాటు రచయితల సమ్మెతో ఒక్క క్యాలిఫోర్నియాకే 210 కోట్ల డాలర్ల మేర నష్టం వాటిల్లింది. ఇప్పుడీ జంట సమ్మెలెంత నష్టం తెస్తాయో? రీషూట్లు, ప్రచారాలు, ప్రీమియర్లకు నటులు దూరమయ్యేసరికి పూర్తయిన సినిమాలకూ ఇబ్బందే. టీవీ షోల కథ సరేసరి. ఎమ్మీ అవార్డుల ప్రదానం లాంటివీ వెనక్కిపోతాయి. వాటి కన్నా ముఖ్యం సాధారణ కార్మికుల పరిస్థితి. 1960లో నటులు, రచయితలు ఒకేసారి సమ్మె చేసినప్పుడు నటీనటుల సంఘానికి సారథి నటుడు, తర్వాత అమెరికా అధ్యక్షుడైన రొనాల్డ్ రీగన్. అయితే ఈసారి సమ్మె ప్రత్యేకమైనది. సాంకేతికతదే పైచేయి అయి, పని స్వభావం, సుస్థిరతపై ప్రభావం పడేవేళ యాజమాన్యానికీ, శ్రామికులకూ మధ్య బంధాల పునర్వ్యవస్థీకరణ అవసరమని గుర్తు చేస్తున్న సమ్మె ఇది. ఛాట్ జీపీటీతో పని చౌకగనక రచయితలు, ఎడిటర్లు, ఫోటోగ్రాఫర్ల లాంటి వైట్‌కాలర్ ఉద్యోగాలు పోతాయని భయం.

అలాగని అంతర్జాల యుగంలో నియంత్రణలతో టెక్నాలజీని అడ్డగలమా అంటే అనుమానమే. ఎవరికీ దెబ్బ తగలకుండా మధ్యేమార్గంలో పోవడం విజ్ఞత. దర్శక దిగ్గజం క్రిస్టఫర్ నోలన్ అన్నట్టు తారల సంగతెలా ఉన్నా, ఏఐతో రచయితల, చిన్న నటీనటుల పొట్టకొట్టడం భావ్యం కాదు. నిజానికి, రచన, నటన లాంటి సృజనాత్మక కృషికి మేధ కన్నా మానసిక స్పందన ముఖ్యం. మనిషైతేనేం, మెషినైతేనేం అంతా ఒకటేనని కొందరు అనుకోవచ్చు. అననూవచ్చు. భవిష్యత్తులో అలాంటి ఏఐ ఆధారిత సినిమాలు రావచ్చు. కొత్త ఒక వింతగా ఆకట్టుకోనూవచ్చు. కానీ, ఏ సృజన ఎందుకు గొప్పదవుతుందో, ఎలా జనాదరణ పొందుతుందో యంత్రాలు, డేటాలు చెప్పగలవా? నకిలీ నటులు, కంప్యూటర్ రచయితలతో తయారైన ఏఐ చిత్రాలు నిజమైన సినిమాల అనుభూతిని అందించగలవా? కొద్దికాలానికి ఈ కృత్రిమ మేధాసృష్టి విసుగెత్తవచ్చు. అయితే, అప్పటికే అంతా ఆలస్యమైపోతుంది. హాలీవుడ్‌లో సమ్మె చేస్తున్నవారి ఆవేదన అదే!

సంస్కృతంలో వాళ్లెందుకు రాయరు?

విశ్లేషణ



ప్రొ॥ కంచ ఐలయ్య షెపర్డ్

సంస్కృతాన్ని ఇష్టపడే కొందరు భారతీయ అమెరికన్లు తమ పుస్తకాలను సంస్కృతంలో ఎందుకు రాయరు? వీరు ఆంగ్లంలో రాస్తూనే, ఆ భాషను వలసవాదమంటూ దాడి చేస్తారు. చారిత్రకంగా సంస్కృతాన్ని కొందరు రచయితలే నియంత్రించారు. వారు దాని ప్రాప్యతను, విస్తృతిని పరిమితం చేశారు. శూద్రులకు ఆ భాషలో చదవడానికి, రాయడానికి గల అవకాశాన్ని నిరాకరించారు. కానీ, ఇప్పుడు వాళ్లు సామాజికపరమైన లేదా విద్యాపరమైన ప్రాముఖ్యం కలిగిన పుస్తకాలు రాయడానికి సంస్కృతాన్ని ఉపయోగించడం లేదు. అలా సంస్కృత అంతర్ధానానికి చైతన్యవంతంగా బాధ్యత వహిస్తున్నారు. అయినా ఆ అంతర్ధానానికి మాత్రం మిగిలిన ప్రపంచాన్ని నిందిస్తూ ఉంటారు.

దాదాపుగా భారతీయ అమెరికన్లతో కూడిన రాజీవ్ మల్హోత్రా నేతృత్వంలోని బృందం ఇటీవల 'టెన్ హెడ్స్ ఆఫ్ రావణ: ఎ క్రిటిక్ ఆఫ్ హిందూఫోబిక్ స్కాలర్స్' పుస్తకాన్ని ప్రచురించింది. ఇంగ్లిషులో రాసిన ఈ పుస్తకం... ఈ రచయితతో సహా రొమిల్లా థాపర్, ఇర్ఫాన్ హబీబ్, శశిథరూర్, రామచంద్ర గుహ, దేవదత్ పట్నాయక్, షెల్డన్ పొలాక్, వెండీ డోనిగర్, ఆడ్రీ ట్రూష్కే, మైకేల్ విట్జెల్‌లను విమర్శించింది. మల్హోత్రా బృందం ఈ పండితులను పౌరాణిక పాత్ర అయిన రావణుడితో పోల్చింది. ఈ పండితులు ప్రాచీన సంస్కృత పుస్తకాలు ప్రబోధించిన ధర్మాన్ని చంపేశారని ఆరోపించింది. 'చారిత్రక రావణుడికి మల్లే ఈ పండితుల రచనల్లో నేడు చాలామంది హిందువులు అధర్మంగా భావిస్తున్న అంశాలు ఉన్నాయి కాబట్టే ఈ పుస్తకంలో పది మంది సమకాలీన విద్వాంసులను లక్ష్యంగా' ఎంచుకున్నట్లు మల్హోత్రా తన పరిచయంలో పేర్కొన్నారు.

ఈ పుస్తకంలో లక్ష్యంగా ఎంచుకున్న నలుగురు విదేశీ పండితులు సంస్కృత భాషపై కృషి చేశారు. చాలాకాలం వివిధ పాశ్చాత్య విశ్వవిద్యాలయాలలో సంస్కృత భాషను బోధించారు. మరోవైపు, మల్హోత్రాకు అమెరికాలో 'ఇన్ఫినిటీ ఫౌండేషన్' అనే ఆర్థిక నెట్‌వర్క్ ఉంది. ఈ పుస్తకాన్ని ప్రచురించిన ఢిల్లీలోని 'గరుడ ప్రకాశన్' సంస్థనూ నడుపుతున్నారు.

ఇప్పుడు ప్రశ్న ఏమిటంటే: సంస్కృతాన్ని ఇష్టపడే ఈ భారతీయ అమెరికన్లు తమ పుస్తకాన్ని సంస్కృతంలో ఎందుకు రాయలేదు? వీరు ఆంగ్లంలో రాస్తూనే, ఆ భాషను వలసవాదమంటూ దాడి చేస్తారు. సంస్కృతాన్ని గొప్ప ప్రపంచ సజీవ భాష అంటారు, కానీ ఆ భాషలో ఏ గ్రంథాన్నీ రాయరు. సంస్కృతాన్ని మృత భాష అని షెల్డన్ పొల్లాక్ సరిగ్గానే అన్నారు. తమ దైనందిన జీవితంలో సంస్కృతాన్ని ఉపయోగించే, అందులో భావ వ్యక్తీకరణ చేసే కుటుంబాలు ఎన్ని ఉన్నాయి? ఒక భాషను స్థానికంగా మాట్లాడేవారు లేనప్పుడు భాష మరణిస్తుంది. ఆధిపత్య నియంత్రణను కొనసాగించడానికి సంస్కృతాన్ని ఉపయోగించే వ్యక్తుల సమూహమే ఆ భాషను చంపేసింది. చారిత్రకంగా సంస్కృతాన్ని కొందరు రచయితలే నియంత్రించారు. వారు దాని ప్రాప్యతను లేదా విస్తృతిని పరిమితం చేశారు. శూద్రులకు ఆ భాషలో చదవడానికి లేదా రాయడానికి గల అవకాశాన్ని నిరాకరించారు.

సామాజికపరమైన లేదా విద్యాపరమైన ప్రాముఖ్యం కలిగిన పుస్తకాలు రాయడానికి సంస్కృతాన్ని ఇప్పుడు వాళ్లు ఉపయోగించడం లేదు. అలా సంస్కృత అంతర్ధానానికి చైతన్యవంతంగా బాధ్యత వహిస్తున్నారు. కానీ ఆ అంతర్ధానానికి మిగిలిన ప్రపంచాన్ని నిందిస్తూ ఉంటారు. ఇతర సంస్కృతులకు చెందిన యూదుల వంటివారు తమ ఆధునిక పుస్తకాలను హీబ్రూలో రాస్తున్నారు. యువల్ నోవా హరారీ ప్రభావవంతమైన రచన 'సేపియన్స్– ఎ బ్రీఫ్ హిస్టరీ ఆఫ్ హ్యూమన్ కైండ్'ను మొదట హీబ్రూలోనే రాశారు. అలాగే గ్రీకులు గ్రీకు భాషలో రాస్తారు. అరబ్బులు అరబిక్‌లోనే రాస్తారు. బ్రాహ్మణ వాదులు మాత్రం సంస్కృతంలో రాయరు. శూద్ర, దళిత, ఆదివాసీ ప్రజానీకాన్ని మోసం చేయడానికి మాత్రమే సంస్కృతాన్ని పొగడటాన్ని నేటికీ కొనసాగిస్తున్నారా?



బ్రాహ్మణవాద మేధావులకు ఆరెస్సెస్, బీజేపీ ఆర్థికంగా, సంస్థాగతంగా మద్దతు ఇస్తున్నాయి. భారతదేశ వ్యవసాయ చేతివృత్తుల చరిత్రను విస్మరిస్తూ సంస్కృత గతాన్ని మాత్రమే వీరు కీర్తిస్తున్నారు. వివిధ విభాగాలలో ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉన్న జ్ఞానాన్నంతటినీ సంస్కృత గ్రంథాలైన వేదాలు, ఉపనిషత్తులు, బ్రాహ్మణాలు, రామాయణం, మహాభారతాల నుండే దొంగిలించారనే భావనను ప్రచారం చేస్తారు. బ్రాహ్మణవాద శాస్త్రవేత్తలు కూడా ఆధునిక విజ్ఞాన శాస్త్రాలన్నీ ప్రాచీన సంస్కృత పుస్తకాలలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ పండితుల్లో ఎంతమంది సంస్కృతంలో ఆ పుస్తకాలను చదివారు? సంస్కృతంలో ఇంత అపారమైన సృజనాత్మక శక్తి ఉన్నట్లయితే, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న భారతీయ మేధావులు... ప్రపంచ తాత్విక, మేధాపరమైన రచనలను హరారీ వంటి వ్యక్తులకు ఎందుకు వదిలివేస్తున్నారు?

భారతదేశ చరిత్ర పొడవునా సంస్కృతాన్ని 'మాతృభాష'గా కాకుండా 'పితృభాష'గా పరిగణిస్తూ వచ్చారు. సంస్కృతాన్ని ద్విజ కుటుంబాలలో కూడా మాతృభాషగా మారడానికి అనుమతించలేదని గుర్తుంచుకోవాలి. తల్లి, ఆమె బిడ్డల మధ్య సంభాషణతో సహా ఇంటిలో రోజువారీ జీవితంలో ఒక భాషను క్రమం తప్పకుండా ఉపయోగిస్తే మాత్రమే దానిని 'మాతృభాష'గా పరిగణించవచ్చు. కులీన గృహాలలో కూడా సంస్కృతాన్ని మాతృభాషగా మారడానికి అనుమతించనప్పుడు, ఉత్పత్తి వర్గాల్లో దాన్ని స్వీకరించే ప్రశ్న తలెత్తదు.

ఈ పరిస్థితుల దృష్ట్యా, నాగరికతకు రక్షణకర్తలుగా తమను తాము గుర్తించుకునే ఈ భారతీయ అమెరికన్ల సమూహం... సంస్కృతంలో తమ పుస్తకాలను ఎందుకు రాయడం లేదని ప్రశ్నించాల్సి ఉంది. ఈ బృందం ప్రధానంగా అమెరికా, యూరప్, కెనడా, ఆస్ట్రేలియాల్లో నివసిస్తున్న వ్యక్తులలోని భారతీయ ఆలోచనా విధానాన్ని నిర్వలసీకరించడం, ఆర్థిక వనరులను సమీకరించడం లక్ష్యంగా పెట్టుకుంది. కానీ, భారతదేశంలో స్థాపించిన సంస్కృత పాఠశాలలు, సంస్కృత విశ్వవిద్యాలయాలకు వారు తమ పిల్లలను ఎందుకు పంపరు? బదులుగా వారు తమ పిల్లలను ప్రతిష్ఠాత్మకమైన అమెరికన్ విశ్వవిద్యాలయాలకు మాత్రమే ఎందుకు పంపాలని భావిస్తున్నారు?

'టెన్ హెడ్స్ ఆఫ్ రావణ' పుస్తకాన్ని రచించిన ఈ వ్యక్తులు, సంస్కృత పుస్తకాల నుండి వచ్చిన భారతదేశ నాగరికత మా లాంటి ఎవరికీ తెలియదని ఆరోపించారు. నాగరికత అంటే వారి దృష్టిలో అర్థం ఏమిటి? పుస్తకాల ద్వారా నాగరికతను నిర్మించవచ్చా? సంస్కృత పుస్తకాలకు చెందిన ఏదైనా అనువాదాన్ని చదివితే... శూద్ర, దళిత, ఆదివాసీ వర్గాల నుండి సామాజిక శక్తులు ఏవీ లేవని అది సూచిస్తుంది. ఇవి యుద్ధం, యజ్ఞాలు, క్రతువుల చుట్టూ కేంద్రీకృతమై ఉన్నాయి. ఆహార ఉత్పత్తి, సేకరణ, జంతువుల మేతకు చెందిన వ్యవస్థలను ఈ పుస్తకాలలో ఏ కోశానా పొందుపర్చలేదు. ఈ హిందూత్వ రచయితలతో సహా మానవులందరూ శూద్ర వ్యవసాయాధారిత ప్రజానీకం ఉత్పత్తి చేసే ఆహారంతోనే జీవిస్తున్నారని గుర్తించడం ముఖ్యం. ఆ 'సంస్కృత యుగం'లో భూమిని పండించిన వారి గురించి, జంతువుల మేత ద్వారా మాంసాన్ని, పాలను ఉత్పత్తి చేసిన వారి గురించి ఎప్పుడూ రాయలేదు.


హాస్యాస్పదంగా, ఈ భారతీయ అమెరికన్ కులీన వర్గాలు, ప్రత్యేకించి అమెరికాలో కుల వ్యతిరేక చట్టాలను వ్యతిరేకించే ఇన్ఫినిటీ ఫౌండేషన్ సభ్యులు తమను తాము 'మేధావులైన క్షత్రియులు'గా పేర్కొంటారు. అది కులతత్వం కాదా? మరోవైపున వీరి సంస్కృత యుగం పట్ల దళితులు, ఆదివాసీలు, శూద్రులకు ఏ మాత్రం ఆసక్తి లేదు. ఇంగ్లిష్ యుగంలోకి వెళ్లాలనీ, జ్ఞానోత్పత్తికి సంబంధించిన అన్ని కేంద్రాల నుండి ఈ శక్తులను స్థానభ్రంశం చేయాలనీ, ఆహార ఉత్పత్తి, జ్ఞానోత్పత్తి మధ్య సంబంధాన్ని ప్రతిష్ఠించాలనీ వారు కోరుకుంటున్నారు. ఇది అమృత్ కాల్ కాదు; నిజానికి ఇది శూద్ర కాలం. ఈ యుగంలో సంస్కృత పుస్తకాలలో వర్ణించినట్లుగా ఉత్పత్తి అనేది లోకువైనది కాదు; ఇక్కడ ఉత్పత్తి చాలా పవిత్రమైనది.

వ్యాసకర్త ప్రముఖ రచయిత, సామాజిక కార్యకర్త

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

పదాలతో పోరు



ప్రతిపక్షాలు తమ కూటమిని 'ఇండియా' అంటున్నాయి: ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్! విస్తరణ రూపంలో ఇది నోరు తిరగని మాటే; కానీ ఇది తక్కువ గుర్తుండిపోయే సంక్షిప్త పదాల కాలం కదా! ఇప్పటికి ఇది ఇండియా వర్సెస్ ఎన్డీయే: ఎవరు గెలిచినా, భారత్ అనే ఇండియా గెలుస్తుంది.

– రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

ఇంత చెత్తా?



నీళ్ల గ్లాసును ఎండలో పెడితే ఆ నీటిలోకి విటమిన్–డి రాదు (వీడియో షేర్ చేశారు). కానీ లైకుల కోసం ఇలాంటి చెత్త వీడియోలు చేస్తున్నారు. ఇంకా ఘోరం ఏమిటంటే, దీన్ని వేలమంది నమ్ముతారు. ఇలాంటి కంటెంటుకు ఉన్న డిమాండుకు తగ్గట్టుగా ఇలాంటి వాళ్లు సరఫరా చేస్తున్నారు.

– కార్తీక్, ఎండోక్రైనాలజిస్ట్

తర్వాతి కథ?



వివాహ సంబంధ పోస్టులను ఎగతాళి చేయొద్దు. తెల్లగా, చూడ్డానికి బాగుండి, ఇంట్లో ఉండటానికి ఇష్టపడే సంప్రదాయ ఐటీ అమ్మాయిని అబ్బాయిలూ; 27 ఏళ్లు, ఆరడుగుల ఎత్తు, యేడాదికి యాభై లక్షల సంపాదన ఉండి, తన తల్లిదండ్రులతో ఉండాలని బలవంత పెట్టని అబ్బాయిని అమ్మాయిలూ కోరుకుంటారు. అవును, ముందు అలాగే మొదలవుతుంది...

– సాయి స్వరూప, అసిస్టెంట్ ప్రొఫెసర్

బోరు బోరు



మోదీకి ఇప్పటికీ ఎదురు లేదని ప్రతిపక్ష కూటమి సమావేశాలు బహిర్గతపరుస్తున్నాయి. పదేళ్లపాటు ప్రతిపక్షంలో కూర్చుండి కూడా వాళ్లు కొత్త ఆలోచనలు, కొత్త ముఖాలు, కొత్త కథనాలతో రాలేదు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

భారత్ వర్సెస్ ఇండియా



అంటే 2024 ఎన్నికల పోరు ఇండియా వర్సెస్ భారత్ కానుందా? మనకు తెలిసిన మోదీ కచ్చితంగా ఈ పోలిక మీద ఆడుకుంటారు: ఒకటేమో విదేశీ వ్యుత్పత్తి, మరొకటేమో ఈ నేల మూలాల్లో ఉన్నది. చూద్దాం ఏం జరగనుందో!

– సుహేల్ సేఠ్, నటుడు

ఏపీలో బీజేపీ మొలకెత్తని విత్తనం

అభిప్రాయం



దానీ

బీజేపీ అంటే భారతీయ జనతా పార్టీ. నిజానికి దాన్ని ఉత్తర భారతీయ జనతా పార్టీ అనాలి. ఇంకా చెప్పాలంటే హిందీ బెల్ట్ రాజకీయ పార్టీ అనాలి. దక్షిణ భారత దేశంలో దాని ప్రభావం ఎప్పుడూ పెద్దగా లేదు. హిందీ బెల్టులో బీజేపీకి సానుకూలమైన అంశం హిందీ వీరాభిమానం; అదే దానికి దక్షిణ భారత దేశంలో ప్రతికూల అంశం.

యూరప్‌లో 'లాప్ డాగ్ మీడియా' అనే మాటను వాడుతుంటారు. అంటే ప్రభుత్వాధి నేత ఒళ్ళో కుక్కపిల్ల వంటి మీడియా అన్నమాట. మన దేశంలో మోదీజీ ఒళ్ళో మీడియాను 'గోదీ' (గోద్ + మోదీ) మీడియా అంటున్నారు. సీనియర్ జర్నలిస్ట్ రవీశ్ కుమార్ హిందీలో ఈ పదబంధాన్ని సృష్టించారు. గోదీ మీడియా ప్రచారంతో హిందీ బెల్ట్‌లో బీజేపీ చాలా బలంగా ఉందని దక్షిణాది వాళ్ళు భావిస్తుంటారు. దక్షిణాదిలో బీజేపీ విస్తరిస్తున్నదని ఉత్తరాది వారు భావిస్తుంటారు. వాస్తవం ఏమంటే అటు ఉత్తర భారత దేశంలోనూ ఇటు దక్షణ భారత దేశంలోనూ మోదీజీ– అమిత్ షాల 'డబుల్ ఇంజిన్' పాలన మీద ఏవగింపు వేగంగా పుంజుకుంటున్నది.

వరుసగా రెండుసార్లు అధికారంలో ఉన్న పార్టీ మీద ప్రజల్లో కొంత అసంతృప్తి వుండడం సహజం. మోదీజీ–అమిత్ షాల పాలన మీద అసంతృప్తి చాలా తీవ్రంగా ఉందనే సంకేతాలొస్తున్నాయి. విచిత్రం ఏమంటే వాణిజ్య, వ్యాపార వర్గాలు సహితం ఇటీవల బీజేపీ పాలన మీద అసంతృప్తితో వున్నాయి. 'హిందూ–ముస్లిం' చీలిక రాజకీయాలతో సామాజిక శాంతి దెబ్బతిన్నది. సామాజిక శాంతి లేనప్పుడు మార్కెట్‌లో కొనుగోలు ఉత్సాహం తగ్గిపోతుంది. ఇది వాణిజ్యం మీద గట్టి ప్రభావాన్ని చూపుతుంది. ఇటీవలి కర్ణాటక ఎన్నికల్లో 'హిజాబ్–హలాలా' వంటి వివాదాలను లేవనెత్తి బీజేపీ చేసిన హడావిడిని బీజేపీ అనుకూల వాణిజ్య వ్యాపార వర్గాలు సహితం ఏవగించుకున్నాయి. అక్కడ బీజేపీ ఓటమికి తమవంతు పాత్రను నిర్వహించాయి. ఇటువంటి పరిస్థితుల్లో బీజేపీ 'ఉమ్మడి పౌర స్మృతి' జపం చేయడం దానికి మేలు కంటే కీడే చేస్తుంది.

ఇప్పటికే హిమాచల్ ప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వరుస విజయాలతో కాంగ్రెస్ ఉత్సాహంగా వుంది. మరోవైపు, రెండు వరుస పరాజయాలతో కమలం శ్రేణులు కుంగుబాటులో ఉన్నాయి. త్వరలో ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, తెలంగాణ, మిజోరం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. వీటిల్లో ఏ ఒక్కదాన్ని అయినా కాంగ్రెస్ తన ఖాతాలో వేసుకుంటే హ్యాట్రిక్ కొట్టినట్టు అవుతుంది.

రాబోయే లోక్ సభ ఎన్నికల్లో ఉత్తరభారత దేశంలో భారీగా సీట్లు తగ్గబోతున్నట్టు బీజేపీ అంతర్గత సర్వే నివేదికలు హెచ్చరించినట్టు వార్తలొచ్చాయి. హిందీ బెల్ట్‌లో తగ్గే సీట్ల లోటును దక్షిణాది రాష్ట్రాల్లో పూడ్చుకోవాలని కమలనాథులు ప్రణాళికలు రచిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాల ఓటర్లను ఆకర్షించడానికి సాక్షాత్తు ప్రధాని మోదీజీయే రంగంలోనికి దిగి రామేశ్వరం నియోజకవర్గం నుండి పోటీ చేస్తారనే వార్తలు గుప్పుమన్నాయి.


ప్రస్తుతం మీడియాలో ప్రచారం జరుగుతున్నట్టు 'రామేశ్వరం'... లోక్‌సభ నియోజకవర్గం కాదు; దక్షిణ తమిళనాడులోని రామనాథపురం లోక్‌సభా నియోజకవర్గంలో అదొక మునిసిపల్ పట్టణం. హిందువుల పుణ్యక్షేత్రం. భారత్–శ్రీలంకల మధ్య 'సేతుసముద్రం షిప్పింగ్ కెనాల్ ప్రాజెక్టు' నిర్మాణం జరుగుతున్నది అక్కడే. ప్రస్తుతం కేఈ నాజర్ ఖాన్ మునిసిపల్ ఛైర్మన్‌గా ఉన్నారు. రామనాథపురం లోక్ సభ స్థానానికి 'ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్'కు చెందిన 'నవాస్ కనీ' అనే నవాజ్ ఖాన్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. 2014 ఎన్నికల్లో ఏఐఏడీఎంకేకు చెందిన అన్వర్ రజా గెలిచారు. 2009, 2014 ఎన్నికల్లో ఇక్కడ బీజేపీ అభ్యర్థులు మూడవ స్థానంలో నిలిచారు. దక్షిణ భారతదేశంలోని ఆరు రాష్ట్రాల్లో నాలుగింటిలో బీజేపీకి లోక్‌సభ సభ్యులు లేరు. కర్ణాటకలో 25 మంది, తెలంగాణలో నలుగురు మాత్రమే ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలు జరిగితే కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో ఇప్పుడున్న స్థానాల్ని నిలబెట్టుకోవడం కూడ బీజేపీకి పెద్ద సవాలు కావచ్చు. కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి, ఆంధ్రప్రదేశ్ నేలల్లో బీజేపీ మొలకెత్తని విత్తనం. కమలం ఇక్కడ ఎన్నికలకు పనికిరాని పువ్వు. ఈ పరిస్థితుల్లో, బీజేపీ 'మిషన్ సౌత్ ఇండియా' చరిత్రను తిరగ రాస్తుందా? చూడాలి!

సమాజ విశ్లేషకులు, సీనియర్ జర్నలిస్టు

అవునని తెలిసీ... కాదని అంటాం!

కామెంట్



కరణ్ థాపర్


కులం గురించి, అది మన వ్యవస్థలలోకి చొరబడిన విద్వేష మార్గం గురించి నాకు మరీ అంతగా తెలియదు. అదృష్టవశాత్తూ మనోజ్ మిత్తా రాసిన 'క్యాస్ట్ ప్రైడ్: బ్యాటిల్స్ ఫర్ ఈక్వాలిటీ ఇన్ హిందూ ఇండియా' నా చేతికి అందింది. దట్టమైన పుస్తకం అది. పుస్తకాన్ని చదువుతున్నప్పుడు అడవిని చూడలేనంతగా చెట్ల కింద కూరుకుపోయినట్లుగా ఉంది. అయితే మీరు గొప్ప పట్టుదలను కలిగి ఉంటే కనుక చదవదగిన పుస్తకమే అనిపిస్తుంది.

ఏమైనా, మనోజ్ తనకు తానుగా సత్యాన్ని గుర్తించాడని కనిపెట్టినప్పుడు మొదట నా ముఖంపై చిరునవ్వు వెలసింది. ''1984లో సిక్కుల ఊచకోత, 2002లో ముస్లింలపై జరిగిన మారణకాండల మీద పుస్తకాలు రాశాక, మూడో పుస్తకాన్ని భారతదేశంలోని సామూహిక హింసపై రాయాలన్నది నా అసలు ప్రణాళిక. దళితుల హత్యలపై దృష్టి పెట్టాలన్నది నా ఉద్దేశం'' అంటాడు మనోజ్. అయితే ఏడేళ్ల పరిశోధన తర్వాత అతడు తెలుసుకున్నది ఏమిటంటే, ఇంకా చాలా కథే ఉందని!

''దేశంలోని వివిధ వ్యవస్థల దర్యాప్తు అధికారులు, ప్రభుత్వం తరపున వాదించే న్యాయవాదులు, కేసు విచారణ న్యాయమూర్తులు, పునర్విచారణ న్యాయ నిర్ణేతలు వీళ్లంతా తమ వాదనలలో, తీర్పులలో పదే పదే స్పష్టమైన కుల దురభిమానాన్ని ప్రదర్శించి కూడా అలాంటిదేమీ లేనట్లు మళ్లీ మళ్లీ ఎలా తప్పించుకోగలరో అర్థం చేసుకోడానికి ప్రత్యక్ష హింసను దాటి చూడాలన్న అవసరాన్ని నేను గ్రహించాను'' అంటాడు మనోజ్. అతడి ఈ గ్రహింపు సూటిగా ఉన్నది, సరళమైనది, బాధతో కూడినది. కులహత్యలు జరిగినప్పుడు, కుల మారణకాండలు సంభవించినప్పుడు వ్యక్తులుగా, వ్యవస్థలుగా కూడా మనం దాదాపు ప్రతిసారీ ఆ హత్యల వెనుక కులపరమైన కారణాలు లేనే లేవని ఖండిస్తాం. మనోజ్ అదే రాస్తూ, ''అత్యంత స్పష్టంగా కనిపించే కుల దౌర్జన్యాల వెనుక ఉన్న కుల కోణాన్ని సైతం భారతదేశం దశాబ్దాలుగా తిరస్కరిస్తూనే వస్తోంది'' అంటాడు.

కుల వివాదాలను, కుల దౌర్జన్యాలను అదుపులోకి తెచ్చేందుకు 1816–2019 మధ్య ఏ విధమైన ప్రయత్నాలు జరిగాయో తెలిపే వివరాలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ''అంటరానితనం నిర్మూలనకు అంటూ 1950లో ఏదైతే ప్రయత్నం జరిగిందో అది... అప్పటికే అంటరానితనం నుంచి విముక్తి పొంది ఉన్న వాళ్లపై మరింతగా దిగ్భ్రాంతికరమైన హింసాత్మక చర్యలకు ఆధిపత్య కులాలవారిని ప్రేరేపించి, సామూహిక హత్యలు అనే ఒక కొత్త దురాగతాన్ని కనిపెట్టేందుకు వారు పాల్పడేంతగా వ్యతిరేకతకు కారణమైంది'' అని మనోజ్ రాశారు. 1968లో తమిళనాడులోని కీలవేణ్మణిలో తొలిసారి అటువంటి సామూహిక హత్యలు జరిగాయి.

మనోజ్ పేర్కొన్న దారుణాలలో నేను బాగా గుర్తెరిగినది బెల్చి హత్యాకాండ. అది జరిగినప్పుడు నా వయసు 22. ఆ భయానక ఊచకోతకు లండన్ నుంచి వెలువడే 'ది స్పెక్టేటర్' పత్రిక 'ది హంటింగ్ ఆఫ్ హరిజన్' అనే శీర్షికను పెట్టడం కన్నా కూడా నాకు ఇప్పటికీ బాగా జ్ఞాపకం ఉన్నది... ఇందిరా గాంధీ



మనోజ్ మిత్తా

చూపిన చొరవ. అర్ధరాత్రి సమయంలో రుతుపవనాలు కుండపోతగా కురుస్తున్నప్పుడు మావటి వెనుక ఏనుగుపై కూర్చొని, ఆ చీకట్లో తనను అంతా గుర్తించగలిగేలా టార్చిలైట్ల వెలుగులో బెల్చి చేరుకోవడం. ''ఆ విధంగా చేయడం ద్వారా ఆమె జనాదరణను ఒడిసి పట్టుకున్నట్లయింది'' అంటాడు మనోజ్.

ఈ పుస్తకం ద్వారా తప్ప... ఇంతవరకు నాకు తెలియందీ, నన్ను ఆశ్చర్యానికి గురి చేసిందీ, ''కులపరమైన హత్యలు జరిగిన ఘటనా స్థలాన్ని సందర్శించిన మొట్టమొదటి, బహుశా ఏకైక జాతీయ నాయకురాలు ఇందిరాగాంధీ'' కావడం. మన తాజా రాజకీయాలపై, నిజానికి ఇప్పటి మన ప్రజాస్వామ్యంపై ఎంత కఠోర వ్యాఖ్య! మనల్ని బాధించే విషాదాలపై మన పాలకులు ఎలా స్పందిస్తున్నారనే దానిపైన కూడా ఇది కచ్చితమైన వ్యాఖ్య.

అయితే మనోజ్ ఉద్దేశం ఇందిరాగాంధీ చొరవ గురించి చెప్పడం కాదు. బెల్చి ఘటనను మన వ్యవస్థ ఒక కులద్వేష దురాగతంగా అంగీకరించడానికి ఎందుకు ఇష్టపడలేదన్న ప్రశ్నను లేవనెత్తడం. నాడు హోమ్ మంత్రిగా ఉన్న చరణ్‌సింగ్ పార్లమెంటులో మాట్లాడుతూ... ''ఈ ఘటనకు కుల, మత, భూ తగాదాలు గానీ, రాజకీయాలు గానీ కారణం కాదు. కొన్ని పత్రికల్లో వచ్చిన విధంగా సమాజంలోని బలహీన వర్గాలపై జరిగిన దౌర్జన్యం కూడా కాదు'' అని ప్రకటించారు. జనతాపార్టీ ప్రధాన కార్యదర్శి రామ్‌ధన్ ఛైర్మన్‌గా ఉన్న పార్లమెంటరీ కమిటీ చరణ్ సింగ్‌తో తీవ్రంగా విభేదించింది కానీ, అది కుల దురాగతమేనని ఆయన్ని ఒప్పించలేకపోయింది.

చరణ్ సింగ్ చేసినటువంటి ఖండన ప్రకటనలు దాదాపు ప్రతిసారి కూడా మన ప్రతిస్పందనల్ని వికలపరుస్తాయని మనోజ్ వాదిస్తాడు. అగ్రవర్ణాలవారు ఉద్దేశపూర్వకంగా వాస్తవాలను తిరస్కరిస్తారు. అది ప్రతి దశలోనూ జరుగుతుంది. పోలీసులు, దర్యాప్తు అధికారులు సహకరించుకోవడం, బలహీనమైన న్యాయ విచారణ, వాదనలు, తీర్పులు, సుప్రీంకోర్టుకు చేరిన పునర్విచారణల నిర్వహణలో సైతం ఈ అగ్రవర్ణ భావన పని చేస్తుందని మనోజ్ అంటాడు.

ఆఖరికి మనమెంతో గొప్పగా భావించే నాయకుల గురించి కూడా మనోజ్ చేసిన వ్యాఖ్యలు మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. ''ఈ నిర్దిష్ట సందర్భంలో ఎల్లవేళలా మహాత్ముడిలా కనిపించరు'' అని గాంధీ గురించి, ''కుల సంస్కరణలను ఆయన ప్రతిఘటించలేదు, లేదా పెద్దగా వాటి కోసం ప్రయత్నించనూ లేదు. ఆయనది అతిథి పాత్ర మాత్రమే'' అని నెహ్రూ గురించి, చివరికి అంబేడ్కర్ గురించి కూడా – నేను ఎక్కువ వివరాలు ఇవ్వను గానీ– ''ఆయన కథేమీ ఆశ్చర్యాలు లేనిదైతే కాదు'' అని అంటూ... ''స్వాతంత్ర్య సమరయోధులు తప్పనిసరిగా సమానత్వ ఉద్యమశీలురు కావాలనేముంది?'' అని ముగిస్తాడు మనోజ్. పుస్తకం గురించి నా ఏకైక విమర్శ ఏమిటంటే... చదివేందుకు ఇది కొంచెం తేలికగా ఉండవలసిందనీ, పేజీలు పొంగిపొర్లేలా వివరాలు ఇవ్వడం వల్ల పుస్తకంలో ప్రధాన సందేశాన్ని తరచు అవి మరుగున పడేస్తున్నాయనీ. అయినప్పటికీ అది మనం వినవలసిన, మనం గుర్తుంచుకోవలసిన సందేశమే.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్టు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: తిథి శు.విదియ రా.2.14 వరకు, తదుపరి తదియ, నక్షత్రం: పుష్యమి ఉ.7.05 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: రా.9.15 నుండి 11.02 వరకు, దుర్ముహూర్తం: ప.11.41 నుండి 12.32 వరకు, అమృతఘడియలు: లేవు ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 5.38, సూర్యాస్తమయం: 6.34.

ఇంద్రకీలాద్రిపై చీరల టెండరు వాయిదా

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్ ముక్కలను పోగు చేసుకునే హక్కు కోసం నిర్వహించిన టెండర్‌కు సరైన ధర రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఈవో భ్రమరాంబ మంగళవారం తెలిపారు. సోమవారం బ్రాహ్మణ వీధిలోని దేవస్థాన బోర్డు సమావేశం హాల్‌లో నిర్వహించిన టెండర్ ప్రక్రియలో ఈ టెండర్, సీల్డ్ టెండర్‌లో ఎవరూ పాల్గొనలేదని, బహిరంగ వేలంలో సరైన పాట రానందున టెండర్ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు పేర్కొన్నారు.

సీఎంకు సీఆర్‌ఎంటీల కృతజ్ఞతలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని క్లస్టర్ రిసోర్స్ పర్సన్ (సీఆర్పీ)లను క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్ల(సీఆర్‌ఎంటీ)గా పేరు మార్చి తమకు న్యాయం చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది. అసోసియేషన్ అధ్యక్షుడు పి.గోవర్ధన్ ఆధ్వర్యంలో సీఆర్‌ఎంటీలు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కాకర్ల వెంకట్రామిరెడ్డితో కలిసి సీఎంను మంగళవారం కలిసి కృతజ్ఞతలు తెలిపినట్టు ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం జగన్ విద్యాశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, కొత్త ఉద్యోగాలను సృష్టించి తమను క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్లను చేశారన్నారు. ఈ సందర్భంగా సీఆర్‌ఎంటీలకు వేతనాల పెంపు, విద్యాశాఖలో విలీనం చేయాలని సీఎంను కోరినట్టు పేర్కొన్నారు.

‘పేదలకు పట్టాల’ తో కులవాదుల గుండెల్లో రైళ్లు

1,024వ రోజు రిలే దీక్షలలో బహుజన నాయకులు



తాడికొండ: పేదలకు పట్టాల పండుగ జరుగుతుంటే కులవాదుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయని బహుజన పరిరక్షణ సమితి నాయకులు అన్నారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,024వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో మంగళవారం పలువురు మాట్లాడారు. రాజధాని ప్రాంతంలో పేదవాడికి జానెడు జాగా లేకుండా చేయాలని చూసిన బాబు అండ్ కోకు త్వరలో దిమ్మతిరిగేలా పేదలు తలెత్తుకుని తిరిగే శాటిలైట్ సిటీ నిర్మాణం జరగడం ఖాయమన్నారు. ఈ నెల 24న శాటిలైట్ సిటీ నిర్మాణానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భూమిపూజ చేయనుండడం హర్షణీయమని, త్వరలో బహుజనుల కలలు సాకారం కానున్న వేళ అందరం ఆయనకు రుణపడి ఉంటామన్నారు. చంద్రబాబుకు అద్దె మైకులా మాట్లాడుతున్న ప్యాకేజీ పవన్ కళ్యాణ్ పేదల సమస్యలపై ఎందుకు పోరాటం చేయడం లేదని ప్రశ్నించారు. అన్ని పార్టీల్లో ఉన్న కులవాదులు అంతా ఏకమై వచ్చినా.. 85 శాతం ఓటు బ్యాంకు ఉన్న బహుజనులు దిమ్మతిరిగే తీర్పు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. మాదిగాని గురునాథం, బేతపూడి సాంబయ్య, పులి దాసు, ఈపూరి ఆదాం, కారుమూరి పుష్పరాజ్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

ఏపీలో ఈ ఏడాది పొగాకు 142 మి.కిలోలు

పొగాకు బోర్డు చైర్మన్ డీవీ స్వామి



సమావేశంలో మాట్లాడుతున్న స్వామి, చిత్రంలో ఈడీ శ్రీధర్‌బాబు

కొరిటిపాడు (గుంటూరు): ఆంధ్రప్రదేశ్‌లో 2023–24 పంట కాలానికి పొగాకు పంట పరిమాణంను 142 మిలియన్ కిలోలుగా నిర్ధారించినట్లు భారత పొగాకు బోర్డు చైర్మన్ డీవీ స్వామి తెలిపారు. గుంటూరులోని పొగాకు బోర్డు ప్రధాన కార్యాలయంలో 161వ పొగాకు బోర్డు సమావేశం బోర్డు చైర్మన్ స్వామి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఇందులో పలు అంశాలను చర్చించారు. పొగాకు రైతులను అన్ని విధాలుగా బోర్డు ఆదుకుంటోందని చైర్మన్ చెప్పారు. తొలిసారిగా గుంటూరుకు వచ్చిన స్వామికి బోర్డు సభ్యులు, అధికారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు, సీటీఆర్ఐ డైరెక్టర్ మాగుంట శేషమాధవ్, పొగాకు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పచ్చందాల కోక.. విశాఖ



50 శాతం గ్రీనరీ లక్ష్యంగా చర్యలు

- పందిరి తరహాలో గ్రీనరీ ఏర్పాటుకు ప్రణాళికలు
- ప్రత్యేకంగా యాప్ రూపకల్పన
- వార్డు ఎమినిటీస్ సెక్రటరీలకు బాధ్యత అప్పగింత
- దేశంలోనే పచ్చదనంలో మొదటి స్థానంలో విశాఖ
- 50 శాతం చేరితే ప్రపంచంలోనే నెంబర్ 1 స్థానానికి

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఒక వైపు పచ్చని తూర్పు కనుమలు.. మరోవైపు నీలి సముద్రపు అలలతో అందంగా కనిపించే వాల్తేరు నగరం మరింత సుందరంగా రూపుదిద్దుకోనుంది. గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ (జీవీఎంసీ) పరిధిలోని సగం నగరం అందమైన నందనవనంగా ముస్తాబవనుంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 642 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించిన జీవీఎంసీ పరిధిలో 50 శాతం గ్రీనరీ ఏర్పాటుకు అన్ని వీధుల్లో నీడనిచ్చే చెట్లను నాటనున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక యాప్ ద్వారా జీవీఎంసీ సర్వే చేస్తోంది. 98 వార్డుల్లో వార్డు ఎమినిటీస్ సెక్రటరీలకు సర్వే బాధ్యత అప్పగించారు. వారి పరిధిలోని 30, 40, 60, 80, 100 ఫీట్ల రోడ్లపై ఎక్కడెక్కడ చెట్లను పెంచే అవకాశం ఉందో సర్వే చేస్తున్నారు. ఇప్పటికే 400 చదరపు కిలోమీటర్ల మేర సర్వే పూర్తయినట్లు సమాచారం. దాదాపు 1,697 కిలోమీటర్ల మేర రోడ్ల వెంట 6 వేల చెట్లను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.



‘గ్రీనరీ మై స్ట్రీట్’ కాన్సెప్ట్‌తో..

వాస్తవానికి హుద్‌హుద్‌కు ముందు విశాఖ నగరంలో 44 శాతం మేర పచ్చదనం ఉండేది. హుద్ హుద్ తర్వాత 14 శాతానికి పడిపోయింది. కొద్దికాలంగా జీవీఎంసీ తీసుకుంటున్న చర్యలతో గ్రీన్ కవరేజ్ 35 శాతానికి చేరుకుంది. 10 లక్షల జనాభా దాటిన నగరాల్లో పచ్చదనంలో దేశంలోనే మొదటిస్థానంలో ఉన్న విశాఖ.. 50 శాతం గ్రీనరీ లక్ష్యాన్ని చేరుకుంటే ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పచ్చదనం ఉన్న నగరంగా రికార్డు సృష్టించనుంది. ఇందుకోసం ‘గ్రీనరీ మై స్ట్రీట్’ పేరుతో జీవీఎంసీ పచ్చదనం పెంపునకు చర్యలు చేపట్టింది. రహదారులతో పాటు వివిధ సంస్థల కార్యాలయాలు, ఖాళీ ప్రదేశాల్లో కూడా మొక్కలను నాటేందుకు సిద్ధమవుతోంది.

ప్రపంచంలోనే నెంబర్ వన్ గ్రీన్ సిటీగా..

ప్రపంచవ్యాప్తంగా సింగపూర్ (45 శాతం) తర్వాత విశాఖ నగరంలోనే పచ్చదనం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం 35 శాతం ఉన్న పచ్చదనాన్ని వచ్చే ఏడాది కాలంలో 40 శాతానికి పెంచేలా జీవీఎంసీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. నిర్ణీత లక్ష్యం మేరకు 50 శాతం గ్రీనరీ ఏర్పాటైతే ప్రపంచంలోనే మొదటి స్థానంలో విశాఖ నగరం నిలవనుంది. తద్వారా 2 డిగ్రీల సెల్సియస్ మేర వేసవి తాపం కూడా తగ్గుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

పందిరి తరహాలో..

ఏదో ఒక తరహా మొక్కలను కాకుండా.. పందిరి తరహాలో చెట్టు పెనవేసుకునిపోయేలా ఉండేలా జీవీఎంసీ జాగ్రత్తలు తీసుకుంటోంది. ఇందుకోసం 30, 40 అడుగుల రోడ్ల వెంట ఇండియన్ చెర్రీ, టీ కోమా వెరైటీస్, పారిజాతం వంటి మొక్కలను నాటనున్నారు. 80, 100 ఫీట్ల రోడ్లలో మాత్రం నిమ్మ, వేప, బాదం, నిద్ర గన్నేరు వంటి మొక్కలను నాటనున్నారు. అయితే, రోడ్డుకు ఒక వైపు నాటే ఈ మొక్కలు ఏపుగా పెరగడంతో పాటు రోడ్డుకు ఆవలి వైపు వరకు కొమ్మలు విస్తరించి రహదారి మొత్తం నీడనిస్తాయి. ప్రధానంగా వేసవి కాలంలో ప్రయాణికులకు చలువ పందిళ్ల తరహాలో ఎండ నుంచి రక్షణ కల్పిస్తాయని జీవీఎంసీ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే నగరంలోని దయాళ్‌నగర్ వంటి ప్రాంతాల్లో పందిరి తరహా గ్రీనరీని జీవీఎంసీ అభివృద్ధి చేసింది. నగరంలోని మిగతా రోడ్లలోనూ ఈ పందిళ్లతో నగరం పచ్చదనంతో కళకళలాడనుంది.

గ్రీనరీ కోసం ప్రత్యేక కార్యక్రమం

విశాఖ నగరంలో 50 శాతం గ్రీనరీ లక్ష్యంగా ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. ఇందుకోసం వార్డుల వారీగా ఎమినిటీస్ సెక్రటరీల సహాయంతో 1,697 కిలోమీటర్ల మేర రోడ్ల సర్వే పూర్తి చేశాం. ఆ ప్రాంతాల్లో 6 వేల మొక్కలను నాటేందుకు ప్రణాళిక సిద్ధమైంది. ఈ కసరత్తు నిరంతరం జరుగుతుంది. రానున్న ఏడాది కాలంలో 40 శాతం గ్రీనరీ లక్ష్యంగా పెట్టుకున్నాం. ఆ తర్వాత దీనిని 50 శాతానికి పెంచి, పచ్చదనంలో విశాఖను ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తున్నాం.

– సాయికాంత్ వర్మ, జీవీఎంసీ కమిషనర్

ఏయూ ఆచార్యునిపై లైంగిక వేధింపుల ఆరోపణలు

- జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేసిన పరిశోధకురాలు
- విచారణ జరుపుతున్న ఏయూ మహిళా గ్రీవెన్స్ సెల్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం హిందీ విభాగాధిపతి ఆచార్య ఎస్.సత్యనారాయణ తనను లైంగిక వేధింపులకు గురిచేశారని విభాగ పరిశోధకురాలు సోనాలి ఘటక్ జాతీయ మహిళా కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. జాతీయ మహిళా కమిషన్ సదరు ఫిర్యాదును ఏయూ వీసీ కార్యాలయానికి పంపారు. దీనిపై వెంటనే స్పందించిన ఏయూ అధికారులు సదరు ఫిర్యాదును ఏయూ మహిళా గ్రీవెన్స్ సెల్‌కి పంపి, విచారణ జరిపి, నివేదిక అందించాలని సూచించారు. ఇప్పటికే ఈ మహిళా గ్రీవెన్స్ సెల్ రెండు పర్యాయాలు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆచార్యుడిని, పరిశోధకురాలిని పిలిచి వివరాలు తెలుసుకున్నారు. మరికొందరితో మాట్లాడి సమగ్రంగా వివరాలు సేకరించి తుది నివేదిక అందిస్తామని మహిళా గ్రీవెన్స్ సెల్ చైర్మన్, ఏయూ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య వి.విజయలక్ష్మి తెలిపారు. కాగా, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఆచార్యుడు, పరిశోధకురాలు పరస్పరం ఫిర్యాదులు చేసుకుంటున్నారు. తనను లైంగికంగా వేధించడంతో పాటు పీహెచ్‌డీ సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించడానికి అవసరమైన సంతకాలు చేయడానికి రూ.2 లక్షలు లంచం అడిగారని, ఇప్పటికే రూ.75 వేలు ఇచ్చానని పరిశోధకురాలు సోనాలి ఘటక్ సదరు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఆచార్య సత్యనారాయణ వివరణ ఇస్తూ తాను ఎటువంటి లైంగిక వేధింపులకు పాల్పడలేదని, ఎవరినీ లంచం అడగలేదని స్పష్టం చేశారు.

ఆంగ్లంపై పట్టు.. ఆత్మస్థైర్యానికి మెట్టు

రోజుకో పదం...నేర్చుకో తక్షణం

కొత్త కార్యక్రమానికి శ్రీకారం | ప్రభుత్వ పాఠశాలల్లో అమలు



లర్న్ ఏ వర్డ్‌లో పదాలు గురించి తెలియజేస్తున్న ఉపాధ్యాయుడు

మదనపల్లె సిటీ: నేటి పోటీ ప్రపంచంలో ఆంగ్లభాషకు అత్యంత ప్రాధాన్యత ఏర్పడింది. నేడు ఎంత చిన్న కొలువు రావాలన్నా ఆంగ్లభాష తప్పనిసరైంది. అందుకే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టింది. అలాగే ఆంగ్లభాషా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు ‘లెర్న్ ఏ వర్డ్ ఏ డే (రోజుకో పదం నేర్చుకో) అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ విధానం ద్వారా విద్యార్థులకు రోజుకో ఆంగ్లపదం పరిచయం చేస్తారు. రోజువారీ పాఠాలు యథావిధిగా బోధిస్తూ ఆ కొత్త పదం గురించి విపులంగా వివరిస్తారు. ఈ పదానికి అర్థం, నానార్థాలు, వ్యతిరేక పదం తదితర వాటిని నేర్పుతారు. నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా తరగతి గది కృత్యాలు తయారు చేయాల్సి ఉంటుంది. 15 రోజులకోసారి పరీక్ష, స్పెల్‌బీ కార్యక్రమం నిర్వహిస్తారు. గతంలోనే ఇంగ్లీషుభాషపై పట్టును పెంచేందుకు వీలుగా విద్యార్థులకు తెలుగు టు ఇంగ్లీషుకు సంబంధించిన జిల్లాలో ఈ ఏడాది 17,750 ఆక్స్‌ఫర్డ్ డిక్షనరీలు అందజేసింది.

ప్రభుత్వ బడుల్లో....

జిల్లాలో 2213 ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10 వ తరగతి వరకు1,54,789 మంది విద్యార్థులు చదువుతుండగా వీరికి లర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమం ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు ఆంగ్లభాషలో రాణించడానికి ఈ పద్ధతి మరింత ఉపయోగకరంగా ఉంటుందని ఉపాధ్యాయులు,ఆంగ్లభాషా నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

తరగతులను బట్టి పదాలు నేర్పడానికి ప్రత్యేకంగా జాబితాను కూడా సిద్ధం చేశారు. ఈ జాబితాలో ఉన్న పదాలను విద్యార్థుల స్థాయిని బట్టి ఉపాధ్యాయులు పరిచయం చేస్తున్నారు. లెవల్–1లో 1,2 తరగతులు, లెవెల్–2లో 3 నుంచి 5 తరగతులు, లెవెల్–3లో 6నుంచి 8 తరగతులు, లెవెల్–4లో 9,10 తరగతులు ఉంటాయి.

నిర్వహణ విధానం ఇలా

ప్రతి రోజూ మొదటి పీరియడ్‌లో ఒక కొత్త ఆంగ్లపదాన్ని విద్యార్థులకు పరిచయం చేయాలి.

రెండో పీరియడ్‌లో పిల్లల చేత డిక్షనరీలో ఆ పదం అర్థాన్ని వెతికించాలి.

లెవల్ 1 విద్యార్థులకు రెండో పీరియడ్ ఉపాధ్యాయుడు పదం యొక్క అర్థాన్ని వివిధ ఉదాహరణలతో ఎలా ఉపయోగించాలో విద్యార్థులకు వివరించాలి. ఆంగ్ల ఉపాధ్యాయుడు తన పీరియడ్‌లో పదాన్ని వివిధ సందర్భాల్లో ఎలా ఉపయోగించాలో తెలియజేయాలి. ఇదే క్రమంలో వివిధ పీరియడ్‌లో ఓరల్ డ్రిల్లింగ్, స్పెల్లింగ్ గేమ్ విద్యార్థులు డిక్షనరీ సహాయంతో పదం యొక్క పార్ట్ ఆఫ్ స్పీచ్ కనుక్కోవడం,వ్యతిరేక పదాలు, సమానార్థ పదాలు వెతకడం, పదాన్ని రిపీట్ చేయడం నేర్పించాలి. కార్యక్రమం కోసం విద్యార్థులు ప్రత్యేకంగా వంద పేజీల నోట్ బుక్ ఉంచుకోవాలి. దానిని ఉపాధ్యాయుడు తరచూ తనిఖీ చేయాలి. 15 రోజులకొకసారి నేర్పించిన పదాలపై స్పెల్‌బీ నిర్వహించాలి. ఇంటి వద్ద పదాలను ప్రాక్టీస్ చేయమని ఉపాధ్యాయులు ప్రోత్సహించాలి. తర్వాత విద్యార్థులు ఆంగ్లభాష పట్ల పట్టు సాధించగలిగేలా చేయాలి.

ఆంగ్లంపై పట్టు సాధించవచ్చు



రోజుకో కొత్త పదాన్ని తెలుసుకోవడం వల్ల ఆంగ్లంపై మంచి పట్టు సాధించవచ్చు. దీని వల్ల విద్యార్థుల్లో ఆంగ్లంపై ఆసక్తి కలుగుతుంది. ప్రతి రోజు కొత్త పదాన్ని, దాని అర్థాన్ని ఉపాధ్యాయులు పిల్లలతో ప్రాక్టీస్ చేయిస్తారు. పాఠశాలలో నేర్చుకున్న పదాన్ని ఇంటి వద్ద కూడా ప్రాక్టీస్ చేయాలి. ఇలా చేస్తే ఆంగ్లంపైమంచి పట్టు వస్తుంది. భవిష్యత్తులో ఇది ఎంతో ఉపయోగపడుతుంది.

–సుబ్బారెడ్డి, హెచ్‌ఎం,జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె.

విద్యార్థులకు ఉపయోగకరం



లర్న్ ఏ వర్డ్ ఏ డే కార్యక్రమం వల్ల ఆంగ్లభాషాభివృద్ధి సాధ్యమవుతుంది. ఆంగ్లభాషపై పట్టుకు ఈ కార్యక్రమం సోపానం. రోజూ ఓ కొత్త పదం నేర్చుకోవడం వాటి వినియోగంపై పిల్లలకు తర్ఫీదు ఇవ్వడం మంచి ఫలితాన్నిస్తోంది. విద్యార్థులకు చాలా ఉపయోగకరం.

–పి.మహమ్మద్‌ఖాన్,ఆంగ్ల పాధ్యాయుడు, జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె.

కొత్త పదాలు నేర్చుకోవచ్చు



లర్న్ ఏ వర్డ్ డే మంచి కార్యక్రమం. రోజుకో కొత్త పదం నేర్చుకోవచ్చు. ఆంగ్లంలోని భాషాభాగాలపై పట్టు లభిస్తుంది. .

–షేక్ సాదియా, 10వ తరగతి విద్యార్థి, జెడ్పీహెచ్‌ఎస్,మదనపల్లె.

ఏపీలో వైద్య సేవలకు కేరళ బృందం ప్రశంస

క్షేత్రస్థాయిలో పలు అంశాల పరిశీలన



కంచికచర్లలో వైద్య సేవలను కేరళ బృందానికి వివరిస్తున్న డీఎంహెచ్‌వో సుహాసిని

లబ్బీపేట (విజయవాడతూర్పు): రాష్ట్రంలో అందుతున్న వైద్య సేవలను పరిశీలించేందుకు వచ్చిన కేరళ అధికారుల బృందం రెండు రోజులుగా ఎన్టీఆర్ జిల్లాలో పర్యటిస్తున్నారు. అందులో భాగంగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో పర్యటించిన వారు ఇక్కడి వైద్య సేవలు బాగున్నాయని ప్రశంసించారు. కేరళ నుంచి వచ్చిన జనాభా పరిశోధన బృందం సభ్యులు డాక్టర్ ఓమెన్‌మాధ్యు, సచిన్ మంగళవారం కంచికచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ అందిస్తున్న ఓపీ సేవలు, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు నమోదు, ల్యాబ్ పరీక్షలు, మందుల పంపిణీ, హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్, ఆఫీస్ నివేదికలు, రికార్డులు, అమలు జరుగుతున్న ఆరోగ్య కార్యక్రమాలు తదితర అంశాలను నిశితంగా పరిశీలించారు. మండలంలోని పరిటాలలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అమలులో భాగంగా ఎనిమియా ముక్త్ భారత్ ద్వారా ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలు పంపిణీ అంశాలను తనిఖీ చేశారు. అక్కడి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కుటుంబ డాక్టర్ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో మంచం పట్టిన రోగులను ఇంటికే వెళ్లి సేవలు అందించడం, గర్భిణులు, బాలింతలకు అందించే సేవలు, ఎన్‌సీడీ–సీడీ సర్వే నిర్వహణ, రక్తపోటు, మధుమేహం వ్యాధిగ్రస్తులకు అందుతున్న సేవలు వంటి అంశాలను సమీక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ మాచర్ల సుహాసిని, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, ఆర్‌బీఎస్‌కే అధికారి డాక్టర్ మాధవి, డీపీఎంవో నవీన్, బాలాజీ నాయక్, లక్ష్మాజీ, మహేష్, శ్రావణ్ పాల్గొన్నారు.

ఆ.. 9 రైల్వే స్టేషన్లలో మరిన్ని రైళ్లకు హాల్ట్



సాక్షి, అమరావతి: సుదూర ప్రాంతాలకు వెళ్లే పలు రైళ్లను రాష్ట్రంలో మరో 9 రైల్వే స్టేషన్లలో ఆపాలని (హాల్ట్) రైల్వే శాఖ నిర్ణయించింది. దీర్ఘకాలికంగా ఉన్న ఈ డిమాండ్‌పై కేంద్ర రైల్వే శాఖ సానుకూలంగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని బొబ్బిలి, దువ్వాడ, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, నడికుడి, సూళ్లూరుపేట, డోర్నకల్, పీలేరు, కుప్పం రైల్వే స్టేషన్లలో పలు రైళ్లను ఆపాలని నిర్ణయించారు. ఆ వివరాలు ఇలా ..

- **బొబ్బిలి:** యశ్వంత్‌పూర్– హతియా ఎక్స్‌ప్రెస్ (12835), యశ్వంత్‌పూర్– టాటా నగర్(12889), హతియా– ఎర్నాకుళం ఎక్స్‌ప్రెస్ (22837 – 22838)
- **దువ్వాడ:** శంకర్‌పల్లి– ముంబై ఎక్స్‌ప్రెస్ (18519 , 18520), విశాఖపట్నం– హజ్రత్ నిజాముద్దీన్ ఎక్స్‌ప్రెస్ (12803, 12804)
- **పిడుగురాళ్ల:** (1) ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (12603) (2) భువనేశ్వర్– సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (17015), నాగర్‌సోల్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్(17232), సికింద్రాబాద్– తిరుపతి ఎక్స్‌ప్రెస్ (12733)
- **సత్తెనపల్లి:** భువనేశ్వర్– సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్ (17015), నాగర్‌సోల్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (17232), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (12603)
- **నడికుడి:** సికింద్రాబాద్– తిరుపతి ఎక్స్‌ప్రెస్ (12733), ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ – హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ (12603), భువనేశ్వర్– సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్(17015), నాగర్‌సోల్–నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ (17232)
- **సూళ్లూరుపేట:** అళప్పుజా–ధన్‌బాద్ ఎక్స్‌ప్రెస్ (13352)
- **పీలేరు:** నాగర్‌కోయిల్ – ముంబై ఎక్స్‌ప్రెస్ (16340, 16339) , కాచిగూడ–మధురై ఎక్స్‌ప్రెస్ (17615, 17616)
- **కుప్పం:** చెన్నై–శిరిడీ ఎక్స్‌ప్రెస్ (22601, 22602)
- **డోర్నకల్:** లింగంపల్లి – కాకినాడ ఎక్స్‌ప్రెస్ (12737), 12738), మచిలీపట్నం– బీదర్ ఎక్స్‌ప్రెస్ (12749, 12750).

మత్స్య రంగంలో ఏపీ ఆదర్శం

ఎంపెడా చైర్మన్ దొడ్డ వెంకటస్వామి



సమీక్షిస్తున్న ఎంపెడా చైర్మన్ వెంకట స్వామి

సాక్షి, అమరావతి: మత్స్య రంగంలో ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పుల వల్ల మత్స్య ఉత్పత్తుల్లో నాణ్యత పెరగడంతో పాటు ఎగుమతులు కూడా గణనీయంగా పెరిగాయని సముద్ర మత్స్య ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి సంస్థ (ఎంపెడా) చైర్మన్ దొడ్డ వెంకటస్వామి అన్నారు. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులను మరింత పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర సచివాలయంలో మత్స్య శాఖ స్పెషల్ సీఎస్ గోపాలకృష్ణ ద్వివేది అధ్యక్షతన మంగళవారం సమావేశం జరిగింది. ఎంపెడా చైర్మన్ మాట్లాడుతూ.. ఆక్వా కార్యకలాపాలన్నీ ఒకే గొడుగు కిందకు తీసుకురావాలన్న సంకల్పంతో ఏర్పాటు చేసిన ఏపీ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడా)తో పాటు నాణ్యమైన సీడ్, ఫీడ్ ఉత్పత్తి లక్ష్యంగా తీసుకొచ్చిన ఏపీ సీడ్, ఫీడ్ యాక్ట్ వంటి విప్లవాత్మక చర్యలను జాతీయ స్థాయిలోనూ అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సముద్ర మత్స్య, ఆక్వా ఉత్పత్తులను ఎగుమతి చేసే రాష్ట్రాలన్నీ ఏపీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. దేశంలో మరెక్కడా లేని విధంగా గ్రామ స్థాయిలో ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా మత్స్యకారులతో పాటు ఆక్వా రైతులకు అందిస్తున్న తోడ్పాటు అభినందనీయమన్నారు. వెనామీ రొయ్యల సాగుపైనే ఆధారపడ కుండా మడ్ క్రాప్, సీ బాస్ వంటి ప్రత్యామ్నాయ జాతుల పెంపకాన్ని ప్రోత్సహించే దిశగా ఏపీ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. పెద్దఎత్తున నిర్మిస్తున్న పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, ఫిష్ ల్యాండింగ్ సెంటర్లు సమీప భవిష్యత్‌లో ఏపీ గతిని పూర్తిగా మార్చేస్తాయన్నారు. హార్బర్లు అందుబాటులోకి వస్తే సముద్ర మత్స్య ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతాయని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపెడా డైరెక్టర్ కార్తికేయన్, ఆర్‌జీసీఏ డైరెక్టర్ కందన్, అడిషనల్ డైరెక్టర్ అంజలి, డిప్యూటీ డైరెక్టర్లు సుధాకర్, కన్సల్టెంట్ ధనుంజయ్ పాల్గొన్నారు.

టీడీఎస్ క్లెయిమ్‌ల కుంభకోణంలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగుల అరెస్ట్

- ఆదాయపన్ను శాఖకు టోపీ
- రీఫండ్ పేరుతో రూ.13,21,76,257 స్వాహా

మదనపల్లె: రాష్ట్ర ట్రెజరీశాఖకు సంబంధించి ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు నియోజకవర్గాల్లో ఇన్‌కంటాక్స్ క్లెయిమ్, టీడీఎస్ రీఫండ్‌కు సంబంధించిన కుంభకోణంలో నలుగురు ప్రభుత్వ ఉద్యోగులను మంగళవారం అరెస్ట్ చేసినట్లు మదనపల్లె డీఎస్పీ కేశప్ప తెలిపారు. బోగస్ టీడీఎస్ క్లెయిమ్‌లతో ఆదాయపన్ను శాఖకు బురిడీ కొట్టి నిధులను అమాయకుల ఖాతాలకు బదలాయించి రూ.13,21,76,257 స్వాహా చేసినట్లు దర్యాప్తులో తేలిందని చెప్పారు. మదనపల్లెలో మంగళవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. తిరుపతికి చెందిన ఆదాయపన్ను అధికారి ఎస్.రాజశేఖర్ ఫిర్యాదుమేరకు అన్నమయ్య జిల్లా మదనపల్లె టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో గత డిసెంబర్ 13న క్రైం నంబర్.329/2022గా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు చెప్పారు. 2015–16 నుంచి 2021–22 ఆర్థిక సంవత్సరాల వరకు మదనపల్లె, తంబళ్లపల్లె, పీలేరు, పుంగనూరు సబ్ ట్రెజరీల పరిధిలో పలువురు ఉద్యోగుల ఆదాయపన్ను చెల్లింపులకు సంబంధించి ఇన్‌కంటాక్స్ డిపార్ట్‌మెంట్‌కు రూ.37,62,03,648 ఫైల్‌చేసి, అందులో నుంచి రూ.13,21,76,257ను రీఫండ్ రూపంలో తెలిసిన, బంధువులకు సంబంధించిన 15 వ్యక్తిగత ఖాతాలకు మళ్లించి డ్రా చేసుకున్నారని వివరించారు. ఈ మోసంలో ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌కు సర్వీస్ ప్రొవైడర్లుగా వ్యవహరిస్తున్న మదనపల్లెకు చెందిన ఆడిటర్లు శ్రీనాథ్, రమ్య కీలకంగా వ్యవహరించినట్లు తేలిందన్నారు. ఈ కేసులో ఏ–1 మదనపల్లె సబ్ ట్రెజరీ ఆఫీసర్‌గా పనిచేసిన కొలిమగుండ్ల శ్రీనివాసులు, ఏ–2 తంబళ్లపల్లె సబ్ ట్రెజరీ ఆఫీసర్ మద్దుల బాలమురళి, ఏ–3 పీలేరు ఎస్టీవో షేక్ ఇంతియాజ్, ఏ–6 పుంగనూరు సబ్ ట్రెజరీ ఆఫీస్ సీనియర్ అకౌంటెంట్ జి.వి.జీవానందం మంగళవారం మదనపల్లె–పుంగనూరు రోడ్డు వై జంక్షన్‌లో ఉండగా అరెస్టు చేసినట్లు చెప్పారు. పరారీలో ఉన్న శ్రీనాథ్, రమ్యను అరెస్టు చేస్తామని తెలిపారు.

దళిత మహిళపై తెలుగు తమ్ముళ్ల దాష్టీకం

- టీడీపీ జెండా దిమ్మె ఏర్పాటు కోసం దుకాణం తడికెల పీకివేత
- అడ్డుకున్న మహిళపై దుర్భాషలాడుతూ దాడి
- బాధితురాలికి అండగా నిలిచిన వైఎస్సార్‌సీపీ



టీడీపీ నేతలు అక్రమంగా కట్టిన దిమ్మె

మర్రిపూడి: ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం జి.అగ్రహారం గ్రామానికి చెందిన దళిత మహిళ కొమ్ముల కోటమ్మ ఒంగోలు కర్నూల్ రహదారి పక్కన బడ్డీకొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తోంది. మరో 3 రోజుల్లో నారా లోకేశ్ పాదయాత్ర ఈ గ్రామం గుండా వెళ్లాల్సి ఉంది. కోటమ్మ కొంతకాలంగా రహదారి పక్కనే నిర్వహిస్తోన్న బడ్డీ కొట్టు ఎదురుగా టీడీపీ దిమ్మె అక్రమంగా ఏర్పాటు చేసేందుకు ఆ పార్టీ సిద్ధమైంది. మంగళవారం కోటమ్మ బడ్డీ కొట్టు వద్దకు అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు తానికొండ శ్రీను, తానికొండ కొండలు, కొప్పాకు వెంకట్రావు, తానికొండ శ్రీహరి, కొప్పాకు వెంకటేశ్వర్లు, తానికొండ సాంబయ్య, తానికొండ పేరయ్య, పాలడుగు రమేష్, మందాటి రంగారావు వచ్చి దౌర్జన్యం చేసి దుకాణానికి ఉన్న తడికల కర్రలు పీకేశారు. అడ్డువచ్చిన కోటమ్మ, ఆమె కుమార్తెలను కొట్టి, నెట్టివేసి, దుర్భాషలాడి, అక్రమంగా దుకాణానికి అడ్డుగా దిమ్మె ఏర్పాటు చేసి జెండాలు కట్టారు. విషయాన్ని బాధితులు పోలీసులకు సమాచారమిచ్చారు. విషయం తెలుసుకున్న కొండపి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్ బాబు ఘటనాస్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. దళితులపై దాడులను ఖండిస్తూ అక్రమ కట్టడాన్ని తొలగించేంత వరకు ఇక్కడే ఉంటానని చెబుతూ వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలతో ధర్నాకు దిగారు. రోడ్డు పక్కన నిరసనగా సహపంక్తి భోజనం చేశారు. దీంతో వెనక్కి తగ్గిన టీడీపీ శ్రేణులు అక్రమ కట్టడాన్ని తొలిగించారు.

జీవో 423ను రద్దు చేయండి

హైకోర్టులో పిటిషన్

సాక్షి, అమరావతి : వార్డు సచివాలయాల్లో వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీల పనివేళలను మారుస్తూ పురపాలక శాఖ జారీ చేసిన జీవో 423ను సవాలు చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ జీవో 423తో పాటు తదనుగుణ ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ వైఎస్సార్ కడప జిల్లా, ప్రొద్దుటూరు మునిసిపాలిటీలో వార్డు శానిటేషన్, ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీగా పనిచేస్తున్న బి.సుమలత ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి, గ్రామ, వార్డు సచివాలయ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ, పురపాలక శాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్ తదితరులను ప్రతివాదులుగా పేర్కొన్నారు. పట్టణ స్థానిక సంస్థల్లో ఉదయం ఐదు నుంచి 10 వరకు లేదా ఉదయం ఆరు నుంచి 11 గంటల వరకు బయట పనులు, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు బయట, కార్యాలయ పనులు అవసరాన్ని బట్టి నిర్వహించాలంటూ పనివేళలను ఖరారు చేశారని పిటిషనర్ తెలిపారు. దీనిపై అభ్యంతరాలు లేవనెత్తినా అధికారులు పరిగణనలోకి తీసుకోలేదని తెలిపారు. సచివాలయాల సిబ్బంది వలే మాకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనివేళలు నిర్దేశించేలా ఆదేశాలివ్వాలన్నారు. ఈ వ్యాజ్యం తేలేంత వరకు జీవో 423తో పాటు తదనుగుణ ప్రొసీడింగ్స్ అమలును నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె కోర్టును అభ్యర్థించారు.

- పాలనాపరమైన అంశాల్లో తెలుగు భాషను ప్రోత్సహించేందుకు విస్తృతమైన చర్యలు తీసుకోవాలని అధికార భాషా సంఘం, భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు పి.విజయబాబు పేర్కొన్నారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రభుత్వ పాలనా వ్యవహారాలలో అధికార భాషగా తెలుగు అమలు తీరును సమీక్షించారు.

రేపటి నుంచి ట్రిపుల్ ఐటీ కౌన్సెలింగ్

వేంపల్లె : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయం (ఆర్జీయూకేటీ) పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలకు గురువారం నుంచి కౌన్సెలింగ్ ప్రారంభమవుతుందని ఇడుపులపాయ ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కసిరెడ్డి సంధ్యారాణి తెలిపారు. ఆమె మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల సమీకృత ఇంజినీరింగ్‌లో ప్రవేశాల కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు పదో తరగతి మార్కుల ఆధారంగా ఇప్పటికే కాల్ లెటర్లు పంపినట్లు చెప్పారు. కాల్ లెటర్స్ వచ్చిన విద్యార్థులు తమకు కేటాయించిన క్యాంపస్‌లలో నిర్దేశించిన తేదీల్లో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. గురువారం నూజివీడు ట్రిపుల్ ఐటీకి, శుక్రవారం ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి సంబంధించి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు, తల్లిదండ్రులకు తగిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలు ఆర్జీయూకేటీ వెబ్‌సైట్(డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఆర్జీయూకేటీ.ఇన్)లో పొందుపరిచినట్లు చెప్పారు. విద్యార్థులు సమగ్ర సమాచారాన్ని తెలుసుకుని, ముందుగా తెలియజేసిన ధ్రువీకరణపత్రాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు.

క్లుప్తంగా...

ఐరాసలో సెప్టెంబర్‌లో మోదీ ప్రసంగం

ఐక్యరాజ్యసమితి: ఐక్యరాజ్యసమితికి చెందిన సర్వప్రతినిధి సభ వార్షిక అత్యున్నత సమావేశంలో ప్రధాని మోదీ ప్రసంగించనున్నారు. సెప్టెంబర్ ఐదున 78వ ఐరాస సర్వప్రతినిధి సభ ప్రారంభమవుతుంది. 19వ తేదీన సభ సాధారణ చర్చ మొదలవనుంది. సంప్రదాయం ప్రకారం తొలిరోజు బ్రెజిల్, ఆ తర్వాత అమెరికా అగ్రనేతలు ప్రసంగిస్తారు. 22వ తేదీన మధ్యాహ్నం సెషన్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడతారు. అదేరోజు ఉదయం సెషన్‌లో పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ ప్రసంగిస్తారు. వారంపాటు జరిగే ఈ సమావేశాల్లో ప్రపంచ నేతలు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సదస్సు, పర్యావరణ లక్ష్యాల సదస్సు, సాధారణ చర్చ ఇలా పలు కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. 'ఈ ఏడాది సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సదస్సులో ప్రపంచ నేతలు చేసే ప్రసంగాలు, నిర్దేశించుకునే లక్ష్యాలతో ప్రపంచం 2023నాటికల్లా మరింత పారదర్శకంగా, ప్రగతి పథంలో దూసుకుపోనుంది' అని ఐరాస ఒక ప్రకటనలో పేర్కొంది. సాధారణ చర్చ మొదటి రోజే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ ప్రసంగించనున్నారు. మోదీ ప్రసంగించిన మరుసటి రోజు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మాట్లాడతారు. మరోవైపు అదేనెల తొమ్మిది, పది తేదీల్లో ఢిల్లీలో భారత్ సారథ్యంలో ప్రతిష్టాత్మకమైన జీ20 నేతల శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ భేటీకి జీ20 దేశాల అగ్రనేతలు విచ్చేయనున్నారు.

బిహార్‌లోని 40 ఎంపీ సీట్లూ ఎన్‌డీయేకే

చిరాగ్ పాశ్వాన్

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లోని మొత్తం 40 సీట్లనూ ఎన్‌డీయేనే గెలుచుకుంటుందని లోక్ జన్‌శక్తి పార్టీ(రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ చెప్పారు. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై హోం మంత్రి అమిత్ షా, బీజేపీ చీఫ్ నడ్డాలతో చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. అందుకే ఎన్‌డీయేలో చేరినట్లు మంగళవారం మీడియాతో అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో హాజీపూర్ నుంచి పోటీ చేస్తానన్నారు. ప్రస్తుతం హాజీపూర్ స్థానం నుంచి రాం విలాస్ పాశ్వాన్ తమ్ముడు, కేంద్ర మంత్రి పశుపతి కుమార్ పరాస్ ప్రాతినిధ్యం వహిస్తుండటం గమనార్హం. చిరాగ్ పాశ్వాన్ వ్యాఖ్యలపై మంత్రి పశుపతి కుమార్ స్పందించారు. రాం విలాస్ పాశ్వాన్ రాజకీయ వారసుణ్ని తానేనని, హాజీపూర్‌ను చిరాగ్‌కు ఇచ్చే ప్రశ్నేలేదని కుండబద్దలు కొట్టారు.

కుటుంబం వలన.. కుటుంబం కోసం..

ఇదే ప్రతిపక్ష నేతలనినాదం
- ప్రధాని మోదీ విసుర్లు
- అది అవినీతిపరుల సమ్మేళనమని ప్రజలనుకుంటున్నారు
- వారి భేటీని చూసి జనం నవ్వుకుంటున్నారు

పోర్ట్ బ్లెయిర్: 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఐక్యంగా ఎదుర్కొనే లక్ష్యంతో 26 విపక్ష పార్టీలు నిర్వహించిన బెంగళూరు సమావేశాలపై ప్రధాని నరేంద్ర మోదీ సునిశితమైన విమర్శనాస్త్రాలు సంధించారు. దాన్ని అవినీతిపరుల సమ్మేళనంగా ప్రజలు చెప్పుకుంటున్నారన్నారు. 'కుటుంబం వలన.. కుటుంబం చేత.. కుటుంబం కోసం..' అనేదే ప్రతిపక్షాల ఏకైక మంత్రమని ఎద్దేవా చేశారు. ప్రధాని మంగళవారం పోర్ట్‌బ్లెయిర్‌లోని వీర సావర్కర్ ఎయిర్‌పోర్టులో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు. 'ఇటీవల బెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల సమయంలో తీవ్రమైన హింస జరిగింది. వివిధ ఘటనల్లో కనీసం 39 మంది చనిపోయారు. వారిలో ఎక్కువ మంది అధికార టీఎంసీకి మద్దతుగా నిలిచిన కారణంగా ప్రాణాలు పోగొట్టుకున్నవాళ్లే. సొంత కేడర్‌పై దాడులు జరిగినా వామపక్షాలు, కాంగ్రెస్ కిమ్మనకుండా ఉన్నాయి. తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై అవినీతి కేసులున్నా ఈ పార్టీలు క్లీన్‌చిట్ ఇచ్చేశాయి. ఇలాంటి 26 ప్రతిపక్షాల నేతలు ఒకే చోటికి చేరిన వైనం చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఇది అత్యంత అవినీతిపరుల సమ్మేళనమని అనుకుంటున్నారు. బెంగళూరు సమావేశం అవినీతికి గుర్తుగా, అవినీతిని ప్రోత్సహించేందుకు జరుగుతున్న భేటీ అని అనుకుంటున్నారు. అందుకే మళ్లీ 2024లో మన ప్రభుత్వాన్నే తీసుకురావాలని ప్రజలు ఇప్పటికే నిర్ణయానికి వచ్చేశారు' అని ప్రధాని తెలిపారు. 'దేశంలోని పేద కుటుంబాల బిడ్డలు అభివృద్ధిలోకి రావడం వీరికి ఇష్టం లేదు. వీరి ఉమ్మడి కనీస కార్యక్రమం సొంత కుటుంబాల అవినీతిని పెంచుకోవడమే. ఇదే వారి సిద్ధాంతం, ఎజెండా' అని ప్రధాని నిప్పులు చెరిగారు. ప్రజల చేత, ప్రజల కొరకు, ప్రజలే ఎన్నుకొనే ప్రభుత్వ విధానాన్ని ప్రజాస్వామ్యం అంటారు..కానీ, ఈ అనువంశిక పార్టీల మంత్రం మాత్రం.. కుటుంబం చేత, కుటుంబం కొరకు, కుటుంబాల వలన అనేదే. వాళ్ల దృష్టిలో కుటుంబానికే మొదటి స్థానం.. దేశానికి అందులో చోటు లేదు' అని ప్రధాని ఎద్దేవా చేశారు.

కులవాద, అవినీతి విషాల విక్రయం

అవినీతి, వంశ రాజకీయాలు లేకుంటే స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం ఎంతో అభివృద్ధి సాధించి ఉండేదని మోదీ అన్నారు. ''ఈ దుస్థితికి కారణమైన వారు ఇప్పుడు మరోసారి తమ దుకాణాలు తెరిచి కులవాదం, అవినీతి అనే తమ విషాన్ని అమ్ముతున్నారు. వీటితో రూ.20 లక్షల కోట్ల కుంభకోణం గ్యారెంటీ. ఈ దుకాణాల్లోకి వెళ్లాలంటే అవినీతిపరుడై ఉండటమే అర్హత. ఎక్కువ అవినీతిపరులను ఇక్కడ మార్గదర్శకుడిగా భావిస్తుంటారు. కోట్లాది రూపాయల అవినీతికి పాల్పడిన వారిని సన్మానిస్తున్నారు. కుటుంబసభ్యులందరూ అవినీతికేసుల్లో బెయిల్‌పై ఉంటే వాళ్లకు మరింత గౌరవం దక్కుతుంది'' అంటూ ఆయన నేరుగా ఎవరి పేరూ ప్రస్తావించకుండా విమర్శలు సంధించారు.

ఇండియాపై యుద్ధానికి దిగితే... గెలుపెవరిదో అందరికీ తెలుసు

2024 ఎన్నికల ఫలితాలపై రాహుల్ జోస్యం ● త్వరలో 'ఇండియా' యాక్షన్ ప్లాన్ రూపొందిస్తామని వెల్లడి

బెంగళూరు: వచ్చే సార్వత్రిక ఎన్నికల పోరాటాన్ని 'భారత్‌కు, ప్రధాని నరేంద్ర మోదీకి మధ్య జరగబోయే పోరు'గా కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ''ఇండియాపై యుద్ధానికి దిగితే అందులో అంతిమ విజయం ఎవరిదో అందరికీ తెలుసు. ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. ఎందుకంటే, భారత్ అనే భావనతో పోరాడే సత్తా ఎవరికీ లేదు. ఆ భావనను వ్యతిరేకించే, దానిపై పోరాడే వారికి ఏ గతి పడుతుందో కూడా అందరికీ తెలుసు'' అని ఆయనన్నారు. ''చరిత్రే ఇందుకు సాక్ష్యం. భారత్ అనే భావనతో ఎవరూ పోరాడలేకపోయారు. రాబోయే లోక్‌సభ ఎన్నికలు భారత్ అనే భావనకు, బీజేపీ అనే భావనకు మధ్య జరిగే పోరు. రాజ్యాంగాన్ని, దేశ ప్రజల గళాన్ని, భారత్ అనే భావనను కాపాడేందుకు పాటుపడుతున్నాం. అందుకే... మా పోరాటం 'ఇండియా' కూటమి వర్సెస్ బీజేపీ. ఇండియా వర్సెస్ మోదీ'' అని వివరించారు.

విపక్షాల బెంగళూరు భేటీ అత్యంత ఫలప్రదంగా జరిగినట్టు రాహుల్ వెల్లడించారు. 2024 ఎన్నికలే లక్ష్యంగా తక్షణం రంగంలోకి దిగాలని విపక్ష పార్టీలన్నీ నిర్ణయించినట్టు తెలిపారు. ''ఇందుకోసం అతి త్వరలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నాం. కూటమి భావజాలం, కార్యక్రమాలు తదితరాలన్నీ త్వరలో నిర్ణయించి వెల్లడిస్తాం'' అని వివరించారు. బీజేపీ, వారి భావజాలంపై విపక్షాల ఉమ్మడి పోరాటానికి దీన్ని నాందిగా అభివర్ణించారు. ''వాళ్లు దేశంపై దాడి చేస్తున్నారు. నిరుద్యోగం పెచ్చరిల్లింది. కోట్లాది మంది నుంచి దేశ సంపదను లాక్కొని కొద్ది మంది మోదీ మిత్రులపరం చేస్తున్నారు'' అని మండిపడ్డారు.

ఆ పేరెలా వచ్చిందంటే...

మంగళవారం నాటి విపక్షాల మేధోమథనం సందర్భంగా కూటమికి ఇండియా అనే పేరు ఎలా వచ్చిందో రాహుల్ వివరించారు. ''జరుగుతున్నది రెండు భిన్న భావజాలాల మధ్య పోరాటం. అందుకే పోరాటం ఏమిటి, ఎవరి మధ్య అనే కీలకాంశాలపై మేం చర్చిస్తున్న క్రమంలో అనుకోకుండా ఇండియా అనే పేరు దానంతట అదే తెరపైకి వచ్చింది. ఎందుకంటే జరగబోయేది రెండు రాజకీయ కూటముల పోరాటం కాదు. భారత్ అనే భావనను కాపాడుకునేందుకు చేయబోయే యుద్ధమది. అందుకే ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయన్స్–ఇండియా అనే పేరు ఖరారు చేశాం'' అని వెల్లడించారు. ''భారత్ మరోసారి ఏకమవుతుంది. 'ఇండియా' గెలుస్తుంది'' అంటూ అనంతరం రాహుల్ హిందీలో ట్వీట్ చేశారు.

కలిసి ఓడిస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

గంటల పాటు కూలంకషంగా చర్చించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్‌గాంధీతో పాటు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం, బిహార్ సీఎం నితీశ్‌కుమార్, డీఎంకే అధినేత ఎం.కె.స్టాలిన్, ఢిల్లీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్, ఆర్జేడీ అధినేత లాలూప్రసాద్, ఎన్సీపీ అధినేత శరద్ పవార్ తదితర దిగ్గజాలంతా భేటీలో పాల్గొన్నారు. విపక్ష కూటమికి ఇండియాగా నామకరణం చేశారు. కూటమి భాగస్వాముల మధ్య సమన్వయం, సహకారం తదితరాలకు 11 మంది సభ్యులతో కమిటీ వేయాలని నిర్ణయించారు.

ముంబై భేటీలో కీలక నిర్ణయాలు: ఖర్గే

ముంబైలో జరగబోయే విపక్షాల తర్వాతి భేటీలో కమిటీ కన్వీనర్ ఎంపికతో పాటు పలు ఇతర కీలక నిర్ణయాలుంటాయని ఖర్గే తెలిపారు. కూటమికి ఇండియాగా నామకరణం చేసినట్టు ఖర్గే ఈ సందర్భంగా వెల్లడించారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో కలసికట్టుగా పోరాడి ఘనవిజయం సాధించి తీరతామని ధీమా వెలిబుచ్చారు. విపక్షాలన్నా, తాజాగా పురుడు పోసుకున్న 26 విపక్షాల కూటమి అన్నా మోదీకి భయం పట్టుకుందని ఖర్గే ఎద్దేవా చేశారు. అయితే కూటమి సారథి ఎవరన్న ప్రశ్నకు మాత్రం ఖర్గే నేరుగా బదులివ్వలేదు. కాంగ్రెస్‌కు అధికారంపై గానీ, ప్రధాని పదవిపై గానీ ఆసక్తి లేదని చెప్పారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని, లౌకికవాదాన్ని, సామాజిక న్యాయాన్ని పరిరక్షించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. అందుకే కూటమిలో పలు పక్షాల మధ్య భేదాభిప్రాయాలున్నా విస్తృత ప్రయోజనాల కోసం, దేశ శ్రేయస్సు కోసం వాటన్నింటినీ పక్కన పెట్టి ఒక్కతాటిపైకి వచ్చామని చెప్పుకొచ్చారు. అనంతరం ఖర్గే సహా విపక్షాల నేతలంతా మీడియాతో మాట్లాడారు.

రాహుల్ మా ఫేవరెట్ : దీదీ

ఇండియా కూటమిని సవాలు చేసే దమ్ము బీజేపీకి ఉందా అని మీడియాతో మాట్లాడుతూ మమత నిలదీశారు. ''మా మాతృభూమి అంటే మాకు ప్రాణం. మేం దేశభక్తులం. మేం రైతులం, దళితులం. మేం మా దేశం కోసం, ప్రపంచం కోసం పాటుపడేవాళ్లం. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ చేస్తున్న పని ఒక్కటే. ప్రభుత్వాలను కొనడం, అమ్మడం!'' అంటూ విరుచుకుపడ్డారు. ''ఇండియా నెగ్గుతుంది. మన దేశం నెగ్గుతుంది. బీజేపీ ఓడుతుంది'' అని జోస్యం చెప్పారు. ''నేటి సంయుక్త డిక్లరేషన్ ద్వారా పాలక ఎన్డీఏ కూటమిపై మా విపక్ష కూటమి 420 సెక్షన్ విధిస్తోంది'' అని ప్రకటించారు. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 420 మోసానికి సంబంధించిన కేసులకు వర్తిస్తుంది. రాహుల్ గాంధీ తమ ఫేవరెట్ అంటూ దీదీ ఈ సందర్భంగా అన్నారు.



శరద్ పవార్‌తో మాట్లాడుతున్న రాహుల్, నితీశ్

'ఇండియా' కూటమిలోని 26 పార్టీలు...

కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, జేడీ(యూ), సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, జేఎంఎం, ఎన్సీపీ (శరద్ పవార్), సీపీఎం, సీపీఐ, శివసేన (యూబీటీ), నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ, ఆరెల్డీ, ఎండీఎంకే, కేఎండీకే, వీసీకే, ఆరెస్పీ, సీపీఐ–ఎంఎల్ (లిబరేషన్), ఫార్వర్డ్ బ్లాక్, ఐయూఎంఎల్, కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి), అప్నాదళ్ (కమెరవాదీ), ఎంఎంకే

దీదీ పెట్టిన పేరు!

విపక్ష కూటమికి ఇండియా అన్న పేరు తృణమూల్ అధినేత్రి మమతా బెనర్జీ సూచించినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. దాని పూర్తి పేరు ఎలా ఉంటే బాగుంటుందని నేతలంతా లోతుగా చర్చించినట్టు చెబుతున్నారు.

ఎవరేమన్నారంటే...

మేం మా కుటుంబాల ప్రయోజనాల కోసమే పోరాడుతున్నామని కొందరంటున్నారు. కానీ వాళ్లు తెలుసుకోవాల్సింది ఏమిటంటే దేశమే మా కుటుంబం. ఆ కుటుంబం కోసమే మేం పోరాడుతున్నాం. మా పోరు ఒక వ్యక్తిపై కాదు. ఒక నియంతృత్వ పోకడపై. ఈ నియంతృత్వాన్ని చూసి దేశ ప్రజలు భయపడుతున్నారు. మై హూ నా (నేనున్నా) అని ఒక హిందీ సినిమా వచ్చింది. మేం కూడా హమ్ హైనా అని ప్రజలకు భరోసా ఇవ్వదలచాం
- మోదీపై ఉద్ధవ్ ఠాక్రే (శివసేన-యూబీటీ)

గత తొమ్మిదేళ్లలో దేశం కోసం ఎంతో చేసే గొప్ప అవకాశం ప్రధాని మోదీకి దక్కింది. కానీ ఏ రంగంలోనూ ఏమాత్రమూ అభివృద్ధి జరగలేదు **- అరవింద్ కేజ్రీవాల్**

2024లో నూతన భారత ఆవిర్భావం

దేశంలో నియంతృత్వం సాగుతోంది. ప్రజాస్వామ్యం, లౌకికవాదం సంక్షోభంలో పడ్డాయి. కానీ 2024లో సరికొత్త భారత్ ఆవిర్భవించడం ఖాయం. పట్నా భేటీలో 15 పార్టీలుగా ఉన్న విపక్ష కూటమి బలం బెంగళూరు భేటీ నాటికి 26 పార్టీలకు విస్తరించడం రాబోయే మార్పుకు ప్రబల సంకేతం. **- స్టాలిన్**

మోదీ నేతృత్వంలోనే ఎన్నికలకు

ఎన్డీఏ భేటీలో తీర్మానం

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంపై పూర్తి విశ్వాసముందని ఎన్డీఏ కూటమి పేర్కొంది. ఆయన నాయకత్వంలోనే ఐక్యంగా 2024 లోక్‌సభ ఎన్నికలకు వెళ్తామని మరోసారి ప్రకటించింది. మంగళవారం 39 భాగస్వామ్య పార్టీలతో భేటీ అనంతరం ఎన్డీఏ కూటమి ఈ మేరకు తీర్మానం ఆమోదించినట్టు పేర్కొంది. అందులో ఏం చెప్పిందంటే...

- విపక్షాలు ప్రాసంగికత కోల్పోయాయి. అస్తిత్వ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయి. ఎన్డీఏపై, కేంద్రంపై నిరాధార ఆరోపణలు చేస్తున్నాయి. కానీ దేశమంతా ఒక్కతాటిపైకి నిలిచి ఎన్డీఏ కూటమిపై విశ్వాసం వ్యక్తం చేస్తోంది.
- ప్రధాని మోదీ నాయకత్వంలో ఎన్డీఏ పాలనలో దేశం సాధించిన కనీవినీ ఎరగని అభివృద్ధిపై ఆయనను భాగస్వామ్య పక్షాలన్నీ ప్రశంసించాయి.

చంద్రయాన్-3 మూడో విడత కక్ష్య దూరం పెంపు

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ షార్ నుంచి ఈనెల 14న ప్రయోగించిన చంద్రయాన్-3 మిషన్‌కు మంగళవారం వేకువజామున మూడోసారి కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను విజయవంతంగా చేపట్టారు. ఎల్‌వీఎం3–ఎం4 ఉపగ్రహ వాహకనౌక ద్వారా చంద్రయాన్-3 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, దూరంగా 36,500 కిలోమీటర్ల ఎత్తులో భూ మధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మొదటి, రెండు విడుతల్లో భూమికి దగ్గరగా 173 కిలోమీటర్ల ఎత్తుకు, దూరంగా 42,000 కిలోమీటర్ల ఎత్తుకు పెంచిన విషయం తెలిసిందే. మూడో విడతలో భూమికి దగ్గరగా 224 కిలోమీటర్లు, దూరంగా 51,568 కిలోమీటర్ల ఎత్తుకు పెంచారు. ప్రపొల్షన్ మాడ్యూల్‌లో వున్న అపాజి ఇంధనాన్ని మంగళవారం ఒక్క నిమిషం పాటు మండించి ఈ ప్రక్రియను పూర్తి చేశారు.

ఎన్‌సీఎస్‌సీ చైర్‌పర్సన్ పదవికి సాంప్లా రాజీనామా

న్యూఢిల్లీ: షెడ్యూల్డ్ కులాల జాతీయ కమిషన్ చైరపర్సన్ పదవికి బీజేపీ నేత విజయ్ సాంప్లా(62) రాజీనామా చేశారు. రానున్న లోక్‌సభ ఎన్నికలకు గాను బీజేపీ ఆయనకు సంస్థాగత బాధ్యతలు అప్పగిస్తుందని భావిస్తున్నారు.

కేరళ మాజీ సీఎం ఊమెన్ చాందీ కన్నుమూత



తిరువనంతపురం/బనశంకరి: కాంగ్రెస్ సీనియర్ నేత, కేరళ సీఎంగా రెండు పర్యాయాలు పనిచేసిన ఊమెన్ చాందీ(79) కన్నుమూశారు. దీర్ఘకాలంగా అస్వస్థతతో బాధపడుతున్న ఊమెన్ చాందీ బెంగళూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కొన్ని నెలలుగా చికిత్స పొందుతున్నారు. మంగళవారం ఉదయం 4.25 గంటలకు తుదిశ్వాస విడిచారని ఆయన కొడుకు చాందీ ఊమెన్ ఫేస్‌బుక్ ఖాతాలో పోస్ట్ చేశారు. చాందీ భౌతికకాయాన్ని బెంగళూరు ఇందిరానగర్‌లోని కర్ణాటక మాజీ మంత్రి టి.జాన్ నివాసంలో ఉంచారు. ప్రతిపక్షాల ఐక్య భేటీకి హాజరయ్యేందుకు బెంగళూరులో ఉన్న కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, ఆపార్టీ నేతలు సోనియా గాంధీ, రాహుల్, తమిళనాడు సీఎం తదితరులు మంగళవారం ఉదయం ఊమెన్ చాందీ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం భౌతిక కాయాన్ని తిరువనంతపురం విమానంలో తరలించారు. అక్కడి నుంచి రాష్ట్ర సెక్రటేరియట్ దర్బార్ హాల్, సెయింట్ జార్జ్ ఆర్థోడాక్స్ సిరియన్ కేథడ్రల్ చర్చి, కేపీసీసీ ప్రధాన కార్యాలయంలో అభిమానులు, ప్రజల సందర్శనార్థం ఉంచారు. బుధవారం చాందీ సొంతూరు కొట్టాయం జిల్లా పుత్తుప్పల్లికి తీసుకెళతారు. గురువారం అంత్యక్రియలు జరుగుతాయి. చాందీకి భార్య మరియమ్మ, కుమార్తెలు మరియా ఊమెన్, అచ్చు ఊమెన్, కొడుకు చాందీ ఊమెన్ ఉన్నారు. కేరళలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంలో సీనియర్ నేతలు ఊమెన్ చాందీ, వాయలార్ రవి, ఏకే ఆంటోనీల కృషి ఎంతో ఉంది. 1970లో మొదటిసారిగా పుత్తుప్పల్లి నియోజవర్గం నుంచి ఎమ్మెల్యే అయ్యారు. అప్పటి నుంచి రికార్డు స్థాయిలో 53 ఏళ్లపాటు అదే నియోజకవర్గం నుంచి ఓటమి అనేదే లేకుండా ప్రాతినిధ్యం వహించారు.

మళ్లీ గెలుస్తాం!

▶ మొదటి పేజీ తరువాయి

కూటములు కట్టింది. ప్రభుత్వాలను కూల్చేందుకే వాటిని దుర్వినియోగ పరిచింది. అధికారమే పరమావధిగా, వారసత్వం రాజకీయాలే పునాదిగా, కుల, ప్రాంతీయ రాజకీయాలు చేసే ప్రతికూల కూటములు విజయం సాధించలేవు' అన్నారు.

ఎన్డీఏ... రంగుల హరివిల్లు

ఎన్డీయే కూటమి ఇటీవలే పాతికేళ్లు పూర్తి చేసుకుందని మోదీ గుర్తు చేశారు. ''ఈ కాలంలో దేశ ప్రగతిని పరుగు పెట్టించడంతో పాటు ప్రజల ఆకాంక్షలను తీర్చింది. దేశంలోని భిన్న ప్రాంతాల ఆకాంక్షలను తనలో కలుపుకున్న రంగుల హరివిల్లు ఎన్డీయే. రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి. 'సబ్ కా ప్రయాస్' స్ఫూర్తితో అభివృద్ధి చెందిన భారత్ కోసం ఎన్డీఏ ముందు నిలిచి పాటుపడుతోంది. దేశ భద్రత, సాధికారతే పరమావధిగా పనిచేసింది. ఇక మీదటా చేస్తుంది కూడా'' అని అన్నారు. ''1998లో ఎన్డీయే ఏర్పడింది. ఎవరినో గద్దె దించేందుకో, ఎవరికో వ్యతిరేకంగానో కాదు. దేశంలో సుస్థిరతే ధ్యేయంగా ఏర్పడిన కూటమి. సుస్థిర ప్రభుత్వముంటేనే దేశ గతినే మార్చేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకోగలదు. ఈ ప్రగతిని గతంలో అటల్‌జీ హయాంలో చూ శాం. మళ్లీ తొమ్మిదేళ్లుగా చూస్తున్నాం. స్థిరమైన ప్ర భుత్వం కారణంగానే భారత్‌పై ప్రపంచ దేశాలు పెట్టుకున్న నమ్మకం మరింత బలపడింది' అని అన్నారు.

విపక్షంలో ఉన్నా ప్రతికూల రాజకీయాలకు దూరం

ప్రతిపక్షంలో ఉన్నా నిర్మాణాత్మక రాజకీయాలే చేశాం. కుంభకోణాల్లో మునిగిన ప్రభుత్వాలను వ్యతిరేకించాం. అంతేగానీ ప్రజాతీర్పును ఏనాడూ తప్పుబట్టలేదు. ప్రభుత్వాన్ని విమర్శించేందుకు విదేశాల సాయం కోరలేదు'' అంటూ విదేశాల్లో రాహుల్ చేసిన వ్యాఖ్యలను పరోక్షంగా విమర్శించారు. '' ఎన్డీయే ప్రతిపక్షంలో ఉన్నా దేశ అభివృద్ధి పథంలో అవరోధాలు సృష్టించలేదు. ఇప్పుడు కేంద్ర పథకాలను విపక్ష పాలిత రాష్ట్రాల్లో అమలు చేయనివ్వడం లేదు. చేసినా నత్తనడకన సాగేలా కుట్ర పన్నుతున్నారు. అధికారమే ధ్యేయంగా, అవినీతే లక్ష్యంగా, వారసత్వ రాజకీయాలకు పట్టం కడుతూ, కుల, ప్రాంతీయ రాజకీయాలకు కొమ్ముకాసే కూటములు దేశానికి అత్యంత హానికరం' అన్నారు.

- ఎన్డీయే భేటీకి 38 పార్టీల కీలక నేతలు హాజరయ్యారు. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, శివసేన నేత, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, తమిళనాడు మాజీ సీఎం, అన్నాడీఎంకే నేత పళనిస్వామి, నాగాలాండ్ ముఖ్యమంత్రి నిఫ్యూ రియో, బిహార్ మాజీ ముఖ్యమంత్రి, హిందుస్తానీ అవామ్ మోర్చా నేత జితన్ రామ్ మాంఝీ తదితరులు భేటీలో మోదీకి స్వాగతం పలికారు.
- లోక్‌జనశక్తి (రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ మోదీకి పాదాభివందనం చేయగా ఆయన్ను ప్రధాని ఆలింగనం చేసుకున్నారు.



మోదీకి గజమాలతో సత్కారం

ఎన్డీఏ భేటీలో పాల్గొన్న 38 పార్టీలు...

బీజేపీ, శివసేన (షిండే), ఎన్సీపీ (అజిత్), ఆరెల్జేపీ (పశుపతి), అన్నాడీఎంకే, అప్నాదళ్ (సోనేలాల్), నేషనల్ పీపుల్స్ పార్టీ, ఎన్డీపీపీ, ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్, సిక్కిం క్రాంతికారీ మోర్చా, మిజో నేషనల్ ఫ్రంట్, ఇండిజినస్ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ త్రిపుర, నాగా పీపుల్స్ ఫ్రంట్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అథవాలే), ఏజీపీ, పీఎంకే, తమిళ మానిల కాంగ్రెస్, యునైటెడ్ పీపుల్స్ పార్టీ (లిబరల్), సుహేల్‌దేవ్ భారతీయ సమాజ్ పార్టీ, అకాలీదళ్ (సంయుక్త), ఎంజీపీ, జననాయక్ జనతా పార్టీ, ప్రహార్ జనశక్తి పార్టీ, రాష్ట్రీయ సమాజ్ పక్ష, జన సురాజ్య శక్తి పార్టీ, కుకీ పీపుల్స్ అలయన్స్, యునైటెడ్ డెమొక్రటిక్ పార్టీ (మేఘాలయ), హిల్ స్టేట్ పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ, నిషాద్ పార్టీ, ఆలిండియా ఎన్నార్ కాంగ్రెస్, హిందూస్తానీ ఆవామ్ మోర్చా, జనసేన పార్టీ, హరియాణా లోక్‌హిత్ పార్టీ, భారత్ ధర్మ జనసేన, కేరళ కామరాజ్ కాంగ్రెస్, పుదియ తమిళగం, లోక్ జనశక్తి (రాంవిలాస్ పాశ్వాన్), గూర్ఖా నేషనల్ లిబరేషన్ ఫ్రంట్.

కశ్మీర్‌లో నలుగురు ఉగ్రవాదులు హతం

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లో భారీ విధ్వంసానికి ఉగ్రవాదులు చేసిన ప్రయత్నాన్ని భద్రతా బలగాలు భగ్నం చేశాయి. పూంచ్ జిల్లాలో మంగళవారం జరిగిన భీకర ఎన్‌కౌంటర్‌లో జవాన్ల తూటాలకు నలుగురు విదేశీ ఉగ్రవాదులు హతమయ్యారు. ఉగ్రమూకలు నియంత్రణ రేఖ వెంబడి చొరబాటుకు చేసిన యత్నాన్ని బలగాలు విజయవంతంగా తిప్పికొట్టిన మరునాడే ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం. పూంచ్ జిల్లా మెంధార్‌లో ఏప్రిల్ 20వ తేదీన ఉగ్రవాదులు జరిపిన దాడిలో అయిదుగురు జవాన్లు నేలకొరిగిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి 'ఆపరేషన్ త్రినేత్ర' పేరుతో బలగాలు సురాన్‌కోట్ అటవీ ప్రాంతంలో జల్లెడపడుతున్నాయి. అనుమానాస్పద కదలికలున్నాయన్న నిఘా వర్గాల సమాచారం మేరకు పోలీసులు, ఆర్మీ ఈ నెల 17వ తేదీ నుంచి సురాన్‌కోట్‌లోని సిందారహాలో 'ఆపరేషన్ త్రినేత్ర 2' పేరుతో కార్డన్ సెర్చ్ చేపట్టాయి. ఉగ్రవాదులు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకుపోయే అవకాశం ఇవ్వకుండా పక్కా వ్యూహంతో చేపట్టిన ఈ ఆపరేషన్‌లో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం 5 గంటల వరకు ఎదురుకాల్పులు కొనసాగాయి. ఉగ్రమూకల కాల్పులు నిలిచిపోవడంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన బలగాలు నలుగురు విదేశీ ఉగ్రవాదుల మృతదేహాలను కనుగొన్నాయి. చైనా తయారీ నాలుగు ఏకే రైఫిళ్లు, పాకిస్తాన్ గుర్తులున్న రెండు పిస్టళ్లు సహా భారీగా మందుగుండు సామగ్రి లభ్యమయ్యాయి. విదేశీ ఉగ్రవాదుల వద్ద ఉన్న ఆయుధాలను బట్టి వారు భారీ విధ్వంసానికి ప్రణాళిక వేసుకున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని ఆర్మీ తెలిపింది. ఉగ్రమూకల పని పట్టేందుకు తమకు ఎంతగానో సహాయ సహకారాలు అందించిన స్థానికులకు ఆర్మీ కృతజ్ఞతలు తెలిపింది.

సోనియా, రాహుల్ ప్రయాణిస్తున్న విమానం అత్యవసర ల్యాండింగ్

భోపాల్: కాంగ్రెస్ అగ్ర నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలు ప్రయాణిస్తున్న విమానం మంగళవారం సాయంత్రం భోపాల్ విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండయింది. ఆ విమానం ఎటువైపు వెళుతోంది, అందులో తలెత్తిన సమస్య ఏమిటనే వివరాలు వెల్లడికాలేదు. రాత్రి 9.30 గంటల తర్వాత విమానం తిరిగి టేకాఫ్ అవ్వొచ్చని భోపాల్ పోలీస్ కమిషనర్ హరినారాయణ్ చారి మిశ్రా చెప్పారు. సోమ, మంగళవారాల్లో జరిగిన విపక్ష భేటీకి సోనియా, రాహుల్ హాజరైన విషయం తెలిసిందే.

నేడు అఖిల పక్ష సమావేశం

న్యూఢిల్లీ: ఈ నెల 20వ తేదీ నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు మొదలవుతున్న వేళ బుధవారం కేంద్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసింది. పార్లమెంట్ సమావేశాలకు ముందుగా ప్రభుత్వం అన్ని పార్టీలతో సమావేశం కావడం రివాజుగా వస్తోంది.

మాది ప్రత్యామ్నాయ ఎ'జెండా'


ప్రజల ముందుంచుతున్నాం ● ఇండియా కూటమి జాయింట్ డిక్లరేషన్

బెంగళూరు: ప్రత్యామ్నాయ రాజకీయ, సామాజిక, ఆర్థిక ఎజెండాను దేశం ముందుంచుతామని కొత్తగా పురుడు పోసుకున్న విపక్షాల కూటమి 'ఇండియా' ప్రకటించింది. తమకు అవకాశమిస్తే పాలన ప్రజాస్వామికంగా, అందరి భాగస్వామ్యంతో కూడినదిగా ఉండేలా చూస్తామని ప్రజలకు హామీ ఇచ్చింది. రెండు రోజుల బెంగళూరు భేటీలో ఈ మేరకు సంయుక్త డిక్లరేషన్ (సామూహిక సంకల్పం' విడుదల చేసింది. తక్షణమే దేశవ్యాప్తంగా కుల గణన చేపట్టాలని కేంద్రాన్ని డిమాండ్ చేసింది. డిక్లరేషన్‌లో ఇంకా ఏం చెప్పిందంటే...

- మైనారిటీలపై జరుగుతున్న హింసాద్వేషలను తుడిచిపెట్టేందుకు, మహిళలు, దళితులు, గిరిజనులు, కశ్మీరీ పండిట్లపై పెరు గుతున్న నేరాలకు అడ్డుకట్ట వేసేందుకే మేం ఒక్కతాటిపైకి వచ్చాం. ఈ దిశగా తొలి అడుగు కింద కులగణన కోరుతున్నాం.
- దేశ రాజ్యాంగానికి మూలాధారాలైన లౌకిక ప్రజాస్వామ్యం, ఆర్థిక సార్వభౌమత్వం, సామాజిక న్యాయం, సమాఖ్య వ్యవస్థలను పద్ధతి ప్రకారం, అతి దారుణంగా కించపరుస్తున్నారు. తద్వారా దేశ సమాఖ్య నిర్మాణాన్ని సంపూర్ణంగా బలహీనపరిచేందుకు ఉద్దేశపూర్వక కుట్ర జరుగుతోంది. విపక్ష పాలిత రాష్ట్రాల గవర్నర్లు అన్ని రాజ్యాంగ నిబంధనలనూ అతిక్రమిస్తున్నారు'' అంటూ మండిపడింది. దేశ చరిత్రలో ప్రస్తుతం కీలక మలుపు వద్ద ఉన్నాం.
- ప్రత్యర్థులు, విపక్షాలపై దర్యాప్తు, నిఘా సంస్థలను కేంద్రంలోని బీజేపీ సర్కారు అడ్డంగా దుర్వినియోగం చేస్తోంది. త ద్వారా ప్రజాస్వామ్యాన్నే కించపరుస్తోంది.
- ఆర్థికసంక్షోభం, నిత్యావసరాల ధరల పెరుగుదల, నిరుద్యోగం తదితర ప్రధాన సమస్యలపై రాజీ లేకుండా పోరాడతాం.
- బలమైన ప్రభుత్వ రంగం, పోటాపోటీ ప్రైవేట్ రంగాలు నేటి తక్షణావసరాలు. కర్షకుడు, కార్మికుడు, కర్మభూమికి అత్యున్నత ప్రాధాన్యం దక్కాలి.
- సమస్యలపై ప్రధాని మౌనం దారుణం.
- మణిపూర్ కల్లోలం అత్యంత విషాదకరం. అక్కడ పరిస్థితి తక్షణం అదుపులోకి తేవాల్సిన బాధ్యత మోదీదే.

మూడు నెలలపాటు నడిసంద్రంలో..

పెంపుడు కుక్క సహా ఆస్ట్రేలియా వాసిని రక్షించిన మెక్సికో బోట్



మెక్సికో సిటీ: సుమారు మూడు నెలల పాటు సముద్రంలో నిస్సహాయ స్థితిలో పెంపుడు కుక్కతో గడిపిన ఓ వ్యక్తి ఎట్టకేలకు సురక్షితంగా ఒడ్డుకు చేరారు. నమ్మశక్యంకాని ఈ ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. తిమోతీ లిండ్సే షడ్డక్(54) అనే ఆస్ట్రేలియా వాసి పెంపుడు కుక్క బెల్లాతో కేటమారన్ రకం పడవలో పసిఫిక్ సముద్రంలో విహరిస్తున్నాడు. ఆ సమయంలో ఆ పడవ మరమ్మతుకు గురయింది. అలా సముద్ర జలాల్లో తీరానికి 1,200 మైళ్ల దూరంలో ఆ ఇద్దరూ మూడు నెలలుగా ఉండిపోయారు. అనూహ్యంగా ఇటీవల అటుగా టునా చేపల వేటకు వెళ్లిన మెక్సికో వాసుల కంట పడ్డారు.

దక్షిణకొరియాలో అమెరికా అణు సబ్‌మెరైన్

సియోల్: నాలుగు దశాబ్దాల తర్వాత అమెరికా తన అణు జలాంతర్గామిని దక్షిణకొరియా జలాల్లో మోహరించింది. ఉత్తరకొరియా తరచూ అణు బెదిరింపులకు పాల్పడుతున్న దృష్ట్యా ఈ ఏడాది ఏప్రిల్‌లో దక్షిణకొరియాతో కుదిరిన పలు ఒప్పందాల్లో భాగంగానే అణు బాలిస్టిక్ క్షిపణులు కలిగిన సబ్‌మెరైన్‌ను అమెరికా పంపించింది. ఓహియో తరగతికి చెందిన యూఎస్‌ఎస్ కెంటకీ జలాంతర్గామి మంగళవారం మధ్యాహ్నం దక్షిణకొరియాలోని బుసాన్ రేవుకు చేరుకుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
బుధవారం : 19 : జూలై : 2023

చిరుత లాంటి చేప

యశవంతపుర: సముద్రంలో లోతైన ప్రాంతంలో జీవించే విచిత్ర, అపురూపమైన లెపర్డ్ మోరె ఈల్ అని పిలిచే చేప దక్షిణ కన్నడ జిల్లాలో అరేబియా సముద్రంలో బయట పడింది. మంగళూరు సూరత్కల్ సమీపంలోని గుడ్డెకొప్ప తీరం వద్ద దీనిని జాలర్లు కనుగొన్నారు. ఈల్ జాతికి చెందిన ఈ చేప దేహంపై చిరుతపులికి ఉన్నట్లు మచ్చలు ఉండడం వల్ల లెపర్డ్ ఈల్ అని కూడా పేరుంది.



న్యూస్‌రీల్

జయచామరాజ ఒడెయార్ జయంతి



జయచామరాజ ఒడయార్ విగ్రహానికి నివాళులు

మైసూరు: మైసూరు దివంగత మహారాజు జయచామరాజ ఒడెయార్ 104వ జయంతి వేడుకలను మైసూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించారు. అఖిల కర్ణాటక ఒక్కలిగ మహాసభ ఆధ్వర్యంలో నగరంలోని శివరామ్ పేటలో ఉన్న సంఘం కార్యాలయం ఆవరణంలో ఒడెయార్ జయంతి వేడుకలు నిర్వహించారు. ప్రముఖులు ఒడెయార్ చిత్రపటానికి పూలు వేసి వేడుకలను ప్రారంభించారు. అనంతరం వారు యదు వంశానికి చెందిన జయచామరాజ ఒడెయార్ ప్రజా వాత్సల్యం కలిగిన వ్యక్తని కొనియాడారు.

విద్యుత్ కంచెకు ఏనుగు బలి

మైసూరు: అడవికి దగ్గరగా పొలం ఉండడంతో ఓ రైతు పంటల రక్షణ కోసమని అక్రమంగా కరెంటుతో కంచె పెట్టాడు, ఆ కంచె తగిలి గజరాజు మృత్యువాత పడింది. ఈ సంఘటన జిల్లాలో బండీపుర అరణ్యంలో ఓంకార విభాగంలో కురుబర హుండి గ్రామం వద్ద జరిగింది. శివరాజప్ప అనే రైతు పొలం చుట్టూ ఇనుప తీగలు కట్టి దానికి కరెంటు కనెక్షన్ ఇచ్చాడు. సోమవారం రాత్రి ఆహారం వెతుక్కుంటూ వచ్చిన ఓ 30 ఏళ్ల ఏనుగు పొలంలోకి చొరబడే సమయంలో కంచె తగిలి షాక్‌తో మరణించింది. అటవీ అధికారులు వచ్చి పరిశీలించారు. పొలం యజమాని పైన కేసు నమోదు చేశారు.

బీబీఎంపీ జేసీల బదిలీ

యశవంతపుర: బీబీఎంపీ రాజరాజేశ్వరినగర, బొమ్మనహళ్లి విభాగం జాయింట్ కమిషనర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. రాజరాజేశ్వరి నగర విభాగం జాయింట్ కమిషనర్ ఎస్ నాగరాజ్‌ను బదిలీ చేసి ఆయన స్థానంలో ఎం.అజిత్‌ను నియమించగా, నాగరాజుకు పోస్టింగ్ ఇవ్వలేదు. బొమ్మనహళ్లి జాయింట్ కమిషనర్ కృష్ణమూర్తిని కూడా బదిలీ చేసి పోస్టింగ్ చూపలేదు. ఆయన స్థానంలో హైకోర్టు అడ్వొకేట్ జనరల్ కార్యాలయంలో పాలనాధికారిగా పని చేస్తున్న అభిజిన్‌ను నియమించింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 19 మంది బీబీఎంపీ అధికారులను బదిలీ చేసింది.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

- ముగ్గురు దుర్మరణం



ట్రాక్టర్ ట్రాలీ కిందకు దూసుకెళ్లిన కారు

మైసూరు: నిలబడి ఉన్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు ఢీకొనగా కారులోని ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన జిల్లాలో మైసూరు -మంగళూరు జాతీయ రహదారిలో పిరియా పట్టణ తాలూకాలోని కంప్లాపుర వద్ద జరిగింది.
వివరాలు.. మంగళవారం పిరియా పట్టణకు చెందిన కొందరు డ్రైవర్లు హుణసూరుకు కారులో బయల్దేరారు. వీరు క్యాంటర్లను కొని కమీషన్‌కు అమ్ముతుంటారు. వ్యాపారం మీద వెళ్తూ హైవే పై నిలిచి ఉన్న ట్రాక్టర్‌ను అదుపు తప్పి ఢీకొన్నారు. కారు సగం వరకూ ట్రాక్టర్ ట్రాలీ కిందకు దూసుకెళ్లింది. ముదాసీర్ (35), ముజాయిద్ (25), అహ్మద్ పాషా(46) అనే ముగ్గురు తీవ్ర గాయాలతో ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడగా మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఎవరు విందుకు పిలిచినా వస్తా : స్పీకర్

శివాజీనగర: విధానసభ స్పీకర్ యూటీ ఖాదర్ కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీతో భేటీ కావడం అసెంబ్లీలో ఆరోపణలకు కారణమైంది. మంగళవారం విధానసభ ఆరంభం కాగానే బీజేపీ ఎమ్మెల్యే అరగ జ్ఞానేంద్ర ఈ విషయాన్ని ప్రస్తావించారు. పార్టీతో సంబంధం లేకుండా ఉండాల్సిన మీరు సోనియా గాంధీని కలవడానికి వెళ్లింది నిజమా? లేక మీడియా సృష్టినా? తమరే చెప్పాలని డిమాండ్ చేశారు. ఇందుకు స్పీకర్ సమాధానమిస్తూ ముఖ్యమంత్రి విందుకు ఆహ్వానించారు. అందుకోసమే వెళ్లాను. ఇది తప్పేం కాదు కదా, మీరు విందుకు పిలిచినా వస్తాను, నేనూ మనిషినే కదా అని అన్నారు.
అంతకు ముందు మాట్లాడిన బీజేపీ ఎమ్మెల్యే సురేశ్‌కుమార్, ముందు వరుసలో 9 మంది మంత్రులు లేరు. అందరూ స్టార్ హోటల్‌లో ఘటబంధన్‌లో ఉన్నట్లు కనిపిస్తోంది. అసెంబ్లీ సమావేశాలను స్టార్ హోటల్‌కు మార్చండని అనడంతో సభ్యులు నవ్వారు. బసవరాజ బొమ్మై మాట్లాడుతూ మంత్రులు సభను సీరియస్‌గా పరిగణించలేదని విమర్శించారు.

భక్తులకు విజ్ఞప్తి..

- ఆలయాల్లో మొబైల్ ఫోన్ల నిషేధం
- దేవాదాయశాఖ ఉత్తర్వులు
- ప్రశాంతతకు భంగం కారాదనే..

మొబైల్స్ స్విచ్ఛాఫ్ చేయండి

దేవస్థానాలకు వచ్చే భక్తులకు ప్రశాంతత ఉండాలి, దేవున్ని భక్తితో పూజించే వాతావరణం తప్పనిసరి. అప్పుడే నిష్ఠతో పూజించిన భావన కలుగుతుంది. కానీ క్షణక్షణం మోగే మొబైళ్లు, సెల్ఫీలు, వీడియోల గోల ఆలయాల్లో ప్రశాంతతకు పాతర వేస్తోంది. గుడికి వచ్చినా ఇదేమి బెడద అని మిగతా వారు తలపట్టుకునే రోజులకు ఫుల్‌స్టాప్ పడనుంది.



ఆలయాల్లో పూజా సమయంలో ఫోన్ల మోత వల్ల ఇతర భక్తులకు ఇబ్బంది కలుగుతోంది

బనశంకరి: రాష్ట్రంలోని దేవాదాయశాఖ పరిధిలోని దేవస్థానాల్లో ఇకపై మొబైల్‌ఫోన్ వాడకాన్ని సర్కారు నిషేధించింది. గత ఏడాది అఖిల కర్ణాటక హిందూ దేవాలయ అర్చకుల ఒక్కూట అప్పటి మంత్రి శశికళా జొల్లెను కలిసి వినతిపత్రం అందజేసింది. పూజా కైంకర్యాలు నిర్వహించే సమయంలో భక్తులు మొబైల్‌ఫోన్లు వాడడం, ఆ రింగ్‌టోన్, పాటలు, అలాగే సెల్ఫీలు, వీడియోలు తీయడం వల్ల ఇబ్బందికరంగా ఉంది, ఇక అశ్లీల రింగ్‌టోన్ల వల్ల ఆలయంలో పవిత్రత దెబ్బతింటోంది, కాబట్టి ఆలయాల ఆవరణలోకి మొబైళ్లను తీసుకురాకూడదని ఆదేశించాలని అర్చకులు కోరారు. ఆలయం బయట మొబైళ్లను భద్రపరచడానికి వసతి కల్పించాలని సూచించారు. ఈ మనవిని పరిగణించిన దేవాదాయశాఖ మొబైళ్లపై నిషేధం ఆదేశాలు జారీ చేసింది.



భక్తులు ఫోన్లను స్విచ్ఛాఫ్ చేయాలి. పెద్ద ఆలయాల్లో ఫోన్లను భద్రపరిచే వసతులు కల్పిస్తారు

ప్రశాంతతకు భంగం

ఇటీవలి రోజుల్లో మొబైల్ ఫోన్లు లేని ప్రదేశమంటూ లేదు. కొందరి వద్ద రెండు ఫోన్లు కూడా ఉంటున్నాయి. భక్తులు ఆలయాలకు వచ్చినప్పుడు ఫోన్ల శబ్దాల వల్ల పూజారులకు, సహచర భక్తులకు ప్రశాంతత లోపిస్తోంది. దీనిపై ఎప్పటినుంచో ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో దేవాదాయశాఖ తన పరిధిలోగల ఆలయాల్లో భక్తులు మొబైల్ ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకుని దేవుని దర్శనం చేసుకోవాలని సూచించింది. ఆ మేరకు బోర్డులు పెట్టాలని సిబ్బందికి ఆదేశించింది.

కరావళిలో అమలు

ఈ సమస్య వల్ల ఇప్పటికే కరావళి ప్రాంతాల్లో పలు దేవస్థానాల్లో మొబైల్‌ను అనుమతించడం లేదు. దక్షిణ కన్నడ జిల్లాలో పుణ్యక్షేత్రాలైన కుక్కేసుబ్రమణ్య, కద్రి మంజునాతేశ్వర, కటీల్ దుర్గా పరమేశ్వరి ఆలయాలతో పాటు పలు ప్రముఖ మందిరాల్లో భక్తులు దయచేసి మొబైల్‌ను స్విచ్ఛాఫ్ చేయాలని బోర్డులు కనిపిస్తాయి. అలాగే మొబైల్ వాడకం, ఫోటోలు తీయడం కూడా నిషేధించారు.



స్విచ్ఛాఫ్ చేయాలని కుక్కె ఆలయంలో సూచన

ఇప్పటికి జ్ఞానోదయం అయ్యింది

రాష్ట్రంలో ఇతర ఆలయాల్లోనూ ప్రభుత్వ ఆదేశాలు జారీకాగానే మొబైల్ నిషేధం పకడ్బందీగా అమలు చేసే అవకాశముంది. తద్వారా సెల్ఫీలు, వీడియోలు, రీల్స్ రికార్డింగ్ వంటి మొబైల్ గందరగోళానికి చరమగీతం పాడవచ్చు. దీనిపై కద్రి మంజునాథేశ్వర ఆలయ సమితి ఉపాధ్యక్షుడు ప్రదీప్ కుమార్ కల్కూర మాట్లాడుతూ అధికారులకు ఇప్పటికి జ్ఞానోదయమైందని అన్నారు. భగవంతుని సన్నిధికి ఆత్మనివేదనకు వచ్చినప్పుడు మొబైల్ అవసరం లేదన్నారు.

ఎయిర్‌పోర్టులో 6.5 కేజీల బంగారం పట్టివేత



దొడ్డబళ్లాపురం: భారీ మొత్తంలో అక్రమంగా బంగారాన్ని తరలిస్తుండగా కస్టమ్స్ అధికారులు పట్టుకున్న ఘటన బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో జరిగింది. వివరాలు... మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ నుంచి గత శుక్రవారం ఇండిగో విమానం కెంపేగౌడ విమానాశ్రయంలో దిగింది. స్మగ్లర్లు బంగారు బిస్కెట్లను విమానంలో ఒక సీటు కింద దాచి పెట్టారు. వారి సూచన మేరకు ఒక ప్రయాణికుడు ఆ బిస్కెట్లను తన బ్యాగులో వేసుకుని విమానం దిగాడు. కస్టమ్స్ అధికారులకు అనుమానం రావడంతో అతన్ని తనిఖీ చేయగా బంగారు బిస్కెట్లు పట్టుబడ్డాయి. మామూలుగా దేశీ ప్రయాణికులను సోదా చేయరనే ధైర్యంతో స్మగ్లర్లు ఈ పథకం వేశారు. లెక్కింగా 6.5 కేజీల బరువు గల 7 బంగారు బిస్కెట్లు లభించాయి. ఆ ప్రయాణికునిది చెన్నై అని తెలిసింది. బంగారును సీజ్ చేసి నిందితున్ని అరెస్టు చేసి విచారణ చేపట్టారు.

11 టీఎంసీలకు టీబీ డ్యాం



బొమ్మనహాళ్: తుంగభద్ర జలాశయానికి మంగళవారం 11,425 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చినట్లు టీబీ బోర్డు అధికారులు తెలిపారు. ప్రస్తుతం డ్యాంలో 1,633 అడుగుల నీటిమట్టానికి గాను 1,589.90 అడుగులకు చేరింది. డ్యాం పూర్తి సామర్థ్యం 105 టీఎంసీలు అయితే సుమారు 11 టీఎంసీల నీటిమట్టం చేరింది. ఇన్‌ఫ్లో 11,425 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 262 క్యూసెక్కులుగా ఉంది. గతడాది ఇదే సమయానికి డ్యాంలో 96 టీఎంసీల జలాలు ఉండేవి.

అసెంబ్లీలో.. జేవర్గి ఇసుక రభస



అసెంబ్లీని తాకిన ఇసుక అక్రమ రవాణా రగడ



రాష్ట్రంలో కొంతకాలంగా ఇసుక మాఫియా దాడులు పెరిగాయి

- పోలీస్ హత్య, ట్రాక్టర్ డ్రైవర్‌పై కాల్పుల కేసు...
- సీఐడీ దర్యాప్తునకు హోంమంత్రి హామీ
- పరిషత్‌లో ప్రతిపక్ష సభ్యుల ధర్నా

శివాజీనగర: కల్బుర్గి జిల్లా జేవర్గి తాలూకాలో గత నెలాఖరులో అక్రమ ఇసుక తరలింపును అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీస్ కానిస్టేబుల్ హత్య, ట్రాక్టర్ డ్రైవర్ కమ్ యజమాని సాయిబన్న కర్జగిపై పోలీసుల కాల్పుల సంఘటన మంగళవారం అసెంబ్లీలో ప్రతిధ్వనించింది. సమగ్ర దర్యాప్తు కోసం ప్రతిపక్ష సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో ఈ కేసును సీఐడీకి అప్పగించనున్నట్లు హోం మంత్రి జీ.పరమేశ్వర్ విధానపరిషత్‌లో తెలిపారు. వాస్తవాలు వెల్లడి కావాలనే కోరుకుంటున్నాం, కాబట్టి సీఐడీకి అప్పగించనున్నట్లు తెలిపారు.

ప్రారంభం కాగానే ధర్నా

ఉదయం సభ ఆరంభం కాగానే బీజేపీ సభ్యులు స్పీకర్ ముందు చేరి ధర్నాను కొనసాగించారు. న్యాయ విచారణకు అప్పగించాలని కోరుతూ బీజేపీ సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ సమయంలో సభాపతి బసవరాజ హొరట్టి స్పందిస్తూ, ధర్నాను విరమించి మీ స్థానాల నుంచి మాట్లాడాలని విజ్ఞప్తి చేశారు. వై.ఏ.నారాయణస్వామి మాట్లాడుతూ హోం మంత్రి చెప్పిన సమాధానం సంతృప్తిగా లేదు. న్యాయ విచారణ చేపట్టాలని మళ్లీ పట్టుబట్టారు. కాంగ్రెస్ సభ్యుడు యూబీ వెంకటేశ్ జోక్యం చేసుకుని రోజూ అదే చెబుతున్నారు. కొత్తదేమైనా ఉంటే చెప్పాలని అన్నారు. మళ్లీ హోం మంత్రి మాట్లాడుతూ సంఘటనను సీఐడీ విచారణకు అప్పగిస్తాం, వాస్తవాలు వెల్లడవుతాయి. ఎవరిని దిక్కు తప్పించడం, విషయాన్ని మూసివేసే అవకాశం లేదని అన్నారు.

ధర్నా విరమణ

బీజేపీ సభ్యుడు శశిల్ నమోషి మాట్లాడుతూ ఈ సంఘటనలో సాయిబన్న కర్జగిపై పోలీసులు కాల్పులు జరిపారు. అతని పరిస్థితి చింతాజనకంగా ఉంది, ఇప్పుడు మైసూరు జైల్లో రిమాండులో ఉన్నాడు, ఆయన ఆరోగ్యంపై దృష్టిపెట్టాలని తెలిపారు. పోలీసులు అరెస్ట్ చేసిన సాయిబన్న కర్జగిని కోర్టులో ఎందుకు హాజరు పరచలేదని హోంమంత్రిని ప్రశ్నించారు. కేసును సీఐడీకి అప్పగిస్తే అన్ని విషయాలూ బహిరంగమవుతాయి, ఇందులో ఎవరి జోక్యం లేకుండా చూస్తామని హోంమంత్రి హామీ ఇవ్వడంతో బీజేపీ సభ్యులు ధర్నాను ఉపసంహరించుకొని తమ సీట్ల వద్దకు వెళ్లారు.

సభాపతితో వాగ్వాదం

జేవర్గిలో జరిగిన ఘటనను పట్టుకుని ధర్నా, నినాదాలు చేయడం తగదని సభాపతి హొరట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. నినాదాలు చేసే అధికారం ప్రతిపక్షాలకు ఉందని బీజేపీ సభ్యుడు వై.ఏ.నారాయణస్వామి బదులిచ్చారు. సభా నియమాల ప్రకారం నడచుకోవాలని సభాపతి సూచించారు. మీరు సభాపతి కానప్పుడు ఇలాగే నినాదాలు చేశారని నారాయణస్వామి చెప్పగా, తానెప్పుడూ అలా చేయలేదని హొరట్టి అన్నారు. దీంతో ఇద్దరి మధ్య కొంత సేపు వాగ్వివాదం జరిగింది.

బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

- కాపీ కొట్టాడని కన్నవారికి ఫిర్యాదు
- కాలేజీ యాజమాన్యంపై కేసు నమోదు



బనశంకరి: అవమానం భరించలేక ఓ విద్యార్థి భవనం పై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటనలో కాలేజీ యాజమాన్యంపై గిరినగర పోలీసులు కేసు నమోదుచేశారు. వివరాలు... కనకపుర మెయిన్ రోడ్డు ఆర్ట్ ఆఫ్ లివింగ్ వద్ద అపార్టుమెంటులో మంగళూరు కు చెందిన ఇంజినీర్ గిరీశ్‌ప్రభు నివసిస్తున్నారు. తన కుమారుడైన ఆదిత్య ప్రభు (19)ను ఇంజనీరింగ్ చదివించడానికి హొసకెరెలో పేరుపొందిన ఒక ప్రైవేటు కాలేజీలో చేర్పించారు.

ఏం జరిగిందంటే

సోమవారం ఆదిత్య ప్రభు రెండో సెమిస్టర్ పరీక్ష రాస్తూ కాపీ కొడుతూ లెక్చరర్‌కు పట్టుబడ్డాడు. అతన్ని పరీక్ష హాల్ నుంచి బయటకు పంపించారు. తరువాత లెక్చరర్ కాలేజీ యాజమాన్యానికి సమాచారమిచ్చాడు. దాంతో వారు ప్రభు తల్లిదండ్రులకు ఫోన్ చేసి మీ కొడుకు కాపీయింగ్‌లో దొరికాడని, మీరు వెంటనే వచ్చి మాతో మాట్లాడాలని సూచించారు. దీంతో తీవ్ర భయాందోళనకు గురైన ఆదిత్య ప్రభు ఆత్మహత్య చేసుకోవాలని కాలేజీ కట్టడం 8వ అంతస్తు పై నుంచి దూకడంతో తీవ్ర గాయాలై మృత్యువాత పడ్డాడు. కాలేజీ యాజమాన్యం ఆత్మహత్యకు ప్రేరేపించడంతోనే తన కుమారుడు మృతి చెందారని తండ్రి ఫిర్యాదు చేయగా, ఆ మేరకు కేసు నమోదుచేశారు.

కరువు పనులు చేపట్టాలి : బొమ్మై

శివాజీనగర: రాష్ట్రంలో వర్షం కురవని ప్రాంతాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించాలని బీజేపీ మాజీ సీఎం బసవరాజ బొమ్మై మంగళవారం విధానసభలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరువు పరిస్థితిపై వాయిదా తీర్మానం కింద మాట్లాడిన ఆయన, ఉత్తర కర్ణాటక, మధ్య కర్ణాటకతో పాటుగా రాష్ట్రంలో వివిధ చోట్ల ఖరీఫ్ వర్షం తగ్గిపోయింది. రైతులు విత్తనాలు కూడా వేయలేదు. కేవలం 1.14 లక్షల హెక్టార్లలోనే విత్తనం పడిందన్నారు. దీంతో రైతుల ఆదాయానికి గండిపడటంతో పాటుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి పడిపోతుంది. వానల్లేని ప్రాంతాలను కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించి పరిహార పనులను చేపట్టాలని డిమాండ్ చేశారు.

కిల్లర్ కొడుకు

- రాడ్‌తో బాది తల్లిదండ్రుల హత్య
- బెంగళూరులో కిరాతకం
- పరారీలో నిందితుడు



తల్లిదండ్రులు (ఫైల్)



తనయుడు శరత్ (ఫైల్)

యశవంతపుర: ఉన్మత్త ఆవేశంలో తల్లిదండ్రులను తలపై రాడ్‌తో బాది హత్య చేశాడో ఉన్మాది. బెంగళూరు బ్యాటరాయనపురలో ఈ ఘోరం చోటు చేసుకొంది. తల్లిదండ్రులు శాంత(61), భాస్కర్(63)లను కొడుకు శరత్ (27) హత్య చేసి పరారయ్యాడు.

డబ్బుల కోసం గొడవపడి

వివరాలు.. మంగళూరుకు చెందిన భాస్కర్ కుటుంబం 12 ఏళ్ల క్రితం బెంగళూరుకు వచ్చి బ్యాటరాయనపుర దగ్గర కట్టెల మండీ వద్ద నివాసం ఉంటున్నారు. తల్లి కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో పని చేసి ఇటీవల రిటైరైంది, తండ్రి ఒక హోటల్ క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. దంపతులకు ఇద్దరు కొడుకులుండగా ఒకరు ప్రైవేట్ సంస్థలో ఉద్యోగి కాగా తిండ్లులో ఉంటున్నాడు. మరో కొడుకు శరత్ అప్పుడప్పుడు సైకోలా ప్రవర్తించేవాడు. సోమవారం రాత్రి మద్యం తాగి తల్లిదండ్రులతో గొడవ చేశాడు. తను అడిగినంత డబ్బులు ఇవ్వాలని పట్టుబట్టాడు. తల్లిదండ్రులు ససేమిరా అనడంతో రాడ్ తీసుకుని ఇద్దరినీ చితకబాదాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో రక్తపు మడుగులో దంపతులిద్దరూ మరణించారు.

పెద్ద కొడుకు ఫోన్ చేయగా

తరువాత శరత్ ఇంటికి తాళం వేసుకొని పరారయ్యాడు. మంగళవారం ఉదయం పెద్ద కొడుకు తల్లిదండ్రులకు ఫోన్ చేయగా స్పందన లేదు. అనుమానం వచ్చి పక్కింటివారికి ఫోన్ చేసి విచారించగా ఇద్దరూ హత్యకు గురైనట్లు బయట పడింది. ఘటనా స్థలాన్ని ఈశాన్య డీసీపీ పరిశీలించారు. బ్యాటరాయనపుర పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సైకో కొడుకు కోసం గాలింపు చేపట్టారు.

సోషల్ మీడియాలో దుష్ప్రచారం

- ఐఏఎస్ ఆకాశ్‌పై భార్య ఫిర్యాదు
- గతంలో కట్నం వేధింపుల కేసు





వందన, ఐఏఎస్ ఆకాశ్ శంకర్ దంపతులు (ఫైల్)

యశవంతపుర: భర్త, అతని కుటుంబసభ్యులు సోషల్ మీడియాలో తనపై తప్పుడు ప్రచారం చేస్తున్నారంటూ ఓ మహిళ బెంగళూరు కొడిగేహళ్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె భర్త ఆషామాషా వ్యక్తి కాదు, ఓ ఐఏఎస్ అధికారి. అప్పట్లో సివిల్స్‌లో దేశంలో వంద లోపు ర్యాంకు తెచ్చుకుని మీడియాలో ఇంటర్వ్యూలు ఇచ్చాడు. కానీ ఏం లాభం.. భార్యను వేధించి అపఖ్యాతిని మూటగట్టుకున్నాడు. కొడగు జడ్పీ సీఈఓగా పనిచేస్తున్న ఆకాశ్ శంకర్‌పై అయన భార్య డాక్టర్ వందన ఈ ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు.

ఘనంగా పెళ్లి చేసినా..

రిటైర్డు ఐపీఎస్ టీఆర్ సురేశ్ కుమార్తె డాక్టర్ వందనకు గత ఏడాది జూన్‌లో ఆకాశ్ శంకర్‌కు ఇచ్చి పెళ్లి చేశారు. ఆ సమయంలో బాగా కట్న కానుకలు సమర్పించారు. కానీ మళ్లీ డబ్బు బంగారం , విలువైన కానుకలు తేవాలని భర్త, అత్తమామలు వేధిస్తున్నట్లు వందన గత మార్చిలో ఆరోపించారు. అప్పటినుంచి దంపతులు వేర్వేరుగా ఉంటున్నారు.

హేళనగా ప్రచారం

ఇటీవల ఆకాశ్ శంకర్ సోదరుడు వికాస్ శంకర్, అతని భార్య చేతన, ఐసిరి శివకుమార్ అనేవారు వందన గురించి హేళనగా మాట్లాడి ఆ వీడియోలను ఆమె స్నేహితులకు పంపారు. ట్రాఫికింగ్ ఆఫ్ ఖాకీస్ డాటర్, ట్రాఫికర్ డాక్టర్ వందన అని తప్పుడు ప్రచారం చేశారని ఆమె ఆవేదన వ్యక్తంచేసింది. వందన కుంటుబం గురించి ఇంటర్నెట్లో అగౌరవంగా రాతలు రాసినట్లు ఆమె వాపోయింది. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

విద్యుత్‌ చార్జీలను తగ్గించండి



మాట్లాడుతున్న కమల్‌ కుమార్‌

రాయచూరు రూరల్‌: కేఈఆర్‌సీ ద్వారా రాష్ట్రంలో పెంచిన విద్యుత్‌ చార్జీలను తగ్గించాలని జిల్లా చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ అధ్యక్షుడు కమల్‌ కుమార్‌ డిమాండ్‌ చేశారు. సోమవారం షియాతలాబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నూతన పరిశ్రమల చట్టం, కేంద్ర గిడ్డంగుల పాలసీ, ఏపీఎంసీ పన్నుల పెంపు, కోల్డ్‌ స్టోరేజ్‌ ధరల పెరుగుదల తదితర అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో పరిశ్రమల కేంద్రం జాయింట్‌ డైరెక్టర్‌ బసవరాజ్‌, కెనరా బ్యాంక్‌ మేనేజర్‌ తిప్పేస్వామి, మహాదేవి, చాంబర్‌ ఆఫ్‌ కామర్స్‌ ఉపాధ్యక్షుడు పురుషోత్తం తదితరులున్నారు.

రేంజరు సేవలు విస్తరించాలి

రాయచూరు రూరల్‌: విద్యార్థుల రేంజరు సేవలను విస్తరించాలని భారత్‌ రేంజర్‌ అధ్యక్షుడు బసవరాజ్‌ బోరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని వీరశైవ కళ్యాణ మంటపంలో ఏర్పాటు చేసిన భారత్‌ స్కౌట్స్‌ అండ్‌ గైడ్స్‌ కార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు పాఠ్యాంశాలకు తోడు పాఠ్యేతర విషయాలపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. వివిధ స్థాయిల్లో సేవలందించిన రోవర్స్‌, రేంజర్లను సన్మానించారు.

వీధి కుక్కల పట్టివేతకు శ్రీకారం



కుక్కను వలతో పట్టుకుంటున్న దృశ్యం

కంప్లి: పట్టణంలో వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బెడదతో ప్రజలు అల్లాడిపోతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగం స్పందించింది. వెంటనే టీపీల స్థాయిలో వీధి కుక్కలను పట్టుకొని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నంలో భాగంగా కుక్కల పట్టివేతను ప్రారంభించారు. వలతో కుక్కలను వెంటాడి పట్టుకునే ప్రయత్నం సఫలమైతే అన్ని గ్రామాల్లో అమలు చేస్తారు.

పండుగలపై శాంతి సమావేశం



మాట్లాడుతున్న సీఐ సురేష్‌ తళవార్‌

కంప్లి: మొహర్రం పండగను ముస్లింలతో పాటు హిందువులు కూడా భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తూ భావైక్యతను చాటడం శ్లాఘనీయమని సీఐ సురేష్‌ తళవార్‌ తెలిపారు. మొహర్రం, గణేష్‌ పండుగల సందర్భంగా సోమవారం సాయంత్రం స్టేషన్‌ ఆవరణలో సర్వధర్మ ప్రముఖుల సమక్షంలో ఏర్పాటు చేసిన శాంతిసభలో ఆయన మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి అడ్డంకులు లేకుండా శాంతిని కాపాడాలని, ప్రముఖంగా యువత నిబంధనలను పాటించాలన్నారు. ఈ సందర్భంగా కే.హేమయ్యస్వామి, వాల్మీకి ఈరణ్ణ, దాదాఖలందర్‌, వలీఅహ్మద్‌, అబ్దుల్‌ మునాఫ్‌, జాఫర్‌ మౌరి, సుధాకర్‌ తదితరులు పాల్గొన్నారు.


ఆ అధికారిపై చర్య తీసుకోండి



ధర్నా చేస్తున్న మాదిగ దండోరా కార్యకర్తలు

రాయచూరు రూరల్‌: రాయచూరు ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్‌)లో విధులు నిర్వహిస్తున్న అధికారి బసవరాజ్‌ హీరాపూర్‌ను సస్పెండ్‌ చేయాలని మాదిగ దండోరా జిల్లా సంచాలకుడు నరసింహులు డిమాండ్‌ చేశారు. మంగళవారం ప్రభుత్వ వైద్య కళాశాల వద్ద చేపట్టిన ధర్నాలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నుంచి వేతనాలు పొందుతూ రిమ్స్‌లో విధులు నిర్వహించే వైద్యులు స్వంతంగా ప్రైవేట్‌ క్లినిక్‌లు, నర్సింగ్‌ హోంలను నడుపుకుంటున్నా వారి నుంచి మామూళ్లను స్వీకరించిన ఆ అధికారిని సస్పెండ్‌ చేయాలని కోరుతూ స్థానికాధికారికి వినతిపత్రం సమర్పించారు.

యాదగిరి కలెక్టర్‌గా సుశీల నియామకం



రాయచూరు రూరల్‌: యాదగిరి జిల్లాధికారిణిగా సుశీలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సోమవారం సాయంత్రం జిల్లాధికారి కార్యాలయంలో ఆమె అధికార బాధ్యతలు చేపట్టారు. గతంలో జిల్లాధికారిణిగా విధులు నిర్వహించిన స్నేహల్‌ను బెంగళూరులో రిపోర్టు చేయాలని ఆదేశించారు. ఏడాది క్రితం యాదగిరి జిల్లాధికారిణిగా ఆమె బాధ్యతలు చేపట్టిన సంగతి విదితమే.

టమాట.. రైతన్నకు కాసుల పంట

- ఒక ఎకరాలో రూ.3 లక్షలకు పైగా ఆదాయం గడించిన ధార్వాడ రైతన్నలు



టమాటా పండించిన రైతన్న ఈరప్ప, సరుకును ట్రేలలో నింపి మార్కెట్‌కు తరలిస్తున్న దృశ్యం

హుబ్లీ: టమాటా అంటేనే భయపడే రోజులు వచ్చాయి. కారణంగా విపరీతంగా పెరిగిన టమాటా ధరలే. ఈ పంట వల్ల రైతులు చేతినిండా ఆదాయం పొందుతున్నారు. ధార్వాడలో కూడా ఒక ఎకరా పొలంలో టమాటా సాగు చేసి లక్షల రూపాయల ఆదాయం గడించారు. రాష్ట్రంలో ఖరీఫ్‌ వానలు నిరాశ పరచినా కొన్ని ప్రాంతాల్లోని రైతులు వివిధ పంటలను పండిస్తున్నారు. ఈ క్రమంలో ధార్వాడ తాలూకా గోవనకొప్ప గ్రామ రైతు ఈరప్ప సిద్దప్ప చిక్కన్నవర్‌ తనకున్న ఒక ఎకరా పొలంలో టమాటా పండించాడు. తమ పొలంలో బోరుబావి లేకపోయినా వాగులో ఉన్న నీటితోనే మొక్కలను రక్షించి మంచి దిగుబడిని సాధించారు. ఇప్పటి వరకు ఈ సీజన్‌లో ఆయన సుమారు రూ.3 లక్షలకు పైగా ఆదాయం గడించారు. జిల్లాలో కేవలం కొందరు రైతులు మాత్రమే టమాటా సాగు చేశారు. టమాటాకు విపరీతంగా ధర రావడంతో మార్కెట్‌లో ఒక్క ట్రే టమాటా రూ.1800 నుంచి రూ.2000 వరకు ధర పలుకుతోంది. ఈ రైతు ఇప్పటి వరకు 15 సార్లు టమాటా కోత వేసి మార్కెట్‌కు పంపారు. రెండు, మూడు కోతలకు సుమారు 20 నుంచి 25 ట్రేల టమాటా లభిస్తోంది. వీటిని హుబ్లీ, ధార్వాడ మార్కెట్లలో విక్రయించారు. రైతు ఈరప్ప మాట్లాడుతూ ఎకరంలో టమాటాను పండించాను. ఈ సారి వానలు లేకపోవడంతో వాగు నీరు పెట్టాను. మంచి దిగుబడి వచ్చింది. ఇప్పటి వరకు సుమారు 30 ట్రేలు టమాటాలను మార్కెట్‌కు పంపించి రూ.3 లక్షలకు పైగా లాభం గడించానన్నారు. మరో రైతు కరియప్ప మాట్లాడుతూ తాను కూడా ఒక ఎకరంలో టమాటా పండించి మంచి దిగుబడి సాధించానన్నారు. రాత్రింబగళ్లు నీరు పెట్టాం. వాగు నీటితోనే సాగు చేశాం. తనకు కూడా రూ.3 లక్షలకు పైగా ఆదాయం లభించిందన్నారు. అలా మూడు రోజులకు ఒక్కసారి మార్కెట్‌లో విక్రయిస్తున్నామన్నారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది మంచి లాభాలు వచ్చాయన్నారు. గత ఏడాది కేవలం 1 ఎకరాకు రూ.50 వేల లాభం వచ్చిందన్నారు. ఈ సారి రూ.3 లక్షలకు పైగా ఆదాయం దక్కిందన్నారు. కాగా వర్షాభావ పరిస్థితులతోనే ఈసారి టమాటా రైతన్న పంట పండటం విధివైచిత్రి అని చెప్పవచ్చు.

తల్లి చేతిలో కొడుకు సజీవ దహనం



చాంద్‌బాషా (ఫైల్‌)

దొడ్డబళ్లాపురం: నవమాసాలు మోసి కనిపెంచిన కొడుకు వేధిస్తుంటే కన్నతల్లి సహించలేకపోయింది. నిప్పంటించి హత్య చేసిన సంఘటన బెంగళూరు ఉత్తర తాలూకా సోలదేనహళ్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. సోలదేనహళ్లి నివాసి చాంద్‌ బాషా (40)ను తల్లి సోఫియా (60) పెట్రోల్‌పోసి నిప్పంటించింది. చిన్న వయసుకే మద్యానికి బానిసైన చాంద్‌బాషా నిత్యం తాగివచ్చి భార్య, తల్లిని వేధించేవాడు. ఇటీవల భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మరింత దిగజారిన చాంద్‌ బాష తల్లిని పీడించేవాడు. సోమవారం సాయంత్రం కూడా తాగివచ్చి గొడవపడ్డాడు. దీంతో సోఫియా ఆక్రోశం పట్టలేక ఇంట్లో ఉన్న పెట్రోల్‌ను అతనిపై పోసి అగ్గిపుల్ల గీసి అంటించింది. మంటల్లో అతడు సజీవ దహనమయ్యాడు. సోలదేనహళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని సోఫియాను అరెస్టు చేశారు.

కోతుల బెడదతో గ్రామస్తులు హడల్‌



చేతి వేళ్లను కోతి కరిచి గాయపరిచిన దృశ్యం

కంప్లి: సోమలాపురంలో పాఠశాల విద్యార్థులతో పాటు ఐదుగురిపై కోతి దాడి చేసి గాయపరిచిన ఘటన సోమవారం జరిగింది. గ్రామంలోని మరియప్పన బావి వీధిలో బడికి వెళ్తున్న ఐదో తరగతి విద్యార్థి ఖాశింసాబ్‌పై కోతి దాడి చేసి ఎడమ చేతి వేళ్లను కరిచి గాయపరిచింది. వెంటనే విద్యార్థి తండ్రి మాబుసాబ్‌ బాలుడిని కంప్లి ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. అదే విధంగా ఇంటి ముందు కూర్చున్న వృద్ధులు లక్ష్మమ్మ, మల్లమ్మ, గృహిణులు గౌరమ్మ, గాదెమ్మలపై కూడా కోతి దాడి చేసి గాయపరిచింది. ఈ గ్రామంలో గత కొన్ని రోజులుగా నిత్యం ఇదే విధంగా మనుషులపై కోతులు దాడి చేసి కరవడం, ఎవరూ లేనప్పుడు ఇళ్లలోకి చొరబడి ఆహార పదార్థాలను ఎత్తుకెళ్లడం, పాత్రలను విసిరేయడం చేస్తున్నాయి. దీంతో ప్రతి ఇంట్లో భయం నెలకొంది. జీపీ సామాన్య సమావేశంలో ఈ విషయంపై చర్చించి తగిన చర్యలు తీసుకోవాలని జీపీ సభ్యులు వేషగార మారేష్‌, ఫక్రుద్దీన్‌ ఒత్తిడి చేయగా, పీడీఓ అటవీ శాఖ ద్వారా కోతులను పట్టిస్తామని తెలిపారు.

జీపీ అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక ఏకగ్రీవం



ఏకగ్రీవంగా ఎన్నికైన కార్యవర్గాన్ని అభినందిస్తున్న గ్రామ పంచాయతీ సభ్యులు

గంగావతి: తాలూకాలోని రెండు గ్రామ పంచాయతీలకు మంగళవారం రెండో దశ అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కేఆర్‌పీపీ మద్దతుదారులైన వరదమ్మను ఇందరిగి జీపీ అధ్యక్షురాలుగా, అమరేష్‌ను ఉపాధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కేఆర్‌పీపీ గ్రామీణ ఉపాధ్యక్షులు దేవప్ప తదితర ప్రముఖులు హాజరయ్యారు. అలాగే చిక్కబెణకల్‌ జీపీ అధ్యక్షులుగా శివమూర్తి గొల్లర్‌, ఉపాధ్యక్షురాలుగా గురమ్మలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. టీపీ ఈఓ మహంతగౌడ పాటిల్‌ పంచాయతీ ఎన్నికలను ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించారు. అధ్యక్షులుగా శివమూర్తి గొల్లర్‌, ఉపాధ్యక్షులుగా గురమ్మ మాత్రమే నామినేషన్లు వేయడంతో పోలింగ్‌ గడువు ముగియగానే వీరిని ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ పంచాయతీలో 24 మంది సభ్యులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌ కాలి.. బట్టల షాపు దగ్ధం



కాలిబూడిదైన వస్త్ర దుకాణం

క్రిష్ణరాజపురం: హొసకోటె బెస్కాం అధికారుల నిర్లక్ష్యం వల్ల బట్టల దుకాణం ఆహుతై ఒక వ్యాపారి రోడ్డున పడ్డాడు. షాపు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ మంటలు చెలరేగి కాలిపోయింది. ఆ మంటలు బట్టల షాపులోకి వ్యాపించి మొత్తం బూడిదైంది. బెంగళూరు రూరల్‌ హొసకోటెలోని గంగమ్మ గుడి రోడ్డులో ఈ ఘటన జరిగింది. షాపును ఆనుకునే ట్రాన్స్‌ఫార్మర్‌ ఉంది. అది ప్రమాదకరంగా ఉందని, దూరంగా ఏర్పాటు చేయాలని షాపు యజమానితో పాటు స్థానిక వ్యాపారులు అనేకసార్లు బెస్కాం అధికారులకు మొరపెట్టుకున్నారు. అయితే ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు ఆరోపించారు. ఇంతలో మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌ కాలిపోయి ఆ మంటలు వ్యాపించి బట్టల షాపు దగ్ధం కావడంతో సుమారు రూ.25 లక్షల విలువైన వస్త్రాలు, యంత్ర పరికరాలు నష్టం జరిగినట్లు వ్యాపారి వాపోయారు. ఫైర్‌ సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

వ్యవసాయ గుంతలో పడి బాలుడి దుర్మరణం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

శ్రీనివాసపురం: వ్యవసాయ గుంతలో పడి బాలుడు దుర్మరణం పాలైన ఘటన తాలూకాలోని చల్దిగానహళ్లిలో మంగళవారం మధ్యాహ్నం జరిగింది. గ్రామానికి చెందిన రాకేష్‌(17) అనే బాలుడు చింతామణిలోని డిప్లొమా కళాశాలలో చదువుతున్నాడు. బాలుడి మృతిపై తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. బాలుడు ఇదే గ్రామానికి చెందిన ఓ యువతిని ప్రేమించిన విషయం యువతి ఇంట్లో తెలిసి దాడి చేసి మొబైల్‌ ఫోన్‌ లాక్కోవడంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని వారు ఆరోపిస్తున్నారు. యువకుడి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం శ్రీనివాసపురం ప్రభుత్వాస్పత్రికి పోలీసులు తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. యువకుడిపై దాడి చేసిన యువతి కుటుంబ సభ్యులను విచారిస్తున్నారు.

భారీ వర్షం..రోడ్లు జలమయం



వర్షపు నీటితో జలమయమైన రోడ్డు

రాయచూరు రూరల్‌: నగరంలో మంగళవారం భారీ వర్షం కురిసింది. దీంతో ఎక్కడ చూసినా రోడ్లు జలమయం అయ్యాయి. మున్నూరు వాడి, గాంధీ చౌక్‌, బసవన బావి చౌక్‌ల్లోకి వర్షపు నీరు చొరబడ్డాయి. అంద్రూన్‌ కిల్లాలో వర్షపు నీరు ముందుకు ప్రవహించక నిలిచిపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నగరంలోని టిప్పుసుల్తాన్‌ రహదారిలోని దుకాణాల్లోకి నీరు చేరాయి. ఏ వీధిలో చూసినా మురుగు కాలువల నుంచి వస్తున్న నీరు దుర్వాసన వెదజల్లింది. మోకాలు లోతు నీరు ప్రవహించాయి. మురుగు కాలువల్లో చెత్తా చెదారాలు పేరుకుని వర్షపు నీరు ముందుకెళ్లక ప్రజలను పలు ఇబ్బందులకు గురి చేశాయి.

ముగ్ధుల్ని చేసిన కెమెరా జాదూ



చిత్రాలను తిలకిస్తున్న సందర్శకులు



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

- అలరిస్తున్న ఛాయాచిత్ర ప్రదర్శన
- ప్రశంసలను అందుకుంటున్న ఫొటోలు

బనశంకరి: చిత్రకళా పరిషత్‌లో యూత్‌ ఫొటోగ్రఫిక్‌ సొసైటీ నిర్వహించిన 41వ వైపీఎస్‌ అఖిల భారత సలాన్‌-2023 ఛాయాచిత్ర ప్రదర్శన నగరవాసులను మంత్రముగ్ధులను చేసింది. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు వివిధ ప్రాంతాల్లో యువ ఛాయాగ్రాహకులు కెమెరాల్లో బంధించిన నవ్యమైన చిత్రాలు సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రధానంగా వన్యజీవులు, చిరుతపులులు, పెద్దపులుల చిత్రాలు, అలాగే వేకువజామున గ్రామీణ మహిళ నీటిబిందెతో వెళ్లే ఫొటో ప్రశంసలు అందుకున్నాయి. జల్లి కట్టు విన్యాసాలు, ఉత్తర కర్ణాటకలో హోలీ రంగుల సంబరాలు, గొర్రెల కాపరి సాయంత్రం ఇంటికి గొర్రెలను తోలుకెళ్లే ఫొటో, కొంగలు, పక్షుల చిత్రాలను నగరవాసులు వీక్షించారు. ఎంతోమంది ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు హాజరై మెళకువలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైపీఎస్‌ అధ్యక్షుడు మంజువికాస్‌శాస్త్రి, ఉపాధ్యక్షుడు గిరీశ్‌అనంతమూర్తి, కార్యదర్శి ప్రేమ కాకడే పాల్గొన్నారు.

రోటరీ క్లబ్‌ కార్యవర్గం ఎంపిక

రాయచూరు రూరల్‌: సమాజానికి రోటరీ క్లబ్‌ సేవలను విస్తరించాలని రోటరీ క్లబ్‌ రేంజర్‌ గోపాలకృష్ణ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని ఐఎంఏ కార్యాలయంలో రోటరీ క్లబ్‌ కృష్ణ, తుంగ నూతన కార్యవర్గం బాధ్యతలు చేపట్టారు. పేరుకు మాత్రమే రోటరీ సేవలు చేయడం కాదు వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని పేదలను గుర్తించి వారికి సహాయం చేయాలని సూచించారు. సమావేశంలో రోటరీ క్లబ్‌ అధ్యక్షుడిగా శరణ బసవ పాటిల్‌, ప్రధాన కార్యదర్శిగా విరుపనగౌడ, కృష్ణ తుంగ అధ్యక్షుడిగా తిరుమల రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంపత్‌ కుమార్‌, సభ్యులుగా ప్రభు, అనిల్‌ రాజ్‌, శివశంకర్‌ పాల్గొన్నారు.

స్వామీజీలేమైనా గోవులను సాకుతున్నారా?

సాక్షి,బళ్లారి: రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే ఐదు గ్యారంటీలతో పాటు గోవధ నిషేధ చట్ట ఉపసంహరణ తదితరాలను మేనిఫెస్టోలో పొందుపరిచిందని కేపీసీసీ ప్రతినిధి పాటిల్‌ గాణిగేర్‌ పేర్కొన్నారు. ఆయన ఆదివారం విజయపురలో విలేకరులతో మాట్లాడారు. స్వామీజీలు ఏనాడైనా గోవులను సాకారా? లేదా వాటి పేడను తాకి తొలగించారా? అని మండిపడ్డారు. ఆర్‌ఎస్‌ఎస్‌, బీజేపీల మెప్పు కోసం పలువురు స్వామీజీలు తాపత్రయ పడుతూ గోవుల బాగోగులు అసలు చూడని వారు కూడా వాటి గురించి మాట్లాడుతున్నారన్నారు.

21న మద్యం విక్రయాలు నిషేధం

హుబ్లీ: రైతుల బలిదాన దినోత్సవం నేపథ్యంలో ఈ నెల 21న జిల్లాలోని నవలగుంద తాలూకా హలగవాడి గ్రామంలో మద్యం విక్రయాలను నిషేధించారు. ఆ రోజున శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా ఈ నెల 20న అర్ధరాత్రి 12 గంటల నుంచి 22న ఉదయం 6 గంటల వరకు మద్యం విక్రయాలతో పాటు మద్యం రవాణాను నిషేధిస్తూ జిల్లాధికారి గురుదత్త హెగ్డే ఆదేశాలను వెల్లడించారు. ఆ ఆదేశాల ప్రకారం మద్యం తయారీ యూనిట్లు, బార్‌లు, క్లబ్‌లు, మద్యం డిపోలను మూసి వేయాలని సూచించారు.

ఘనంగా శ్రావణమాస పూజలు



పూజల్లో పాల్గొన్న ఆర్యవైశ్య మహిళలు

గంగావతి: నగరేశ్వర కళ్యాణ మంటపంలో మంగళవారం అధిక శ్రావణమాస విశేష పూజలను ఆర్యవైశ్య సమాజం, వాసవీ మహిళా మండలి నేతృత్వంలో ఘనంగా జరిపారు. అధిక శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని బెంగళూరుకు చెందిన గురురాజాచార్‌ గోవు, కామధేను పూజలను నెరవేర్చారు. అనంతరం మహిళా మండలి అధ్యక్షురాలు లక్ష్మీజనార్ధన్‌ మాట్లాడుతూ మనిషి శాంతి, నెమ్మది, ధార్మిక భావనల కోసం కొంత సమయాన్ని వెచ్చించాలన్నారు. సుఖ జీవితానికి దేవుడు ఆశీర్వాదం అత్యవసరమన్నారు. ఈ ఏడాది వచ్చిన అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని ఈ విశేష పూజలను తమ మహిళా మండలి తరఫున చేపట్టామన్నారు. కార్యక్రమంలో మహిళా మండలి కార్యదర్శి రమా దరోజీ, పదాధికారులు, ఆర్యవైశ్య సమాజ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రోడ్ల పనుల్లో నిధుల స్వాహా



మాట్లాడుతున్న వినోద్‌రెడ్డి

రాయచూరు రూరల్‌: జిల్లాలో చేపట్టిన రోడ్ల పనుల్లో కోట్లాది రూపాయల నిధులు స్వాహా అయ్యాయని కరవే జిల్లాధ్యక్షుడు వినోద్‌ రెడ్డి ఆరోపించారు. మంగళవారం నగరంలోని పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవదుర్గ తాలూకాలో రంజిత్‌ సంస్థకు అప్పగించిన పనుల్లో ఆ సంస్థతో పలువురు ప్రజా ప్రతినిధులు కుమ్మక్కై భారీగా అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారన్నారు. రోడ్ల పనుల్లో 2019-20లో కృష్ణా భాగ్య జల నిగమలో రూ.32 కోట్లు, కర్ణాటక గ్రామీణ రహదారి అభివృద్ధి మండలిలో రూ.8 కోట్ల నిధులను పనులు చేయకుండానే బోగస్‌ బిల్లులు తయారు చేసి నిధులు కాజేసిన సంస్థపై, అందుకు సహకరించిన వారిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

వైభవంగా భద్రకాళికాంబ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

మాలూరు: తాలూకాలోని లక్కూరు ఫిర్కా హెచ్‌ హొసకోటె గ్రామ పంచాయతీ సీతానాయకనహళ్లిలోని భద్రకాళికాంబ ఆలయ 6వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈశ్వర ఆలయంలో స్వామి వారికి దీపోత్సవం, పల్లకీ ఉత్సవాలను జరిపారు. ఆలయంలో ప్రధాన అర్చకుల నేతృత్వంలో ప్రత్యేక పూలతో అలంకరించి మూల విగ్రహానికి విశేష పూజలు చేశారు. సాయంత్రం భద్రకాళికాంబ కరగ ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

విద్యతోనే సధృడ సమాజం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కేజీఎఫ్‌: సధృడ సమాజ నిర్మాణానికి విద్య ముఖ్యం అని కవి లక్ష్మయ్య అన్నారు. మంగళవారం బంగారుపేటలోని కేసీ రెడ్డి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన భావగీత పోటీల్లో విజేతలకు బహుమతులను అందించి ఆయన మాట్లాడారు. తన వేతనంలోని 20 శాతం సంపాదనను పేదలకు, విద్యా వంచితుల కోసం ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వాలు ఎవరికీ ఉచితాలు ఇవ్వరాదని అభిప్రాయపడ్డారు. ప్రజలను తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడమే ప్రభుత్వ కర్తవ్యమన్నారు. కర్ణాటక కవి కావ్య వేదిక అధ్యక్షుడు జీటీ రామచంద్ర, జానపద గాయకుడు వి.రాజు, ప్రిన్సిపాల్‌ మునిశామప్ప తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మికత నిర్మూలనపై జాగృతి జాతా



ఆటో ప్రచార జాతాను ప్రారంభించిన కలెక్టర్‌ అక్రంపాషా తదితర అధికారులు

కోలారు: బాల కార్మిక పద్ధతి నిర్మూలన కోసం జిల్లాలోని అన్ని తాలూకాల్లో జన జాగృతి జాతాను మంగళవారం జిల్లా కలెక్టర్‌ అక్రంపాషా నగరంలోని తన కార్యాలయ భవనం ముందు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో బాల కార్మికతను పూర్తిగా నిర్మూలించాలన్నారు. పిల్లలను పనిలో పెట్టుకోవడం శిక్షార్హ నేరమనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలన్నారు. బాల కార్మికులను గుర్తిస్తే వెంటనే చైల్డ్‌ హెల్ప్‌ లైన్‌ సెంటర్‌కు సమాచారం అందించాలన్నారు. జెడ్పీ సీఈఓ పద్మ బసవంతప్ప, కార్మిక అధికారిణి శబానా అజ్మి, వలయ కార్మిక సూపరింటెండెంట్‌ రాజేశ్వరి పాల్గొన్నారు.

పిల్లలు భగవంతుని స్వరూపులు



విద్యార్థులకు కుట్టించిన యూనిఫాంతో దాత, ఇతర ఉపాధ్యాయులు

శ్రీనివాసపురం: చిన్న పిల్లల్లో ప్రతి ఒక్కరూ భగవంతుడిని చూడాలని దాత, ఉపాధ్యాయుడు ఎస్‌ఆర్‌ ధర్మేష్‌ తెలిపారు. మంగళవారం తాలూకాలోని హొగరి గొల్లహళ్లి గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు యూనిఫాం అందించి ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు ప్రభుత్వమే కాకుండా దాతలు కూడా ముందుకు వచ్చి తమ వంతు సహకారం అందించాలన్నారు. నివృత్త ప్రధానోపాధ్యాయుడు వెంకటేశప్ప మాట్లాడుతూ ఉపాధ్యాయుడు ధర్మేష్‌ తన సంపాదనలో ప్రతి నెలా విద్యార్థుల కోసం రూ.10 వేలను అందిస్తుండడం ఆయన దాతృత్వానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌, ఉపాధ్యాయులు ఆర్‌.నారాయణప్ప, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నాటకాలతో పిల్లల్లో దేశభక్తి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న రామాంజనప్ప

కోలారు: చారిత్రక నాటకాలతో పిల్లల్లో దేశభక్తి పెంపొందుతుందని జీపీ అధ్యక్షుడు రామాంజనప్ప తెలిపారు. మంగళవారం తాలూకాలోని రాజకల్లహళ్లిలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నిర్వహించిన కన్నడ సాంస్కృతిక ఉత్సవాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. అనంతరం అల్లూరి సీతారామరాజు అనే చారిత్రక నాటకం, శకుని ఆవేదన ఏకపాత్రాభినయం, శాస్త్రీయ నృత్యం, జానపద, భావగీత, రంగగీతాలాపన చేపట్టారు. ప్రధానోపాధ్యాయుడు బివి దేవరాజ, ఎస్డీఎంసీ అధ్యక్షురాలు సుమా పాల్గొన్నారు.

స్నూకర్‌ పోటీల్లో కీర్తనకు స్వర్ణం



ఛాంపియన్స్‌ ట్రోఫీని అందుకున్న కీర్తన

కేజీఎఫ్‌: సౌదీ అరేబియాలోని రియాద్‌లో జరిగిన అంతర్జాతీయ స్నూకర్‌ చాంపియన్‌షిప్‌ పోటీలో మహావీర్‌ జైన్‌ కళాశాల ఫైనలియర్‌ బీకాం విద్యార్థి కీర్తన పాండియన్‌ ట్రోఫీని కైవసం చేసుకుంది. సబాషా అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించిన చాంపియన్స్‌ టోర్నీలో భారత్‌ నుంచి 10 మంది విద్యార్థులు పాల్గొనగా, టోర్నీలో అంతిమంగా ఉత్తమ ప్రదర్శన కనబర్చిన కీర్తన పాండియన్‌ ట్రోఫీని దక్కించుకుంది. ట్రోఫీని సాధించినందుకు ప్రిన్సిపాల్‌ రేఖా సేఠి కళాశాల విద్యార్థిని కీర్తన పాండియన్‌ను అభినందించారు.

సదాశివ నివేదికపై సిఫార్సుకు వినతి



మాట్లాడుతున్న బసవరాజ్‌ కౌతాళ్‌

కోలారు: రాష్ట్రంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం సదాశివ కమిషన్‌ నివేదికను ఆమోదించి కేంద్రానికి సిఫార్సు చేయాలని ఎస్సీ కులాల సమాఖ్య రాష్ట్ర ప్రధాన సంచాలకుడు బసవరాజ్‌ కౌతాళ్‌ డిమాండ్‌ చేశారు. మంగళవారం పాత్రికేయుల భవనంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంపై కేంద్రానికి సిఫార్సు చేసిన అనంతరం షెడ్యూల్‌- 9లో మార్పులు తెచ్చి అమలు చేయకుంటే రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధమవుతామన్నారు. వచ్చే ఎన్నికల్లో అన్ని పార్టీలకు తగిన గుణపాఠం చెబుతామన్నారు. దళిత నాయకులు హారోహళ్లి రవి, హూవరసనహళ్లి రాజప్ప, నారాయణ్‌ పాల్గొన్నారు.

హుక్కా మత్తులో యువత

- ఒక్కో రుచికి ఒక్కోరేటు
- బెంగళూరు నగరంలో విచ్చలవిడిగా హుక్కా కేంద్రాలు



డ్రగ్స్ మత్తులో జీవితాలను నాశనం చేసుకుంటున్న యువత (ఫైల్)

బనశంకరి: బెంగళూరు నగరంలో హుక్కాబార్లు హెచ్చుమీరడంతో పాఠశాల, కాలేజీ విద్యార్థులు ఈ బార్లకు వెళ్లి గంటల కొద్దిమత్తులో మత్తులో తూలుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. స్నేహితులు, యువతులతో కలిసి హుక్కాబార్లకు(స్మోకింగ్ జోన్లు) వెళ్లడానికి అలవాటుపడిన మైనర్లు, యువకులు వివిధ ప్లేవర్లలో దూరంగా ఉన్న హుక్కాబార్లకు వెళ్లి అక్కడ హుక్కా సేవించి మత్తులో మునిగి తేలుతున్నారు. హుక్కాబార్లు రెండు గంటలకు రూ.400 నుంచి 500 వరకు ధర నిర్ణయించారు. ఒక్కొక్క ఫ్లేవర్‌కు ఒక్కో ధర ఉంటుంది. నగరంలో సుమారు 68 ట్రేడ్ లైసెన్సు కలిగిన హుక్కాపార్లర్‌లు ఉన్నాయి. 49 రిక్రియేషనల్ క్లబ్‌లు, బెట్టింగ్ కేంద్రాలు ఉన్నాయి. లైసెన్సు పొందని అనధికారికంగా అనేక హుక్కా పార్లర్లు కూడా పనిచేస్తున్నాయి. వీకెండ్ విలాసాల కోసం ఐటీబీటీ ఉద్యోగులు ఈ హుక్కాబార్లకు వెళ్లి ఎంజాయ్ చేస్తున్నారు. కొందరు డ్రగ్స్ సేవిస్తారు. ఇక్కడికి వచ్చే కస్టమర్లను టార్గెట్‌గా పెట్టుకుని డ్రగ్స్ పెడ్లర్లు గంజా, చరస్, ఎండీఎంఏ ఇతర మాదక ద్రవ్యాలను విక్రయిస్తున్నారు. హుక్కా, మాదకద్రవ్యాలు సేవనానికి అలవాటుపడిన కొందరు యువతీ యువకులు వీటికి డబ్బుకోసం అడ్డదారులు తొక్కుతున్నట్లు కనబడుతుంది. హుక్కాబార్లతో యువతకు తలెత్తే దుష్పరిణామాలను ప్రభుత్వం తీవ్రంగా పరిగణించి తక్షణం చర్యలు తీసుకోవాలి. లేని పక్షంలో యువసమాజం అడ్డదార్లలో పడి జీవితాలు నాశనం చేసుకుంటారు.

హుక్కాబార్లు నిర్వహించడానికి పోలీస్‌శాఖ ఎలాంటి అనుమతి ఇవ్వదు. బీబీఎంపీ నుంచి ట్రేడ్ లైసెన్సు పొందుతున్నాయి. హుక్కాబార్లు నిర్వహించేవారు కోర్టు నుంచి కొన్ని ఆదేశాలు తీసుకుంటారు. హుక్కాబార్లకు పదేపదే పోలీసులు తనిఖీలు నెపంతో ఇబ్బందులు పెట్టరాదని కోర్టు సూచించింది. దీంతో హుక్కాబార్లు చర్యలు తీసుకోవడంలేదు. ఈ నేపథ్యంలో అప్పుడప్పుడూ హుక్కాబార్లపై సీసీబీ పోలీసులు దాడి చేసి అక్కడ వినియోగించే కొన్ని వస్తువులను స్వాధీనం చేసుకుని అందులో ఉన్న కంటెంట్లు పరిశీలనకు ఎఫ్ఎస్ఎల్‌కు పంపిస్తారని అధికారులు తెలిపారు.

దమ్ మారో దమ్


యువతను ఆకట్టుకునే విధంగా హుక్కా కేంద్రం

హొసకెరెహళ్లి మెయిన్‌రోడ్డులో గల హుక్కాబార్‌లో పేరుపొందిన కొందరు కాలేజీ విద్యార్థులు హుక్కాబార్‌కు వెళ్లి దమ్ మారో దమ్‌లో హుక్కా సేవిస్తున్నట్లు కనబడింది. హుక్కాబార్లకు మైనర్లు, కాలేజీ విద్యార్థులు ఇష్టానుసారంగా వెళ్లి హుక్కా సేవించి దమ్ మారో దమ్ అనే మత్తులో తూలుతున్నారు. కొందరు కాలేజీ యూనిఫారంలోనే హుక్కా కేంద్రంలో కూర్చుని హుక్కా సేవిస్తారు. దీనిపై చర్యలు తీసుకోవల్సిన పోలీసులు హుక్కా బార్ యజమాని నుంచి మామూళ్లు తీసుకుని కనబడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

క్లుప్తంగా

మొక్కలు నాటిన విద్యార్థులు


మొక్కలు నాటే కార్యక్రమంలో విద్యార్థులు

బొమ్మనహళ్లి: ఆజాదీ కా అమృత్ మహోత్సవం పురస్కరించుకుని నగరంలోని బెంగళూరు దక్షిణ నియోజకవర్గం ఎలక్ట్రానిక్ సిటీలోని బీఇటీఎల్ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం చందాపురలోని నజరత్ పాఠశాల విద్యార్థులు ఇక్కడి నారాయణ హృదయాలయ ఆస్పత్రి సమీపంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో సంస్థ ప్రముఖులు శ్రీనివాస్‌గౌడ, పాండియన్, కృష్ణమూర్తితో పాటు విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

టాటా ఏస్ వాహనం బోల్తా, పలువురికి గాయాలు

మైసూరు: టాటా ఏస్ వాహనం బోల్తా పడటంతో పలువురు గాయపడిన ఘటన మైసూరు జిల్లా గుండ్లుపేటె తాలూకా శివపుర సమీపంలో ఉన్న హుండిమనె వద్ద చోటుచేసుకుంది. గుండ్లుపేటె తాలూకా కొడహళ్లి గ్రామంలోని భీముని అమావాస్య పురస్కరించుకుని మహేశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న జాతరలో పాల్గొనడానికి టాటాఏస్ వాహనంలో సుమారు 30 మంది ప్రయాణికులు బయలుదేరారు. డ్రైవర్ అతివేగంగా వాహనాన్ని నడపడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చామరాజనగర జిల్లా ఆస్పత్రికి తరలించారు. గుండ్లుపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

విద్యార్థులకు శిక్షణ తరగతులు



గౌరిబిదనూరు: స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో చేరడం వల్ల విద్యార్థులలో సేవాభావం కలుగుతుందని సంస్థ జిల్లా కమిషనర్ హనుమంతరెడ్డి తెలిపారు. నగరంలోని ప్రభుత్వ ఫస్ట్‌గ్రేడ్ కళాశాలలో సోమవారం సాయంత్రం స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులకు శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. ఎక్కువ సంఖ్యలో విద్యార్థి దళాలను ఏర్పాటు చేసి అవగాహన కల్పించాలన్నారు. ఈ సంస్థ ద్వారా విద్యార్థి దశ నుంచే ప్రజాసేవను అలవరచుకోవడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో ఈఓ హరీశ్, విద్యాశాఖ అధికారి శ్రీనివాసమూర్తి, ప్రిన్సిపాల్ శివణ్ణ, ఉపాధ్యాయుడు బాలప్ప, గిరిధర్, సిద్దేశ్, నేత్ర, లక్ష్మీనరసమ్మ, లత, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో 19 గొర్రెలు మృతి



తుమకూరు: కరెంటు షాక్‌తో 19 గొర్రెలు మృతి చెందిన సంఘటన తుమకూరు జిల్లా పావగడ తాలూకా శ్రీరంగాపుర గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రైతు మంజునాథ్ తన గొర్రెలను షెడ్‌లో పెట్టారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి గొర్రెల షెడ్ సమీపంలో ఉన్న కరెంట్ స్తంభానికి విద్యుత్ ప్రసరించడంతో సమీపంలో ఉన్న గొర్రెలు ఉంచిన మెష్‌కు వ్యాపించి 19 గొర్రెలు మృతి చెందాయి. లక్షల్లో నష్టం జరిగిందని, ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు. తిరుమణి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

అనుమతులు లేని నివాసాలు తొలగించాలి

మైసూరు: మైసూరు నగరంలో ప్రసిద్ధి చెందిన చాముండి కొండపై ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మించిన నివాసాలను వెంటనే తొలగించాలని ఎంపీ ప్రతాప్ సింహా అన్నారు. మంగళవారం ఆయన మైసూరులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మొదటి నుంచి కొండపై ఉన్న వారికి మాత్రమే అవకాశం ఉందని, ఇటీవల నివాసాలు ఏర్పాటు చేసుకున్న వారిని ఖాళీ చేయించాలన్నారు.

స్కూల్ బ్యాగుల పంపిణీ



బొమ్మనహళ్లి: నగరంలోని మడివాళ వార్డు తావరెకెరె ప్రభుత్వ పాఠశాల, మడివాళ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంగళవారం మాజీ మేయర్ మంజునాథ రెడ్డి నోటు పుస్తకాలు, స్కూల్ బ్యాగులు, స్వెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడతూ...ఇప్పటికే నియోజకవర్గంలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలను అత్యాధునికంగా అభివృద్ధి చేసిన మంత్రి రామలింగారెడ్డి పేద విద్యార్థులు చదువుకు దూరం కాకూడదని, దాతల సహకారం, ఆర్ఎల్ఆర్ టీం ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు.

సౌజన్య హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయాలి


ఆందోళన చేస్తున్న వివిధ సంఘాల సభ్యులు

మండ్య: ధర్మస్థలలో 11 ఏళ్ల క్రితం ఓ విద్యార్థినిపై అత్యాచారం చేసి హత్య చేసిన కేసులో పోలీసులు అసలు నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని వివిధ సంఘాలు మంగళవారం మండ్య నగరంలోని సర్ ఎంవీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. 2012 ఆగస్టు 9న కళాశాల విద్యార్థి సౌజన్య ఇంటికి వెళ్తున్న సమయంలో కొందరు కిడ్నాప్ చేసి ఆమెపై అత్యాచారం చేసి హత్య చేశారు. ఈ కేసులో అసలు దోషులను వదిలి అమాయకుడైన సంతోష్ రావ్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారని, కోర్టులో అతన్ని నిర్దోషిగా తేల్చారని, అసలు దోషులను నేటికి పోలీసులు పట్టుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సౌజన్య హత్య కేసులో ధర్మస్థల ధర్మాధికారి వీరేంద్ర హెగ్డె సోదరుడి కుమారుడు నిశ్చల్ జైన్ అతని స్నేహితులు ఉన్నారని, వారిపై నేటికి కూడా కేసు పెట్టలేదని ఆరోపించారు. అనంతరం జిల్లా అధికారి కార్యాలయం చేరుకుని కలెక్టర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

శాసనసభ సమావేశాలు వీక్షించిన విద్యార్థులు


మహాత్ముడి విగ్రహం వద్ద విద్యార్థులతో ఎమ్మెల్యే

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటెలోని సోలిబెలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం శాసనసభ సమావేశాలను వీక్షించారు. విద్యార్థుల కోరిక మేరకు స్థానిక ఎమ్మెల్యే శరత్ బచ్చేగౌడ వారికి సమావేశాల వీక్షణకు అవకాశం కల్పించారు. అనంతరం విద్యార్థులు అసెంబ్లీ ప్రాంగణంలో మహాత్మా గాంధీ విగ్రహం వద్ద ఫొటోలు దిగారు.

పోక్సో కేసులో అరెస్ట్‌లు

తుమకూరు: తుమకూరు జిల్లా కుణిగల్ తాలూకా హులియూరు దుర్గ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన పోక్సో కేసుల్లో పోలీసులు నిందితులను అరెస్ట్ చేశారు.

మైనర్ బాలికపై అత్యాచారం : తుమకూరు జిల్లా హులియూరు దుర్గ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలిక (15)ను ప్రేమించాడని ఆమెతో వివాహం జరిపించారు. బాలిక గర్భిణి కావడంతో ఆస్పత్రికి వచ్చిన సమయంలో మైనర్‌గా గుర్తించిన వైద్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు.

కూలి పనికి తీసుకువచ్చి:

13 ఏళ్ల బాలికను ఓ కాంట్రాక్టర్ వద్ద పనిచేసే యువకుడు చెట్లను నరకడానికి అడవికి తీసుకువచ్చాడు. అక్కడ బాలికపై అత్యాచారం చేశాడు. బాధితురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేశారు. మరో కేసులో ఓ గ్రామంలో పశువుల కొట్టంలో పనిచేస్తున్న బాలికపై ఓ యువకుడు అత్యాచారయత్నం చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిని అరెస్ట్ చేశారు.

మహామైత్రి నాయకులకు ఐఏఎస్‌ల స్వాగతమా ?

- ట్విటర్‌లో హెచ్‌డీకే ఆగ్రహం

శివాజీనగర: బెంగళూరులో జరుగుతున్న మహామైత్రి కూట సభకు విచ్చేసిన నాయకులను స్వాగతించేందుకు ఐఏఎస్ అధికారులను నియమించటం సరికాదని మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డీ కుమారస్వామి ట్విటర్‌లో ధ్వజమెత్తారు. ఈ మేరకు ట్వీట్ చేసిన ఆయన ఐఏఎస్ సేవలను ఘటబంధన్‌కు వచ్చిన బయటి రాష్ట్ర రాజకీయ నాయకులకు అందించేందుకు పంపించడం మంచిది కాదన్నారు. మహాఘట బంధన్ ప్రభుత్వ కార్యక్రమం కాదని, ప్రభుత్వ స్వీకారం కూడా కాదని, కేవలం నాయకులకు ఆతిథ్య కల్పించేందుకు ఐఏఎస్‌లను పంపించడం ఆరుకోట్ల కన్నడిగులను అవమానించినట్లేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రొటోకాల్ ప్రకారమే..

ఇతర రాష్ట్ర నాయకులు రాష్ట్రానికి వచ్చినపుడు వారి అతిథ్యానికి ఐఏఎస్ అధికారులను పంపించడం ఎప్పటి నుంచో ఉందని, ప్రోటోకాల్ ప్రకారమే ఐఏఎస్ అధికారులను నియమించామని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. బెంగళూరులో మహామైత్రి సభ జరిగిన పంచతార హోటల్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... మాజీ సీఎం కుమారస్వామి ఆరోపణలకు తాను సమాధానం చెప్పేందుకు సిద్ధంగా లేనని, నియమానుసారంగానే ఏఐఏఎస్‌లను నియమించామన్నారు. ఆయన ఎన్‌డీఏ ఆహ్వానం కోసం నిరీక్షణలో ఉన్నారని కుమారస్వామిపై ధ్వజమెత్తారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వముంది. అందుచేత కుమారస్వామి మాట్లాడుతున్నారు. ఆయనకు ఏదో ఒక వార్త కావాలని ఎద్దేవా చేశారు. బెంగళూరులోని కొన్నిచోట్ల ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ ఫొటో ఉన్న కరపత్రాలను అతికించటంపై స్పందించిన ఆయన, బీజేపీ మిత్రులు నితీశ్‌కుమార్ పోస్టర్లను అతికించి రాజకీయం చేస్తున్నారని ధ్వజమెత్తారు.

బనశంకరీదేవికి చందనం అలంకరణ



బనశంకరి: భక్తుల మొక్కులు తీర్చే కల్పవల్లి బనశంకరీదేవి చందన అలంకరణలో దర్శనమిచ్చారు. మంగళవారం వేకువజామున సుప్రభాతసేవ అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు సత్యనారాయణశాస్త్రి, చంద్రమోహన్ ఆధ్వర్యంలో అమ్మవారి మూలవిరాట్‌కు చందనంతో అలంకరణ చేపట్టి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి విచ్చేసి అమ్మవారికి నిమ్మకాయల ప్రమిదలతో దీపారాధన చేశారు.

చిన్నారి అదృశ్యంపై విచారణ ముమ్మరం

పెనుకొండ: పెనుకొండ పట్టణంలోని దర్గాపేటకు చెందిన చిన్నారి షఫియా అదృశ్యంపై పోలీసులు మంగళవారం పలువురిని విచారణ చేశారు. గతనెల 12న చిన్నారి అదృశ్యం కాగా ఆ రోజు స్థానిక బాబాయ్య దర్గాకు ఎవరెవరు వచ్చారు, ఏ వాహనంలో వచ్చారు. అన్న విషయాలను పోలీసులు సీసీ కెమెరాల్లో పరిశీలించారు. అ నేపథ్యంలో సంబంధిత వాహనాలకు సంబంధించి చిరునామా వున్న వారిని స్టేషన్‌కు పిలిపించి విచారణ చేసారు. అయితే ఎలాంటి క్యూ పోలీసులకు లభించలేదు. ఇదిలా వుండగా ఎస్ఐ రమేష్‌బాబు నేతృత్వంలో ప్రత్యేక పోలీస్ బలగాలు బెంగళూరు, కేరళ, తమిళనాడు తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా గాలించారు. అక్కడి పోలీసులతో కలిసి చిన్నారి అదృశ్యం గురించి ఆరా తీసారు. అయినా ప్రయోజనం లేకపోయింది. ఏది ఏమైనా చిన్నారి అదృశ్యం పోలీసులకు సవాల్‌గా మారింది.

ఆ రెండు చట్టాలకు ఆమోదం

శివాజీనగర: విధానసభలో అంగీకారమైన రెండు ప్రాముఖ్య చట్టాలను విధాన పరిషత్‌లో సుదీర్ఘంగా చర్చించిన తరువాత ఆమోదించారు. కర్ణాటక ప్రజా సేకరణలో పారదర్శక (సవరణ) చట్టం 2023, కర్ణాటక వస్తు, సేవల (సవరణ) చట్టాన్ని సభ అంగీకరించింది. ముఖ్యమంత్రి సిద్దరామయ్య తరపున న్యాయ, పార్లమెంట్ వ్యవహారాల మంత్రి హెచ్.కే.పాటిల్ బిల్లులను ప్రవేశపెట్టి ప్రభుత్వ వైఖరిని బలంగా సమర్థించుకొన్నారు. కర్ణాటక వస్తు, సేవల సవరణ చట్టంపై అనేక మంది సభ్యులు మాట్లాడారు. సభ్యులు డీ.ఎస్.అరుణ్, నవీన్, నారాయణస్వామి, తేజస్విని గౌడ, మునిరాజుగౌడతో పాటు ఇతరులు చర్చల్లో పాల్గొన్నారు. జేడీఎస్ తరపున మరితిబ్బేగౌడ, టీఏ.శరవణ, భోజేగౌడతో పాటుగా పలువురు సభ్యులు మాట్లాడారు. ఈ సందర్భంగా సభ్యులు సవరణ గురించి కొన్ని అభ్యంతరాలను వ్యక్తం చేశారు. అనేకమంది సభ్యులు మధ్యతరహా, చిన్న వ్యాపారులకు ఇబ్బంది కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కాంగ్రెస్ తరపున నాగరాజ్ యాదవ్, మంజునాథ్ భండారి తదితరులు సవరణను బలంగా సమర్థించుకొన్నారు. ఆఖరిలో ప్రభుత్వ తరపున సమాధానమిచ్చిన న్యాయ, పార్లమెంట్ వ్యవహారాల మంత్రి హెచ్.కే. పాటిల్ చట్టం సవరణతో ఎవ్వరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. అందరిని దృష్టిలో పెట్టుకొని సవరించామన్నారు. ఆ తరువాత చట్టాలను సభాపతి ఆమోదించారు.

హోసూరు వార్తలు..

కార్మికుడు ఆత్మహత్య

కెలమంగలం: దంపతుల మధ్య ఏర్పడిన గొడవల్లో జీవితంపై విరక్తి చెందిన భర్త ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన రాయకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకొంది. వివరాలు... రాయకోట సమీపంలోని సూళకుంట గ్రామానికి చెందిన మునియప్ప (38) భవన నిర్మాణ కార్మికుడు. ఇతనికి తాగుడు అలవాటు ఉంది. రోజూ మద్యం తాగి ఇంటి వచ్చి భార్యతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా గొడవపడిన మునియప్ప అదే ప్రాంతంలో ఉన్న చింతచెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొన్నాడు. రాయకోట పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నారు.

మేకెదాటుపై రాష్ట్రం నిర్లక్ష్య ధోరణి

- నల్లదుస్తులతో బీజేపీ నిరసన


మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

హోసూరు: కర్ణాటక రాష్ట్రం కావేరి నదిపై మేకెదాటు ఆనకట్ట నిర్మాణానికి యత్నిస్తున్నా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ పథకం అడ్డుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ మంగళవారం బీజేపీ నాయకులు నల్లదుస్తులు ధరించి అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హోసూరులోని క్రిష్ణగిరి పశ్చిమ జిల్లా బీజేపీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు ఎం.నాగరాజ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మాజీ ఎంపీ నరసింహన్ మాట్లాడుతూ... రెండు రోజుల క్రితం బెంగళూరుకు వెళ్లిన ముఖ్యమంత్రి స్టాలిన్ కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో చర్చలు జరిపారని, కావేరి నదిపై కర్ణాటక ప్రభుత్వం మేకెదాటు ఆనకట్ట నిర్మాణానికి చర్యలు చేపట్టిన విషయం తెలిసినా అడ్డుకట్ట వేయక తమిళనాడులోని కావేరి డెల్టా ప్రాంత రైతులకు ద్రోహం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు, కార్యకర్తలు నల్లదుస్తులు ధరించి ముఖ్యమంత్రి చర్యలను వ్యతిరేకించారు.

సీఎం క్షమాపణ చెప్పాలి

బనశంకరి: నగరంలో నిర్వహిస్తున్న విపక్షాల సభకు విచ్చేసిన దేశంలోని వివిధ రాజకీయ పార్టీల నేతలను స్వాగతించడానికి రాష్ట్రంలోని సీనియర్ ఐఏఎస్‌లను నియమించిన ప్రభుత్వ చర్యను తీవ్రంగా వ్యతిరేకించిన బీజేపీ తక్షణం ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. దీనిపై మంగళవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్యకు బెంగళూరు దక్షిణ జిల్లా బీజేపీ శాఖ అధ్యక్షుడు ఎన్ఆర్. రమేశ్ లేఖ రాశారు. లేఖ సారాంశం.. ఓ రాజకీయ కార్యక్రమానికి బెంగళూరుకు విచ్చేసిన రాజకీయ నేతలను స్వాగతించడానికి సీనియర్ ఐఏఎస్‌లను నియమించడం అధికార దుర్వినియోగం, రాజ్యాంగ వ్యతిరేక చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘనకార్యంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తామని, దీనికి సంబంధించి తక్షణం బహిరంగక్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

సినీ డైరెక్టర్ కిడ్నాప్

- గతంలో సినిమా చాన్సిస్తానని వసూళ్లు



హోసూరు: సినిమాలలో దర్శకుడు ఎన్నో కిడ్నాప్ ఘటనలను చిత్రీకరించి ఉంటాడు. కానీ తనే కిడ్నాప్‌కు గురవుతానని ఊహించి ఉండడు. నిజజీవితంలో అదే జరిగింది. సినిమా చాన్సిస్తానని డబ్బులు వసూలు చేసి ముఖం చాటేసిన సినిమా డైరెక్టర్‌ను కొందరు కిడ్నాప్ చేశారు. ఈ సంఘటన క్రిష్ణగిరి పట్టణంలో చోటుచేసుకొంది. వివరాల మేరకు కేరళ రాష్ట్రం పాలక్కాడుకు చెందిన క్రిష్ణ ప్రకాష్ (36), తమిళం, మలయాళం సినిమా రంగంలో దర్శకునిగా ఉన్నాడు. రెండు రోజుల క్రితం క్రిష్ణగిరి ప్రాంతంలో సినిమాను చిత్రీకరించేందుకు స్థల పరిశీలన కోసం వచ్చాడు. క్రిష్ణగిరి కొత్తబస్టాండులోని ఓ లాడ్జిలో బసచేశాడు. సోమవారం ఉదయం క్రిష్ణగిరి బస్టాండు వద్ద ఉన్న క్రిష్ణప్రకాష్‌తో కారులో వచ్చిన నలురు వ్యక్తులు వాగ్వివాదానికి దిగి అతన్ని కారులో కిడ్నాప్ చేశారు.

ఈరోడ్‌లో పట్టివేత

గమనించిన స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే పోలీసులు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రాష్ట్రంలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లకు సమాచారం అందజేశారు. ఈరోడ్ జిల్లా సత్యమంగలం పోలీసులు కారును అడ్డుకుని అందరినీ క్రిష్ణగిరి పోలీసులకు అప్పగించారు. గత ఏడాది క్రితం సత్యమంగలం ప్రాంతంలో కరికాలన్, కార్తికేయన్, శివశక్తి అనేవారి నుంచి సినిమాలలో అవకాశమిస్తానని రూ. 2.50 లక్షల నగదును తీసుకొన్నాడు. కానీ అవకాశాలు ఇవ్వకపోవడంతో ఏదో ఒకటి తేల్చుకోవాలని కిడ్నాప్ చేశామని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసి తీవ్ర విచారణ జరుపుతున్నారు.

బైక్ ప్రమాదంలో కార్మికుడు మృతి

హోసూరు: ద్విచక్రవాహనాన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో కార్మికుడు మృతి చెందిన ఘటన హడ్కో పరిధిలో జరిగింది. వివరాల మేరకు పట్టణంలోని కాలేకుంట ప్రాంతానికి చెందిన కూలికార్మికుడు నారాయణస్వామి (23) సోమవారం సాయంత్రం బైక్ మీద హోసూరు– క్రిష్ణగిరి జాతీయ రహదారిలో సీతారామ్ దిన్న వద్ద వెళుతుండగా ఆ మార్గంలో వెళ్లిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన నారాయణ స్వామి ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. ఈ ఘటనపై హడ్కో పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలుడే.. మొబైల్ దొంగ

నిలిచి ఉన్న వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దొంగను పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు పట్టణంలోని రాయకోట గృహవసతి కాలనీకి చెందిన అంజి (28) సోమవారం సాయంత్రం ఆ ప్రాంతంలో నిలిచి ఉండగా 17 ఏళ్ల బాలుడు అతని సెల్‌ఫోన్‌ను ఎత్తుకెళ్లాడు. స్థానికుల సాయంతో అతన్ని పట్టుకొని పట్టణ పోలీసులకు అప్పగించారు. బాలుడు అదే ప్రాంతానికి చెందినవాడిగా తెలిసింది. బాలున్ని అరెస్ట్ చేశారు.

తమిళనాడు దినోత్సవ చైతన్య ర్యాలీ


చైతన్య ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

హోసూరు: తమిళ రాష్ట్రానికి అప్పటి ముఖ్యమంత్రి అణ్ణా తమిళనాడుగా పేరు పెట్టడాన్ని 2021లో ప్రస్తుత ముఖ్యమంత్రి ఆచరణకు తీసుకొచ్చారు. ప్రతి సంవత్సరం జూలై 18న తమిళనాడు దినోత్సవంగా ఆచరించాలని ఆదేశాలు జారీ చేయడంతో మంగళవారం జిల్లా కేంద్రం క్రిష్ణగిరి తాలూకా కార్యాలయం వద్ద జిల్లా కలెక్టర్ శరయు చైతన్య ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... తమిళనాడు దినోత్సవంపై విద్యార్థినీ విద్యార్థులకు చైతన్యం కలిగించే ఉద్దేశంతో చైతన్య ర్యాలీని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి తమిళనాడు దినోత్సవాన్ని తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని ప్లకార్డులను ధరించి నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన అఖిల భారత మామిడి ప్రదర్శనలో ప్రజా సంబంధ శాఖ ద్వారా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించారు. జిల్లా ఎస్పీ సరోజ్‌కుమార్ ఠాగూర్, అధికారులు బాబు, మణిమేఘలై, పీఆర్వో మోహన్, ఏపీఆర్వో రాజ ప్రకాష్, భూపతి తదితరులు పాల్గొన్నారు.

అడవి ఏనుగుల వీరంగం

యశవంతపుర: అడవి ఏనుగులు పొలాలపై పడి నాశనం చేస్తున్నాయి. కొడగు జిల్లా విరాజపేట తాలూకా సిద్దాపుర చుట్టు పక్కల మూడు రోజుల నుంచి కాఫీతోటల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. విషయం తెలుసుకున్న అటవీశాఖ సిబ్బంది ఏనుగులను అడవుల్లోకి తరుముతున్నాయి. ఏనుగుల సంచారంతో రైతులు పొలాల వద్దకు వెళ్లటానికి భయపడుతున్నారు. ఒక్కసారిగా 30 ఏనుగులు కాఫీ తోటలపైకి రావటంతో వందల ఎకరాలలో పంట నష్టం జరిగిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి


జాతాలో విద్యార్థులు, కమిషనర్ గీత

గౌరిబిదనూరు: పర్యావరణానికి ప్రమాదకరంగా మారిన ప్లాస్టిక్‌ను నిషేధించాలని నగరసభ కమిషనర్ ఎండీ గీత పిలుపునిచ్చారు. మంగళవారం నగరసభ కార్యాలయం నుంచి ఎస్ఎస్ఈఏ కళాశాల విద్యార్థులచే ప్లాస్టిక్ వాడకంపై జరిగే అనర్థాలపై అవగాహన జాతాను ప్రారంభించి మాట్లాడారు. ఆధునిక ప్రపంచంలో గాలి, నీరు, మట్టి ప్లాస్టిక్‌తో నిండిపోయిందన్నారు. వ్యాపారులు బట్టలతో తయారు చేసిన బ్యాగులను ఉపయోగించాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేయడంలో నగర పౌరులు, వ్యాపారులు సహకరించాలని అన్నారు.

స్వచ్ఛతా కార్యక్రమంలో కలెక్టర్


చెత్త తొలగిస్తున్న కలెక్టర్ రవీంద్ర

చిక్కబళ్లాపురం: నగరంలో మంగళవారం నిర్వహించిన స్వచ్ఛతా కార్యక్రమంలో కలెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు. ఉదయం నగర సభ సిబ్బందితో వాపసంద్ర బ్రిడ్జ్ వద్దకు చేరుకున్న కలెక్టర్ అక్కడ చీపురు పట్టుకుని చెత్తను తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నగరాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా మార్చడం కోసమే ప్రతి మంగళవారం నిర్ణయించిన ప్రాంతాల్లో స్వచ్ఛతా కార్యక్రమాలు చేపడుతామన్నారు. జాతీయ రహదారి బ్రిడ్జి వద్ద ప్రజలు వేస్తే జ్‌ను అక్కడ డంప్ చేస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. విజిలెన్స్ బృందాన్ని ఏర్పాటు చేస్తామన్నారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థినులకు సర్టిఫికెట్లను అందజేసిన దృశ్యం

హోసూరు: జిల్లా యంత్రాంగం, తమిళనాడు విజ్ఞాన సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న పుస్తక ప్రదర్శనలో ఏర్పాటు చేసిన వివిధ పోటీల్లో పాల్గొన్న బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను చాటుకొన్నారు. గత 14వ తేదీ నుంచి హోసూరు పారిశ్రామికవాడ మూకొండపల్లిలోని హోటల్ హిల్స్‌లో 12వ పుస్తక ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. ఈ ప్రదర్శనలో ప్రతి రోజూ విద్యార్థులకు చిత్రలేఖన, వ్యాసరచన, ఉపన్యాస, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నారు. సోమవారం సాయంత్రం జరిగిన పోటీల్లో బేడరపల్లి ప్రభుత్వ మాధ్యమిక పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటుకొన్నారు. పోటీల్లో పాల్గొని గెలుపొందిన విద్యార్థులకు మంగళవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పాన్ నాగేష్, ఉపాధ్యాయులు జ్ఞాపికలు, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు.

క్లుప్తంగా...

పోలవరం పనులు పరిశీలించిన పీపీఏ సీఈవో


గోతులను పూడ్చి చదును చేస్తున్న యంత్రాలు

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులను పీపీఏ (పోలవరం ప్రాజెక్టు అథారిటీ) సీఈవో శివనందన్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈసీఆర్ఎఫ్ (ఎర్త్ కమ్ రాక్ ఫిల్ డ్యామ్) ప్రాంతంలో గోతులు పడిన ప్రదేశంలో ఇసుకతో నింపి వైబ్రో కంపాక్షన్ చేసిన పనులను ఆయన తనిఖీ చేశారు. రానున్న వరదల కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్షించారు. ఈఎన్సీ నారాయణ రెడ్డి, సీఈ సుధాకర్ బాబు, ఎస్ఈ నరసింహ మూర్తి, మేఘ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

హెల్త్ కేర్ సెంటర్‌గా భారత్


వినయ్ టెండూల్కర్‌ను సత్కరిస్తున్న పల్సస్ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: భారతదేశం ప్రపంచానికి హెల్త్ కేర్ సెంటర్‌గా మారిందని రాజ్యసభ సభ్యుడు వినయ్ టెండూల్కర్, డాక్టర్ సందేశ్ యాదవ్ తెలిపారు. జీ 20 సదస్సులో భాగంగా సోమ, మంగళవారాల్లో స్విట్జర్లాండ్, ఇటలీలలో హెల్త్‌కేర్‌పై జరిగిన సన్నాహక సదస్సుల్లో పల్సస్ గ్రూప్ పాలుపంచుకుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని పల్సస్ సంస్థ కార్యాలయాన్ని వినయ్ టెండూల్కర్, డాక్టర్ సందేశ్ యాదవ్ సందర్శించారు. అందరికీ ఆరోగ్యమే లక్ష్యంగా పల్సస్ గ్రూప్ కృషి చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఏపీలో సీఎం వైఎస్ జగన్ ఆరోగ్య రంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారన్నారు. సమావేశాల కో-కన్వీనర్ డాక్టర్ శ్రీనుబాబు గేదెల పాల్గొన్నారు.

7న తిరుపతిలో ఓబీసీ జాతీయ మహాసభ

నెహ్రూనగర్ (గుంటూరు తూర్పు): ఆగస్టు ఏడో తేదీన తిరుపతిలో ఓబీసీ జాతీయ మహాసభ నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. ఆయన మంగళవారం గుంటూరులో విలేకరులతో మాట్లాడుతూ ఈ మహాసభలో పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, మంత్రులు, బీసీ నేతలు పాల్గొంటారని చెప్పారు.

దోచుకునే దుర్బుద్ధి మీదే రామోజీ..!

టీడీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టులో మట్టి పనులు చేయకుండానే దోచుకున్నది మీరేకదా?

- వారిలాగే అందరూ ఉంటారనే భ్రమలతో 'రాయలసీమ ఎత్తిపోతల'పై రామోజీ విషం
- కానీ, ఇప్పుడు అత్యంత పారదర్శకంగా కాంట్రాక్టర్‌కు రూ.739.5 కోట్ల బిల్లుల చెల్లింపులు


పోలవరంలో చేయని పనులకు రూ.112.47 కోట్లు బిల్లులు చెల్లించారని తిరిగి వసూలు చేయాలని 2018, జూలై 10న పీపీవో జారీచేసిన నోటీసు



చంద్రబాబు హయాంలో పోలవరం ప్రాజెక్టులో మట్టి పనులు చేయకుండానే డబ్బుల దోపిడీపై సాక్షిలో ప్రచురించిన కథనం

సాక్షి, అమరావతి: పనులు చేయకుండానే కాంట్రాక్టర్లకు ప్రజాధనాన్ని బిల్లుల రూపంలో 'దోచిపెట్టడం'.. దాన్ని 'పంచుకోవడం'.. ఆ తర్వాత 'తినేయడం'.. టీడీపీ సర్కార్ హయాంలో చంద్రబాబుతో 'ఈనాడు' రామోజీరావు సాగించిన 'డీపీటీ' దందా ఇది. పోలవరం ప్రాజెక్టు మట్టి తవ్వకం పనుల్లో 1.65 కోట్ల క్యూబిక్ మీటర్ల మట్టి పనులు చేయకుండానే చేసినట్లు చూపి.. రూ.150.93 కోట్లను కాంట్రాక్టర్ అయిన కొడుకు వియ్యంకుడి సంస్థకు చెల్లించి.. చంద్రబాబుతో కలిసి రామోజీరావు పంచుకుతిన్నారు. ఈ దోపిడీని 2018, మార్చి 24న 'మట్టిలో రూ.150.93 కోట్లు మింగేశారు' శీర్షికన 'సాక్షి' ఆధారాలతో సహా ఆ బండారాన్ని బయటపెట్టింది. దీనిపై స్పందించిన పే అండ్ అకౌంట్స్ విభాగం అధికారులు ఎం-బుక్‌ల తనిఖీకి ఉపక్రమించారు. భయంతో హడావుడిగా కొంతమేర పనులు చేశారు. అయినా సరే.. తనిఖీ పూర్తయ్యే నాటికి చేయని మట్టి పనులకు రూ.112.47 కోట్లు చెల్లించారని నిర్ధారించారు. దోచిపెట్టిన రూ.112.47 కోట్లను రికవరీ చేయాల్సిందేనని 2018, జూలై 10న పోలవరం ప్రాజెక్టు ఉన్నతాధికారులకు అప్పటి పశ్చిమ గోదావరి జిల్లా పీఏఓ కె. సోమయ్య తాఖీదులు జారీచేశారు. ఈ నేపథ్యంలో.. తాము దోపిడీ చేసినట్లుగానే ఇతరులూ చేస్తారని భ్రమపడుతున్న రామోజీరావు.. 'పనులు కాకుండానే పైసలిచ్చేశారు' శీర్షికతో మంగళవారం మరో తప్పుడు కథనాన్ని అచ్చేసి రాష్ట్ర ప్రభుత్వంపై యథేచ్ఛగా విషం చిమ్మారు. నిజానికి.. రాయలసీమ ఎత్తిపోతల పథకంలో అత్యంత పారదర్శకంగా.. నిబంధనల ప్రకారం కాంట్రాక్టర్లకు ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే సీఎం జగన్‌కు ప్రజల్లో మరింత ఆదరణ పెరుగుతుందని.. అప్పుడు చంద్రబాబుకు రాజకీయంగా భవిష్యత్ ఉండదనే భయంతో ఆ పథకాన్ని అడ్డుకునేందుకు తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తితో ఎన్జీటీ (జాతీయ హరిత ట్రిబ్యునల్)లో దుష్టచతుష్టయం కేసులు వేయించింది. ఇందులో ప్రధాన భూమిక రామోజీదే. ఓ వైపు ఎన్జీటీలో కేసులు వేయించి రాయలసీమ ఎత్తిపోతలకు సైంధవుల్లా అడ్డుపడుతూ.. మరోవైపు ఆ ఎత్తిపోతలపై సన్నాయినొక్కులు నొక్కుతూ.. రామోజీ అడుగడుగునా వాస్తవాలను ఆ కథనంలో వక్రీకరించారు. అందులోని నిజానిజాలు ఏమిటంటే..

ఈనాడు: రాయలసీమ ఎత్తిపోతల పనులకు ఆర్ఈసీ నుంచి 10.5 శాతం వడ్డీ చెల్లించేందుకు అంగీకరించి మరీ కార్పొరేషన్ పేరుతో అప్పు తెచ్చి.. ప్రభుత్వ ఖజానాతో సంబంధం లేకుండా నేరుగా కాంట్రాక్టు సంస్థ మేఘా జాయింట్ వెంచర్‌కు రూ.739 కోట్లు చెల్లించేశారు.

వాస్తవం: పట్టిసీమ, పురుషోత్తపట్నం, కొండవీటివాగు ఎత్తిపోతల, గోదావరి-పెన్నా అనుసంధానం వంటి ప్రాజెక్టులకు ఆర్ఈసీ, పీఎఫ్సీల వద్ద.. అమరావతి డెవలప్‌మెంట్ బాండ్ల పేరుతో పది శాతం కంటే అధిక వడ్డీకి టీడీపీ ప్రభుత్వం రూ.వేల కోట్లను అప్పుగా తెచ్చింది. ఇందులో కొంత మొత్తాన్ని కాంట్రాక్టర్లకు చెల్లించి.. మిగిలిన మొత్తాన్ని ఎన్నికలకు ముందు చంద్రబాబు పసుపు-కుంకుమ పథకానికి మళ్లించారు. అప్పట్లో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చి.. రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మారుస్తున్న టీడీపీ ప్రభుత్వాన్ని ఒక్కసారైనా ప్రశ్నించావా రామోజీ? చంద్రబాబు సర్కార్ నిధులను దారిమళ్లించడంవల్లే.. ఇచ్చే రుణాన్ని నేరుగా కాంట్రాక్టు సంస్థకే చెల్లిస్తామని ఆర్ఈసీ, పీఎఫ్సీ సంస్థలు నిబంధనలు పెట్టిన మాట వాస్తవం కాదా? ఈ ప్రాజెక్టుపై రోతరాతలు రాయడం తగునా రాజగురవిందా? చంద్రబాబు అధికారంలో ఉంటే ఒక నీతి.. జగన్ ఉంటే మరో నీతి అంటే ఎలా?

ఈనాడు: పర్యావరణ సమస్యల కారణంగా రెండేళ్ల క్రితం రాయలసీమ ఎత్తిపోతల పనులు ఆపేశారు. ఇప్పట్లో పనులు చేపట్టే అవకాశాలు కనిపించడంలేదు. అయినా కాంట్రాక్టర్‌కు చెల్లింపులు చేశారు.

వాస్తవం: శ్రీశైలం ప్రాజెక్టులో 800 అడుగుల నీటి మట్టం నుంచే కల్వకుర్తి, జలవిద్యుదుత్పత్తి కేంద్రం ద్వారా తెలంగాణ సర్కార్ ఇప్పటికే నీటిని తరలిస్తోంది. అలాగే, 800 అడుగుల నుంచే రోజుకు రెండు టీఎంసీలు తరలించేలా పాలమూరు-రంగారెడ్డి, డిండి ఎత్తిపోతలను తెలంగాణ సర్కార్ చేపట్టింది. కానీ, శ్రీశైలంలో 854 అడుగుల నీటిమట్టం ఉంటేనే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రోజుకు ఏడువేల క్యూసెక్కులు మాత్రమే వాడుకోగలం. ప్రాజెక్టులో 875 అడుగుల స్థాయిలో నీటి మట్టం ఉంటే.. పోతిరెడ్డిపాడు నుంచి 44 వేల క్యూసెక్కులు తరలించడానికి సాధ్యమవుతుంది. కృష్ణా నదిలో క్రమేణా వరద రోజులు తగ్గుతుండటం.. తెలంగాణ సర్కార్ వచ్చిన నీటిని వచ్చినట్లు తోడేస్తూ శ్రీశైలంలో నీటిమట్టం పెరగకుండా చేస్తూ.. రాష్ట్ర ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తున్న తరుణంలో.. ట్రిబ్యునల్ కేటాయించిన నీటిని మరింత సమర్థవంతంగా వాడుకుని తెలుగుగంగ, కేసీ కెనాల్, ఎస్సార్బీసీ, గాలేరు-నగరి ప్రాజెక్టుల ఆయకట్టుకు సాగునీరు, రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల ప్రజలకు తాగునీరు, చెన్నైకి తాగునీరు అందించడానికి సీఎం జగన్ రాయలసీమ ఎత్తిపోతల చేపట్టారు. శ్రీశైలంలో 800 అడుగుల నుంచే రోజుకు మూడు టీఎంసీలు పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ దిగువన ఎస్సార్బీసీ కాలువలోకి ఎత్తిపోసేలా ఈ పథకాన్ని చేపట్టారు. రాయలసీమ ప్రాజెక్టులకు గుండెకాయ వంటి రాయలసీమ ఎత్తిపోతల పూర్తయితే సీఎం జగన్‌కు ప్రజల్లో ఆదరణ మరింత పెరుగుతుందని.. అప్పుడు చంద్రబాబుకు భవిష్యత్తు అంధకారమవుతుందనే భయంతో.. ఆ పథకంపై తెలంగాణకు చెందిన గవినోళ్ల శ్రీనివాస్ అనే వ్యక్తితో చంద్రబాబు నేతృత్వంలోని దుష్టచతుష్టయం ఎన్జీటీ (జాతీయ హరిత ట్రిబ్యునల్)లో కేసులు వేయించింది. పర్యావరణ అనుమతులు తెచ్చుకునే వరకూ పనులు ఆపేయాలని ఎన్జీటీ ఆదేశించింది. దాంతో.. పర్యావరణ అనుమతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తోంది. కానీ, దీనికి ఓవైపు సైంధవుల్లా అడ్డుపడుతూ మరోవైపు సన్నాయినొక్కులు నొక్కితే ఎలా రాజగురవిందా? ఎలాంటి పర్యావరణ అనుమతి తీసుకోకుండా టీడీపీ సర్కార్ చేపట్టిన పురుషోత్తపట్నం ఎత్తిపోతలను ఆపేయాలని ఎన్జీటీ ఆదేశించింది. దీంతో ట్రయల్ రన్ దశలోనే రూ.1,900 కోట్లతో నిర్మించిన పురుషోత్తపట్నం ఎత్తిపోతల ఆగిపోయింది. ఎన్జీటీ ఉత్తర్వుల మేరకు రూ.కోట్ల ప్రజాధనాన్ని అపరాధ రుసుంగా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఈనాడు: ప్రధాని మోదీతో తనకు రాజకీయాలకు అతీతమైన సంబంధాలు ఉన్నాయని ప్రకటించే సీఎం జగన్.. రాయలసీమ ఎత్తిపోతలకు పర్యావరణ అనుమతులను సాధించలేకపోతున్నారు..

వాస్తవం: రాయలసీమ ఎత్తిపోతల పూర్తయితే చంద్రబాబుకు రాజకీయంగా భవిష్యత్ ఉండదనే భయంతో ఆ పథకంపై ఎన్జీటీలో కేసులు వేయించి అడ్డుకున్న దుష్టచతుష్టయంలో కీలక పాత్రధారివి నువ్వే కదా రామోజీ? పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర అటవీ, పర్యావరణ శాఖతో రాష్ట్ర జలవనరుల శాఖ సంప్రదింపులు జరుపుతోంది. దీనికి పర్యావరణ అనుమతులివ్వాలని అటవీ, పర్యావరణ శాఖ మంత్రికి సీఎం జగన్ పలుమార్లు విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానాల్లో ఉన్న కేసులలో ప్రధాని మోదీ ఎలా జోక్యం చేసుకుంటారనే కనీస ఇంగిత జ్ఞానం లేకపోతే ఎలా రాజగురవిందా?

శ్రీశైలంలో 800 అడుగుల కంటే దిగువ నుంచి రోజుకు రెండు టీఎంసీలను తరలించేలా తెలంగాణ సర్కార్ అక్రమంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలను చేపడితే దాన్ని అడ్డుకోవడంలో నాటి సీఎం చంద్రబాబు ఘోరంగా విఫలమయ్యారు. ఓటుకు నోటు కేసు నుంచి తప్పించుకోవడానికి రాష్ట్ర రైతుల ప్రయోజనాలను తెలంగాణ సీఎం కేసీఆర్‌కు తాకట్టు పెట్టారు. కానీ, జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించాకే రాష్ట్ర ప్రయోజనాలు.. రైతుల హక్కుల పరిరక్షణే పరమావధిగా పనిచేస్తున్నారు. ఉదా..

- రాయలసీమ ఎత్తిపోతలతోపాటు శ్రీశైలానికి వరద వచ్చే 30-40 రోజుల్లోనే వరదను ఒడిసిట్టి.. రాయలసీమ ప్రాజెక్టులను నింపేందుకు కాలువల ప్రవాహ సామర్థ్యాన్ని పెంచేలా ఆధునీకరణ పనులు చేపట్టారు.

నాడు తాకట్టు.. నేడు పరిరక్షణ..

- పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేలకు పెంచేలా పనులు చేపట్టారు.
- బనకచర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి వెలిగోడు రిజర్వాయర్ వరకూ లింక్ కెనాల్ ప్రవాహ సామర్థ్యాన్ని 15 వేల క్యూసెక్కులకు.. వెలిగోడు రిజర్వాయర్ నుంచి బ్రహ్మంసాగర్ వరకూ తెలుగుగంగ ప్రధాన కాలువ సామర్థ్యాన్ని 5 వేల క్యూసెక్కులకు పెంచే పనులను రూ.500 కోట్లు వెచ్చించి యుద్ధప్రాతిపదికన పూర్తిచేశారు. తద్వారా సకాలంలో వెలిగోడు రిజర్వాయర్‌ను నింపుతున్నారు.
- బ్రహ్మంసాగర్ మట్టికట్టకు డయాఫ్రమ్ వాల్‌తో లీకేజీలకు అడ్డుకట్ట వేసి.. గరిష్ఠ సామర్థ్యం మేరకు నీటిని నిల్వచేస్తూ ఆయకట్టుకు నీళ్లందిస్తున్నారు. నిర్వాసితులకు పునరవాసం కల్పించడం ద్వారా గండికోట, చిత్రావతిలో గరిష్ఠ స్థాయిలో నీటిని నిల్వచేస్తూ ఆయకట్టుకు నీటిని అందిస్తున్నారు.
- ఇక హంద్రీ-నీవా ద్వారా ఏటా సగటున 40 టీఎంసీలు తరలిస్తూ రాయలసీమ రైతుల ప్రయోజనాలను పరిరక్షిస్తున్నారు.
- మరోవైపు.. చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గానికి హంద్రీ-నీవాలో అంతర్భాగమైన కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను రూ.128 కోట్లతో పూర్తిచేసి, నీటిని తరలించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు.

ఈనాడు: పనులు చేయకున్నా పైసలు ఇచ్చేశారు. మోటార్లు, పంపులు, ఎలక్ట్రిక్ పరికరాలతో ఎలాంటి పనులు చేయలేదు.

వాస్తవం: రాయలసీమ ఎత్తిపోతల పథకం కింద చేసిన పనులను వాటి పరిమాణం ఆధారంగా ఎం-బుక్‌లలో ఫీల్డ్ ఇంజినీర్లు రికార్డు చేశారు. క్వాలిటీ కంట్రోల్ విభాగం అధికారులు వాటిని తనిఖీచేసి.. డిజైన్ ప్రకారం, నాణ్యంగా పనులు చేశారని తేల్చారు. ఈ పనులను ఆర్ఈసీ బృందం మరోసారి పరిశీలించాకే బిల్లులు చెల్లించారు. చెల్లించిన రూ.739.5 కోట్లతో.. సమగ్ర సర్వే, డిజైన్లకు రూ.8.46 కోట్లు, అప్రోచ్ చానల్‌కు రూ.204.07 కోట్లు, పంప్‌హౌస్ నిర్మాణం, తదితర పనులకు రూ.167.27 కోట్లు.. పంపులు, మోటార్ల విడిభాగాల సేకరణకు రూ.293.98 కోట్లు, జీఎస్టీ, ఐటీ వంటి ఇతర చెల్లింపులకు రూ.65.71 కోట్లను ఆర్ఈసీ విడుదల చేసింది. పనులు జరుగుతున్నప్పుడే మెటీరియల్ తెప్పించుకుని వీలైనంత త్వరగా ప్రాజెక్టును పూర్తిచేసి, రైతులకు ప్రయోజనాలు అందించాలనుకోవడం ఏ రకంగా తప్పు రామోజీ? టీడీపీ హయాంలో పట్టిసీమ, పురుషోత్తపట్నం వంటి పథకాలకు పంపులు, మోటార్లు, ఎలక్ట్రిక్ పరికరాల సేకరణకు ముందస్తుగా రూ.వేల కోట్లు చెల్లించలేదా? గోదావరి-పెన్నా అనుసంధానం పథకంలో ఒక్క ఎకరా భూసేకరణ చేయకుండానే దాదాపు రూ.వెయ్యి కోట్లు ఎలక్ట్రిక్ పరికరాలకు టీడీపీ సర్కార్ చెల్లించినప్పుడు.. ప్రశ్నించడానికి నీ నోరు మూగబోయిందా రామోజీ? భూసేకరణను టీడీపీ జటిలం చేయడంతో.. ఆ ఇబ్బందులను అధిగమించి గోదావరి-పెన్నా అనుసంధానం పనులు చేయడానికి ప్రభుత్వం ఎంతో శ్రమించాల్సి వస్తోంది.

నిమ్మ మార్కెట్‌కు ప్రసిద్ధి.. పొదలకూరు యార్డు

జిల్లాలో ప్రత్యేక గుర్తింపు ఉన్న పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డు రైతులు కాయలను విక్రయించుకునేందుకు, ఎగుమతులు జరుపుకునేందుకు అనుకూలంగా ఉంది. సీజన్‌లో ఈ మార్కెట్ యార్డు నుంచి ఢిల్లీతోపాటు పొరుగు రాష్ట్రాలకు సైతం అధికంగా కాయలు ఎగుమతి అవుతుంటాయి. ఆ మేరకు లాభసాటి ధరలు కూడా లభిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా మార్కెట్ యార్డులో సౌకర్యాల కల్పన, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటూ అండగా నిలుస్తోంది.

సీజన్‌లో రూ.50 లక్షల మేర కాయల ఎగుమతులు

పెరుగుతున్న వ్యాపారుల సంఖ్య	కోట్లాది రూపాయలతో వసతుల కల్పన
మార్కెట్‌లో అదనపు దుకాణాల నిర్మాణం	రైతులకు లాభసాటి ధరలు


రైతుల నుంచి వచ్చిన నిమ్మకాయలను ప్యాకింగ్ చేస్తున్న వ్యాపారులు

పొదలకూరు:

జిల్లాలో పొదలకూరు నిమ్మ మార్కెట్ యార్డుకు ప్రత్యేక ప్రస్థానం ఉంది. వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఈ నిమ్మ మార్కెట్ యార్డును వివిధ ప్రభుత్వాల హయాంలో కొంతమేర అభివృద్ధి చేసినా వసతుల కల్పనతోపాటు వ్యాపారుల సమస్యలను పరిష్కరించిన ఘనత మాత్రం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఈ మార్కెట్ యార్డుకు పొదలకూరు, రాపూరు, కలువాయి, చేజర్ల, మనుబోలు, సైదాపురం సంగం, నెల్లూరు రూరల్, వెంకటాచలం తదితర మండలాల నుంచి రైతులు కాయలను తీసుకువస్తుంటారు.

13 ఎకరాల్లో మార్కెట్ యార్డు

పొదలకూరు ప్రభుత్వ మార్కెట్ యార్డుకు 2003 జూన్ 20వ తేదీన 13 ఎకరాల స్థలాన్ని కేటాయించి దుకాణాలకు వేలంపాటలు నిర్వహించారు. అప్పట్లో రోడ్లపై వ్యాపారాలు చేసుకునే నిమ్మ వ్యాపారులు యార్డుకు కష్టంగా వచ్చి వ్యాపారాలు మొదలుపెట్టారు. ఇపుడు యార్డు అతిపెద్దగా రూపుదాల్చి నిత్యం సుమారు 200 మందికి ఉపాధి కల్పిస్తోంది. రెండు దశాబ్దాల కాలంలో మార్కెట్ బాగా విస్తరించింది. ఏఎంసీ చైర్మన్లు, ప్రభుత్వాల కృషి ఫలితంగా కోట్లాది రూపాయలతో అంతర్గత సిమెంటురోడ్లు, అదనపు దుకాణాల నిర్మాణం జరిగింది. అదనంగా మరికొన్ని దుకాణాలను నిర్మిస్తామని గుంటూరు మార్కెట్ ఆర్జేడీ శ్రీనివాసరావు వెల్లడించారు. ఇటీవల 24 దుకాణాలకు వేలంపాటలు కూడా నిర్వహించారు. యార్డులో ఇపుడు మొత్తం 40 మంది వరకు వ్యాపారులు ఉన్నారు. వీరిలో సేల్స్ వ్యాపారులు (కాయలకు వేలంపాటలు నిర్వహించేవారు) 5 మంది, బయ్యర్లు (కొనుగోలు చేసేవారు) 35 మంది ఉన్నారు. రోడ్లు, ప్లాట్‌ఫామ్స్‌పై కాయలు కొనుగోలు చేసేవారు చాలామందే ఉన్నారు. మార్కెట్‌లో అంతర్గత సిమెంటు రోడ్లు, అదనపు దుకాణాల నిర్మాణం, ఓపెన్ మార్కెట్ కోసం ప్లాట్‌ఫాంల ఏర్పాటు, కార్బైడ్ రహితంగా కాయలను మగ్గబెట్టేందుకు లైఫింగ్(గ్యాస్) చాంబర్ నిర్మాణం, హమాలీలకు విశ్రాంతి గది తదితరుల సౌకర్యాలు ఉన్నాయి.

సీజన్‌లో రూ.లక్షల్లో కాయల ఎగుమతులు

నిమ్మమార్కెట్‌లో సీజన్ జనవరి చివరి నుంచి ప్రారంభమవుతుంది. మే నెల వరకు నిమ్మకాయలకు సీజన్‌గా పరిగణిస్తారు. ఆ సమయంలో ధరలు బాగా లభించడం వల్ల రైతులు కాయలను యార్డుకు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. సీజన్‌లో యార్డు నుంచి నిత్యం 15 లారీల కాయలు ఎగుమతి అవుతాయి. వాటి విలువ సుమారు రూ.50 లక్షల వరకు ఉంటుంది. మార్కెట్ కమిటీకి బస్తాకు రూ.5 వంతున సెస్‌చార్జీలు వసూలవుతున్నందున యార్డు నుంచి రాబడి కూడా బాగా ఉంటుంది. ఢిల్లీ మార్కెటే నిమ్మ ధరలను నిర్ణయిస్తుంది. ఢిల్లీ మార్కెట్ యార్డులోని వ్యాపారులు తరచూ ఇక్కడకు వచ్చి వ్యాపారులతో లావాదేవీలు కుదుర్చుకుని వెళుతుంటారు. దీంతో ఇక్కడి నుంచి ఢిల్లీ మార్కెట్‌కు కాయలు అధికంగా ఎగుమతి అవుతుంటాయి.

వ్యాపారులకు అండగా..

కోవిడ్ సమయంలోనూ మార్కెటింగ్ శాఖ చొరవ తీసుకుని వ్యాపారులకు అండగా నిలిచింది. కరోనా భయంతో వ్యాపారులు సుమారు నెల రోజులపాటు మార్కెట్‌ను మూసివేసిన తర్వాత మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో క్రమక్రమంగా మార్కెట్ తెరుచుకుని తిరిగి రైతుల వద్ద కాయలు సేకరించి పొరుగు రాష్ట్రాలకు ఎగుమతులను ప్రారంభించారు.

మరింత విస్తరించేలా చర్యలు

యార్డులో అప్పట్లో మంచినీటి ట్యాంకు వ్యాపారుల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని నిర్మించారు. ప్రస్తుతం వ్యాపారులు, రైతుల సంఖ్య పెరగడంతో మంచినీటి సమస్యలు తలెత్తుతున్నాయి. పెద్ద ట్యాంక్ నిర్మించాలని వ్యాపారులు కోరుతున్నారు. గతంలో నిర్మించిన 10 దుకాణాల వద్ద సిమెంటు రోడ్డు లేకపోవడంతో లారీలు దిగబడుతున్నాయి. అక్కడ అంతర్గత సిమెంటురోడ్డు నిర్మిస్తే సరిపోతుందని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మార్కెట్‌ను మరింత విస్తరించి సౌకర్యాలు పెంపొందించేందుకు ఒక ప్రణాళిక రూపొందించాల్సిందిగా మార్కెటింగ్‌శాఖ అధికారులను ఆదేశించారు.

కొత్తగా నిర్మించిన దుకాణాలు


ఇబ్బందులు తలెత్తడం లేదు


పొదలకూరు నిమ్మమార్కెట్ రైతులకు దగ్గరగా ఉండడం వల్ల కాయలను ఎగుమతి చేసేందుకు ఇబ్బందులు తలెత్తడం లేదు. ధరలు కూడా బాగానే లభిస్తున్నాయి. వేసవిలో రైతులకు ధరలు లభిస్తున్నా, చలికాలం కొంత ఇబ్బంది తలెత్తుతోంది. నిమ్మకాయలకు కూడా గిట్టుబాటు ధర ఉంటే బాగుంటుంది.

– పెంచలనారాయణరెడ్డి, రైతు, అంకుపల్లి

మార్కెట్‌లో సౌకర్యాలు కల్పించాలి


నిమ్మమార్కెట్‌లో సౌకర్యాలు బాగున్నాయి. అయితే వేసవిలో జనాల తాకిడికి మంచినీరు సరిపోవడం లేదు. కొత్తగా మరో ట్యాంకు నిర్మిస్తే మంచినీటి ఇబ్బందులు ఉండవు. మంత్రి కాకాణి ప్రత్యేక చొరవ తీసుకుని సౌకర్యాలు కల్పించాలి.

– ఎం.బాలకృష్ణారెడ్డి, వ్యాపారి

అదనపు దుకాణాలు నిర్మిస్తాం


యార్డులో అదనపు దుకాణాలు నిర్మిస్తాం. ప్రస్తుతం వ్యాపారులందరికీ లైసెన్సులను రెన్యువల్ చేస్తున్నాం. ప్లాట్‌ఫాం వ్యాపారులకు కూడా లైసెన్సులు అందజేస్తున్నాం. లైసెన్సులు లేనివారు యార్డులో కాయలు పట్టుకునేందుకు అవకాశం ఉండదు.

– నవీన్‌కుమార్‌రెడ్డి, సెక్రటరీ

యార్డును అభివృద్ధి చేస్తున్నాం


రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి చొరవతో నిమ్మ మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తున్నాం. అదనపు దుకాణాలు నిర్మిస్తాం. నిత్యావసర వస్తువులను రాయితీపై యార్డులో ప్రజలకు అందజేస్తున్నాం.

– పెదమల్లు రత్నమ్మ, ఏఎంసీ చైర్మన్

మహా నగరంలో 'యూనిటీ మాల్'

ప్రపంచవ్యాప్తంగా పేరొందిన ఉత్పత్తులన్నీ ఒకే చోట లభించేలా సరికొత్త మాల్ మహా నగరంలో ఏర్పాటు కానుంది. దేశంలోని ప్రతి రాష్ట్రంలోనూ జియోగ్రాఫికల్ ఇండికేషన్(జీఐ) పొందిన ఉత్పత్తుల కోసం వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ పేరుతో ఈ మాల్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా రుషికొండ సమీపంలో బీచ్‌రోడ్డులో యూనిటీ మాల్ ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. టెండర్లు ఖరారైన 24 నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. –సాక్షి, విశాఖపట్నం

- రుషికొండ సమీపంలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు
- వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్ పేరుతో ప్రత్యేక ఉత్పత్తుల ప్రదర్శన
- రాష్ట్రానికి రూ.180 కోట్ల రుణం అందించనున్న కేంద్రం



36 నెలల్లో యూనిటీ మాల్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

కేంద్ర బడ్జెట్-2023 సందర్భంగా 'యూనిటీ మాల్' అనే ప్రాజెక్ట్‌ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. ఒక్కొక్క రాష్ట్రంలోని ప్రత్యేకమైన హస్తకళ ఉత్పత్తులు, వన్ డిస్ట్రిక్ట్.. వన్ ప్రొడక్ట్, భౌగోళిక గుర్తింపు(జీఐ ఇండెక్స్) పొందిన ఉత్పత్తులను ప్రోత్సహించడం, విక్రయించడమే లక్ష్యంగా ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. ఆయా రాష్ట్రాలు స్థలాన్ని గుర్తిస్తే కేంద్ర ప్రభుత్వం నిధులు అందించి.. ఈ మాల్ నిర్మించేందుకు సహకారం అందిస్తుంది. ప్రతి రాష్ట్రంలోనూ ఆ రాష్ట్ర రాజధాని లేదా ఆర్థిక రాజధాని, లేదా ప్రసిద్ధమైన పర్యాటక ప్రాంతంలో ఈ యూనిటీ మాల్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రుషికొండలోని రామానాయుడు స్టూడియో సమీపంలో యూనిటీ మాల్ ఏర్పాటు చేసేందుకు అనువైన ప్రాంతంగా జిల్లా అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు.

యూనిటీ మాల్ అంటే.?

ఆయా రాష్ట్రాల్లో ఉత్పత్తి చేసిన విభిన్న శ్రేణి హస్తకళ ఉత్పత్తులు, ఇతర సాంస్కృతిక కళాఖండాలను ప్రోత్సహించడం, విక్రయించడం లక్ష్యంగా నిర్దేశించుకున్న కార్యక్రమం యూనిటీ మాల్. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన హస్తకళలు, చేతి వృత్తులు, జీఐ ఇండెక్స్ ఉత్పత్తులను దేశంలోని మిగిలిన రాష్ట్రాలకు పరిచయం చేసేందుకు అనువుగా దీన్ని నిర్మించనున్నారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.180 కోట్ల రుణాన్ని మంజూరు చేస్తుంది. 50 నెలల పాటు రుణంపై వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేకుండా అందిస్తుంది. టెండర్లు ఖరారైన తర్వాత 24 నుంచి 36 నెలల్లో యూనిటీ మాల్ నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నారు.

రాష్ట్రంలో జీఐ గుర్తింపు పొందినవివే...

సహజ, వ్యవసాయ ఉత్పత్తులు, హస్త కళలు, పారిశ్రామిక ఉత్పత్తులకు ప్రపంచ వాణిజ్య సంస్థకు చెందిన 'ది జియోగ్రాఫికల్ ఇండికేషన్ ఆఫ్ గూడ్స్'(రిజిస్ట్రేషన్, రక్షణ) చట్టం-1999 ఆధారంగా జీఐ గుర్తింపు ఇస్తుంది. 2003 సెప్టెంబర్ 15 నుంచి ఈ చట్టం అమల్లోకి వచ్చింది. 2004-2005లో 'డార్జిలింగ్ టీ'దేశంలో మొట్టమొదటి జీఐ ట్యాగ్ పొందింది. ఇప్పటి వరకు దాదాపు నాలుగు వందల ఉత్పత్తులకు జీఐ గుర్తింపు లభించింది. ఈ గుర్తింపు పొందిన ఉత్పత్తులు, వస్తువులు, పదార్థాలకు ప్రపంచ వ్యాప్తంగా ఆదరణ పెరిగే అవకాశం ఉంటుంది. ఈ గుర్తింపు 10 ఏళ్లు వర్తిస్తుంది. తర్వాత మళ్లీ పునరుద్ధరించుకోవచ్చు. రాష్ట్రంలో ఏటికొప్పాక బొమ్మలు, అరకు అరబికా కాఫీ, తిరుపతి లడ్డూ, బంగినపల్లి మామిడి, బొబ్బిలి వీణ, బందరు లడ్డూ, శ్రీకాళహస్తి కలంకారీ, కొండపల్లి కొయ్య బొమ్మలు, మచిలీపట్నం కలంకారీ, బుడితి గంటలు, కంచు బొమ్మలు, ఏపీ లెదర్ పప్పెట్రీ, ఉప్పాడ జందానీ చీరలు, గుంటూరు సన్నం మిర్చి, వెంకటగిరి చీరలు, మంగళగిరి చీరలు, ధర్మవరం పట్టుచీరలు, ఉదయగిరి చెక్క సామగ్రి, దుర్గి, ఆళ్లగడ్డ రాతిబొమ్మలు.. మొదలైనవి జీఐ గుర్తింపు పొందాయి. వీటితో పాటు ఆత్రేయపురం పూతరేకులు, మాడుగుల హల్వా, పొందూరు ఖద్దరు, పలు ప్రాంతాల పిండి వంటలు, హస్తకళలన్నీ యూనిటీ మాల్‌లో ఒకే చోట కొలువై ఉండనున్నాయి.

ప్రతిపాదనలు పంపించాం

ఆయా ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించేందుకు యూనిటీమాల్ ఉపయుక్తంగా నిలుస్తుంది. స్థానిక కళాకారులు, వారి ఉత్పత్తులను విక్రయించి.. వారికి జీవనోపాధిని మెరుగు పరిచేందుకు దోహదపడుతుంది. ఆయా రాష్ట్రాల సుసంపన్నమైన సాంస్కృతిక వారసత్వం గురించి


ప్రజలు ఒకే చోట తెలుసుకోవచ్చు. యూనిటీ మాల్ ఏర్పాటు కోసం ఇప్పటికే స్థలాన్ని గుర్తించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. స్థల పరిశీలకు బృందాలు రావాలని ఆహ్వానించాం. త్వరలోనే దీనికి సంబంధించిన కార్యాచరణ వెలువడే అవకాశం ఉంది. – డా.మల్లికార్జున, కలెక్టర్

న్యూస్‌మేకర్

చేతిలో పలుగూ పార
నెత్తిన పచ్చగడ్డి
నుదుటిన ఎప్పుడూ దొర్లే చెమట...
కాని గుండెల నిండా చదువు పూర్తి చేయాలన్న
సంకల్పం.
మహా మహా సౌకర్యాలు ఉండి కూడా
పీహెచ్‌డీ కల నెరవేర్చుకోలేని వారు
చకితమయ్యేలా-
ఏ సౌకర్యాలూ లేని వాళ్లు
కొండంత స్ఫూర్తి పొందేలా
వ్యవసాయ కూలీ భారతి
మొన్న (సోమవారం)
పీహెచ్‌డీ పట్టా అందుకుంది.
అనంతపురంలో
ఈ అద్భుతం జరిగింది.

ఈమె డాక్టర్ భారతి ఎందరికో స్ఫూర్తి


గడ్డిమోపు తెస్తున్న భారతి

సాకే భారతి రెండు రోజుల క్రితం ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా అనంతపురం ఎస్.కె.యూనివర్సిటీలో రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా తీసుకుంది. ఆమె పుట్టి పెరిగిన సామాజిక వర్గం (ఎరుకల)లో, ఆమె నివసిస్తున్న శింగనమల మండలం నాగుల గుడ్డం గ్రామంలో ఆమె సాధించింది ఎంత పెద్ద ఘనకార్యమో చాలా మందికి తెలియదు. అసలు సాకే భారతి చదువుకుంటూ ఉంటేనే 'చదువెందుకు' అని చాలామంది స్త్రీలు ఆశ్చర్యపోయేవారు. 'మేము ఏం చదివామని సుబ్రంగా కాపురాలు చేస్తున్నాం' అని కూడా అనేవారు. కాని చదువు తెచ్చే వెలుతురు భారతికి బాగా తెలుసు. ఈ మెట్టు తర్వాత తనకు ప్రొఫెసర్‌గానో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గానో ఉద్యోగం వస్తే మారబోయే తన జీవితమూ తెలుసు. తనను చూసైనా తన వర్గంలో తనలాంటి సామాజిక వర్గాల్లో స్ఫూర్తి రావాలని ఆమె కోరిక.


డాక్టరేట్ పట్టాతో భారతి

2016లో పీహెచ్‌డీ సీటు

2016లో సాకే భారతి ఎస్.కె. యూనివర్శిటీలో ప్రొఫెసర్ ఎం.సి.ఎస్ శోభ దగ్గర ఆర్గానిక్ కెమెస్ట్రీలో పిహెచ్.డి ప్రవేశం పొందింది. పిహెచ్.డిలో చేరడంతో ప్రభుత్వం నుంచి వచ్చే ఉపకార వేతనం భారతి చదువుకు సహాయపడింది. దీంతోపాటు కూలి పనులకు వెళ్తూ 2023 సంవత్సరానికి పట్టా పొందింది. స్లిప్పర్లతో, అతి సాదా బట్టలతో స్నాతకోత్సవంలో పట్టా అందుకోవడానికి భారతి స్టేజీ ఎక్కితే ఆడిటోరియం అంతా చప్పట్లతో మార్మోగిపోయింది.

■ ముగ్గురు ఆడపిల్లలు

తల్లిదండ్రులకు పుట్టిన ముగ్గురు ఆడపిల్లల్లో సాకే భారతి రెండో సంతానం. తండ్రికి చదువు లేదు. పైగా ముగ్గురూ ఆడపిల్లలే పుట్టారని, అబ్బాయి పుట్టలేదని భార్యను ఇబ్బంది పెట్టేవాడు. తను కూడా చాలా అస్థిమితంగా ఉండేవాడు. ఇంట్లో వాతావరణం ఏమీ బాగుండేది కాదు. అప్పుడు భారతి తాత భారతితో అన్నమాట ఆమె జీవితాన్ని మలుపు తిప్పింది- అమ్మా... నా కూతుర్ని మీ నాన్నకు ఇస్తే ఇలా ఇబ్బంది పెడుతున్నాడు. ఆడపిల్లకు ఏం తక్కువ? బాగా చదువుకుంటే ఎన్నో గొప్ప పనులు చేయవచ్చు. నువ్వు బాగా చదువుకుని మీ నాన్న కళ్లు తెరిపియ్యాలి' అన్నాడు. ఆ రోజు నుంచి భారతి గట్టిగా చదువుకోవాలనుకుంది. ఇవాళ్టికీ చదువుకుంటూనే ఉంది.


భర్త, కుమార్తెతో రేకుల ఇంట్లో భారతి

■ ఎన్నో కష్టాలు

భారతి మూడో క్లాసుకు వచ్చేసరికి చిన్న చెల్లెలు పుట్టింది. తల్లిదండ్రులు ఇద్దరూ కూలికి వెళ్లాలి. అక్క బడికెళ్లాలి. చెల్లెల్ని ఎవరు చూసుకోవాలి? రెండేళ్లు బడి మానేసి ఇంట్లో చెల్లెల్ని చూసుకుంటూ ఉండిపోయింది భారతి. ఆ తర్వాత పదో క్లాస్‌లో పెళ్లి చేశారు. అప్పుడు కూడా ఒక సంవత్సరం చదువు సాగలేదు. పెళ్లయ్యాక నివాసానికి ఇల్లు లేకపోవడంతో రేకుల షెడ్డు వేసుకుని అందులోనే ఉన్నారు. అక్కడే ఒక రోజు కాలేజీకి వెళుతూ ఒకరోజు కూలి పనికి వెళుతూ చదువుకుంది భారతి. ఇంటర్ (ఎం.పి.సి.)లో రోజు కూలి పాతిక రూపాయలు, డిగ్రీ (బిఎస్సీ)లో రోజు కూలి యాభై రూపాయలు వచ్చేది. ఈ లోపు కూతురు పుట్టింది. పాటలంటే చాలా ఇష్టమున్న భారతి తన కూతురికి 'గాయని' అని పేరు పెట్టింది. పెళ్లి, సంసారం వల్ల చదువు మీద శ్రద్ధ ఉండటం లేదని భారతి బాధ పడుతుంటే భర్త ఏరికుల శివప్రసాద్ ఇంటర్ చదువు కొనసాగేలా ప్రోత్సహించాడు. పామిడిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, అనంతపురంలోనే ఎమ్మెస్సీ పూర్తి చేసింది. గ్రామం నుంచి కళాశాలకు పోవడానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో రోజూ ఎనిమిది కిలోమీటర్లు గార్లదిన్నెకు నడుచుకుంటూ వెళ్లి అక్కడ నుంచి ఆర్టీసీ బస్సులో అనంతపురం వెళ్లి చదువుకుంది. డిగ్రీలో భారతి ఫస్ట్ క్లాస్ తెచ్చుకుంది. ఆ తర్వాత ఎమ్మెస్సీ పూర్తి చేసింది.

■ ఇల్లు లేదు.. ఉద్యోగం లేదు

భారతి నివసిస్తున్న ఇల్లు అసంపూర్ణ స్థితిలో ఉంది. గతంలో ఇందిరమ్మ ఇల్లు శాంక్షన్ అయితే డబ్బులేక నిర్మాణం సగంలోనే ఆపేయాల్సి వచ్చింది. ప్రొఫెసర్ కావాలన్నదే భారతి కోరిక. 'ప్రొఫెసర్ ఉద్యోగం వస్తే నేను నేర్చుకున్న జ్ఞానాన్ని మరి కొంతమంది విద్యార్థులకు పంచి చదువులో రాణించే విధంగా కృషి చేస్తాను' అంది భారతి. పీహెచ్‌డీ పట్టా వచ్చాక దానిని ఇంట్లో పెట్టి కూలి పనికి వెళుతోంది భారతి. టొమాటో చేనులో, బెండకాయ చేనులో పని చేస్తోంది. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 వరకు పని చేస్తే 150 రూపాయలు వస్తున్నాయి.

– రుషింగప్పగారి మునెప్ప,
శింగనమల, సాక్షి

పచ్చని సంసారానికి.. ఆకుపచ్చని ఆర్మీ

పచ్చని సంసారానికి గ్రీన్ ఆర్మీ కావాలి అంటున్నారు వారణాసిలోని కుషియారి గ్రామ వాసులు. ఈగ్రామంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన కులాల వాళ్లే ఎక్కువ. నిరుపేదలు కావడంతో విద్యాగంధం ఉన్న వాళ్లు తక్కువ. ఆర్థిక పరిస్థితులు అంతంతమాత్రమే. చాలా కుటుంబాల్లో.. పెద్దరికం వహించాల్సిన భర్తలు తాగుడు, మత్తుపదార్థాలకు బానిసలై భార్యలను కొట్టడం, తిట్టడం, ఇంట్లో ఖర్చులకు డబ్బులు అడిగితే తన్ని తరిమేయడం సర్వసాధారణమైంది. గత కొన్నేళ్లుగా భర్తల తీరుతో విసిగిపోయిన గ్రామ మహిళలకు రవి మిశ్రా అనే టీచర్ చుక్కానిలా దారిచూపుతున్నాడు.

భర్త బాధితురాలైన ఆశాదేవిని కలిసిన మిశ్రా... సమస్యలు ఆమె ఒక్కదానికే కాదు, ఆమె ఇరుగు పొరుగు వారి పరిస్థితులు కూడా అలానే ఉన్నాయని తెలుసుకున్నాడు. మీరంతా కలసికట్టుగా ఉంటే ఇవేమీ పెద్ద సమస్యలు కాదని చెప్పి, ఆశాదేవితోపాటు మరికొంతమంది మహిళలను కూడగట్టుకుని 2014లో 'గ్రీన్‌ఆర్మీ'ని ప్రారంభించారు. వ్యసనాలకు బానిసలైన భర్తలకు కౌన్సెలింగ్ ఇచ్చి సరైన దారిలో నడిపించడమే ఈ ఆర్మీ ముఖ్య ఉద్దేశ్యం. ఆర్మీలోని సభ్యులు పచ్చని రంగు చీర కట్టుకుని, కర్రలు పట్టుకుని ఎవరైనా ఇంట్లో భర్తలు తాగి గొడవచేస్తుంటే వెళ్లి ఆ వ్యక్తికి కౌన్సెలింగ్ ఇచ్చి సాధారణ స్థితికి తీసుకొస్తారు. లిక్కర్, మత్తుపదార్థాలకు బానిసలైన వారికి రకరకాలుగా కౌన్సెలింగ్ ఇచ్చి మంచి మనుషులుగా మార్చడానికి కృషిచేస్తోంది.


తాగుడుకు బానిసైన వ్యక్తికి కౌన్సెలింగ్ ఇస్తున్న గ్రీన్ ఆర్మీ

భర్తలతోపాటు.. గ్రామాభివృద్ధికి

ప్రస్తుతం ఈ ఆర్మీలో 1800 మంది సభ్యులు ఉన్నారు. ఈ ఆర్మీ చేస్తోన్న కార్యకలాపాలు చూసిన ఎంతోమంది ఇతర గ్రామాల్లో గులాబీ గ్యాంగ్ వంటి రకరకాల పేర్లతో ఆర్మీలను ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. మహిళలు తమను తాము రక్షించుకొనేందుకు ఆత్మరక్షణ విద్యలలో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తున్నారు. వారణాసి, మీర్జాపూర్ జిల్లాల్లోని చాలామంది మహిళలు ఈ ఆర్మీ ద్వారా భర్తలను మార్చుకుని సంతోషంగా జీవిస్తున్నారు. మూర్ఖపు భర్తలను మార్చడంతోపాటు, గృహహింస, వరకట్నం, మూఢాచారాలు నిర్మూలించేందుకు ఆర్మీలు కృషి చేస్తున్నాయి. ఈ ఆర్మీల వల్ల కుటుంబ పరిస్థితులు మెరుగుపడడమేగాక, గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తున్నాయి.


సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ

''నా పేరు ఆశాదేవి. పద్నాలుగేళ్లకే పెళ్లి అయ్యింది. ఐదుగురు పిల్లలు. నా భర్త ఎప్పుడూ కొట్టేవాడు. గర్భవతినని కూడా చూడకుండా హింసించేవాడు. పిల్లలు ఎదిగే కొద్దీ ఖర్చులు కూడా పెరిగాయి. కానీ ఆయన మాత్రం తాగడం మానలేదు. నన్ను కొట్టడం ఆపలేదు. ఆయన కొట్టిన దెబ్బలకు రాత్రులకు నిద్రపట్టేది కాదు. మూలుగుతూ పడుకున్న నన్ను మళ్లీ మళ్లీ కొట్టేవాడు. చలికాలం ఇంటి బయటకు నెట్టేసేవాడు. బాధలు తట్టుకోలేక చచ్చిపోదామని నిప్పు అంటించుకున్నాను. కానీ వేరేవాళ్లు కాపాడడంతో ప్రాణాలు రవి మిశ్రా హోప్ వెల్ఫేర్ ట్రస్ట్‌వాళ్లతో కలసి మా గ్రామానికి వచ్చారు. అప్పుడు నా పరిస్థితి, పిల్లలు స్కూలుకు కూడా వెళ్లడంలేదని తెలుసుకున్నారు. నేను నా బాధల గురించి వివరించాను. వారు ఇచ్చిన కౌన్సెలింగ్‌తో ఆయన తాగడం మానేశాడు. ఎనిమిదేళ్లుగా మంచి వ్యక్తిగా మారి, నన్ను పిల్లల్ని బాగా చూసుకుంటున్నాడు. ఆ తరువాతే నాలాంటి మహిళలను ఆదుకునేందుకు మిశ్రా తో కలిసి గ్రీన్ ఆర్మీని ఏర్పాటు చేశాము.'' ఆశా దేవిలాంటి వందలమంది మహిళలు గ్రీన్ ఆర్మీ ద్వారా సంసారాలను చక్కబెట్టుకుని ఆనందంగా జీవిస్తున్నారు.


గ్రీన్ ఆర్మీ సభ్యులతో రవి మిశ్రా

కిచెన్‌టిప్స్

పకోడీలు, బజ్జీలు క్రిస్పీగా రావాలంటే...

- పిండిని కలిపేటప్పుడు ఉండలు లేకుండా చక్కగా కలుపుకోవాలి.
- అరగంట ముందే పిండిని చల్లని నీటితో కలిపి పక్కన పెట్టుకోవాలి.
- పకోడీలు, బజ్జీలను నూనెలో వేసి డీప్‌ఫ్రై చేసేటప్పుడు పదేపదే తిప్పకూడదు. ఎక్కువగా తిప్పితే మెత్తగా మారతాయి. అవసరాన్ని బట్టి అప్పుడప్పుడు మాత్రమే తిప్పుతూ ఫ్రైచేయాలి.
- పచ్చిమిర్చి, పాలకూర, వంకాయ, అరటికాయ, బంగాళ దుంప వంటివాటితో బజ్జీలు వేసేముందు శుభ్రంగా కడిగి, కాటన్ గుడ్డతో తడిలేకుండా తుడిచి ఫ్యాన్ గాలికింద ఆరబెట్టాలి. తరువాత పిండిలో ముంచితే ముక్కలకు పిండి చక్కగా అంటుకుని బజ్జీలు క్రిస్పీగా, క్రంచీగా వస్తాయి.



యూత్ పల్స్

పాఠం కోసం ఫారిన్ వెళదాం చలోచలో!


ప్రతీకాత్మక చిత్రం

ఇంగ్లాండ్‌లో అడుగు పెడుతూనే 'ఎలాగో జ్ఞాపకం పెట్టుకొని కుడికాలే పెట్టాను. నిజానికి అదృష్టం బాగుంటే ఏ కాలు పెట్టినా ఇబ్బంది లేదు. బాగుండకపోతే ఏ కాలు పెట్టినా ఒక్కటే' అనుకుంటాడు పార్వతీశం. బారిష్టరు చదువు కోసం చిన్న పల్లెటూరు నుంచి ఇంగ్లాండ్‌కు వెళ్లిన పార్వతీశం తెలియని భాష, మనుషులు, సంస్కృతుల వల్ల ఎన్నో ఇబ్బందులు పడుతూ మనల్ని తెగ నవ్విస్తాడు. కాలం మారినంత మాత్రాన, చదువు కోసం వెళ్లినవారికి దేశం కాని దేశంలో సమస్యలు ఉండవని కాదు. అవి వేరే రకంగా ఉండవచ్చు. అవి ఏ రకంగా ఉన్నా సరే... యూత్ వాటిని లైట్‌గా తీసుకుంటుంది. విదేశీ యూనివర్శిటీలలో చదువుపై బోలెడు లవ్వు చూపుతోంది...

విదేశీ చదువు అనేది ఒకప్పుడు సంపన్న వర్గాల వారికి మాత్రమే పరిమితమైన విషయం. అయితే ఇప్పుడు దృశ్యం మారింది. ఆర్థికస్థాయి, చిన్నా, పెద్దా పట్టణాలు అనే తేడా లేకుండా ఎంతోమంది విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారు. ఎనభైలలో ఫారిన్ యూనివర్శిటీ అంటే ఎక్కుమందికి అమెరికాలోని యూనివర్శిటీలు మాత్రమే. ఇప్పుడు అమెరికా, ఆస్ట్రేలియా, కెనడాలతో పాటు రిమోట్ ఈస్ట్ యూరోపియన్ దేశాలపై కూడా యువత ఆసక్తి ప్రదర్శిస్తోంది.

'ఎందుకు ఇలా?' అనే ప్రశ్నకు రకరకాల సమాధానాలు వినిపిస్తాయి. అందులో ఒకటి...

'పాఠ్యపుస్తకాలను, తరగతి గదినీ దాటి మన విద్యావ్యవస్థ బయటికి రాలేకపోతోంది. పాఠ్యాంశం యూత్‌కు దగ్గర కాలేపోతోంది'

ఢిల్లీకి చెందిన పద్దెనిమిది సంవత్సరాల శ్రేయకు ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ అంటే ఆసక్తి. ఆ ఆసక్తి ఆమెను అమెరికాలోని 'జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ' వరకు తీసుకువచ్చింది. 'ఈ యూనివర్శిటీ డిగ్రీ మాత్రమే ఇవ్వదు. ఎంతో అనుభవ జ్ఞానాన్ని ఇస్తుంది' అంటుంది శ్రేయ. ఫ్లెక్సిబుల్ కరికులమ్ నుంచి ప్రపంచంలోనే అత్యున్నతమైన బోధన సిబ్బంది వరకు ఆ యూనివర్శిటీ గురించి చెప్పుకోదగిన అంశాలను ప్రస్తావిస్తుంది శ్రేయ.

'విద్యార్థులు తమను తాము వ్యక్తీకరించుకునే అనుభవ జ్ఞానాన్ని విదేశీ విశ్వవిద్యాలయాలు ఇస్తాయి' అంటున్నారు దిల్లీ యూనివర్శిటీ మాజీ వైస్-ఛాన్సలర్ దినేష్ సింగ్. అయితే 'అత్యున్నత ప్రమాణాలతో కూడిన చదువు' మాత్రమే మన విద్యార్థులు దేశం దాటడానికి కారణం కావడం లేదు.

'భిన్నమైన సాంస్కృతిక వాతావరణంలో గడపడం, ఇతర దేశాల విద్యార్థులతో కలిసి చదువుకొనే అవకాశం దానికదే ఒక ఎడ్యుకేషన్' అనే అభిప్రాయం కూడా విదేశీ విశ్వవిద్యాలయాలపై ఆసక్తికి కారణం అవుతుంది.

'విదేశీ యూనివర్శిటీలలో చదువుకోవడం అనేది మన విద్యావ్యవస్థను తక్కువ చేయడం కాదు. మన పరిధిని విస్తృతం చేసుకోవడం మాత్రమే' అంటుంది పుణెకు చెందిన సుమన.

దిల్లీకి చెందిన 19 సంవత్సరాల సైబా బజాజ్ కెనడాలోని 'యూనివర్శిటీ ఆఫ్ మనిటోబ'లో కంప్యూటర్ సైన్స్ చదువుతోంది.

'విదేశాలలో చదువు అనేది డిగ్రీలను మించినది. ఇది ఒక రకంగా సెల్ఫ్-జర్నీ' అంటుంది సైబా.

బెంగళూరుకు చెందిన ప్రతిభా జైన్ గ్రాఫిక్ డిజైనింగ్ కోర్సు చేయడానికి యూకేకు వెళ్లాలనుకుంటోంది. ఈ మాత్రం దానికి అక్కడిదాకా వెళ్లాలా! అనిపిస్తుందిగానీ ప్రతిభ వెర్షన్ వేరు.

'యూకేకు వెళ్లాలనుకోవడానికి కారణం... అక్కడి యూనివర్శిటీ ఫర్ ది క్రియేటివ్ ఆర్ట్స్‌కి ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ విషయంలో ప్రపంచంలో పెద్ద పేరు ఉండడం ఒక కారణం అయితే, సాంస్కృతిక వైవిధ్యం, గ్లోబల్ ఎక్స్‌పోజర్ అనేది రెండో కారణం. మూడోకారణం ఒకేరకమైన అభిరుచులు ఉన్న వారితో, సబ్జెక్ట్‌కు సంబంధించిన నిపుణులతో కలిసి నెట్‌వర్క్‌గా ఏర్పడే అవకాశం ఉండడం' అంటుంది ప్రతిభ.

జాబ్ మార్కెట్‌లో సులువుగా విజయం సాధిస్తారు అనే ధీమా వల్ల, మల్టీ కల్చరల్ యూనివర్శిటీలలో తమ పిల్లలను చదివించడానికి పేరెంట్స్ ఆసక్తి చూపుతున్నారు.

పక్కా ఫైనాన్స్ ప్లానింగ్, ఎడ్యుకేషన్ లోన్‌ల వల్ల పిల్లలను విదేశీ యూనివర్శిటీలలో చదివించడం చాలామంది పేరెంట్స్‌కు పెద్ద సమస్య కావడం లేదు. తల్లిదండ్రుల ఆసక్తిని గమనించి నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)లు ఎడ్యుకేషన్ లోన్స్‌పై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి. మరోవైపు 'అబ్రాడ్ ఎడ్యుకేషన్ లోన్స్'కు బెస్ట్ ఎన్‌బీఎఫ్‌సీలు ఏమిటి? అని తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు పేరెంట్స్.

టెస్ట్-ప్రిపేరేషన్, కంట్రీ, కోర్సు, యూనివర్శిటీ ఎంపిక, డాక్యుమెంటేషన్ ప్లానింగ్... మొదలైన వాటిలో స్టడీ అబ్రాడ్ కన్సల్టెన్సీలపై ఆధారపడుతోంది యూత్.

జపాన్ అయినా ఓకే

అబ్రాడ్ ఎడ్యుకేషన్ అనగానే అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, జర్మనీ... మొదలైన దేశాలు గుర్తుకు వస్తాయి తప్ప జపాన్ గుర్తుకు రావడం జరగదు. అయితే గణాంకాల ప్రకారం జపాన్ యూనివర్శిటీలలో చదివే మన విద్యార్థుల సంఖ్య పెరుగుతోంది. కొన్ని సంవత్సరాల క్రితం జపాన్‌లోని 20 యూనివర్శిటీల ప్రతినిధులు దిల్లీ, పుణె, చెన్నైలలో హైస్కూల్, కాలేజీలలో నిర్వహించిన ఎడ్యుకేషన్ ఫెయిర్‌కు మంచి స్పందన లభించింది.



స్పానిష్ బోలో

ప్రపంచ ప్రఖ్యాత భాషలలో స్పానిష్ ఒకటి. సుసంపన్నమైన సాంస్కృతిక చరిత్ర ఉన్న భాష ఇది. స్పానిష్‌ను సెకండ్ లాంగ్వేజ్‌గా తీసుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. ఎన్నో దేశాలలో ప్రజలతో కమ్యూనికేషన్ చేయడంలో, ఉద్యోగ అవకాశాల విషయంలో ఈ భాష ఉపయోగపడుతుంది. చదువు కోసం విదేశాలకు వెళ్లాలనుకుంటున్న విద్యార్థులు, ఇతరులను దృష్టిలో పెట్టుకొని వారికి స్పానిష్ నేర్పించడానికి హైదరాబాద్‌కు చెందిన సుభాష్ యాదవ్ 'స్పానిష్ బోలో' అనే వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నాడు.

కళ

చిత్రవిందు





అను చౌహాన్

**పంజాబీ-కెనడియన్ అను చౌహాన్ ఇలస్ట్రేటర్, వీడియో గేమ్ ఆర్టిస్ట్.
సాంస్కృతిక-సాహిత్య వైభవాన్ని కళలోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది అను.
ఆమె చిత్రాల్లో ఎన్నడూ చూడని మొక్కల నుంచి గ్లోబల్ ఫ్యాషన్ వరకు కనువిందు చేస్తాయి...**

కెనడాలో పుట్టి పెరిగిన అను చౌహాన్‌కు చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం అంటే ఇష్టం. నాలుగు సంవత్సరాల వయసులో స్క్రీన్‌పై కనిపిస్తున్న డిస్నీ కార్టూన్‌ను చూస్తూ బొమ్మ వేయడానికి ప్రయత్నించింది. హైస్కూల్ రోజులకు వచ్చేసరికి ఇలస్ట్రేషన్‌ను సీరియస్‌గా తీసుకుంది. ఆ సమయంలోనే ఇలస్ట్రేటర్ కావాలని బలంగా అనుకుంది. అను అభిరుచికి తల్లిదండ్రులు ఎంతో ప్రోత్సాహం ఇచ్చేవారు.

ఇంటరాక్టివ్ ఆర్ట్స్ అండ్ టెక్నాలజీలో డిగ్రీ చేసి, యానిమేషన్ సబ్జెక్ట్ చదువుకున్న అను చౌహాన్ తనలోని సృజనాత్మకతను కాపాడుకోవడానికి నిత్యనూతనంగా ఆలోచించేది. చిత్రకళలో తనదైన శైలిని రూపొందించుకునే ప్రయత్నం చేసేది.

చదువు పూర్తయిన తరువాత మొబైల్ గేమ్ ఆర్టిస్ట్‌గా ప్రస్థానం మొదలుపెట్టింది. అంతర్జాలంలో పోస్ట్ చేసిన ఆమె ఆర్ట్ వర్క్స్‌కు మంచి స్పందన లభించేది. కొద్ది కాలంలోనే ఆమె ఫాలోవర్స్ సంఖ్య వందలు దాటి వేలల్లోకి వచ్చింది.

'నా ప్రతి చిత్రం ఒక కథ చెప్పాలనే లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకున్నాను. నా కథలోని పాత్రలు దక్షిణ ఆసియాకు చెందినవి. ఎక్కడో ఆకాశం నుంచి ఊడిపడినట్లు కాకుండా ఆ పాత్రలు మనకు సుపరిచితమైనవి అన్నట్లుగా ఉండాలి. బొమ్మల ద్వారా కూడా స్త్రీ సాధికారతకు సంబంధించిన విషయాలను ప్రచారం చేయవచ్చు' అంటుంది అను. ప్రపంచంలో ఏ మూల ఏ కొత్త డిజైన్ వచ్చినా దాన్ని లోతుగా అధ్యయనం చేస్తుంటుంది అను. 1960– 1970లలో వచ్చిన ఫ్యాషన్ అండ్ ఆర్ట్ వర్క్స్ అంటే ఆమెకు చాలా ఇష్టం.

'వీడియో గేమ్స్, డిస్నీ, బాలీవుడ్...ఇలా ఎన్నో అంశాలు నా ఆర్ట్‌పై ప్రభావం చూపాయి' అంటున్న అను చౌహాన్ తన చుట్టూ ఉన్న వాతావరణం నుంచి కూడా స్ఫూర్తి పొందుతుంది. న్యూయార్క్ టైమ్స్ బెస్ట్‌సెల్లింగ్ బుక్ 'అరు షా అండ్ ది ఎండ్ ఆఫ్ టైమ్' గ్రాఫిక్ ఎడాప్షన్ కోసం వేసిన చిత్రాలు ఆకట్టుకున్నాయి. మహక్ జైన్ రాసిన 'భరతనాట్యం ఇన్ బాలెట్ షూస్' పుస్తకానికి అను చౌహాన్ వేసిన బొమ్మలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. పిల్లల కోసం అను రూపొందించిన 'ఏ దుపట్టా ఈజ్' 'హెన్నా ఈజ్' పుస్తకాలు సూపర్‌హిట్ అయ్యాయి.

'క్రియేటివ్ వర్క్ ద్వారా జీవితాన్ని సంతోషంగా గడపాలనేది నా కోరిక. వెబ్‌కామిక్ చేయాలనేది నా కల. జీవితం ఎప్పుడు, ఎక్కడ, ఎలా ముగుస్తుందో తెలియదు అనే ఎరుకతో చిత్రకళ ద్వారా ప్రతి క్షణం ఉత్సాహంగా ఉండడానికి ప్రయత్నిస్తాను' అంటుంది అను.



బంగ్లాదేశ్‌తో నేడు భారత్ రెండో వన్డే

సిరీస్‌లో నిలవాలంటే తప్పనిసరిగా గెలవాల్సిన స్థితిలో... బంగ్లాదేశ్ మహిళల జట్టుతో నేడు జరిగే రెండో వన్డే మ్యాచ్‌లో భారత జట్టు బరిలోకి దిగనుంది. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా మిర్పూర్‌లోనే జరిగిన తొలి వన్డేలో 40 పరుగుల తేడాతో ఓడిపోయింది. వన్డే ఫార్మాట్‌లో బంగ్లాదేశ్ చేతిలో భారత్‌కిదే తొలి ఓటమి. నేటి మ్యాచ్‌లో భారత్ నెగ్గాలంటే సమష్టి ప్రదర్శన చేయాల్సిన అవసరం ఉంది. బ్యాటర్లు స్మృతి, ప్రియా పూనియా, జెమీమా రోడ్రిగ్స్‌తోపాటు హర్మన్ రాణించడంపై భారత విజయావకాశాలు ఆధార పడి ఉంటాయి.

ఆరో ర్యాంక్‌లో స్మృతి మంధాన

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల వన్డే ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ ఓపెనర్ స్మృతి మంధాన ఒక స్థానం మెరుగుపర్చుకుంది. తాజా ర్యాంకింగ్స్‌లో స్మృతి 704 రేటింగ్ పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది. భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ రెండు స్థానాలు పడిపోయి 702 పాయింట్లతో ఎనిమిదో ర్యాంక్‌కు చేరుకుంది. బౌలర్ల ర్యాంకింగ్స్‌లో రాజేశ్వరి గైక్వాడ్ తొమ్మిదో ర్యాంక్‌లో, ఆల్‌రౌండర్ల ర్యాంకింగ్స్‌లో దీప్తి శర్మ ఏడో ర్యాంక్‌లో ఉన్నారు.



సింధు ర్యాంక్ 17



న్యూఢిల్లీ: ఈ ఏడాది ఒక్క టైటిల్ కూడా నెగ్గలేకపోయిన భారత స్టార్ బ్యాడ్మింటన్ ప్లేయర్ పీవీ సింధు ప్రదర్శన ఆమె ర్యాంకింగ్స్‌పై ప్రభావం చూపిస్తోంది. గతవారం యూఎస్ ఓపెన్‌లో క్వార్టర్ ఫైనల్లో ఓడిపోయిన పీవీ సింధు... మంగళవారం విడుదల చేసిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) ర్యాంకింగ్స్‌లో ఐదు స్థానాలు పడిపోయింది. గతవారం 12వ ర్యాంక్‌లో నిలిచిన సింధు తాజాగా 17వ ర్యాంక్‌కు చేరుకుంది. గత పదేళ్లలో సింధు అత్యల్ప ర్యాంక్ ఇదే కావడం గమనార్హం. సింధు చివరిసారి 2013 జనవరిలో 17వ ర్యాంక్‌లో నిలిచింది. ఈ ఏడాది ఇప్పటి వరకు 12 టోర్నీలు ఆడిన సింధు మాడ్రిడ్ మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచింది. మలేసియా మాస్టర్స్ టోర్నీ, కెనడా ఓపెన్‌లో సెమీ ఫైనల్‌కు చేరుకుంది. ప్రస్తుతం కొరియా ఓపెన్ టోర్నీలో సింధు బరిలో ఉంది.

కొత్త కోచ్‌గా హఫీజ్ హషీమ్

పారిస్ ఒలింపిక్స్ క్వాలిఫయింగ్ ప్రారంభం కావడంతో పీవీ సింధు కొత్త వ్యక్తిగత కోచ్‌ను నియమించుకుంది. 2003 ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, మలేసియా మాజీ ప్లేయర్ మొహమ్మద్ హఫీజ్ హషీమ్ తన వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరిస్తాడని మంగళవారం సింధు ట్విటర్ వేదికగా ప్రకటించింది.

2026 కామన్వెల్త్ గేమ్స్‌కు ఆతిథ్యమివ్వలేం: ఆస్ట్రేలియా

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ప్రతిష్టాత్మక కామన్వెల్త్ క్రీడల ఆతిథ్యం నుంచి వైదొలగింది. 12 రోజుల క్రీడల కోసం ఏకంగా రూ. 39 వేల కోట్లు (7 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు) వెచ్చించడం తగదని నిర్ధారించుకున్న విక్టోరియా రాష్ట్రం కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించలేమని కామన్వెల్త్ గేమ్స్ సమాఖ్య (సీజీఎఫ్)కు స్పష్టం చేసింది. బిడ్డింగ్‌లో పాల్గొని 2026 ఆతిథ్య హక్కుల్ని ఆస్ట్రేలియా పొందింది. ఆ సమయంలో రూ. 14 వేల కోట్లు (2.6 బిలియన్ ఆస్ట్రేలియన్ డాలర్లు) బడ్జెట్ సరిపోతుందని భావించిన ఆస్ట్రేలియాకు తాజా బడ్జెట్ అంచనా తలకిందులు చేసింది. దీంతో అంత బడ్జెట్‌తో వచ్చే లాభం కన్న ఆర్థిక నష్టమే ఎక్కువని భావించిన ఆస్ట్రేలియా కామన్వెల్త్‌కు బైబై చెప్పింది. 2006లో విక్టోరియా రాష్ట్రంలోని మెల్‌బోర్న్‌లో కామన్వెల్త్ గేమ్స్ జరిగాయి. బర్మింగ్‌హామ్–2022 కామన్వెల్త్ గేమ్స్‌కు ముందు 2018లో ఆస్ట్రేలియాలోని గోల్డ్‌కోస్ట్ నగరం ఆతిథ్యమిచ్చింది.

'గిన్నిస్'లోకి సాత్విక్ స్మాష్...

బ్యాడ్మింటన్‌లో భారత డబుల్స్ స్టార్ రికార్డు



సాకా (జపాన్): తెలుగుతేజం సాత్విక్ సాయిరాజ్ రాంకీ రెడ్డి ఇన్నాళ్లూ ఇంటాబయటా డబుల్స్ టైటిల్స్‌తో పతాక శీర్షికల్లో నిలిచాడు. తాజాగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ బ్యాడ్మింటన్ స్టార్ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు'ల్లోకెక్కాడు. చిరాగ్ శెట్టితో కలిసి అతను ఇటీవల ఇండోనేసియా ఓపెన్‌లో పురుషుల డబుల్స్ టైటిల్ గెలిచాడు. మేటి డబుల్స్ షట్లర్‌గా రాటుదేలిన సాత్విక్‌కు టైటిళ్లు కొత్తేం కాదు. అయితే తాజాగా బ్యాడ్మింటన్ చరిత్రలో అత్యంత వేగవంతమైన స్మాష్‌తో సాత్విక్ రికార్డు సృష్టించాడు. జపాన్‌కు చెందిన ప్రముఖ క్రీడా ఉపకరణాల సంస్థ యోనెక్స్ తమ ఫ్యాక్టరీలో ఇటీవల నిర్వహించిన టెస్టులో సాత్విక్ రాకెట్ వేగంతో స్మాష్ కొట్టాడు. సాత్విక్ స్మాష్‌కు షటిల్ గంటకు 565 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లింది. ఫార్ములావన్ సర్క్యూట్‌లో రయ్ రయ్‌మని రాకెట్ వేగంతో దూసుకెళ్లే కారు వేగం (గంటకు 372.6 కి.మీ.) కంటే కూడా సాత్విక్ స్మాష్ వేగమే ఎక్కువ! బ్యాడ్మింటన్‌లో ఇది అసాధారణ వేగం. దీంతో దశాబ్దం క్రిందట మలేసియన్ షట్లర్ తన్ బూన్ హియాంగ్ (2013లో) గంటకు 493 కి.మీ. వేగంతో కొట్టిన స్మాష్ రికార్డును సాత్విక్ బద్దలుకొట్టాడు. తద్వారా 'ఫాస్టెస్ట్ స్మాష్' రికార్డును సాత్విక్ సాయిరాజ్ తన పేరిట గిన్నిస్ బుక్‌లో లిఖించుకున్నాడు. మహిళల విభాగంలో మలేసియా షట్లర్ తన్ పియర్లీ గంటకు 438 కి.మీ. వేగంతో కొట్టిన స్మాష్ రికార్డు కూడా గిన్నిస్ బుక్‌లో చోటు దక్కించుకుంది.

ప్రిక్వార్టర్స్‌లోకి ప్రవేశం

ప్రస్తుతం కొరియా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో ఆడుతున్న సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీ శుభారంభం చేసింది. మంగళవారం జరిగిన పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్–చిరాగ్ ద్వయం 21–16, 21–14తో సుపక్ జోమ్కో–కిటినిపోంగ్ కెద్రెన్ (థాయ్‌లాండ్) జంటను ఓడించి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. భారత్‌కే చెందిన ఎం.ఆర్.అర్జున్–ధ్రువ్ కపిల జోడీ తొలి రౌండ్‌లోనే నిష్క్రమించింది.

ధనుశ్ శ్రీకాంత్ జట్టుకు స్వర్ణ పతకం

- ఉమామహేశ్‌కు కాంస్యం
- ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్



స్వర్ణ పతకాలతో పార్థ్ మానె, అభినవ్ షా, ధనుశ్ శ్రీకాంత్


కాంస్యంతో ఉమామహేశ్

చాంగ్వాన్ (కొరియా): గురి తప్పని ప్రదర్శనతో భారత యువ షూటర్లు ప్రపంచ జూనియర్ షూటింగ్ చాంపియన్‌షిప్‌లో తమ పతకాల వేటను కొనసాగిస్తున్నారు. మంగళవారం భారత్‌కు ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఒక కాంస్య పతకం లభించాయి. పురుషుల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో తెలంగాణకు చెందిన బధిర షూటర్ ధనుశ్ శ్రీకాంత్, అభినవ్ షా, పార్థ్ రాకేశ్ మానెలతో కూడిన భారత బృందం పసిడి పతకం గెల్చుకుంది. ధనుశ్ శ్రీకాంత్, అభినవ్, పార్థ్ బృందం మొత్తం 1886.7 పాయింట్లు స్కోరు చేసి అగ్ర స్థానంలో నిలిచింది. మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ టీమ్ విభాగంలో గౌతమి భానోత్, సోనమ్ మస్కర్, స్వాతి చౌధరీలతో కూడిన భారత జట్టు 1886.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకుంది.

10 మీటర్ల ఎయిర్ రైఫిల్ వ్యక్తిగత విభాగంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్ షూటర్ మద్దినేని ఉమామహేశ్ కాంస్య పతకం సాధించాడు. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో విజయవాడకు చెందిన ఉమామహేశ్ 229 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచాడు. రొమైన్ అఫ్రెరె (ఫ్రాన్స్; 251.2 పాయింట్లు) స్వర్ణం, హాంగ్‌హావో వాంగ్ (చైనా; 251 పాయింట్లు) రజతం సాధించారు. ఉమామహేశ్‌తోపాటు ఫైనల్లో పోటీపడ్డ అభినవ్ షా 207.2 పాయింట్లతో నాలుగో స్థానంలో, ధనుశ్ శ్రీకాంత్ 164.9 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచారు. 64 మంది షూటర్లు పోటీపడ్డ క్వాలిఫయింగ్‌లో అభినవ్ షా 631.4 పాయింట్లతో తొలి స్థానంలో, ధనుశ్ శ్రీకాంత్ 629.9 పాయింట్లతో మూడో స్థానంలో, ఉమామహేశ్ 627.9 పాయింట్లతో ఎనిమిదో స్థానంలో నిలిచి ఫైనల్‌కు అర్హత సాధించారు.

మరోవైపు జూనియర్ మహిళల స్కీట్ ఈవెంట్‌లో భారత షూటర్ రైజా ధిల్లాన్ రజత పతకం సాధించింది. ఆరుగురు షూటర్లు పాల్గొన్న ఫైనల్లో రైజా, మిరోస్లావా హకోవా (స్లొవేకియా) 51 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే స్వర్ణ, రజత పతకాల కోసం 'షూట్ ఆఫ్' నిర్వహించగా మిరోస్లావా రెండు పాయింట్లు స్కోరు చేసి స్వర్ణం ఖరారు చేసుకోగా... ఒక పాయింట్ సాధించిన రైజాకు రజతం దక్కింది. ప్రస్తుతం భారత్ 4 స్వర్ణాలు, 3 రజతాలు, 3 కాంస్యాలతో కలిపి మొత్తం 10 పతకాలతో రెండో స్థానంలో ఉంది.

జర్మనీ చేతిలో భారత్ ఓటమి

వీస్‌బాడెన్ (జర్మనీ): ఆసియా క్రీడలకు సన్నాహాల్లో భాగంగా జర్మనీలో పర్యటిస్తున్న భారత మహిళల హాకీ జట్టు ఓటమితో సిరీస్‌ను ఆరంభించింది. రెండు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా జర్మనీతో మంగళవారం జరిగిన తొలి మ్యాచ్‌లో సవితా పూనియా సారథ్యంలోని భారత జట్టు 1–4 గోల్స్ తేడాతో ఓడిపోయింది. భారత్ తరఫున వైష్ణవి విఠల్ ఫాల్కే (29వ ని.లో) ఏకైక గోల్ చేసింది. జర్మనీ జట్టుకు నైకీ లోరెంజ్ (6వ, 59వ ని.లో), జెటీ ఫ్లెషిట్జ్ (14వ, 43వ ని.లో) రెండు గోల్స్ చొప్పున అందించారు.

బ్రిజ్‌భూషణ్‌కు బెయిల్... బజరంగ్, వినేశ్‌లకు బెర్త్‌లు

- నేరుగా ఆసియా క్రీడల జట్టులోకి భారత స్టార్ రెజ్లర్ల ఎంపిక



న్యూఢిల్లీ: రెజ్లర్లపై లైంగిక వేధింపుల కేసులో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌ఐ) అధ్యక్షుడు, బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్‌కు ఢిల్లీ కోర్టు రెండు రోజుల మధ్యంతర బెయిల్ ఇవ్వగా... డబ్ల్యూఎఫ్‌ఐ అడ్‌హక్ కమిటీ స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్‌లకు నేరుగా ఆసియా క్రీడల బెర్త్‌లు ఖరారు చేసింది. మరోవైపు ఈ ఇద్దరు రెజ్లర్లకు కమిటీ ఇచ్చిన మినహాయింపుపై విమర్శలు వస్తున్నాయి. ఇదిలా ఉంటే సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీం కోర్టు) డబ్ల్యూఎఫ్‌ఐ ఎన్నికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జస్టిస్ అనిరుధ బోస్, జస్టిస్ ఎస్వీ భట్టిలతో కూడిన ద్విసభ్య బెంచ్ గతంలో గువాహటి హైకోర్టు విధించిన 'స్టే'ను కొట్టివేసింది. వెంటనే ఎన్నికల ప్రక్రియను మొదలు పెట్టాల్సిందిగా డబ్ల్యూఎఫ్‌ఐని ఆదేశించింది. అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ హర్జీత్ సింగ్ రూ.. 25 వేల పూచీకత్తుపై బ్రిజ్‌భూషణ్‌కు, డబ్ల్యూఎఫ్‌ఐ సహాయక కార్యదర్శి వినోద్ తోమర్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేసి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

నేరుగా ఆసియా క్రీడలకు...

రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌పై పోరాటానికి దిగిన ఒలింపిక్ పతక విజేత బజరంగ్, ఆసియా గేమ్స్ చాంపియన్ వినేశ్ ఫొగాట్ ట్రయల్స్ లేకుండానే బెర్త్‌లు పొందారు. పురుషుల 65 కేజీల కేటగిరీలో బజరంగ్... మహిళల 53 కేజీల విభాగంలో వినేశ్ చైనాలో జరిగే ఆసియా క్రీడల్లో పోటీ పడతారు. అయితే ఈ విభాగాల్లోనూ ట్రయల్స్ నిర్వహించి విజేతలను స్టాండ్‌బైగా అక్కడికి తీసుకెళ్తారు.

షకీల్ అజేయ డబుల్ సెంచరీ



పాక్ జట్టుకు 149 పరుగుల ఆధిక్యం

గాలె: శ్రీలంక జట్టుతో జరుగుతున్న తొలి టెస్టులో పాకిస్తాన్ జట్టుకు 149 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. ఆట మూడో రోజు ఓవర్‌నైట్ స్కోరు 221/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన పాకిస్తాన్ 121.2 ఓవర్లలో 461 పరుగులవద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ సౌద్ షకీల్ (361 బంతుల్లో 208 నాటౌట్; 19 ఫోర్లు) అజేయ డబుల్ సెంచరీ సాధించాడు. ఆగా సల్మాన్ (83; 9 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి షకీల్ ఆరో వికెట్‌కు 177 పరుగులు జోడించాడు. లంక బౌలర్లలో రమేశ్ మెండిస్ ఐదు వికెట్లు, ప్రభాత్ జయసూర్య మూడు వికెట్లు పడగొట్టారు. 149 పరుగులతో వెనుకబడి రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి వికెట్ కోల్పోకుండా 14 పరుగులు చేసింది.

సినిమా

బాలీవుడ్ కబురు?


కీర్తీ సురేశ్

హీరోయిన్ కీర్తీ సురేశ్‌కు బాలీవుడ్ నుంచి కబురు అందినట్లు తెలుస్తోంది. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ ఓ సినిమా నిర్మించనున్న సంగతి తెలిసిందే. తమిళ దర్శకుడు కాలిస్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారు. కాగా ఈ చిత్రంలోని హీరోయిన్ పాత్రకు చిత్ర యూనిట్ కీర్తీ సురేష్‌ను సంప్రదించినట్లు బాలీవుడ్‌లో ప్రచారం సాగుతోంది. ఒకవేళ ఈ వార్త నిజమైతే కీర్తికి బాలీవుడ్‌లో ఇదే తొలి చిత్రం అవుతుంది. ఈ సంగతి ఇలా ఉంచితే.. నిజానికి కీర్తీ సురేష్ బాలీవుడ్ ఎంట్రీ ఎప్పుడో జరగాల్సింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన 'మైదాన్'కు తొలుత హీరోయిన్‌గా ఆమెనే తీసుకున్నారు. కొన్ని కారణాలవల్ల 'మైదాన్' చిత్రం నుంచి కీర్తీ తప్పుకోవాల్సి వచ్చింది. ఆ పాత్రను ప్రియమణి చేశారు. ఇలా కీర్తీ సురేష్ బాలీవుడ్ ఎంట్రీ వాయిదా పడింది. ఇక 'మైదాన్' చిత్రం ఇంకా రిలీజ్ కాని సంగతి తెలిసిందే.

కొత్త ప్రపంచంపై నమ్మకంతో...


దీపికా పదుకోన్

ఆమె కళ్లు ఎటో తీక్షణంగా చూస్తున్నాయి. దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనబడుతోందామె. 'ప్రాజెక్ట్ కె'లో దీపికా పదుకోన్ చేస్తున్న పాత్ర లుక్ ఇది. ''ఆమె కళ్లల్లో కొత్త ప్రపంచంపై నమ్మకం కనిపిస్తోంది'' అంటూ దీపికా లుక్‌ని విడుదల చేసింది చిత్ర యూనిట్. ప్రభాస్ హీరోగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'ప్రాజెక్ట్ కె'. ఈ చిత్రం ద్వారా బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకోన్ తెలుగు చిత్ర పరిశ్రమకు కథానాయికగా పరిచయమవుతున్నారు. సైన్స్ ఫిక్షన్ నేపథ్యంలో సి. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. 'ప్రాజెక్ట్ కె' టైటిల్, ట్రైలర్, సినిమా విడుదల తేదీని ఈ నెల 20న అమెరికాలోని 'శాన్ డియాగో కామిక్– కాన్ 2023' వేడుకలో లాంచ్ చేస్తారు. ఈ వేడుకకు ప్రభాస్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, నాగ్ అశ్విన్, అశ్వనీదత్ హాజరు కానున్నారు.


ఎన్టీఆర్


మహేశ్ బాబు

ప్రతీ క్యారెక్టర్ సవాల్‌గా అనిపించక పోవచ్చు. అయితే కొన్ని క్యారెక్టర్స్ మాత్రం చాలెంజ్ చేస్తాయి. మంచి మేకోవర్‌ని డిమాండ్ చేస్తాయి. అలాంటి క్యారెక్టర్స్‌ని చాలెంజ్‌గా తీసుకుని మేకోవర్ అయిపోతుంటారు స్టార్స్. ఇప్పుడు కొందరు స్టార్స్ కొత్త మేకోవర్ కోసం షూటింగ్స్ నుంచి కొంత గ్యాప్ తీసుకుని, స్పెషల్‌గా ట్రైన్ కావాలనుకుంటున్నారు. ఆ స్టార్స్ గురించి తెలుసుకుందాం.

కొత్త మేకోవర్... కొంత గ్యాప్

ఫారెస్ట్‌లో యాక్షన్

దాదాపు మూడు నెలల పాటు మహేశ్‌బాబు ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారని తెలుస్తోంది. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఒక సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఆఫ్రికన్ ఫారెస్ట్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ అడ్వెంచరస్ ఫిల్మ్ ఇది. ఈ సినిమా షూటింగ్‌ను వచ్చే ఏడాది ప్రారంభంలో స్టార్ట్ చేయాలనుకుంటున్నారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు దర్శక–రచయిత విజయేంద్రప్రసాద్. ఈ చిత్రంలో హీరో మహేశ్‌బాబు సరికొత్త సర్‌ప్రైజింగ్ లుక్‌లో కనిపించనున్నారట. ఇందు కోసం మహేశ్ మూడు నెలల కఠోర శ్రమతో కూడిన ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారన్నది ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తున్న మాట. ప్రస్తుతం మహేశ్‌బాబు 'గుంటూరు కారం' సినిమాతో బిజీగా ఉన్నారు. 'అతడు', 'ఖలేజా' చిత్రాల తర్వాత మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వస్తున్న ఫిల్మ్ ఇది. ఈ సినిమా షూటింగ్ మొత్తం ఓ కొలిక్కి వచ్చిన తర్వాత కొన్నాళ్లు గ్యాప్ తీసుకుంటారట మహేశ్. ఈ గ్యాప్‌లో రాజమౌళి సినిమా కోసం ప్రత్యేక శిక్షణ తీసుకుంటారని తెలిసింది.


అల్లు అర్జున్

మరో సర్‌ప్రైజ్

'పుష్ప' చిత్రంలో అల్లు అర్జున్ మేకోవర్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. మరోసారి ఆడియన్స్ వావ్ అనేలా అల్లు అర్జున్ మేకోవర్, లుక్ ఉండబోతున్నాయనే టాక్ వినిపిస్తోంది. 'జులాయి', 'సన్నాఫ్ సత్యమూర్తి', 'అల.. వైకుంఠపురములో..' చిత్రాల తర్వాత హీరో అల్లు అర్జున్, దర్శకుడు త్రివిక్రమ్ కాంబినేషన్‌లో మరో సినిమా తెరకెక్కనుంది. ఈ చిత్రంలో అల్లు అర్జున్ గెటప్ కొత్తగా ఉంటుందని, ఈ గెటప్ మేకోవర్ కోసం అల్లు అర్జున్ కొంత టైమ్ తీసుకోవాలనుకుంటున్నారని సమాచారం. ప్రస్తుతం సుకుమార్ దర్శకత్వంలో 'పుష్ప' మలి భాగం 'పుష్ప: ది రూల్'తో బిజీగా ఉన్నారు అల్లు అర్జున్. ఈ సినిమా తర్వాత త్రివిక్రమ్ సినిమా కోసం వర్కౌట్ చేస్తారని తెలుస్తోంది.

వార్ ట్రైనింగ్

ఏ పాత్రలోనైనా లీనమైపోతారు ఎన్టీఆర్. ఇందుకోసం ఆయన ఎంతటి రిస్క్ అయినా తీసుకుంటారు. క్లిష్టమైన వర్కౌట్స్ చేయడానికి కూడా వెనకాడరు. 'అరవింద సమేత వీర రాఘవ', 'ఆర్ఆర్ఆర్' వంటి సినిమాల కోసం ఎన్టీఆర్ కష్టపడి ఎలా మేకోవర్ అయ్యారో తెలిసిందే. ఎన్టీఆర్ మరోసారి మేకోవర్ అయ్యేందుకు రెడీ అవుతున్నారు. హిందీలో యశ్‌రాజ్ చోప్రా బ్యానర్‌పై స్పై యూనివర్స్‌లో భాగంగా ఆదిత్యా చోప్రా 'వార్ 2' చిత్రం నిర్మించనున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో హృతిక్ రోషన్, ఎన్టీఆర్ మెయిన్ లీడ్ రోల్స్ చేయనున్నారు. ఈ కథ రీత్యా ఎన్టీఆర్ పాత్రలో కాస్త నెగటివ్ షేడ్స్ ఉంటాయనే ప్రచారం జరుగుతోంది. 'వార్ 2' సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది చివర్లో ప్రారంభించాలనుకుంటున్నారు. ఈ సినిమాలోని తన రోల్, లుక్ కోసం ఎన్టీఆర్ ప్రత్యేక శిక్షణ తీసుకోనున్నారనే టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం కొరటాల శివ దర్శకత్వంలో 'దేవర' సినిమాలో ఎన్టీఆర్ నటిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్‌ని సెప్టెంబరు చివరికల్లా పూర్తి చేసి, ఆ తర్వాత కొంత గ్యాప్ తీసుకుని 'వార్ 2' ట్రైనింగ్‌లో బిజీ అయిపోయి, డిసెంబరులో షూటింగ్‌లో జాయిన్ అవ్వాలన్నది ఎన్టీఆర్ ప్లాన్ అట.


సాయిధరమ్ తేజ్


ఆరు నెలల విరామం

దాదాపు ఆరు నెలలు బ్రేక్ తీసుకోవాలనుకుంటున్నారు సాయిధరమ్ తేజ్. ఫిజికల్‌గా ఇంకొంచెం స్ట్రాంగ్‌గా అవ్వాలనుకుంటున్నానని, ఇందు కోసం ఆరు నెలల సమయం పడుతుందని సాయిధరమ్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. సాయిధరమ్ తర్వాతి చిత్రం సంపత్ నంది దర్శకత్వంలో ఉంటుంది. భారీ బడ్జెట్ యాక్షన్ ఫిల్మ్‌గా ఈ సినిమా తెరకెక్కనుంది. సో.. ఆరు నెలల బ్రేక్‌లో సాయిధరమ్ ఫిట్‌నెస్ కోసం చేసే వర్కౌట్స్ ఈ సినిమాకు కూడా ఉపయోగపడతాయని, తను సరికొత్త మాస్ లుక్‌లో కనిపించే అవకాశం ఉందని భోగట్టా.

ఇలా షూటింగ్స్ నుంచి కొంత గ్యాప్ తీసుకుని తమ కొత్త సినిమాల గెటప్‌ల కోసం ట్రైనింగ్ తీసుకోవడానికి మరికొందరు స్టార్స్ కూడా రెడీ అవుతున్నారు.

రీల్స్

మీ ప్రేమ చూపిస్తూనే ఉండాలి


విజయ్ దేవరకొండ

''బేబీ'ని సాయి రాజేష్ నిజాయతీగా తీశాడు. అందుకే ప్రేక్షకులు ఇంత పెద్ద విజయం అందించారు. ఆనంద్‌కి వచ్చిన సక్సెస్‌కు గర్వంగా ఉంది. విరాజ్, వైష్ణవిలకు కూడా మంచి పేరొచ్చింది. 'బేబీ' చిత్రంపై మీ (ప్రేక్షకులు) ప్రేమ చూపిస్తూ ఉండాలి'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య, విరాజ్ అశ్విన్ లీడ్ రోల్స్‌లో సాయి రాజేష్ దర్శకత్వం వహించిన చిత్రం 'బేబీ'. ఎస్‌కేఎన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 14న విడుదలైంది. ఈ సందర్భంగా నిర్వహించిన 'కల్ట్ బ్లాక్ బస్టర్ సెలబ్రేషన్స్'కి ముఖ్య అతిథులుగా విజయ్ దేవరకొండ, నిర్మాతలు అల్లు అరవింద్, వై. రవిశంకర్, బన్నీ వాసు హాజరయ్యారు. 'బేబీ' యూనిట్ నుంచి ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి, ఎస్‌కేఎన్, సాయిరాజేశ్ పాల్గొన్నారు.

ఆశ్చర్యపోతారు...


అనిల్ కన్నెగంటి

అశ్విన్‌బాబు, నందితా శ్వేత జంటగా అనిల్ కన్నెగంటి దర్శకత్వం వహించిన చిత్రం 'హిడింబ'. అనిల్ సుంకర సమర్పణలో గంగపట్నం శ్రీధర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ– ''ఫిక్షనల్ హిస్టారికల్ టచ్ ఉన్న ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'హిడింబ'. ఈ సినిమాలో హిడింబాసురుడి లక్షణాలు ఉన్న ఓ తెగ గురించిన ప్రస్తావించాం. అందుకే 'హిడింబ' టైటిల్ పెట్టాం. స్క్రీన్‌ప్లే ప్రస్తుత కాలంలోనే జరుగుతుంది. అయితే కథకు 1908 నాటి టచ్ ఉంటుంది. కథలో ఉన్న ఓ షాకింగ్ పాయింట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది'' అన్నారు.

మాస్ ఎంటర్‌టైనర్


ఇవానా, ఆశిష్

'రౌడీ బాయ్స్' ఫేమ్ ఆశిష్ హీరోగా నటిస్తున్న రెండో చిత్రం 'సెల్ఫిష్'. కాశీ విశాల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో ఇవానా హీరోయిన్. సుకుమార్ రైటింగ్స్‌తో కలిసి 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్నారు. యూత్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతోన్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ చిత్రానికి కెమెరా: ఆచార్య వేణు, సంగీతం: మిక్కీ జె. మేయర్.

ప్రేమ.. అభిమానం


అర్జున్ దాస్, దుషారా

అర్జున్ దాస్, దుషారా విజయన్ జంటగా నటించిన చిత్రం 'బ్లడ్ అండ్ చాక్లెట్'. ఎస్ పిక్చర్స్‌పై ప్రముఖ దర్శకుడు శంకర్ సమర్పణలో రూపొందిన ఈ సినిమా తెలుగు, తమిళ భాషల్లో ఈ నెల 21న విడుదలకానుంది. ఈ మూవీని తెలుగులో ఎస్ఆర్‌డీఎస్ సంస్థపై దేవసాని శ్రీనివాసరెడ్డి రిలీజ్ చేస్తున్నారు. ''ఈ సినిమాలో ప్రేమ, అభిమానం, మంచి ఎమోషన్స్ ఉంటాయి'' అన్నారు వసంత బాలన్.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	205	66,795
నిఫ్టీ ▲	38	19,749

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	14,328	▲	83
డోజోన్స్	34,889	▲	304
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,454	▲	47
డాక్స్	16,125	▲	57
షాంఘై	3,198	▼	12
నికాయ్	32,494	▲	103

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో – ముంబై

బంగారం (24 క్యారట్)	59,440	▲	170
బంగారం (22 క్యారట్)	59,202	▲	169
వెండి (కిలో)	75,181	▲	115

పాన్ పనిచేయకపోతే అధికారులను సంప్రదించాలి

ఎన్‌ఆర్‌ఐలకు ఆదాయపన్ను శాఖ సూచన



న్యూఢిల్లీ: ఎన్‌ఆర్‌ఐలు, విదేశీ పౌరసత్వం కలిగిన భారతీయులు తమ పాన్ ఇన్‌ఆపరేటివ్‌గా (పనిచేయకపోతే) మారిపోతే, నివాస ధ్రువీకరణ పత్రాలతో అసెసింగ్ అధికారులను సంప్రదించాలని ఆదాయపన్ను శాఖ సూచించింది. తమ పాన్‌లు పనిచేయకుండా పోవడం పట్ల కొందరు ఎన్‌ఆర్‌ఐలు, విదేశీ పౌరసత్వం కలిగిన భారతీయుల (ఓసీఐలు) నుంచి ఆందోళన వ్యక్తమైనట్టు తెలిపింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో ఐటీఆర్ దాఖలు చేసిన వారి స్టేటస్ వివరాలను తామే జురిస్‌డిక్షనల్ అసెసింగ్ ఆఫీసర్‌లకు పంపించినట్టు స్పష్టం చేసింది. గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల్లో రిటర్నులు దాఖలు చేయని లేదా తమ నివాస హోదాను అప్‌డేట్ చేయని వారి పాన్‌లు పనిచేయకుండా పోయినట్టు ఆదాయపన్ను శాఖ తెలిపింది.

సెన్సెక్స్ @ 67,000

- 19,750 స్థాయి చేరువలో నిఫ్టీ
- నాలుగోరోజూ కొత్త రికార్డులు
- రాణించిన ఐటీ షేర్లు

ముంబై: ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల కొత్త రికార్డుల ర్యాలీ నాలుగోరోజూ కొనసాగింది. అమెరికా, యూరప్ మార్కెట్ల సానుకూల ట్రేడింగ్ కలిసొచ్చింది. విదేశీ ఇన్వెస్టర్ల వరస కొనుగోళ్లు ఉత్సాహాన్నిచ్చాయి. ఫలితంగా సూచీలు ఇంట్రాడే, ముగింపులోనూ సరికొత్త రికార్డులను నమోదు చేశాయి. ఉదయం సెన్సెక్స్ 239 పాయింట్ల లాభంతో 66,829 వద్ద, నిఫ్టీ 77 పాయింట్లు పెరిగి 19,788 వద్ద మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలో ఐటీ, టెక్, విద్యుత్, పారిశ్రామిక, యుటిలిటీ రంగాల షేర్లకు డిమాండ్ నెలకొంది. ఫలితంగా సెన్సెక్స్ 417 పాయింట్లు బలపడి 67,007 వద్ద, నిఫ్టీ 108 పాయింట్లు పెరిగి 19,819 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేసాయి. అయితే ద్వితీయార్థంలో ప్రభుత్వరంగ బ్యాంకులు, మెటల్ షేర్లలో లాభాల స్వీకరణతో సూచీల లాభాలు సగానికి పైగా హరించుకుపోయాయి. చివరికి సెన్సెక్స్ 205 పాయింట్ల లాభంతో 67 వేల దిగువన



66,795 వద్ద ముగిసింది. నిఫ్టీ 38 పాయింట్లు బలపడి 19,749 వద్ద స్థిరపడింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.2,115 కోట్ల షేర్లను కొనుగోలు చేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,317 కోట్ల షేర్లను విక్రయించారు. అమెరికా రిటైల్ అమ్మకాలు, పారిశ్రామికోత్పత్తి డేటా వెల్లడికి ముందు ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు స్వల్ప లాభాల్లో కదలాడుతున్నాయి. 'అమెరికా డాలర్ ఇండెక్స్ అనూహ్య పతనం, పదేళ్ల కాలపరిమితి బాండ్లపై రాబడులు తగ్గడంతో వర్ధమాన దేశాల మార్కెట్లలో విదేశీ ఇన్వెస్టర్లు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా చైనా ఆర్థిక డేటా నిరాశపరచడం, అమెరికా మార్కెట్ అవుట్‌లుక్ వృద్ధి అంశాలు భారత ఈక్విటీకు డిమాండ్ పెరిగింది. సాంకేతికంగా ఇంట్రాడే కరెక్షన్ ఫార్మేషన్ స్వల్ప కాలం పాటు పరిమితి శ్రేణి ట్రేడింగ్‌ను సూచిస్తుంది. అయితే అధిక వ్యాల్యుయేషన్ల ఆందోళనల నేపథ్యంలో ద్వితీయార్థంలో కొంత అనిశ్చితి ఏర్పడింది' అని కోటక్ సెక్యూరిటీస్ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్ తెలిపారు.

మార్కెట్లో మరిన్ని సంగతులు

- మ్యాట్రెస్‌లను తయారు చేసే షీలా ఫోమ్ కంపెనీ షేరు నాలుగు శాతం లాభపడి రూ.1236 వద్ద స్థిరపడింది. కర్లాన్ ఎంటర్‌ప్రైజెస్‌లో 94.66% వాటాలు కొనుగోలు చేస్తుండటంతో ఈ షేరుకు డిమాండ్ నెలకొంది. ట్రేడింగ్‌లో 15% ర్యాలీ చేసి రూ.1,364 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది.
- రెండు బిలియన్ డాలర్ల విలువ ఏఐ డీల్ దక్కించుకోవడంతో ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ షేరు 4% లాభపడి రూ.1475 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీ సూచీల్లో అత్యధిక లాభపడిన షేరు ఇదే.
- రెండు రోజుల ర్యాలీ తర్వాత ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకుంది. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ 3%, సెంట్రల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, కెనరా బ్యాంక్ షేర్లు 2%, ఎస్‌బీఐ, యూకో బ్యాంక్ షేర్లు 1.5% పతనమయ్యాయి. పీఎన్‌బీ, మహారాష్ట్ర బ్యాంక్, పీఎస్‌బీ, బ్యాంక్ ఆఫ్ ఇండియా 1% నష్టపోయాయి.

ఆర్‌ఐఎల్ కౌంటర్లో ప్రత్యేక ట్రేడింగ్

- కొత్త పద్ధతిలో చేపట్టనున్న ఎన్‌ఎస్‌ఈ
- గురువారం ప్రత్యేక ప్రీఓపెన్ సెషన్‌కు సై



న్యూఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీ దిగ్గజం ఎన్‌ఎస్‌ఈ.. ప్రయివేట్ రంగ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్(ఆర్‌ఐఎల్) కౌంటర్లో ప్రత్యేక ట్రేడింగ్‌కు తెరతీస్తోంది. ఫైనాన్షియల్ సర్వీసెస్ బిజినెస్‌ను రిలయన్స్ స్ట్రాటజిక్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ పేరుతో ప్రత్యేక కంపెనీగా ఆర్‌ఐఎల్ విడదీయనుంది. తదుపరి జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌గా మార్పు చేయనుంది. దీనిలో భాగంగా ఆర్‌ఐఎల్ వాటాదారులకు తమవద్ద గల ప్రతీ షేరుకూ ఒక ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరును కేటాయించనుంది. ఇందుకు రికార్డ్ డేట్ జూలై 20కాగా.. అదే రోజు కొత్త విధానంలో ప్రత్యేక ప్రీఓపెన్ సెషన్‌ను ఎన్‌ఎస్‌ఈ నిర్వహించనుంది. దీని ప్రకారం నిఫ్టీ ఇండెక్స్‌లో ఆర్‌ఐఎల్ కొనసాగనుంది.

19 ఇండెక్సులలో..: జియో ఫైనాన్షియల్‌ను తాత్కాలికంగా నిఫ్టీ-50లో కొనసాగించడంతోపాటు.. 19 ఇండెక్సులలో చోటు కల్పించనుంది. దీంతో జూలై 20 నుంచి కనీసం మూడు రోజులపాటు నిఫ్టీకి తాత్కాలికంగా 51 షేర్లు ప్రాతినిధ్యం వహించనున్నాయి. జియో ఫైనాన్షియల్ లిస్టయిన రోజు నుంచి మూడు రోజులు(T+3) పూర్తయ్యాక ఇండెక్సుల నుంచి తొలగించనున్నట్లు తెలుస్తోంది. ఇదంతా నిఫ్టీ ఇండెక్సుల కొత్త విధానం ప్రకారం ఎన్‌ఎస్‌ఈ చేపట్టనుంది. ఏప్రిల్‌లో ఎన్‌ఎస్‌ఈ ఇండైసెస్ లిమిటెడ్ కొన్ని సవరణల ద్వారా కొత్త విధానానికి తెరతీసింది. కంపెనీల విడదీతసహా కార్పొరేట్ చర్యలకు అనుగుణంగా తాజా విధానానికి రూపకల్పన చేసినట్లు ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. దీనిలో భాగంగా ఎన్‌ఎస్‌ఈ ప్రత్యేక ప్రీఓపెన్ సెషన్‌ను నిర్వహిస్తే నిఫ్టీలో విడదీత కంపెనీకి చోటు కల్పించవచ్చు.

రికార్డ్ డేట్ ఎఫెక్ట్..

అనుబంధ సంస్థ జియో ఫైనాన్షియల్ సర్వీసెస్ విడదీతకు రికార్డ్ డేట్ జూలై 20 కాగా.. 19 నాటికి రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో ఇన్వెస్ట్ చేసిన వాటాదారులకు జియో ఫైనాన్షియల్ షేర్లు పొందేందుకు వీలుంటుంది. ఇక గురువారం (20న) ఎన్‌ఎస్‌ఈ రెగ్యులర్ ట్రేడింగ్ కంటే ముందుగా ప్రత్యేక ప్రీ-ఓపెన్ సెషన్‌ను నిర్వహిస్తోంది. ఉదయం 9-10 మధ్య జియో ఫైనాన్షియల్ షేరు ధర నిర్ణయానికి ఇది సహకరించనున్నట్లు ఎన్‌ఎస్‌ఈ పేర్కొంది. దీనికి సంబంధించి బ్రోకింగ్ సంస్థ ప్రభుదాస్ లీలాధర్ ఇచ్చిన ఉదాహరణను చూద్దాం.. 19న (టీ-1) ఆర్‌ఐఎల్ ముగింపు ధర రూ. 2,800 అనుకుంటే.. 20న రూ. 2,600 ధర పలికిందనుకుందాం.. వెరసి జియో ఫైనాన్షియల్ షేరు ధరను రూ. 200గా పేర్కొనవచ్చు.

అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తున్నాం

- ఇప్పుడు మరింత పటిష్టంగా ఉన్నాం
- అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ స్పష్టీకరణ



న్యూఢిల్లీ: వ్యాపార నిర్వహణ, కీలక వివరాల వెల్లడి విషయంలో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తున్నామని వ్యాపార దిగ్గజం అదానీ గ్రూప్ చీఫ్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. తమ బ్యాలెన్స్ షీట్, అసెట్స్, నిధుల లభ్యత ఇప్పుడు మరింత పటిష్టమయ్యాయని ఆయన చెప్పారు. దేశ, విదేశాల్లో తాము కుదుర్చుకున్న భాగస్వామ్యాలే తమ గవర్నెన్స్ ప్రమాణాలకు నిదర్శనమని వార్షిక సర్వసభ్య సమావేశంలో అదానీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా అమెరికన్ షార్ట్ సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్‌పై ఆయన మరోసారి విమర్శలు గుప్పించారు. తప్పుడు సమాచారం, ఆరోపణలతో భారతీయ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేందుకు సరిగ్గా భారత గణతంత్ర దినోత్సవం సందర్భంగా హిండెన్‌బర్గ్ తప్పుడు నివేదికను ప్రచురించిందని అదానీ వ్యాఖ్యానించారు. అయితే, భారతదేశం, భారతీయ సంస్థల ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఎవరెంతగా కుట్రలు పన్నినా 'మాతృభూమి' భవిష్యత్తు ఉజ్వలంగానే ఉండబోతోందని ఆయన స్పష్టం చేశారు. 2030 కన్నా ముందే ప్రపంచంలోనే మూడో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా, 2050 నాటికి రెండో పెద్ద ఎకానమీగా మారుతుందనడంలో ఎలాంటి సందేహం అక్కర్లేదని చెప్పారు. దేశ అభివృద్ధే.. తమ వ్యాపార వృద్ధికి కూడా తోడ్పాటు అందించగలదని ఆయన తెలిపారు. షేర్లు, అకౌంట్లపరంగా అదానీ గ్రూప్ సంస్థలు మోసాలకు పాల్పడుతున్నాయంటూ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ జనవరిలో నివేదిక ప్రచురించడం, దానితో అదానీ కంపెనీల షేర్లు కుదేలవడం తెలిసిందే. ఆ నివేదికతో అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ దాదాపు 150 బిలియన్ డాలర్ల మేర కరిగిపోయింది.

సహారా డిపాజిటర్లకు చెల్లింపుల ప్రక్రియ షురూ

ముందుగా రూ. 10,000 వరకు ఇన్వెస్ట్ చేసిన వారికి చెల్లింపు



న్యూఢిల్లీ: సహారా గ్రూప్‌నకు చెందిన నాలుగు కోఆపరేటివ్ సొసైటీల్లో ఇరుక్కుపోయిన దాదాపు రూ. 5,000 కోట్ల మొత్తాన్ని తిరిగి డిపాజిటర్లకు అందజేసే ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రారంభించింది. దీనితో చాలా కాలంగా తమ కష్టార్జితం కోసం ఎదురుచూస్తున్న కోట్ల మంది చిన్న ఇన్వెస్టర్లకు ఊరట లభించనుంది. ఇందుకోసం సీఆర్‌సీఎస్-సహారా రీఫండ్ పోర్టల్‌ను కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా ప్రారంభించారు. దీనితో ఒక కోటి మంది డిపాజిటర్లకు ప్రయోజనం చేకూరగలదని ఆయన పేర్కొన్నారు. ముందుగా రూ. 10,000 వరకు ఇన్వెస్ట్ చేసిన కోటి మంది ఇన్వెస్టర్లకు చెల్లింపులు జరపనున్నట్లు మంత్రి చెప్పారు. నాలుగు సొసైటీల (సహారా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ, సహారాయాన్ యూనివర్సల్ మల్టీపర్పస్ సొసైటీ, హమారా ఇండియా క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీ, స్టార్స్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీ) మొత్తం డేటా సీఆర్‌సీఎస్-సహారా రీఫండ్ పోర్టల్‌లో ఉందని, దాని ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఇందుకోసం ఇన్వెస్టరు ఆధార్ కార్డు వారి మొబైల్ నంబరు, బ్యాంకు ఖాతాలకు అనుసంధానమై ఉండాలని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 45 రోజుల్లోగా వారికి రావాల్సిన సొమ్ము వారి ఖాతాల్లో జమవుతుందని చెప్పారు. రూ. 5,000 కోట్ల చెల్లింపులు పూర్తయిన తర్వాత ఇతర ఇన్వెస్టర్లకు చెందిన డబ్బును కూడా తిరిగి చెల్లించేందుకు అనుమతుల కోసం సుప్రీం కోర్టును కోరనున్నట్లు ఆయన తెలిపారు. సహారా-సెబీ రిఫండ్ ఖాతా నుంచి రూ. 5,000 కోట్ల మొత్తాన్ని సెంట్రల్ రిజిస్ట్రార్ ఆఫ్ కోఆపరేటివ్ సొసైటీస్ (సీఆర్‌సీఎస్)కు బదలాయించాలంటూ గతంలో సుప్రీం కోర్టు ఆదేశించింది. నాలుగు సహకార సంఘాలకు చెందిన 10 కోట్ల మంది ఇన్వెస్టర్లకు 9 నెలల్లోగా డిపాజిట్ మొత్తాలను వాపసు చేస్తామంటూ మార్చి 29న కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

ఇండస్‌ఇండ్ లాభం జూమ్

- క్యూ1లో రూ. 2,124 కోట్లు
- మొండిబకాయిల తగ్గుదల



ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం ఇండస్‌ఇండ్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023-24) తొలి త్రైమాసికం(క్యూ1)లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన క్యూ1(ఏప్రిల్-జూన్)లో నికర లాభం వార్షికంగా 30 శాతం జంప్‌చేసి రూ. 2,124 కోట్లను తాకింది. గతేడాది(2022-23) ఇదే కాలంలో రూ. 1,631 కోట్లు మాత్రమే ఆర్జించింది. ఇందుకు మొండి రుణాలు తగ్గడం, వడ్డీ ఆదాయం పుంజుకోవడం సహకరించాయి. మొత్తం ఆదాయం రూ. 10,113 కోట్ల నుంచి రూ. 12,939 కోట్లకు ఎగసింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం పుంజుకుని రూ. 4,867 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు నామమాత్రంగా మెరుగుపడి 4.29 శాతానికి చేరాయి. ఇతర ఆదాయం 14 శాతం వృద్ధితో రూ. 2,210 కోట్లుగా నమోదైంది. ప్రొవిజన్లు రూ. 1,251 కోట్ల నుంచి రూ. 991 కోట్లకు తగ్గాయి. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 2.35 శాతం నుంచి 1.94 శాతానికి దిగివచ్చాయి. నికర ఎన్‌పీఏలు 0.67 శాతం నుంచి 0.58 శాతానికి తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఇండస్‌ఇండ్ షేరు నామమాత్రంగా తగ్గి రూ. 1,390 వద్ద క్లోజైంది.

జాబ్ పాయింట్

కొచ్చిన్ షిప్‌యార్డులో 300 వర్క్‌మ్యాన్ పోస్టులు

కొచ్చిలోని కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్‌ఎల్).. కాంట్రాక్ట్ ప్రాతిపదికన వర్క్‌మ్యాన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 300
» ట్రేడ్‌లు:షీట్ మెటల్ వర్కర్, వెల్డర్,ఫిట్టర్, మెకానిక్ డీజిల్, మెకానిక్ మోటార్ వెహికల్, ప్లంబర్,పెయింటర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్ మెకానిక్,ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, షిప్ రైట్ వుడ్.
» అర్హత: ఎస్ఎస్ఎల్సీ, సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. వయసు: 30 ఏళ్లు మించకూడదు.
» వేతనం: నెలకు రూ.23,300 నుంచి రూ.24,800 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఫేజ్ 1-ఆబ్జెక్టివ్ టైప్ ఆన్‌లైన్ టెస్ట్, ఫేజ్2-ప్రాక్టికల్ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:28.07.2023.
» వెబ్‌సైట్: https://cochinshipyard.in

ఐఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ అసోసియేట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. రీసెర్చ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» అర్హత: బీఈ/బీటెక్/ఎమ్మెస్సీ/ఎంఈ/పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి.
» వయసు: 30 నుంచి 40 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.47,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: ashok@mae.iith.ac.in
» దరఖాస్తులకు చివరితేది: 26.07.2023.
» వెబ్‌సైట్: iith.ac.in

ఐఐటీ హైదరాబాద్‌లో రీసెర్చ్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ).. రీసెర్చ్ అసోసియేట్, జూనియర్ రీసెర్చ్ ఫెలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» విభాగాలు: మైక్రోఎలక్ట్రానిక్స్/నానో ఎలక్ట్రానిక్స్/నానో టెక్నాలజీ/నానో బయోటెక్నాలజీ/మెటీరియల్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ తదితరాలు.
» అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత స్పెషలైజేషన్‌లో ఎమ్మెస్సీ/ఎంఈ/ఎంటెక్ /పీహెచ్‌డీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 28 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.31,000 నుంచి రూ.47,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: షార్ట్‌లిస్టింగ్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» ఈమెయిల్: fendlabiith@gmail.com
» దరఖాస్తులకు చివరితేది: 20.07.2023.
» వెబ్‌సైట్: iith.ac.in

ఐసీఎంఆర్-ఎన్ఐఎన్, హైదరాబాద్‌లో 116 పోస్టులు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 116
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్-45, టెక్నీషియన్-33, ల్యాబొరేటరీ అటెండెంట్-38
» టెక్నికల్ అసిస్టెంట్: వేతనం: నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400 చెల్లిస్తారు.
» టెక్నీషియన్: వేతనం: నెలకు రూ.19,900 నుంచి రూ.63,200 చెల్లిస్తారు.
» ల్యాబొరేటరీ అటెండెంట్: వేతనం: నెలకు రూ18,000 నుంచి రూ.56,900 చెల్లిస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభ తేది:24.07.2023.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:14.08.2023.
» వెబ్‌సైట్: www.nin.res.in


సీఎస్ఐఆర్-సీఐఎంఏపీ, హైదరాబాద్‌లో ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ అండ్ ఏరోమాటిక్ ప్లాంట్స్(సీఐఎంఏపీ).. ప్రాజెక్ట్ స్టాఫ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 04
» పోస్టుల వివరాలు: ప్రాజెక్ట్ అసోసియేట్-03, ప్రాజెక్ట్ అసిస్టెంట్-01.
» అర్హత: పోస్టును అనుసరించి బీఈ/బీటెక్/బీఎస్సీ/ఎంఎస్సీ/ఎంఫార్మసీ ఉత్తీర్ణులవ్వాలి. వయసు: 35 నుంచి 50 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.20,000 నుంచి రూ.35,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఇంటర్వ్యూలో మెరిట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» ఇంటర్వ్యూ వేదిక: సీఎస్ఐఆర్-సీఐఎంఏపీ, రీసెర్చ్ సెంటర్, స్ట్రీట్ నెం.1, అన్నపూర్ణ కాలనీ, బోడుప్పల్, హైదరాబాద్-500092,తెలంగాణ.
» ఇంటర్వ్యూ తేది: 26.07.2023.
» ఇంటర్వ్యూ సమయం: ఉదయం 9.30.
» వెబ్‌సైట్: https://cimap.res.in

ప్రీవియస్ పేపర్స్.. ప్రిపరేషన్ కింగ్

» పోటీ పరీక్షల విజయంలో కీలకంగా ప్రీవియస్ పేపర్స్
» పరీక్ష శైలి, ప్రశ్నల తీరుపై అవగాహనకు అవకాశం
» అభ్యర్థులు స్వీయ సామర్థ్యాలు తెలుసుకునే వీలు
» కొన్నిసార్లు నేరుగా పాత ప్రశ్నలు అడుగుతున్న వైనం



పోటీ పరీక్షల ప్రత్యేకం

సివిల్స్, గ్రూప్స్, బ్యాంక్స్, జేఈఈ, నీట్.. ఇలా పరీక్ష ఏదైనా.. ప్రిపరేషన్‌లో కీలకంగా మారుతున్నాయి.. ప్రీవియస్ పేపర్స్!! ఆయా పరీక్షలకు సంబంధించి గత ప్రశ్న పత్రాలను పరిశీలించడం ద్వారా ప్రశ్న శైలిపై అవగాహన వస్తుంది. అంతేకాదు సదరు నియామక సంస్థ అభ్యర్థి నుంచి ఏం కోరుకుంటుందో తెలుస్తుంది. దీంతోపాటు పరీక్ష కోణంలో ముఖ్యమైన టాపిక్స్‌ను గుర్తించే వీలవుతుంది. కొన్నిసార్లు గత ప్రశ్నలను నేరుగా అడుగుతున్నారు. ఈ నేపథ్యంలో.. పోటీ పరీక్షల్లో పాత ప్రశ్న పత్రాల సాధన ఆవశ్యకత గురించి తెలుసుకుందాం..

'ప్రీవియస్ పేపర్స్ ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపకరించింది. పాత ప్రశ్న పత్రాలను అనుసరించడం పరీక్షలో విజయానికి దోహదం చేసింది'. -పోటీ పరీక్షల విజేతలు చెప్పే మాటలు ఇవి! దీన్ని బట్టి పోటీ పరీక్షల ప్రిపరేషన్‌లో గత ప్రశ్న పత్రాల ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోవచ్చు అంటున్నారు నిపుణులు.

ప్రిపరేషన్ ప్రారంభానికి ముందే

పోటీ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభానికి ముందే ప్రీవియస్ పేపర్లను పరిశీలించడం లాభిస్తుంది. వాస్తవానికి ఎక్కువ మంది సిలబస్‌పై అవగాహన ఏర్పరచుకుని ప్రిపరేషన్‌కు ఉపక్రమిస్తారు. కాని సిలబస్‌పై అవగాహనతో పాటు ప్రీవియస్ పేపర్లను కూడా పరిశీలిస్తే.. ఏ టాపిక్‌కు ఎంత వెయిటేజీ లభిస్తుందో తెలుస్తుంది. దానికి అనుగుణంగా ప్రిపరేషన్ సమయంలో ఆయా అంశాలకు ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై స్పష్టత లభిస్తుంది.

ప్రశ్నల తీరుపై అవగాహన

ప్రీవియస్ కొశ్చన్ పేపర్స్ పరిశీలిస్తే.. ప్రశ్నలు అడుగుతున్న తీరు తెలుస్తుంది. ఒక అంశంపై ఎన్ని రకాలుగా ప్రశ్నలు వస్తున్నాయో అవగాహన వస్తుంది. దాని ఆధారంగా సదరు టాపిక్‌ను చదివేటప్పుడు.. అన్ని కోణాల్లో సబ్జెక్టుపై పట్టు పెంచుకునే ప్రయత్నం చేయొచ్చు. సొంతంగా ప్రశ్నలు రూపొందించుకుని సమాధానాలు ప్రాక్టీస్ చేయడానికి కూడా ఉపకరిస్తుంది.

స్వీయ సామర్థ్యంపై స్పష్టత

ప్రీవియస్ పేపర్లు సాధన చేయడం ద్వారా ఆయా టాపిక్ లేదా సబ్జెక్ట్‌పై అభ్యర్థులు తమకున్న సామర్థ్య స్థాయిపై స్పష్టత తెచ్చుకునే అవకాశం లభిస్తుంది. ప్రీవియస్ పేపర్స్‌ను ప్రాక్టీస్ చేసి.. ఫలితాన్ని విశ్లేషించుకోవడం ద్వారా.. పొరపాటు సమాధానాలకు కారణాలను గుర్తించొచ్చు. ఫలితంగా సదరు విభాగంలో ఇంకా పట్టు సాధించాల్సిన అంశాలు, అందుకు అనుసరించాల్సిన విధానంపైనా స్పష్టత వస్తుంది.

కనీసం అయిదేళ్ల పేపర్లు

కనీసం గత అయిదేళ్ల ప్రశ్న పత్రాలను సాధన చేయాలని నిపుణులు సూచిస్తున్నారు. పోటీ పరీక్షల్లో గత ప్రశ్న పత్రాల నుంచి 20 శాతం వరకు ప్రశ్నలు పునరావృతం అయ్యే అవకాశం ఉందంటున్నారు. సదరు ప్రశ్న అన్ని పరీక్షల్లో ఒకే విధంగా ఉండకపోయినా.. నిర్దిష్టంగా ఒక అంశం నుంచి వేరే రూపంలో ప్రశ్నలు పునరావృతం అవుతున్నాయని చెబుతున్నారు. ముఖ్యంగా గ్రూప్స్, సివిల్ సర్వీసుల పరీక్షల్లో సైన్స్ అండ్ టెక్నాలజీ, ఎకాలజీ, ఎన్విరాన్‌మెంట్ తదితర సబ్జెక్ట్‌లకు సంబంధించి కోర్ అంశాల నుంచి ప్రశ్నలు రిపీట్ అవుతున్నాయి.

ప్రాక్టీస్ పలు విధాలుగా

- ప్రిపరేషన్ సమయంలో ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేసే విషయంలోనూ పలు వ్యూహాలను అనుసరించాలని నిపుణులు సూచిస్తున్నారు. టాపిక్ వారీగా, సబ్జెక్ట్ వారీగా ప్రీవియస్ పేపర్లలోని కొశ్చన్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా ప్రిపరేషన్ పూర్తి చేసుకున్న అంశాలకు సంబంధించిన ప్రశ్నలను సాధనం చేయాలి. ఫలితంగా సదరు సబ్జెక్ట్ లేదా టాపిక్‌పై పరీక్షకు అవసరమైన అన్ని కోణాల్లో పట్టు సాధించొచ్చని చెబుతున్నారు.
- ప్రీవియస్ పేపర్లను సాధన చేసే క్రమంలో ఉపకరించే మరో వ్యూహం.. వీక్లీ ప్రాక్టీస్. అంటే.. ప్రతి వారం చివరలో.. ఆ వారంలో తాము చదివిన టాపిక్స్, యూనిట్స్, సబ్జెక్ట్‌లకు సంబంధించి ప్రీవియస్ పేపర్లలోని కొశ్చన్స్‌ను సాధన చేయాలి. దీనివల్ల నిరంతర అవగాహనతో పాటు.. అనుసంధాన విధానంలో ఉండే ప్రశ్నలను, వాటికి సంబంధించిన సబ్జెక్ట్‌లను తెలుసుకునే వీలు లభిస్తుంది.

వాస్తవ పరీక్ష మాదిరిగానే

ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేసే అభ్యర్థులు.. వాటిని వాస్తవ పరీక్షగానే భావించి సాధన చేయడం మేలు చేస్తుంది. పరీక్షలో సదరు పేపర్‌కు అందుబాటులో ఉండే సమయాన్నే.. ప్రీవియస్ పేపర్స్ సాధనకు కేటాయించాలి. నిర్దిష్ట సమయంలోపే పేపర్‌లోని అన్ని ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఆ తర్వాత వాటి సమాధానాలను సరిచూసుకోవాలి. ఈ విశ్లేషణ ఆధారంగా.. స్వీయ బలాలు, బలహీనతలపై అవగాహన లభిస్తుంది. వాస్తవ పరీక్ష మాదిరిగానే భావించి ప్రాక్టీస్ చేయడం ద్వారా నిర్దేశిత సమయంలో ఎన్ని ప్రశ్నలకు సమాధానాలు గుర్తించగలిగాం. మిగిలిపోయిన ప్రశ్నలెన్ని? దానికి కారణం సమయాభావమా.. లేదా సమాధానాలు తెలియకపోవడమా.. వంటి కోణాల్లో విశ్లేషించుకోవచ్చు. దానికి అనుగుణంగా సమయ పాలన పరంగా వేగం పెంచుకోవడం, సబ్జెక్ట్ పరంగా లోపాలు ఉంటే సరిదిద్దుకోవడం వంటివి చేయొచ్చు.

డిస్క్రిప్టివ్‌కు సమయపాలన

- డిస్క్రిప్టివ్ విధానంలో ఉండే పరీక్షలకు ప్రీవియస్ పేపర్స్ సాధనలో సమయ పాలనను తప్పనిసరిగా పాటించాలి. ఉదాహరణకు.. సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్ష లేదా గ్రూప్-1 మెయిన్ ఎగ్జామినేషన్‌నే పరిగణనలోకి తీసుకుంటే.. ప్రతి ప్రశ్నకు సగటున 10 నుంచి 12 నిమిషాల సమయం అందుబాటులో ఉంటుంది. ప్రీవియస్ పేపర్స్ ప్రాక్టీస్ చేసేటప్పుడు ప్రతి ప్రశ్నకు సమయ పరిమితి విధించుకోవాలి. ఆ సమయం దాటిన తర్వాత సదరు ప్రశ్నకు సమాధానాన్ని ముగించి, వేరే ప్రశ్నకు సమాధానం రాయాలి.
- ఇలా వాస్తవ పరిస్థితుల్లో అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయడం పూర్తి చేసుకున్న తర్వాత విశ్లేషణ చేసుకోవాలి. సమాధానాల్లో ముఖ్యాంశాలను పొందుపర్చామా.. ఎగ్జామినర్ ఆశించిన తీరులోనే జవాబులు ఉన్నాయా.. సమాధానాన్ని అసంతృప్తిగా ఎందుకు ముగించాల్సి వచ్చింది? ఇలా భిన్న కోణాల్లో పరిశీలించాలి. అంతేకాకుండా తాము రాసిన సమాధానాలను వీలైతే సబ్జెక్ట్ నిపుణులతో మూల్యాంకన చేయించుకోవాలి.
- ఈ విశ్లేషణల ఫలితంగా సమయ పాలనతో పాటు సమాధానం రాసే విధానాన్నీ మెరుగుపరచుకునే వీలవుతంది. చక్కటి చేతిరాత, పాయింట్స్ వారీగా సమాధానాలు రాయడం వంటి నైపుణ్యాలు లభిస్తాయి.

పది రెట్లు ప్రయోజనం

ప్రీవియస్ పేపర్లను ప్రాక్టీస్ చేయడం, వాటిని విశ్లేషించుకోవడం ద్వారా రైటింగ్ స్కిల్స్, ప్రజెంటేషన్ నైపుణ్యాలు మెరుగుపడతాయి. పదిసార్లు చదివిన దానికంటే.. ఒకసారి రాసిన విషయం ఎక్కువగా కాలం గుర్తుంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. నిరంతర రాయడం ద్వారా రీడింగ్ స్పీడ్ కూడా పెరుగుతుందని చెబుతున్నారు.

సరి పోల్చుకుంటూ

ప్రస్తుతం పలు మార్గాల ద్వారా ప్రీవియస్ పేపర్లకు నిపుణుల సమాధానాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు ఆ మార్గాలను వినియోగించుకోవాలి. ఆయా ప్రశ్నలకు సంబంధించి తమ సమాధానాలు, నిపుణుల జవాబులు పోల్చుకోవాలి. నిపుణులు పొందుపర్చిన సమాధానాల్లోని ముఖ్య అంశాలను నోట్ చేసుకోవాలి. తమ ప్రజెంటేషన్, నిపుణుల ప్రజెంటేషన్ మధ్య వ్యత్యాసాలను గుర్తించాలి. తాము రాయని, నిపుణులు రాసిన అంశాలను నోట్ చేసుకోవాలి. అదే విధంగా.. ఆయా అంశాలకు సంబంధించి తాము చదివిన మెటీరియల్‌లో లేని, నిపుణులు ఉదహరించిన అంశాలను ప్రత్యేకంగా గుర్తించాలి.

ప్రీవియస్ పేపర్లు.. ముఖ్యాంశాలు

- పోటీ పరీక్షల విషయంలో పూర్తి అవగాహన కల్పించే ప్రీవియస్ పేపర్లు.
- సబ్జెక్టులు, టాపిక్స్‌కు లభిస్తున్న వెయిటేజీని తెలుసుకునే అవకాశం.
- కనీసం అయిదేళ్ల ప్రశ్న పత్రాల సాధనతో ఆయా అంశాలపై అవగాహన.
- గత ప్రశ్న పత్రాల నుంచి దాదాపు 20 శాతం ప్రశ్నలు పునరావృతం
- నిరంతర స్వీయ సామర్థ్యాలను తెలుసుకునేందుకు అవకాశం కల్పించే ప్రీవియస్ కొశ్చన్ పేపర్లు.

క్లుప్తంగా...

మాగుంట రాఘవకు బెయిల్ మంజూరు

4 వారాల పాటు షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన ఢిల్లీ హైకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మాగుంట రాఘవకు 4 వారాల పాటు షరతులతో కూడిన బెయిల్‌ను ఢిల్లీ హైకోర్టు మంజూరు చేసింది. గతంలో ఢిల్లీ హైకోర్టు రాఘవకు బెయిల్ ఇచ్చినప్పుడు, సుప్రీంకోర్టును ఈడీ ఆశ్రయించగా..మంగళవారం మాత్రం రాఘవ బెయిల్ పిటిషన్‌ను ఈడీ వ్యతిరేకించ లేదు. విచారణకు ఈడీ అధికారులు పిలిచినప్పుడు హాజరుకావాలని, ప్రతీ మంగళ, శుక్రవారాల్లో సాయంత్రం 4 గంటలకు రిపోర్ట్ చేయాలని షరతులు విధించింది. ఫిబ్రవరి 10న రాఘవ అరెస్టయ్యారు.

ఇండోనేషియాకు భారత యుద్ధ నౌకలు

జకార్తా తీరానికి చేరుకున్న ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కోల్‌కతా



భారత నౌకాదళానికి ఘన స్వాగతం పలికిన ఇండోనేషియా నౌకాదళం

సాక్షి, విశాఖపట్నం: ఇండియన్ నేవీ ఫ్రంట్‌లైన్ వార్‌షిప్స్ ఐఎన్ఎస్ సహ్యాద్రి, ఐఎన్ఎస్ కోల్‌కతా ఇండోనేషియాకు మంగళవారం చేరుకున్నాయి. జకార్తా తీరానికి చేరుకున్న భారత నౌకాదళ బృందానికి ఇండోనేషియా నావికాదళం ఘన స్వాగతం పలికింది. ఇరు దేశాల నౌకాదళాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు, ఇంటర్ ఆపరేబిలిటీ మరింత బలోపేతం అయ్యేందుకు మారీటైమ్ పార్టనర్‌షిప్ ఎక్సర్‌సైజ్(ఎంపెక్స్)లో సంయుక్తంగా పాల్గొంటాయి.

నీళ్లు, నిధులు, నియామకాల కోసం 28న ఢిల్లీలో ధర్నా

రాయలసీమ హక్కుల నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్ పునర్విభజన తర్వాత ఎక్కువగా నష్టపోయిన రాయలసీమకు నీళ్లు, నిధులు, నియామకాల కోసం ఈ నెల 28న ఢిల్లీలో ధర్నా నిర్వహిస్తున్నట్లు రాయలసీమ హక్కుల నేత బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో రాజశేఖర్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రాయలసీమ అభివృద్ధి కాకపోవడానికి మొదటి శత్రువులు సీమ నేతలేనని చెప్పారు.

ఏపీ విద్యా విధానాలు భేష్

- ఐక్యరాజ్యసమితి అభినందనలు
- బాలికా విద్యకు సీఎం జగన్ ప్రోత్సాహం అభినందనీయం
- ఐరాస లక్ష్యం కూడా ఇదేనని స్పష్టీకరణ

సాక్షి, అమరావతి : అందరికీ విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన కోసం నవరత్నాలు, నాడు – నేడు, సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగం అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని ఐక్యరాజ్యసమితి ఎకనామిక్, సోషల్ కౌన్సిల్ అంతర్జాతీయ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ప్రశంసించారు. ఐక్యరాజ్య సమితి లక్ష్యం కూడా ఇదేనని స్పష్టం చేశారు. ఐరాస ప్రధాన కార్యాలయమైన న్యూయార్క్‌లో ఆర్థిక, సామాజిక మండలి నేతృత్వంలో సుస్థిరాభివృద్ధిపై జూలై 17న జనరల్ అసెంబ్లీ హాలులో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు, విద్యారంగంలో పథకాలకు సంబంధించి ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. జగనన్న విద్యా కానుక కిట్లు, విద్యా దీవెన, అమ్మ ఒడి, వసతి దీవెన, విద్యార్థులకు ఇచ్చే ఇతర ప్రోత్సాహకాల పోస్టర్లను ప్రదర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ ఎడ్యుకేషన్‌లో భాగంగా ఏర్పాటు చేస్తున్న ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ బోర్డులు, అటల్ టింకరింగ్ ల్యాబ్స్, స్మార్ట్ బోర్డ్స్, బైజూస్ ట్యాబ్స్ నమూనాలను ప్రదర్శించారు. ఐరాస స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ మెంబర్ వున్నవ షకిన్ కుమార్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేపట్టిన విద్యా రంగ సంస్కరణలు, వివిధ పథకాల ద్వారా విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించేలా సీఎం జగన్ ప్రోత్సహిస్తున్న తీరు, డిజిటల్ బోధన, డిజిటల్ క్లాస్ రూమ్స్ గురించి వివరించారు. నాడు – నేడు స్టాల్‌ని సందర్శించిన ఎకనామిక్ సోషల్ కౌన్సిల్ ప్రపంచ అధ్యక్షురాలు లచ్చెజర స్టోవ్ ఆసక్తిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ బాలికల విద్యను ప్రోత్సహిస్తూ ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టడాన్ని అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టోఫెల్ ట్రైనింగ్, సబ్జెక్ట్ టీచర్ కాన్సెప్ట్, బైలింగ్యువల్ డిక్షనరీలు, గోరుముద్ద, ఆణిముత్యాల పథకాన్ని ప్రత్యేకంగా ప్రశంసించారు. పేద విద్యార్థులను గ్లోబల్ లీడర్లుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని షకిన్ కుమార్ ఆమెకు వివరించారు. డిజిటల్ ఇండియా దిశగా అడుగులు వేస్తున్న ఆంధ్రప్రదేశ్ విద్యా విధానాలను కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ప్రశంసించారు.



స్టాల్‌ను సందర్శించిన టాంజానియా దేశ ఆర్థిక శాఖ మంత్రి నటూ వాంబా

ఏపీ స్టాల్‌పై పలు దేశాల ఆసక్తి

టాంజానియా ఆర్థిక శాఖా మంత్రి నటూ వాంబా ఏపీ స్టాల్‌ను సందర్శించి విద్యాభివృద్ధికి సీఎం జగన్ చేస్తున్న కృషిని అభినందించారు. అమెరికా పర్మినెంట్ అబ్జర్వర్ మిషన్ టూ యునైటెడ్ నేషన్స్ ప్రొఫెసర్ ఒట్టో ఫీజిన్ బ్లాట్, అమెరికన్ డిప్లొమాటిక్ అకాడమి రిప్రజెంటేటివ్ టు యునైటెడ్ నేషన్స్ ప్రెసిడెంట్ బిల్ గ్రాహమ్ తదితరులు ఏపీ విద్యా విధానాలను తెలుసుకుని అభినందించారు. ఈ కార్యక్రమంలో సునీత చిట్టూమూరి తదితరులు పాల్గొన్నారు.

‘మార్గదర్శి’ కేసు విచారణ వాయిదా

- 56 వేల పేజీల డిపాజిటర్ల వివరాలు అందజేసిన సంస్థ
- అన్ని పక్షాలు రెండు పేజీల నోట్ దాఖలు చేయండి
- సెప్టెంబరు 26కు వాయిదా వేసిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ/సాక్షి, అమరావతి : ఆర్‌బీఐ నిబంధనలకు విరుద్ధంగా డిపాజిట్లు సేకరించారంటూ మార్గదర్శి ఫైనాన్షియర్స్ మీద దాఖలైన పిటిషన్లకు సంబంధించిన విచారణను సుప్రీంకోర్టు వాయిదా వేసింది. 72 వాల్యూమ్‌లతో 56వేల పేజీల డిపాజిటర్ల వివరాలను సంస్థ మంగళవారం కోర్టుకు అందజేయగా దానిని పరిగణనలోకి తీసుకుంటున్నట్లు న్యాయస్థానం పేర్కొంది. మార్గదర్శి ఫైనాన్షియర్స్‌పై ఉండవల్లి అరుణ్‌కుమార్, ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ కేసులో ఏపీ ప్రభుత్వానికి పిటిషన్ దాఖలు చేసే అర్హతలేదని సంస్థ తరఫు సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే ఆరోపించారు. దీన్ని పార్టీ ఇన్ పర్సన్ ఉండవల్లి అరుణ్‌కుమార్, న్యాయవాది రమేశ్ అల్లంకి, ఏపీ ప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్ విభేదించారు. ఏపీ, తెలంగాణ ఇద్దరినీ పార్టీ చేసినట్లు ఉండవల్లి కోర్టుకు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఇంకా కౌంటరు దాఖలు చేయలేదని న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఏపీ ప్రభుత్వం రిజాయిండరు దాఖలు చేసినట్లు వైద్యనాథన్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం కౌంటరు దాఖలు చేయాలని తదుపరి విచారణలోగా అన్ని పార్టీలు ప్లీడింగ్స్ పూర్తిచేయాలని ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేసింది. ఈలోగా రెండు పేజీల నోట్ సమర్పించాలని అన్ని పక్షాలను కోర్టు ఆదేశించింది.

ఏపీ పిటిషన్ మరో ధర్మాసనానికి..

మరోవైపు.. తెలంగాణ హైకోర్టులో మార్గదర్శి ఫైనాన్షియర్స్‌కు సంబంధించిన కేసులు ఏపీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న ఏపీ ప్రభుత్వ పిటిషన్ మంగళవారం జస్టిస్ అనిరుద్ధ బోస్, జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి ధర్మాసనం ముందుకొచ్చింది. ఈ పిటిషన్‌ను తాను సభ్యుడుగా లేని ధర్మాసనం ముందు జాబితా చేయాలని జస్టిస్ ఎస్. వెంకటనారాయణ భట్టి కోరారు. ఈ మేరకు రిజిస్ట్రీని ధర్మాసనం ఆదేశించింది. ఇదిలా ఉంటే.. చట్ట నిబంధనల ప్రకారం మార్గదర్శి చిట్ గ్రూపులను మూసివేస్తూ చిట్ రిజిస్ట్రార్లు జారీచేసిన ఉత్తర్వులను ఏపీ హైకోర్టు తప్పుబట్టింది. చందాదారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా చిట్ గ్రూపులను మూసివేయడం సరికాదంటూ సదరు ఉత్తర్వులతోపాటు తదుపరి చర్యలన్నింటినీ నిలిపివేసింది. ఈ వ్యవహారంలో కౌంటర్లు దాఖలు చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ముఖ్య కార్యదర్శి, ఆ శాఖ కమిషనర్‌లతో పాటు ఆయా జిల్లాల చిట్ రిజిస్ట్రార్లకు, మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్‌లను న్యాయమూర్తి జస్టిస్ జయసూర్య ఆదేశించారు. తదుపరి విచారణ సెప్టెంబరు 26కు వాయిదా వేశారు.

వివేకా హత్య కేసు చార్జ్‌షీట్‌ను సీల్డ్ కవర్‌లో ఇవ్వండి

- సీబీఐని ఆదేశించిన సుప్రీంకోర్టు
- అవినాశ్ బెయిల్ రద్దు పిటిషన్‌పై విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ : మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్యకేసు చార్జిషీట్‌ను సీల్డ్ కవర్‌లో అందజేయాలని సీబీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఎంపీ అవినాశ్‌రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు చేయాలని, జూలై ఒకటి తర్వాత గంగిరెడ్డిని విడుదల చేయవచ్చన్న హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ, గంగిరెడ్డి బెయిల్ కోరుతూ దాఖలైన వేర్వేరు పిటిషన్లు మంగళవారం జస్టిస్ సంజీవ్‌ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేదిలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. ముందుగా అవినాశ్‌రెడ్డి బెయిల్ రద్దు పిటిషన్‌ను ధర్మాసనం విచారించింది. సునీత నర్రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపిస్తూ సీబీఐ చార్జిషీట్ దాఖలు చేయలేదని తెలిపారు. చార్జిషీట్ దాఖలు చేయడానికి రెండు వారాలు గడువు కావాలని సీబీఐ తరఫు న్యాయవాది కోరారు. ట్రయల్ కోర్టులో సీబీఐ చార్జిషీట్ దాఖలు చేసిందని, ఆగస్టు 14న విచారణకు రావాలని సమన్లు జారీ చేసిందని అవినాశ్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది రంజిత్‌కుమార్ ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అయితే తామేమీ ఇప్పుడు ఆర్డర్ ఇవ్వడం లేదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. చార్జిషీట్ దాఖలు కాకుండా, వాదనలు వినకుండా ఎలాంటి ఆదేశాలు ఇవ్వబోమని, గతంలో ఇచ్చిన ఆదేశాలు కొనసాగుతాయని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టంచేశారు. సీబీఐ రెండు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని చెప్పారు. జూన్ 30న దాఖలు చేసిన చార్జిషీట్, వివేకా హత్య కేసు వివరాలు, డైరీ సీల్డ్ కవర్‌లో అందజేయాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రతివాదులు మూడు వారాల్లో కౌంటరు దాఖలు చేయాలని చెప్పింది. ఈ కేసును సెప్టెంబరు 11తో ప్రారంభమయ్యే వారంలో జాబితా చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. మరోవైపు జూలై ఒకటి తర్వాత ఎర్ర గంగిరెడ్డిని బెయిల్‌పై విడుదల చేయవచ్చంటూ గతంలో హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ సునీత నర్రెడ్డి, బెయిల్ కోరుతూ గంగిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపైనా ధర్మాసనం విచారించింది. అవినాశ్ రెడ్డి ముందస్తు బెయిల్ రద్దు పిటిషన్‌తో వీటిని జత చేస్తామని ధర్మాసనం పేర్కొనగా... విడిగా వినాలని గంగిరెడ్డి తరఫు న్యాయవాది కోరారు. హత్య కేసు కాబట్టి కొంత సమయం వేచి రెండు వారాల్లో కౌంటర్లు దాఖలు చేయాలని, మూడు వారాల్లో రిజాయిండర్ దాఖలు చేయాలని ఇరు వర్గాలను ఆదేశించింది.

యువతకు ‘ఉపాధి’ పెంచడమే లక్ష్యం

- దక్షిణ కొరియాలో సామ్యూక్ వర్సిటీని సందర్శించిన ఆర్థిక మంత్రి బుగ్గన, అధికారులు
- కొరియన్ లాంగ్వేజ్ ల్యాబ్‌ల ఏర్పాటుపై వర్సిటీ ఆసక్తి
- ఒకేషనల్ విద్యకు సంబంధించిన తోడ్పాటుకూ అంగీకారం
- ఐసీసీకే, కొట్రా ప్రతినిధులు, భారత రాయబారితోనూ సమావేశం
- వివిధ రంగాల్లో పెట్టుబడులకు గల అవకాశాలపై చర్చ

సాక్షి, అమరావతి: రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే వైఎస్ జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఆర్థిక, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ చెప్పారు. రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తీసుకువచ్చేందుకు మంత్రి బుగ్గన నేతృత్వంలో ఏపీ అధికారుల బృందం దక్షిణ కొరియాలో పర్యటిస్తోంది. ఈ సందర్భంగా ప్రముఖ సామ్యూక్ విశ్వవిద్యాలయాన్ని బృందం సందర్శించింది. ఒకేషనల్ విద్యకు సంబంధించి అవసరమైన సహకారం అందించేందుకు సామ్యూక్ వర్సిటీ ముందుకు వచ్చిందని మంత్రి బుగ్గన తెలిపారు. కొరియన్ భాష నేర్చుకోవడం వల్ల ప్లేస్‌మెంట్లను మరింతగా పెంచవచ్చన్నారు. ఇందుకోసం ఏపీలో కొరియన్ లాంగ్వేజ్ ల్యాబ్‌ల ఏర్పాటుపై వర్సిటీ వైస్ ప్రెసిడెంట్ హ్యున్ హీ కిమ్‌తో బుగ్గన చర్చించారు. అనంతరం కొరియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ ఏజెన్సీ(కొట్రా) ప్రతినిధులను బుగ్గన నేతృత్వంలోని బృందం కలిసింది. ఏపీలో పెట్టుబడులకు అవసరమైన సహకారం అందిస్తామని కొట్రా హామీ ఇచ్చిందని మంత్రి తెలిపారు. కొట్రాకు బెంగళూరులో కార్యాలయం ఉందని.. అక్కడి నుంచి పూర్తి సహకారం అందిస్తామని కొట్రా డైరెక్టర్ జనరల్ తెలిపినట్లు పేర్కొన్నారు. కొట్రా డైరెక్టర్ జనరల్ హియో జిన్వోస్ మాట్లాడుతూ.. తమ ప్రతినిధులు ఏపీకి వచ్చి అవసరమైన సహకారం అందిస్తారని చెప్పారు. అనంతరం ఇండియన్ చాంబర్ ఆఫ్ కామర్స్ కొరియా(ఐసీసీకే) గ్లోబల్ సీఎఫ్‌వో పంకజ్ శ్రీవాస్తవతో పాటు ఇతర ప్రముఖులతోనూ బుగ్గన భేటీ అయ్యారు. ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో మరింతగా కలిసి పనిచేసే అవకాశాలపై ఈ సందర్భంగా చర్చించారు. ఇందుకు ఐసీసీకే సానుకూలంగా స్పందించింది. అలాగే దక్షిణ కొరియాలోని భారత రాయబారి హెచ్ఈ అమిత్‌కుమార్‌తో కూడా బుగ్గన బృందం సమావేశమైంది. ఏపీ ఆర్థికాభివృద్ధికి అవసరమైన అంశాలలో దక్షిణ కొరియా భాగస్వామ్యంపై ఈ సందర్భంగా చర్చించారు. దక్షిణ కొరియా వ్యాపార విస్తరణకు అవసరమైన ఇండస్ట్రియల్ క్లస్టర్‌ను ఏర్పాటు చేసేందుకు ఏపీ సంసిద్ధతతో ఉందని బుగ్గన ఈ సందర్భంగా తెలిపారు. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులు, దిగుమతులు సహా సీ ఫుడ్‌పై మరింత అవగాహన పెంచే బ్రాండింగ్ అంశంలో సహకరిస్తామని అమిత్ కుమార్ చెప్పారు. ఈ సమావేశాల్లో ఏపీ ఉన్నతాధికారులు ఎస్ఎస్ రావత్, కె.సునీత, సురేశ్ కుమార్, వినోద్ కుమార్, సామ్యూక్ వర్సిటీ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ డీన్ జియెన్ షిన్, కొట్రా డైరెక్టర్ చో ఈనం, డిప్యూటీ డైరెక్టర్ జో యాండ్, రీసెర్చ్ టీమ్ డైరెక్టర్ హాంగ్ చంగ్సెక్, అసిస్టెంట్ మేనేజర్ పార్క్ మనిజోంగ్, బీకేఎల్ పార్టనర్ జాంగ్, టాగివ్ సీఈవో పంకజ్ అగర్వాల్, సేజ్ స్ట్రాటజీస్ సీఈవో ఇంబం చోయ్ తదితరులు పాల్గొన్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943